వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 6 సంచిక : 11 హైదరాబాద్ 88 నవంబర్ 2008 పేజీలు : 48 రు. 10

ఫోకస్ : ప్రపంచ ఆర్థిక సంక్షోభం
ఆరు వ్యాసాలు

ఒరిస్సాలో క్రైస్తవులపై మారణకాండ


చేనేత రంగంపై రెండు వ్యాసాలు

ప్రపంచీకరణ చరిత్ర

ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య వ్యవస్థలు

వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం

యాభై ఏళ్ల
ఆంధ్రప్రదేశ్ పై
ఏకైక విశిష్ట
సమాచార, విశ్లేషణా గ్రంథం



సిడిఆర్‌సి ప్రచురణ

ఇంగ్లిషులో, 568 పేజీలు

హార్డ్ బౌండ్ (గ్రంథాలయ, మేలు ప్రతి) రు. 895

విద్యార్థుల కొరకు ప్రత్యేక ముద్రణ రు. 225

FIFTY YEARS OF ANDHRA PRADESH
1956 - 2006

ప్రస్తుతం మార్కెట్లో ఉంది

యాభై సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ జయాపజయాలపై,
అభివృద్ధి పథంలో ఒడిదుడుకులపై
నలభై విశ్లేషణాత్మక, సమాచార భరిత వ్యాసాలు, పట్టికలు
చరిత్ర, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సౌకర్యాలు, ఆర్థిక వ్యవహారాలు,
సామాజిక పరిణామాలు, విద్యా వైద్య రంగాలు
ఆంధ్రప్రదేశ్ పురోగతి గురించి తెలుసుకోదలచిన వారందరూ
తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన గ్రంథం
ప్రతి గ్రంథాలయంలోనూ ఉండవలసిన గ్రంథం

ప్రతులకు, వివరాలకు

సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసెర్చ్ అండ్ కమ్యూనికేషన్

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040 - 66843495 ఇమెయిల్ : reachcdrc@yahoo.com

CDRC

వీక్షణం 88

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

నవంబర్ 2008
సంపుటి : 6
సంచిక : 11

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్ ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

విషరాజకీయాలు - భైంసా విషాదం

దేశవ్యాప్తంగా ముస్లింల మీద, ఒరిస్సా, కర్ణాటకలలో క్రైస్తవుల మీద సంఘపరివారం ప్రారంభించిన విషరాజకీయాల, మతవిద్వేష యుద్ధం తెలుగుసీమకు కూడ విస్తరించి, ఆదిలాబాద్ జిల్లా భైంసాలో ముగ్గురిని, వటోలిలో ఆరుగురిని బలి తీసుకుంది. వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం, దేవీనవరాత్రులు వంటి సందర్భాల్లో రెచ్చగొడుతున్న హిందూ మతోన్మాద భావాలు, పేట్రేగుతున్న మెజారిటీ మతోన్మాదానికి జవాబు తమ మత ఛాందసమేననే తప్పుడు అవగాహనతో విస్తరిస్తున్న మైనారిటీ మతోన్మాదం కలిసి జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ హింసాకాండకు ప్రధాన బాధ్యత వహించవలసినది మతం కాదు. రాజకీయాధికారం కోసం మతభావనలను వినియోగించుకుంటున్న సంఘపరివారం, హిందుత్వ భావజాలం. ఇళ్లలో వ్యక్తిగతంగా కుటుంబాలు జరుపుకునే అమాయకమైన పూజలను వీధుల్లోకి లాక్కువచ్చి, సామూహిక భావోద్వేగాలను, పరమతద్వేషాన్ని ప్రేరేపిస్తున్నది హిందుత్వ. తమ మతం ప్రమాదంలో పడుతున్నదనే అబద్ధాన్ని పదే పదే చెప్పి అమాయకులను కూడగట్టి అవతలి మతం మీద హంతకదాడులు సాగిస్తున్నది హిందుత్వ. అలా కల్పించిన మతవిద్వేషాల వాతావరణాన్ని రాజకీయాధికారానికి రాజమార్గంగా ఉపయోగించుకోవచ్చునని తెలిసినప్పటినుంచీ సంఘపరివారం సాగిస్తున్న ప్రణాళికాబద్ధమైన కుట్ర ఇది. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ నిరంకుశపాలనలో అనుభవించిన నిర్బంధాన్ని అవకాశంగా తీసుకుని దేశ రాజకీయాలలో ప్రాధాన్యతా స్థానానికి ప్రవేశించిన సంఘపరివారం ఆ తర్వాత కొన్ని రాష్ట్రాలలోనూ అధికారాన్ని మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి వాడుకుంది. అటు మైనారిటీలలో భయాన్ని, ఇటు హిందువులలో సంఘపరివారమే తమ ఏకైక ఆధారమనే తప్పుడు భావాన్ని కలిగించడానికి ప్రయత్నించింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా సాగించిన ఏకాత్మతా యాత్ర, రథయాత్రల పొడవునా ఆ రథచక్రాలకు అంటినది ఈ దేశ మైనారిటీల, పీడితుల నెత్తురే. ఆ నెత్తుటి విత్తనాలతో అధికారపంటను కోసుకున్న సంఘపరివారం బాబ్రీమసీదు విధ్వంసానికి, దేశవ్యాప్త మారణకాండలకు మాత్రమే కాదు, గుజరాత్‌లో జాతిహననానికి పాల్పడింది. హిట్లర్ తో, నాజీలతో సమానమైన అసహ్యకరమైన చరిత్రను మూటకట్టుకుంది. ఆ నెత్తుటి పంటను దేశవ్యాప్తంగా పండించి తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని సంఘపరివారం రాజకీయపక్షాలు ఒక మహాపథకాన్ని రచించి అమలుచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో హంతక రాజకీయ బృందంగా మారుతున్న సంఘపరివారం సమాజంలో సాధికారతను సాధించుకోవడానికి సామూహిక ఉత్సవాలను జరుపుతోంది. ప్రజలందరూ సంతోషంగా, ఉత్సాహంగా జరుపుకునే పండుగలను తన రాజకీయ, భావప్రచార వేదికలుగా, అంటే మతవిద్వేష, హింసా, హంతక ప్రణాళికల ప్రచార, ఆచరణ కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నది. ఆదిలాబాద్ జిల్లా భైంసాలో, పక్కనే ఉన్న వటోలిలో జరిగిన మారణకాండలో స్పష్టంగా కనబడుతున్నది ఇదే. దేవీనవరాత్రి ఉత్సవాలలో సంఘపరివార నాయకులు పాల్గొని రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇవ్వడం, ముస్లింల శుక్రవారం ప్రార్థనలు జరుగుతున్న సమయంలో మసీదు ముందుకువెళ్లి రెచ్చగొట్టే ప్రదర్శన జరపడం, ఘర్షణ జరగకుండా నివారించవలసిన ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం అన్నీ పద్ధతి ప్రకారం జరిగినవే. అందులోనూ జనాభాలో రెండు మతాల నిష్పత్తి దాదాపు చెరి సగంగా ఉన్న పట్టణంలో ఇటువంటి దుష్ట పన్నాగం తప్పనిసరిగా హింసాత్మకంగా మారుతుంది. ఒక మతస్తులు అతి తక్కువమంది ఉన్న పొరుగు గ్రామాలలో ఆ ప్రభావం మరింత ఎక్కువగా పడుతుంది. తత్ఫలితంగా సాధారణ మానవ ప్రవృత్తులే అంతరించిపోతాయి. ఎన్నో సంవత్సరాలుగా ఆ గ్రామస్తులందరికీ దర్జీగా పనిచేస్తున్న మనిషి, ప్రతి ఒక్క కుటుంబంతోనూ మతాతీతంగా సత్సంబంధాలు నెరపుతున్న వ్యక్తి, ఆ వ్యక్తి కుటుంబం, చుట్టపుచూపుగా వచ్చిన చిన్నారిపిల్లలు మతద్వేషకీలల్లో మాడి మసి అయిపోతారు. ఇది ఎవరి రాజకీయం కోసం జరిగినది అయినా, ఎవరి మతం కోసం జరిగినది అయినా అమానవీయమైనది, మనుషులు చేసేది కాదు. ఇప్పటికయినా సంఘపరివారాన్ని, దాని విషరాజకీయ వ్యూహాన్ని ప్రతిఘటించి, బహిష్కరించి ఓడించకపోతే మన మానవత్వమే అనుమానంలో పడుతుంది. వీ

అవి ఆత్మహత్యలు కావు

మరొకసారి చేనేత కార్మికుల ఆత్మహత్యలు పత్రికల పతాక శీర్షికలకూ, టెలివిజన్ ఛానళ్ల ప్రదర్శనలకూ ఎక్కుతున్నాయి. ఒక దశాబ్దానికి పైగా అనంతంగా సాగుతున్న ఈ ఆత్మహత్యలు ఎన్నికల రుతువు పుణ్యమా అని ప్రస్తుతం రాజకీయ నాయకుల మొసలి కన్నీళ్ల ప్రవాహాలను చూస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నవాళ్లూ, గతంలో ప్రభుత్వాలు నడిపినవాళ్లూ, భవిష్యత్తులో గద్దెనెక్కడానికి ఉవ్విళ్లూరుతున్న వాళ్లూ, ఎప్పుడూ అధికార పీఠాలను తమ భుజాల మీద మోస్తున్న వాళ్లూ అందరూ ఎదుటివారి వైపు వేలు చూపిస్తూ మరణించిన చేనేత కార్మికుల కుటుంబాల దగ్గర సానుభూతి నటిస్తున్నారు. చేనేత కార్మికుల అకాల, బలవన్మరణాలు ఆత్మహత్యల లాగ కనబడుతున్నప్పటికీ, అవన్నీ రాజ్యం చేసిన హత్యలేననే అసలు వాస్తవాన్ని మరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. రాజ్యంలో, రాజ్య విధానంలో నిన్ననో, ఇవాళనో, రేపో తామూ భాగమే గనుక అసలు నేరస్తులవైపు నుంచి దృష్టి మరల్చడానికి అందరూ ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఇవాళ చేనేత కార్మికులను హత్యచేస్తున్నవి మన పాలకుల రాజకీయార్థిక విధానాలు. వాటిని మౌనంగా సహిస్తున్నవి మన సమాజంలో నానాటికీ పెరుగుతున్న తప్పుడు విలువలు, మన సాంస్కృతిక విలువల చట్రంలో శ్రమజీవుల పట్ల పెరుగుతున్న చిన్నచూపు. నూతన ఆర్థిక విధానాల వెల్లువలో చేనేత కార్మికులకూ, కుటీర, చిన్న తరహా పరిశ్రమలకూ ఆదరణను తగ్గించి, భారీ యంత్ర పరిశ్రమలకూ, పెద్ద పెట్టుబడులకూ, ఎగుమతి ప్రధాన, బహుళజాతి సంస్థల, దేశీయ బడాసంస్థలకూ అనుకూల విధానాలు ప్రకటించి అమలు చేయడంతోనే చేనేత పరిశ్రమ కుంటుపడడం మొదలయింది. చేనేత వస్త్రాల మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి కాదుగదా, ఉన్నది ఉన్నట్టుగా పరిరక్షించడానికి కూడ ప్రభుత్వం ఏ చర్యలూ తీసుకోలేదు. మార్కెట్ ను తగ్గించడానికి ప్రయత్నించింది. మరొకవైపు ఉత్పత్తి వ్యయం పెరిగిపోతుంటే ఎటువంటి నియంత్రణా విధించలేదు. ఈ పరిణామాలతో ఉపాధి కోల్పోతున్న చేనేత కార్మికులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఈ రెండు దశాబ్దాలలో మొత్తం సమాజంలోనే ప్రపంచీకరణ అనుకూల, ఆడంబర జీవన శైలులు విస్తరించడంతో, శ్రామిక ప్రజల పట్ల చిన్నచూపు పెరిగిపోతుండడంతో చేనేత కార్మికుల ఉత్పత్తులకు విలువలేకుండా పోవడం, వారి జీవితాలకు కూడ విలువ లేకుండా పోవడం మొదలయ్యాయి. మన సమాజంలోని అతి పెద్ద జీవనవృత్తి పట్ల కొనసాగుతున్న ఇటువంటి తప్పుడు విధానాలను, నిరాదరణను, వ్యతిరేకతను సరిదిద్దవలసి ఉంది.

నానో - అందరూ అందరే

పశ్చిమ బెంగాల్ లోని సింగూర్‌లో ప్రజాప్రతిఘటనకు తోకముడిచిన తాతాలు తమ నానో కార్ల తయారీ కర్మాగారాన్ని గుజరాత్‌కు మార్చారు. పారిశ్రామికీకరణ కావాలో అరాచకత్వం కావాలో తేల్చుకొమ్మంటూ రతన్ తాతా బెంగాలీ ప్రజలను అవమానిస్తూ ఒక బహిరంగ లేఖ రాశాడు. ఈలోగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రానికి రమ్మంటే తమ రాష్ట్రానికి రమ్మని, ఏది అడిగితే అది ఇస్తామని తాతాలకు ఆహ్వానం పలికాయి. సింగూర్‌లోనే నానోను వెనక్కి రప్పించాలంటూ ఒక కుహనా ఉద్యమం కూడ మొదలయింది. ఈ దేశంలో పెట్టుబడి దారులకు, సంపన్నులకు లాభాలు చేకూర్చి పెట్టడం కోసం అబద్ధాలమీద, స్వార్థ ప్రయోజనాల మీద ఆధారపడుతూ ప్రజలనూ విడదీసి ఎవరికి వారికే ఆకర్షణలు చూపి పబ్బం గడుపుకునే పాలకవిధానాలు ఎంత నీచస్థాయికి దిగజారగలవో ఈ ఉదంతం రుజువు చేస్తున్నది. మొట్ట మొదట తాతాలు ఎవరికో ధర్మం చేయడానికి చిన్నకార్లు తయారు చేయడంలేదు. అది ఒకవ్యాపార ప్రయోజనం. పెట్టుబడిదారీ అర్థ శాస్త్రాన్ని నమ్మినా, ఆ వ్యాపార ప్రయోజనం కోసం వ్యాపార నియమాలే పాటించాలి గాని, రాయితీలు, మినహాయింపులు, ఉచిత సమర్పణలు అక్కరలేదు. రైతుల భూమిని లాక్కొని తక్కువ ధరకు ఇవ్వమని ప్రభుత్వాన్ని అడగకూడదు. అందులోనూ అవసరానికి మించిన భూమిని, రియల్ ఎస్టేట్‌గా మార్చుకోవడం కోసం అడగగూడదు. అడిగినా ప్రభుత్వం ఇవ్వగూడదు. తాతాలు మొన్న సింగూర్‌లోనూ, ఇప్పుడు గుజరాత్‌లోనూ అడుగుతున్న భూమి, రెండు భిన్నమైన రంగుల ప్రభుత్వాలు ఇచ్చిన భూమి వెయ్యిఎకరాలు కాగా తాతాల కార్ల కార్ఖానాకు అందులో మూడో వంతు కూడా అవసరం లేదని అంతర్జాతీయ కార్ల కార్ఖానాల ప్రమాణాలు చూపుతున్నాయి. సింగూర్ ప్రజల వీరోచిత పోరాటాన్ని తప్పుపట్టిన అక్కడి మార్క్సిస్ట్ నామాంకిత రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రజల మొండితనంవల్ల పారిశ్రామికీకరణ ప్రయత్నం ఆగిపోయిందని అంటున్నది. హిందుత్వ మొనగాడుగా ముందుకొచ్చిన మోడీని తాలిలు వరించారు. ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతాయుత ప్రతిపక్షం లేనందువల్లనే తాతాలు ఇక్కడికి రాలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి అంటున్నాడు. ఆశ్చర్యంగా తాతాలు, మార్క్సిస్టులమని చెప్పుకుంటున్న వాళ్లు, కాంగ్రెస్ ముఖ్యమంత్రి, భాజపా ముఖ్యమంత్రి అందరికందరూ ఒకేరకమైన అబద్ధాలు మాట్లాడుతున్నారు. పెట్టుబడిదారుల, సంపన్నుల ప్రయోజనా లు కాపాడడం విషయం వచ్చేసరికి భారత పాలకవర్గ ముఠాల మధ్య విభేదాలేమీ లేవని సింగూర్ – నానో ఉదంతం మరొకసారి రుజువు చేస్తున్నది.

మార్పు ఎంత కష్టం!

ఇటీవలి చైనా, నేపాల్ పరిణామాలు ప్రజారాజకీయాలను విశ్వసించేవారికి నిరుత్సాహాన్ని కలిగించేలా ఉన్నాయి. ప్రజాపోరాటాల ద్వారా, ప్రజా చైతన్యం ద్వారా, ప్రజలు తమను తామే పరిపాలించుకునే సామ్యవాద వ్యవస్థ ఏర్పడుతుందని, అది క్రమక్రమంగా వికసించి సమసమాజానికీ, అంతిమంగా అంతరాలు లేని వర్గరహిత సమాజానికి పరిణమిస్తుందని కన్నకలలు నెరవేరడంలో ఎన్ని అవరోధాలున్నాయో బయటపడుతున్నాయి. ఒకపక్క చైనాలో భూమి క్రయవిక్రయాలకు అవకాశం కల్పిస్తూ, అంటే చిట్టచివరి సామ్యవాద అవశేషమైన భూమి జాతీయకరణను రద్దుచేస్తూ నిర్ణయం తీసుకున్నారు. భూ సంస్కరణలతో, కమ్యూన్లతో సాగిన అద్భుత మావోయిస్టు ప్రయోగానికి ముగింపు పలికారు. మరొకపక్క న్యూయార్క్ పర్యటన సందర్భంగా నేపాల్ లో భూసంస్కరణల గురించి వచ్చిన ఒక ప్రశ్నకు జవాబు చెపుతూ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ (ప్రచండ) అందరు రాజకీయవేత్తల లాగానే 'అధ్యయనం చేయవలసి ఉంద'ని అన్నారు. కాలం చెల్లిన ఫ్యూడల్ ఆచారమయిన కుమారి ఉత్సవాన్ని మొదట కొంత వ్యతిరేకించినప్పటికీ మావోయిస్టు ప్రభుత్వం సకల ప్రభుత్వ లాంఛనాలతో అమలు జరిపింది. ప్రచండ విలాస జీవితం గురించి ఇదివరకు వచ్చిన వార్తలకు తోడుగా ప్రధానమంత్రి గృహంలో పడకమంచానికి పెట్టిన ఖర్చు గురించి కొత్తవివాదం రాజుకుంటోంది. పాలకపార్టీ తన పేరులోంచి మావోయిస్టు అనే విశేషణాన్ని వదులుకోవాలని నిర్ణయించుకుని ఆ నిర్ణయాన్ని శ్రేణులకో ప్రజలకో పత్రికలకో తెలపడానికన్న ముందే ప్రపంచ బ్యాంకుకూ, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థకూ తెలిపింది. ప్రత్యామ్నాయ రాజకీయాలను, సంస్కృతిని నిర్మించడం ఎంత కత్తిమీద సామో ఈ పరిణామాలు చూపుతున్నాయి. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : ఆర్థిక సంక్షోభం

నియంత్రణలేని మార్కెట్ల ద్వారా నడిచే పెట్టుబడిదారీ విధానం వలయాలు వలయాలుగా పైకీ కిందకీ ఊగిసలాడుతుందని, సంక్షోభాల వల్ల పెట్టుబడిదారీ విధానం తనలోని అనుత్పాదక పెట్టుబడులను క్షాళన చేసుకుంటుందని, దానితో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, కాని సంక్షోభం పెద్దదైతే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని మార్క్స్ అన్నాడు. మార్కెట్ వల్ల జరిగే ఈ వైఫల్యాల బలహీనతను అర్థం చేసుకున్న కీన్స్ పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడడానికి ప్రభుత్వ జోక్యం అవసరమని వాదించాడు. ప్రస్తుత సంక్షోభంలో ఆసక్తికరమైన విషయమేమంటే, ఈ సంక్షోభం మార్క్స్‌కు మాత్రమే కాదు, కీన్స్ ఆలోచనలకు కూడా ఎప్పుడో కాలం చెల్లిందనే మూఢవిశ్వాసం మీద నిర్మాణమైంది. అందువల్లనే విచిత్రంగా ఈ సంక్షోభం అందరినీ మళ్లీ ఒకసారి మార్క్స్ రచనలనూ, కీన్స్ రచనలనూ అధ్యయనం చేయడానికి పురిగొల్పుతోంది. ఇదంతా ఎందుకంటే, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం ఎంత విస్తృతమైనదంటే ప్రతి ఒక్కరూ 1930ల నాటి మహాసంక్షోభాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు.

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028







- **ప్రత్యేక మృత్యు మండలాలు** – సెజ్‌లపై పరిశీలనా వ్యాసాలు – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 148 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ మార్క్; నవోదయ బుక హౌస్, హైదరాబాద్
- **ఆయుధం పట్టని యోధుడు** – మార్టిన్ లూథర్ కింగ్ – ఎం.వి. రమణారెడ్డి – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 209 పేజీలు, 1/8 డెమీ, రు. 80
- **పథేర్ పాంచాలీ** – బిభూతి భూషన్ బంధోపాధ్యాయ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 258 పేజీలు, 1/8 డెమీ, రు. 80

పై రెండు ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500067, ఫోన్ : 23521849, 23517401

- **అసలు విషయం వ్యవస్థను మార్చడం** – కవితా సంపుటి – తక్కోలు మాచిరెడ్డి – కడప జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రచురణ – 74 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : డా. తక్కోలు మాచిరెడ్డి, 5/39-2, ముత్తరాసు పల్లి, కడప – 516 002, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్
- **నాగమణి నవ్వింది** – కవితా సంపుటి – డి. రామచంద్రరాజు – 98 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు : శ్రీమతి డి. సుజాత, డోర్ నెం. 4-6-25, మిద్దెమీద, రిజర్వాయర్ కాలనీ, తిరుపతి, సెల్ : 9849904514
- **17 సెప్టెంబర్ 1948** – భిన్న దృక్కోణాలు – తెలంగాణ హిస్టరీ సొసైటీ ప్రచురణ – సంపాదకులు : తడకమళ్ల వివేక్, సంగిశెట్టి శ్రీనివాస్, 150 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : సంగిశెట్టి శ్రీనివాస్, ఫ్లాట్ నెం. 305, హిమగిరి ఎవెన్యూ, 13-6-434/బి/38, ఓంనగర్, మెహదీపట్నం రింగ్‌రోడ్, హైదరాబాద్ – 500 008, సెల్ : 9849220321
- **నానీల దశాబ్ది** 1997 – 2007 – ప్రసంగ వ్యాసాలు – డా.ఎస్. రఘు – మనస్వి ప్రచురణలు – 103 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : మనస్వి ప్రచురణలు, 'అక్షరం', 4-2-171/1, (536), పోలీస్ హౌసింగ్ కాలనీ, మమత మెడికల్ కాలేజ్ రోడ్, ఖమ్మం – 507 002, ఫోన్ : 08742 – 255094, సెల్ : 9848208533
- **కల్లు మండువ** – కెవియల్ – అభ్యుదయ రచయితల సంఘం ప్రచురణ – 101 పేజీలు, 1/4 క్రౌన్, రు. 75, ప్రతులకు : కె.వి.ఎల్. రాష్ట్ర కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ గీత పనివారల యువజన విభాగం, 3-9-64, కంచరి బజార్, సూర్యాపేట. ఫోన్ :08684-220257, 220190; ఆంధ్రప్రదేశ్ గీత పనివారల సంఘు కార్యాలయం, ఎల్.బి.నగర్, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్ హౌస్
- **నిరీక్షణ** – కథల సంపుటి – సర్వజిత్, 120 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : పి. సూర్యనారాయణ, C/o. పి. సాయి సుబ్రహ్మణ్యం, మొదటి అంతస్తు, పద్మావతి టవర్స్, టి.వి. రావ్ హైస్కూల్ రోడ్, దుర్గాపురం, విజయవాడ – 520 003, సెల్ : 9010196842; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
- **జైలు భూమి** – వేల్పుల నారాయణ – ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల ప్రచురణలు – 71 పేజీలు, 1/8 డెమీ, రు. 35, ప్రతులకు : వేల్పుల నారాయణ, టి2 – 137, పవర్ హౌస్ కాలనీ, గోదావరిఖని, కరీంనగర్ – 505 209, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, దిశ పుస్తక కేంద్రం











రాగింగ్ మనకొద్దు పుస్తకాన్ని పరిచయం చేసినందుకు కృతజ్ఞతలు. తెలుగుభాష సంస్కృతి వ్యాసంలో కె. పుణ్యవతి గారు, ఆంధ్రులు అనే జాతి, కాళింగులు అనే జాతి కాశీ నుంచి, ఉత్తరాది నుంచి వచ్చారు అన్న మాట నమ్మశక్యంగా లేదు. కళింగ యుద్ధం వల్ల కళింగులు దక్షిణాదికి వచ్చారా? ఇది మరీ వింతగా ఉంది. ఇలాంటి విషయాల్లో వ్యాసాలు వైయక్తికంగా కాకుండా పరిశోధనా పత్రాలుగా ఉండేవాటికి ప్రాముఖ్యత ఇవ్వండి. మిగతావి అలా వస్తున్నటువంటివే కదా! పాఠకుల ఉత్తరాల్లో దినకర్ గారి కమ్యూనిస్టు అభిమానానికి ఆనందమేసింది. వాళ్లు అవ్వాబువ్వా రెండూ కావాలంటున్నారు. వాళ్ల తాత్పారం చూసి అభిమానులం ఎంత గిల్టీగా ఫీలయ్యామో దినకర్ గారి లాంటి వాళ్లకు ఎలా తెలుస్తుందో! ఆలస్యంగా జ్ఞానోదయం అయిందని ఆయనే అంటున్నారు. మరి దానికి శిక్ష ఉండదా? ఆలస్యం దేనికి సంకేతం? పాతనగరం మురికి వాడల గురించి ప్రశాంత్ చక్కగా వ్యాసం ఇచ్చారు. ఇట్టాంటప్పుడు అలాంటి ఒక ఫోటో అయినా ఇచ్చి ఉంటే బాగుండేది కదా! తన పరిశీలన, పరిశోధనలో మానవీయతా అంశాలూ, సమస్యని హృదయానుభూతం చేస్తున్నాయి. ప్రశాంత్‌కి అభినందనలు. కన్నబిరాన్ గారి చిరంజీవి - ప్రజాసేవ వ్యాసం ఆయన చిన్నప్పుడు రాసినట్టుంది. అంతకంటే సంపాదకీయమే చాలా బాగుంది.

- నటరాజ్
విశాఖపట్నం

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాస పత్రిక చదివాను. నేను ప్రస్తుతం ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో ఉన్నాను. తమరి పత్రికలో ప్రచురితమైన ఎన్నో ఆసక్తికరమైన విషయాలపై, ఇంకా అందులోని వాస్తవాలపై నాకు చాలా అభిరుచి ఉంది. ఇది నాకే కాక ఇక్కడ నాతోటి సహచర ఖైదీలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- సి.ఎచ్. దుర్గాప్రసాద్
ఖైదీల వ్యవసాయక్షేత్రం, చర్లపల్లి జైల్

అక్టోబర్ 'వీక్షణం'లో 'ప్రజారాజ్యం' పార్టీ ఆవిర్భావం, విధి విధానాలు. దాని భవిష్యత్తు పర్యవసానంపై వచ్చిన ఐదు వ్యాసాలు బాగా ఆకట్టుకున్నాయి. ఈ వ్యాసాల్లో 'ప్రజారాజ్యం' పార్టీపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. ఒకటి మాత్రం నిజం. కోట్లాది ప్రజాభిమానుల చరిష్మా కలిగిన చిరంజీవి పార్టీ పెడుతున్నాడని గత సంవత్సర కాలంగా మీడియా, పత్రికల్లో వస్తున్న నాటి నుంచి ప్రధాన పార్టీలకు భయం పట్టుకుంది. చిరుపార్టీని యువత, మహిళలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఇప్పటికే తెదేపా నుంచి ప్రజారాజ్యం లోకి వలసలు అధికమయ్యాయి. అధికార పార్టీ కాబట్టి కాంగ్రెస్ నుంచి అంతగా లేవు. ఇక చిన్న పార్టీలు, వామపక్షాలు, తెరాస, బిజెపి, లోక్‌సత్తా పార్టీలు చిరంజీవితో జత కట్టేందుకు తహతహలాడుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు గతంలో ఎన్‌టిఆర్ మాదిరిగా రెండు వందల సీట్లు దాటాల్సిన అవసరం లేదు. చిరంజీవి రాకతో నేడు రాష్ట్రంలో త్రిముఖ పోటీ అనివార్యమయ్యింది. కాబట్టి ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాదు. మ్యాజిక్ ఫిగర్ 148 వస్తే చాలు, ప్రభుత్వ ఏర్పాటు ఖాయం. చిరంజీవి గాలో, ప్రభంజనమో ప్రజారాజ్యం పార్టీకి ఎంత లేదన్నా 100 - 120 సీట్లు వచ్చినా చాలు. చిరంజీవి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉంది. అదెలాగంటే చిన్న పార్టీలు, లోక్‌సత్తా, వామపక్షాలు, తెరాస, బిజెపిలు చిరంజీవికి మద్దతునిస్తాయి. ఏది ఏమైనప్పటికీ 2009 ఎన్నికల్లో కొన్ని ఆశ్చర్యకరమైన ఎత్తులు, పొత్తులు, జిత్తులతో హంగ్ అసెంబ్లీ రాష్ట్రంలో రావడం ఖాయం. అలాగే సినిమా రంగం వారిని రాష్ట్ర ప్రజలు తప్పక గెలిపిస్తారు. దానికి నిదర్శనం నందమూరి తారకరామారావు తెలుగు దేశం పార్టీ విజయఢంకా మోగించడమే.

- జానపాటి శ్రీనివాస్
మిర్యాలగూడ

అక్టోబర్ 'వీక్షణం' చాలా బాగుంది. ప్రజారాజ్యం పార్టీ గురించి వచ్చిన వ్యాసాలు చాలా విమర్శనాత్మకంగా ఉన్నాయి. ముఖ్యంగా దుడ్డు ప్రభాకర్, ఎన్. వేణుగోపాల్ రాసిన వ్యాసాలు చాలా లోతుగా, ఆలోచనాత్మకంగా ఉన్నాయి. ప్రభాకర్ గారి వ్యాసం చదివిన తరువాత రెండు మాటలు రాయాలనిపించి ఈ లేఖను రాస్తున్నాను. ప్రభాకర్ గారు అన్నట్లు ప్రజారాజ్యం పార్టీపై దళిత బహుజనులు కొన్ని ఆశలు పెట్టుకున్న మాట వాస్తవమే. చిరంజీవిగారు తనకు అంబేద్కర్, పూలే ఆదర్శమని వారి ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా ప్రజారాజ్యం పార్టీ ఉంటుందని, సామాజిక న్యాయం తమ పార్టీ ఉద్దేశ్యమని చెప్పుకుంటున్నారు. చిరంజీవి గారు ప్రజారాజ్యం పార్టీ ప్రథమ సభను తిరుపతిలో ఏడు కొండల వాని పాదాల దగ్గర పెట్టి 'హిందువునిగా పుట్టినా హిందువునిగా చావనని' ప్రకటించుకున్న అంబేద్కర్ ఆశయాలను, పూలే ఆలోచనా విధానాన్ని ఆదిలోనే తుంగలో తొక్కారు. కమ్మ ప్రభువులు కారంచేడును, రెడ్డి దొరలు చుండూరును సృష్టిస్తే, కాపులు వెంకటాయపాలెం, పొట్టిలంకలను సృష్టించి తమ అగ్రకుల స్వభావాన్ని చాటుకున్నారు. ఇటువంటి పరిస్థితులను కత్తి పద్మారావు వంటి దళిత మహాసభ నాయకులు మరచిపోవచ్చుగాని, ఈ రాష్ట్రంలో ఉన్న దళిత యువకులు మరచిపోలేదు. అటువంటి కాపుకుల నాయకత్వంలో వస్తున్న ప్రజారాజ్యం పార్టీ 'సామాజిక న్యాయం, దళితోద్ధరణ' అనే నినాదాలు దళితులను మభ్యపెట్టి పబ్బం గడుపుకోవటానికే తప్ప, దళితులకు ఒరిగేదేమి ఉండదని దళితులు గ్రహించాలి. దళిత మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు ఇటువంటి మోసపూరిత నినాదాలను ఖండించి, దళితులను చైతన్యపరచవలసిన అవసరం ఉంది.

- కె. నాగసత్యనారాయణ
కపిలేశ్వరపురం

అక్టోబర్ 2008 'వీక్షణం'లో ఖైర్లాంజి తీర్పుపై ప్రచురించిన సంపాదకీయ వ్యాఖ్య చదివి ఈ ఉత్తరం రాస్తున్నాను. అందులో మీరు 'మరణశిక్షలను సూత్రరీత్యా వ్యతిరేకించే వారు కూడా ఆహ్వానించవలసిన తీర్పు ఇది' అని రాసారు. అందుకు సమర్థంగా ఖైర్లాంజి హత్యలు, మానభంగాలు ఎంత పాశవికంగా, అనాగరికంగా జరిగాయో వివరించారు. అదంతా నిజమే. కాని ఎంతటి జుగుప్సాకరమైన వారికైనా మరణశిక్షను ఆహ్వానించడం, అంతిమంగా సమాజంలో మరణశిక్షలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికే ఉపయోగపడుతుంది. 'నేరం ఉన్నంత వరకూ శిక్ష అనేది ఉండకతప్పదని గుర్తించవలసి ఉంది' అనే మీ మాటలతో ఏకీభవిస్తున్నాను. కాని దారుణమైన నేరాలకు మరణశిక్షలు విధించడాన్ని సమర్థించడం అంటే, ఏవి దారుణమైన నేరాలు లేదా ఏవి మరణశిక్షకు పాత్రమైన నేరాలు అనే చర్చ ప్రారంభమవుతుంది. వర్గ, కుల, మత విభజనల సమాజంలో దీనిపట్ల పాక్షిక వైఖరులుంటాయి. మతదురహంకారుల అభిప్రాయంలో మత విశ్వాసాలను కించపరిచే వాళ్లు మరణశిక్షలకు అర్హులు. వారి దృష్టికి అదే అత్యంత హేయమైన నేరం. దళిత కులాల దృష్టికోణం నుండి చూస్తే వాళ్లమీద అగ్రకుల దురహంకారంతో జరుపుతున్న దాడులు, హత్యలు అత్యంత దుర్మార్గమైనవి. ఇంకో కోణం నుండి ఆలోచిస్తే పురుషాహంకారంతో స్త్రీల మనస్సులపై, శరీరాలపై జరుగుతున్న మానసిక భౌతిక దాడులు అత్యంత జుగుప్సాకరమైనవి. ప్రభుత్వం, పాలకవర్గాల దృష్టిలో 'దేశద్రోహం' 'మరణశిక్ష' విధించదగ్గ నేరం. ఇలా ఎవరి సమర్థనలు వారికుంటాయి. ఇదంతా అంతిమంగా పాలకులు తమ పునాదుల్ని ప్రశ్నించేవారిని 'న్యాయ'బద్ధంగా భౌతికంగా నిర్మూలించడానికి దోహదపడుతుంది. మరణశిక్షలను కూడా రాజ్యహింసలో భాగంగా చూడాలి. అలా చూస్తే మరణశిక్షలను సమర్థించే ఏ చిన్నపాటి ఆలోచనయినా రాజ్యాన్ని మరింత దుర్మార్గంగా చేయడానికి ఉపయోగపడుతుందని గుర్తించాలి.

- సి.ఎస్.ఆర్. ప్రసాద్
గుంటూరు

మా విశ్వబ్రాహ్మణ సామాజిక చైతన్యానికి వీక్షణం ద్వారా తోడ్పాటు అందించగలరని కోరుతున్నాము. అసంఘటిత రంగంలో చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మాకు మీ ప్రోత్సాహం అవసరం. ప్రభుత్వం నుండి మేము కోరుతున్న డిమాండ్స్ : 1) విశ్వబ్రాహ్మణ చేతివృత్తులు నిర్వహించే గ్రామీణ నిరుపేద విశ్వబ్రాహ్మణ కుటుంబానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమి, ఎరువులు, విత్తనాలు ఇవ్వాలి; 2) సమగ్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ శాఖలు, విశ్వబ్రాహ్మణ కమిషన్‌లు ఏర్పాటు చేయాలి; 3) కేంద్రస్థాయిలో విశ్వబ్రాహ్మణ అభివృద్ధి, సామాజిక న్యాయసాధన భద్రత మిషన్ ఏర్పాటు చేయాలి; 4) విశ్వబ్రాహ్మణులను అత్యంత వెనుకబడిన వర్గం (ఎం.బి.సి) గా గుర్తించి అనగా రాజస్తాన్ ప్రభుత్వం గుజ్జర్‌లకు ఇచ్చిన మాదిరిగా అదనంగా రిజర్వేషన్ వర్తింపచేయాలి; 5) విశ్వబ్రాహ్మణ చేతివృత్తులు అయిన కమ్మరి, కంచరి, వడ్రంగి, బంగారు, శిల్ప వృత్తులను నిర్వహించే గ్రామాల్లో గల విశ్వబ్రాహ్మణులను వ్యవసాయ కార్మికులుగా గుర్తించి, వ్యవసాయ కార్మికులకు వర్తించే పథకాలలో భాగస్వాములను చేయాలి; 6) రైతులకు మాదిరి విశ్వబ్రాహ్మణ వృత్తులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి; 7) విశ్వబ్రాహ్మణ సహకార పరపతిని ఐదు వందల కోట్ల రూపాయల బడ్జెట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి; 8) ఆత్మహత్యలు చేసుకున్న విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఒక ఎకరం భూమి ఇవ్వాలి; 9) బహుళజాతి సంస్థలతో ఒప్పందం చేసుకున్న వ్యవసాయ శాఖ విశ్వబ్రాహ్మణులకు వృత్తి రక్షణ చేపట్టాలి;

(మిగతా 45వ పేజీలో...)

మెక్సికో జైలులో తిరుగుబాటు

మెక్సికోలోని ఓ కారాగారంలో జరిగిన తిరుగుబాటులో సుమారు 21 మంది ఖైదీలు సజీవదహనమయ్యారు. ఇక్కడి టమౌలిపాస్ కారాగారంలోని రోనోసా కారాగారంలో అక్టోబర్ 21న జరిగిన తిరుగుబాటు సందర్భంగా చెలరేగిన అల్లర్లలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనివెనుకగల కారణాలు తెలియరాలేదని జైలు వార్డెన్ వెల్లడించారు. కాగా ఈ ఘటన సందర్భంగా జైలు అధికారులు వ్యవహరించిన తీరుపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి

థాయ్‌లాండ్, కంబోడియా సరిహద్దులో ఉద్రిక్తత

థాయ్‌లాండ్, కంబోడియా దేశాల సరిహద్దుల్లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశం ప్రేవిహేయర్ దేవాలయప్రాంతం ఇరుదేశాల సైన్యాల కాల్పులతో అట్టుడుకుతోంది. తమ భూభాగం నుంచి థాయ్ సైన్యాలు వెనక్కి వెళ్లకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కంబోడియా ప్రధాని హన్‌సేన్ హెచ్చరించారు. అంతేగాక అక్టోబర్ 11న థాయ్‌లాండ్ సైన్యం తమ సైన్యంపై మొదటిసారిగా కాల్పులు జరిపిందని కంబోడియా సైనికాధికారి బ్రిగేడియర్ బన్‌తీన్ తెలిపారు. క్మెర్ దేవాలయం చుట్టూ 2 కిలోమీటర్ల మేర థాయ్ సైన్యం ప్రవేశించినందువల్లే సమస్య తలెత్తిందని ఆయన పేర్కొన్నారు. కాగా థాయ్, కంబోడియాల మధ్య సరిహద్దు ఘర్షణలు గత జూలై నుంచి కొనసాగుతున్నాయి. దీంతో తమ దేశ దక్షిణ సరిహద్దు ప్రాంతంలో కొనసాగుతున్న అత్యవసర పరిస్థితిని థాయ్ ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది.

భారత రచయితకు బుకర్

భారత ఆంగ్ల సాహితీ వినీలాకాశంలో మరో తార తళుక్కున మెరిసింది. కాల్పనిక సాహిత్యంలో చేసిన కృషికిగాను మన దేశానికి చెందిన అరవింద్ అదిగ (33)కు ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ వచ్చింది. బుకర్ ప్రైజ్ అందుకున్న భారత రచయితల్లో అరవింద్ ఐదో వ్యక్తి. ఇంతకు ముందు వీఎస్ నైపాల్, సాల్మన్ రష్దీ, అరుంధతీరాయ్, కిరణ్‌దేశాయ్‌లు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అరవింద్ రాసిన తొలి నవల 'ది వైట్ టైగర్'కు ఈ బహుమతి లభించింది. ఈ నవలను ఢిల్లీ ప్రజలకు అంకితమిస్తున్నట్లు బుకర్ వచ్చిన సందర్భంగా అరవింద్ ప్రకటించారు.

అత్యాచార వివాదంలో అమెరికా గవర్నర్

అమెరికాలో మరో గవర్నర్ అత్యాచార అభియోగాలను ఎదుర్కొంటున్నారు. నెవెడా గవర్నర్ జిమ్‌గిబ్బన్ తనపై అత్యాచారం చేస్తానని బెదిరించారంటూ ఓ మహిళ కోర్టులో వ్యాజ్యం వేశారు. 2006 ఎన్నికల ముందు లాస్ వెగాస్‌లోని ఓ హోటల్‌లో మద్యంసేవించి తనను రేప్ చేస్తానని బెదిరించారని పేర్కొన్నారు. తాను ఆ హోటల్‌లో వెయిట్రెస్‌గా పనిచేసేదాన్నని, గిబ్బన్స్ పార్కింగ్ స్థలంలో ఉన్న గోడకు తనను నెట్టివేసి అత్యాచారం చేయబోయాడని మహిళ కోర్టుకు వివరించింది.

దక్షిణాఫ్రికా, జపాన్‌లకు కొత్త సారథులు

దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా గలేయా మొట్లాంటేను అధికార 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్' ఎన్నుకుంది. మరో ఏడు నెలల్లో జరగనున్న పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల వరకు ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతారు. ప్రస్తుతం ఉన్న అధ్యక్షుడు ఎంబెకీ పార్టీ దేశాధ్యక్షుడిగా ఎంబెకీ ఎన్నికయ్యారు. జపాన్ ప్రధానిగా విదేశాంగ శాఖ మంత్రి తారో అసో(68) ఎన్నికయ్యారు. సెప్టెంబర్ 22న సమావేశమైన లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ (ఎల్‌డీపీ) సభ్యులు ఆయన్ను ఎన్నుకున్నారు. రాజీనామా చేసిన మాజీ ప్రధాని ఫుకుడా స్థానంలో ఈయన కొనసాగుతారు. మొత్తం 525 మంది సభ్యుల్లో 351 మంది అసోకు మద్దతు పలికారు.

కొరియా 'అణు' ధిక్కారం

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) ఆంక్షలను ఉత్తర కొరియా ధిక్కరించింది. అణుబాంబులను తయారు చేసే ఓ కేంద్రంలో ఐఏఈఏ అమర్చిన నిఘా కెమెరాలను ఫ్లెమింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'యురేనియం శుద్ధి చేసే కేంద్రంలో కొరియా ఇప్పటికే నిఘా కెమెరాలను తొలగించింది. ఇకపై ఐఏఈఏ పెత్తనం చెల్లదని ప్రకటించింది' అని ఆయన తెలిపారు.

ఇక ఎల్‌ఓసి వాణిజ్యం

ద్వైపాక్షిక సంబంధాల పురోగతికి ఉగ్రవాదం అడ్డుకారాదని భారత్, పాకిస్థాన్ అంగీకారానికి వచ్చాయి. పలు విశ్వాస కల్పన చర్యలు చేపట్టాలని నిర్ణయించాయి. ఐరాస సర్వ ప్రతినిధి సమావేశాల కోసం న్యూయార్క్ చేరుకున్న భారత ప్రధాని మన్మోహన్ సింగ్, పాక్ ప్రధాని జర్దారీ ఈ మేరకు సెప్టెంబర్ 25న సమావేశమయ్యారు. ఈ చర్యల్లో భాగంగా ఎల్‌ఓసి మీదుగా అక్టోబర్ 21 నుంచి పూంచ్-రావల్‌కోట్ మార్గాల్లో వాణిజ్యం ప్రారంభించాలని, కాల్పుల విరమణను సుస్థిరం చేయాలని, ఇరు పక్షాల ఆర్మీ డైరెక్టర్ జనరల్లు, సెక్టార్ కమాండర్లు కలుసుకునే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే వాఘా-అటారీ రోడ్డు మార్గాన్ని, ఖోక్రాపార్-మున్నాబావో రైలు మార్గాన్ని తెరవనున్నారు.

అణు బిల్లుకు ఆమోదం

అణు ఒప్పందం అమలు దిశగా లాంచనాలు దాదాపుగా ముగిసిపోయాయి. ఈ ప్రక్రియలో కీలకమైన కాంగ్రెస్ ప్రతినిధులు అణు బిల్లుకు ఆమోద ముద్ర వేసారు. సెప్టెంబర్ 27న కాంగ్రెస్‌లో నిర్వహించిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 117 ఓట్లు పడ్డాయి. అయితే అంతకు ముందు రోజు 'అణు బిల్లు'పై జరిగిన చర్చ సందర్భంగా అమెరికా విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ బెర్మన్‌తో పాటు మరో డెమోక్రాట్ నేత, మసాచ్యూసెట్స్ ప్రతినిధి ఎడ్వర్డ్ మార్కీ తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. అణ్వాస్త్ర వ్యాప్తి నిరోధానికి ఇది ఇలా దోహదం చేస్తుందని విమర్శించారు.

ప్రజలను ఓటర్లుగా చూస్తూ, ఓటర్లను కులమతాలుగా విభజించి మనుగడ సాధించే పాలకవర్గ రాజకీయాలు తీసుకువస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల్లో భాగమే ఈ హిందుత్వ దాడులు అంటున్నారు **వరవరరావు**

వాళ్లీసారి దళిత క్రైస్తవుల కోసం వచ్చారు

ఒరిస్సాలోని కందమల్ జిల్లాలో ఆగస్ట్ 22 మొదలుకొని దళిత్ పానా క్రైస్తవులపై జరిగిన దాడులు గుజరాత్‌ను మరిపించేలా ఉన్నాయి. కందమల్ జిల్లాకే పరిమితం కాకుండా ఇది క్రమంగా ఒరిస్సా అంతటికీ విస్తరిస్తుండడం వల్ల దీనిని ఇప్పుడు మరొక మైనారిటీ మతం విషయంలో గుజరాత్‌తో పోల్చవచ్చు. ఇప్పటికే ఒరిస్సాలో క్యాంపులలో ఉన్న బాధితులు చెప్పిన ప్రకారం వాణిజ్య వర్గాల ప్రోత్సాహంతో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ మొదలైన సంఘ్ పరివార్ కార్యకర్తలు చేసిన దాడులలో అరవై – డెబ్బై మంది దాకా హతులయ్యారు. వీరిలో గ్రామంలో సామూహిక అత్యాచారానికి గురై సజీవంగా దహనం చేయబడిన ఇద్దరు దళిత్ పానా యువతులు ఉన్నారు. ప్రధాన రహదారి మీదనే ఓ క్రైస్తవ సెమినరీలో పనిచేస్తున్న నన్ పై సంఘ్ పరివార్ వాళ్లు చేసిన అత్యాచారం ఇప్పటికే ప్రపంచం దృష్టికి వచ్చింది. దాడులు జరిగిన ప్రతిచోట వందలకొద్ది సంఘ్ పరివార్ కార్యకర్తలు 'జై శ్రీరాం', 'జై భజరంగ్ భళి' అంటూ 'భారత్ మాతాకి జై' అంటూ దాడి చేయడం బాధితులు అందరూ చెప్పిన వాంగ్మూలం. ఇట్లా నినాదాలు ఇస్తూ దాడి చేయడానికి వస్తున్న విషయాన్ని గమనించి పొరుగున ఉన్న అడవులలో వెళ్లిపోవడం వల్ల చాలా మంది దళితులు బతికిపోయారు. హతుల విషయంలో గానీ, బాధితుల విషయంలోగానీ సరైన సంఖ్య తెలియక పోవడానికి ఈ దాడుల సందర్భంగా చాలామంది ప్రాణరక్షణార్థం అడవులలోకి వెళ్లిపోవడం కూడా ఒక కారణమైంది.

గ్రామాలలో వేలాది దళిత క్రైస్తవుల దుకాణాలు తగలబెట్టారు. ఇళ్లను ధ్వంసం చేశారు. చర్చిలను ఉద్దేశ్యపూర్వకంగా కసితో ధ్వంసం చేశారు, తగలబెట్టారు. కొన్ని చర్చిలపై ఓం జెండాను ఎగరవేశారు. శిలువను పడగొట్టి ధ్వంసం చేయడం ఒక సాధారణమైన విషయం. గుజరాత్‌లో వలెనే ఇరుగు పొరుగున హిందువుల ఇళ్లు ఉంటే మధ్యన ఉన్న క్రైస్తవ ఇళ్లను ధ్వంసం చేయడం కనిపిస్తుంది. ఈ విషయంలో కొన్ని చోట్ల ఆదివాసీ క్రైస్తవులు కూడా దాడులని తప్పించుకోలేక పోయారు. యాభై దాకా చర్చిలు దగ్ధం అయ్యాయి. నాలుగు కాన్వెంట్లు, ఐదు హాస్టళ్లు, ఎనిమిది పెద్ద పెద్ద క్రైస్తవ సంస్థలు, లెక్కకుమిక్కిలి ప్రచార వాహనాలు ధ్వంసం చేయబడ్డాయి. ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారమే 154 చర్చిలు, పదిహేను ప్రభుత్వ భవనాలు ధ్వంసం అయినాయి. 37 మంది హత్యకు గురైనారు. 62 మంది గాయపడినారు. ఇది కేవలం కందమల్ జిల్లాకు పరిమితమైన అంశం.

ఈ దాడులు జరుగుతున్నప్పుడు స్థానిక పోలీసులు ప్రేక్షకులుగా మిగిలి శవాలను తీసుకుపోవడానికో, గాయపడిన వారిని ఆలస్యంగా ఆసుపత్రులకు తీసుకువెళ్లడానికో వచ్చారు తప్ప ఏ సహకారం అందించలేదనీ, పైగా ప్రోత్సహించినట్టే కనిపించారనీ క్యాంపుల్లో బాధితులు చెప్పారు. క్యాంపుల్లో ఉన్న ప్రభుత్వాధికార్ల, పోలీసు అధికార్ల వైఖరి చూసినా ఎంత హిందూత్వ భావజాలానికి లోనవుతున్నారో స్పష్టమౌతుంది. 'వీళ్లకేమండీ, ఈ క్యాంపులలో మా రక్షణలో భద్రంగానే ఉన్నారు. బయట ఉన్న హిందువులకే ప్రాణానికి రక్షణ లేదు' అని క్యాంపు ఇన్‌చార్జి పోలీసు అధికారి వ్యాఖ్యానించాడు.

ఆలస్యంగా వచ్చిన కేంద్ర పారా మిలిటరీ బలగాలు ఇప్పుడు ఈ ఒక్క జిల్లాలోనే 53 కంపెనీలు ఉన్నాయి. స్థల విస్తీర్ణం దృష్ట్యా చూసినప్పుడు ఇది కాశ్మీర్ కంటే ఎక్కువగా కేంద్ర పారామిలిటరీ బలగాల మోహరింపని ఒక స్థానిక పత్రికాధిపతి పేర్కొన్నారు. సహజంగానే ఒకచోట ఘర్షణలు నడిచి అదుపు చేయడానికి పంపించబడిన పోలీస్ బలగాలు అతిగా ప్రవర్తిస్తాయి. రెండు మూడు సందర్భాల్లో పోలీసులు కాల్పులు జరిపారు. అందులో అనధికారికంగా పదిహేను మంది మరణిస్తే అధికార లెక్కల ప్రకారం ఆరుగురు మరణించారు. నెల, రెండు నెలలు తిరగకముందే ఈ కేంద్ర పోలీసుల అత్యాచారాలు ఎంత మితిమీరాయంటే అక్టోబర్ 14న తమ మీద అత్యాచారానికి ఒడిగట్టిన ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్‌ను మహిళలు కొట్టి చంపారు. అందుకే సిఆర్‌పిఎఫ్ జవాన్ మరణాన్ని పెద్దగా ప్రచారం చెయ్యలేదు.

ఆరువందలకు పైగా వ్యక్తులను అరెస్ట్ చేశారు, నాలుగువందలకు పైగా క్రిమినల్ కేసు పెట్టారు. కాని ప్రతి క్యాంపులోనూ బాధితులు చెపుతున్న దేమిటంటే, ఈ దాడులు ప్రోత్సహించిన వాళ్లుగా తాము స్థానికంగా పేర్కొన్న ఏ ఒక్క స్థానిక గూండా నాయకుడిని గానీ అరెస్ట్ చేయలేదనీ, వీళ్లు అందరూ ఒరిస్సా తీరప్రాంతం నుంచి వచ్చి తమను చిరకాలంగా దోచుకుంటున్న వాళ్లని వాళ్లు చెప్పారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ప్రతి క్యాంపులోనూ ఆ పేర్లు ఇచ్చామనీ, భజరంగ్ దళ్ పేరుతో 'మీ మతానికి మీరు ఎప్పుడు తిరిగివస్తారు, లేకుంటే మీ ప్రాణాలు రుచిచూస్తాం' అని రాసిన బెదిరింపు లేఖలు ఎన్నో ఇచ్చామని వారు చెప్పారు.

ఈ దాడులు, హత్యాకాండ, విధ్వంసం ఆగస్ట్ 22న లక్ష్మణానంద హత్యతో ప్రారంభమైనప్పటికీ దీని మూలాలు మాత్రం 1997లో

మొదటిసారిగా దళితుల మీద జరిగిన దాడులలోనే ఉన్నాయి. ఒక హత్యకేసులో యువకుడుగా ఉత్తరదేశానికి పారిపోయి, హరిద్వార్‌లో సాధువుగా మారిన లక్ష్మణానంద 1969లో విశ్వహిందూ పరిషత్ పనుపుపై వనవాసి కళ్యాణ ఆశ్రమాలను నిర్వహించడానికి కందమల్ జిల్లాకు వచ్చాడు. అప్పటి నుంచీ ఒరిస్సా తీర ప్రాంతం నుంచి వ్యాపారస్తుల సహకారంతో బదులూ, సంస్థలూ నిర్వహిస్తూ ఆదివాసులను హిందూ మతంలోకి బలవంతంగా మారుస్తూ వస్తున్నాడు. ఇప్పుడు పానా దళితులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న కుయి ఆదివాసి సమాజ అధ్యక్షుడైన లంబోదర కన్హర్ కూడ లక్ష్మణానంద హంతకుడని, భూ భక్షకుడని ఆయన మీద ఎన్నో నేరాలు పోలీస్ స్టేషన్లో నమోదయ్యాయని చెప్పాడు.

2007 డిసెంబర్ 24, 25 క్రిస్మస్ వేడుకలు సందర్భంగా వ్యాపారస్తులు ఈ ప్రాంతంలో బంద్‌కు పిలుపునిచ్చి ఘర్షణలు రెచ్చగొట్టడానికి లక్ష్మణానంద ప్రోత్సహించాడు. ఇక్కడ ఇరువైపుల జరిగిన ఘర్షణల్లో ముగ్గురు మరణించారు. అప్పుడే మొదటిసారి ఈ ఘర్షణల్లో మావోయిస్ట్‌ల పాత్ర ఉందని పోలీసులు చెప్పినప్పుడు అందులో తమ పాత్ర ఉంటే లక్ష్మణానంద వంటి సంఘ్ పరివార్ హంతకముఠా నాయకుణ్ని చంపేవాళ్లమని వాళ్లు ప్రకటించారు. ఇప్పుడు చాలా స్పష్టంగా వాళ్లు లక్ష్మణానందను చంపింది తామేనని, అతనికి చాలాకాలంగానే హెచ్చరికలు పంపుతున్నామని తమ కారణాలు వివరించారు. అయినప్పటికీ సంఘ్ పరివార్ ఇది క్రైస్తవులు చేసిన హత్యగా చిత్రిస్తూ దళిత్ పానా క్రైస్తవులపై దాడులు చేస్తున్నారు. చివరికి ఇది మావోయిస్టులు చేసిన హత్యేనని, అందులో ముగ్గురిని అరెస్ట్ చేశామని చెపుతున్న పోలీసులు క్రైస్తవ సంస్థలు మావోయిస్ట్‌లను కిరాయికి తీసుకొని హత్య చేయించాయని ఆరోపిస్తున్నారు.

అంటే ఉద్దేశ్యపూర్వకంగా అటు సంఘ్ పరివార్, ఇటు పోలీసులు ఇది క్రైస్తవులు చేయించిన హత్యగా చూపాలని ప్రయత్నం చేస్తున్నారు. దీనితో తరువాత క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదివాసులకు, దళితులకు మధ్యన సంఘర్షణగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. భజరంగ్ దళ్‌ను హిందూత్వ సంస్థ అంటూనే ఈ హత్యాకాండకూ, విధ్వంసానికీ వాళ్లు బాధ్యులని అనలేకపోతున్నారు. అందుకు కారణం ఎనిమిదిన్నర సంవత్సరాలుగా ఎన్.డి.ఎ.లో భాగస్వామిగానే ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. సంఘ్ పరివార్ రాజకీయ వ్యక్తీకరణ అయిన బిజెపి సహకారం లేకుండా ఆయన అధికారంలో ఉండలేడు కాబట్టి తన ఎముకలలో లౌకికవాద మూలుగులు ఉన్నాయని చెపుతున్నప్పటికీ ఆయన అసహాయంగా ఉండిపోతున్నాడు.

ఒరిస్సా అత్యధిక సంఖ్యలో ఆదివాసులు ఉన్న రాష్ట్రం. 38 శాతం ఆదివాసులు, 16 శాతం దళితులు ఉన్నారు. అడవి ప్రాంతం అంతా అపారమైన ఖనిజ సంపద ఉంది. ముఖ్యంగా కందమల్ జిల్లా అపారమైన అడవి సంపదకు ఆలవాలమైంది. ఇదివరకు ఫూల్‌బని జిల్లాగా ఉన్న జిల్లాను ఇటీవలనే కందమల్ జిల్లా అని పేరు పెట్టారు. ఫూల్‌బనీ అంటే పూలవనం అనే అర్థంలో ఇది అడవి అని, కందమల్ అంటే కుయి సమాజం అని, అంటే ఆదివాసీ సమాజం అని అర్థం. అంటే ఇది అడివనీ, ఆదివాసులదనీ పేరులోనే ఉంది. అయితే తగిన సంఖ్యలో ఇక్కడ పానా దళితులు కూడా ఉన్నారు. ఈ పానా దళితుల్లోకి క్రైస్తవ మిషనరీ వచ్చి హిందూ మతంలో ఉన్న అస్పృశ్యత కారణంగా, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ కారణంగా మతాంతరీకరణకు పూనుకున్నది. అయితే ఎక్కడా క్రైస్తవ మతం బలవంతంగా తనలోకి దళితులను గానీ, మరెవరిని గానీ కలుపుకున్న దాఖలాలు లేవు. వ్యతిరేకులు చెపుతున్న ప్రకారం కూడా బియ్యం, చదువు, ఆవాసం వంటి వసతులు కల్పించి దేవుని బిడ్డలుగా చూసి ప్రలోభపెట్టారని చెపుతున్నారు తప్ప హిందూ మతం వలె బలవంతంగా కలుపుకుంటున్నారని దాఖలా లేదు. మరొకవైపు ఆదివాసులను హిందూ మతంలోకి చేర్చుకోవడానికి గోమూత్రంతో, ఆవుపెండతో శుద్ధి కార్యక్రమాలు చేస్తూ, మతంలేని ఆదివాసులకు మతాన్ని ఇస్తున్న సంఘ్ పరివార్ తిండి, పెళ్లి, చావు వంటి ఏ విషయాల్లో కూడా అగ్రకులాలతో ఆదివాసుల సంబంధాలను ఏర్పర్చడం లేదు. ఆదివాసుల ఇళ్లలోకి పుట్టుక, చావు, పెళ్లి సందర్భంగా కూడా బ్రాహ్మణులు వెళ్లరు. ఇక కంచం పొత్తు, మంచం పొత్తు అగ్రవర్ణాలకు ఆదివాసులతో ఉండనే ఉండదు. అయితే మరి ఆదివాసులలోకి ఈ వనవాస ఆశ్రమాలు ఎందుకొచ్చినట్టు? ఎంత దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఇవాళ ఈ ఘర్షణ వెనుక రెండు భావజాల ఘర్షణలు ఉన్నాయి.

నలభై ఏళ్ల క్రితం నక్సల్బరీ పోరాటం ప్రారంభమైనప్పటి నుంచి దేశంలోని ఆదివాసీ ప్రాంతాలన్నీ నక్సలైట్ ఉద్యమ ప్రభావంలోకి వచ్చాయి. నక్సల్బరీ, గోపీవల్లభ్‌పూర్, శ్రీకాకుళం, కేరళ లోని వైనాడ్ మొదలుకొని ఇవాళ జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీ జిల్లాలన్నీ నక్సలైట్ ఉద్యమ ప్రభావంలో ఉన్నాయి. ముఖ్యంగా మావోయిస్ట్ పార్టీ ప్రాబల్యంలో ఉన్నాయి. ఈ ఆదివాసులు ఉంటున్న అడవిలోనే భూస్వాములకైనా, పెట్టుబడిదారులకైనా, వీళ్ల ఇద్దరి యజమాని అయిన సామ్రాజ్యవాదానికైనా అవసరమైన వన సంపద, ఖనిజాలు, భూమి కూడా ఉన్నాయి. వలసవాద కాలం నుంచి కూడా దోపిడీ దారుల కన్నంతా అడవిమీద ఉండడానికి కారణం అదే. ఒకవైపు నక్సల్బరీ ఉద్యమం ప్రారంభమైన రోజుల్లోనే దేశంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థల జోక్యం పెరుగుతూ వచ్చి అడవి మీద పెట్టుబడి కన్ను కేంద్రీకరించింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలు నెరవేర్చడానికే అడవి మీద సంఘ్‌పరివార్ సంస్థలు, ఎన్‌జిఓల కన్నుపడింది. ఈ విప్లవోద్యమ పరివ్యాప్తిని అరికట్టడానికి సంఘ్ పరివార్ శక్తులు వనవాసీ కళ్యాణ్ ఆశ్రమాలు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయడం ప్రారంభించాయి. నక్సలైట్ ఉద్యమం ఇంకా బలంగా ఉన్న చోటికి ఇవి ప్రవేశించలేక పోతున్నప్పటికీ బలహీనంగా ఉన్న చోట ప్రారంభించి, క్రమంగా విస్తరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఛత్తీస్‌ఘడ్ వంటి ప్రాంతంలోనైతే అడవి చుట్టూ మైదాన ప్రాంతాల్లో చిన్న చిన్న వ్యాపారస్తుల ఆధారంగా సంఘ్ పరివార్ సహకారంతో పెట్టుబడి ప్రవేశించి క్రమంగా రమణ్‌సింగ్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చి ప్రతిపక్ష కాంగ్రెస్ మహేంద్ర కర్మ ఇచ్చిన సాల్వాజుడుం దాడులతో చేస్తున్న విధ్వంసం మనం చూస్తూనే ఉన్నాం.

ఒరిస్సాలోనూ మల్కన్‌గిరి, గంజాం మొదలైన దక్షిణాది ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమం విస్తరించి ఆదివాసుల హక్కులు

రక్షించడానికి పోరాడుతోంది. కళింగనగర్‌లో టాటా కంపెనీకి ఆదివాసుల వందలాది ఎకరాల అడవి ఇవ్వకుండా రెండేండ్లకు పైగా నక్సలైట్ ఉద్యమమే అండగా ఉంది. అక్కడ పదకొండు మంది ఆదివాసులను టాటా కంపెనీ గార్డ్లు, పోలీసులు కలిపి చంపారు. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా అక్కడ ఆదివాసులు పోరాడుతున్నారు. సంబల్‌పూర్, కాశీపుర, గోపాలపురం మొదలైన ఎన్నో ప్రాంతాల్లో అడవినీ, తీరప్రాంతాలనూ బహుళజాతి కంపెనీలో, బడా కంపెనీలో ప్రభుత్వ సహకారంతో ఆక్రమించుకోవాలని పోరాడుతుంటే వాళ్లకు అండగా నక్సలైటు ఉద్యమం, ప్రగతిశీల శక్తులూ, ప్రజాస్వామ్య శక్తులూ నిలిచాయి. గోపాలపురంలో సిపిఐ నాయకత్వంలో జరుగుతున్న ఈ పోరాటం పై కూడా ప్రభుత్వం విరుచుకపడి నాయకుడు సాహూను అరెస్ట్ చేసింది. కందమల్ జిల్లాలో కూడా ఈ శక్తులు ప్రవేశించి బలపడకముందే ఆదివాసుల మీద పట్టు సాధించి అడవి సంపదను తన గుప్పిట్లో పెట్టుకోవడానికి సంఘ్ పరివార్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ దాడి.

కందమల్ జిల్లా చిన్నదే కాని, సమృద్ధిగా వనరులు ఉన్నాయి. ఇరవై బిలియన్ డాలర్ల విలువ చేసే టేకు కర్ర ఉన్నది. ఒరిస్సాలో ఉత్పత్తి అయ్యే చింతపండు, అల్లం యాభై శాతం ఈ ఒక్క జిల్లాలోనే లభిస్తాయి. తీరప్రాంతం నుంచి వచ్చిన అగ్రవర్ణ వ్యాపారస్తులు వీటిని అయిదు రూపాయలకు కిలో కొని యాభై రూపాయలకు అమ్ముతున్నారు. వీళ్లకు ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి, భజరంగ్ దళ్ అండ ఉన్నది. అగ్రవర్ణ హిందువులు కాబట్టి స్వయంగా వీళ్లే ఈ సంఘపరివార్ కార్యకర్తలుగా ఉన్నారు. 2007లో లక్ష్మణానంద గోవధ నిషేధ ఉద్యమమని చేపట్టి, పానా దళితులు గోమాంసం తింటారు కాబట్టి వాళ్ల మీద దాడులకు ప్రోత్సహించారు. అయితే వాస్తవానికి ఇవాళ కందమల్ జిల్లాలో ఎక్కడ పర్యటించినా కనిపించే పశు సంపదలో ఎక్కువగా పానా దళితులవే. ఇన్ని హత్యలూ, దాడులూ జరిగిన తరవాత కూడా వీళ్లు దినమంతా ఈ పశువులను అడవికి తీసుకుపోవడానికి ఊళ్లోకి వస్తున్నారు. వాటిని మేపుకుని సాయంకాలాలు దగ్ధమైపోయిన తమ ఊళ్లలో, మిగిలిపోయిన తమ స్కూళ్లలో 60-70 మంది కలిసి నిద్రపోతున్నారు. లేదా దగ్గర ఉంటే రాత్రిపూట క్యాంపులకు పోతున్నారు. ఇప్పటికైనా హిందువుగా మారకపోతే మళ్లీ దాడి చేస్తామని, లేదా సిఆర్‌పిఎఫ్ వెళ్లిపోయిన తరువాత మళ్లీ గ్రామాల మీద పడతామని సంఘ్ పరివార్ బెదిరిస్తున్నప్పటికీ పశు సంపద తప్ప ఏమీ మిగలని పానా దళిత క్రైస్తవులు దినమంతా వాటి కోసమే ఊళ్లలోకి వస్తున్నారు. ఏ మాత్రం హామీ లభించినా ఆ పశువులను తమ ఒకటి రెండు ఎకరాల భూమిని కాపాడుకోవడానికి తమ ఊళ్లకు వెళ్లిపోతామంటున్నారు. వాళ్లు పశుమాంసం తినరా అంటే, ఇంక వ్యవసాయానికి, సంతానానికి, పాడికి పనికి రాకుండా కబేళాకు సిద్ధమైన వాటిని, లేదా చచ్చిన వాటిని తింటారు. నిజానికి ఈ ఆరోపణ చేస్తున్న క్రైస్తవేతరులైనా, అగ్రవర్ణాలైనా తమ ముసలి పశువులను వీళ్లకే అమ్ముకుంటున్నారు. లేదా చచ్చిన వాటిని వీళ్లకు అప్పగిస్తున్నారు. అప్పుడు వీళ్లకు ఈ గో ప్రేమ ఎక్కడ పోయినట్టు?

ఆదివాసులు హిందువులు కారని, కొత్తగా ఇక్కడ పెద్ద చర్చ చేయనక్కర్లేదు. గ్రామీణ సమాజంలోని బ్రాహ్మణేతరులు ఎవరైనా దేవాలయాల్లోని గర్భగుడిలోకి ప్రవేశించనివ్వని దృష్టిదోషాన్ని, స్పర్శదోషాన్ని పాటించే బ్రాహ్మణులు వర్ణ వ్యవస్థలో ఒక నిచ్చెనమెట్టు అసమానతను పాటించి, హిందుత్వ భావజాలంలో తాము పేర్కొంటున్న పవిత్రాంశాన్ని బ్రాహ్మణులకే పరిమితం చేసింది. దళితులనైతే అస్పృశ్యులుగా చూసింది. కాని ఇతర మతాల విషయాల్లోకి వచ్చినప్పుడు మాత్రం వీళ్ల మీద లేని ప్రేమ నటిస్తూ హిందువులుగా చూపుతున్నది. కీలవేన్మణి మొదలుకొని ఖైర్లాంజీ దాకా కోకొల్లలుగా అగ్రవర్ణాలు చేసిన దాడులన్నీ దళితులమీద అగ్రవర్ణాలు చేసినవే. వారిని తాము ఇవాళ హిందూ మతస్తులుగా చూపుతున్నారు. లేదా హిందూ మతంలోకి బలవంతంగా మార్చుకోవాలనుకుంటున్నారు. .

నిజానికి వేరే మతాల పేరుతో సంఘ్ పరివార్ చేస్తున్న దాడులు దళితుల మీద చేస్తున్న దాడులే. ఈ దేశంలో ముస్లింలైనా, క్రైస్తవులైనా అత్యధిక శాతం దళితులే. గుజరాత్‌లోనైనా, ఇవాళ ఒరిస్సాలోనైనా ముస్లింలుగా, క్రైస్తవులుగా ఈ దాడులకు బలి అయింది వాళ్లే. విషాదమేమంటే సంఘ్ పరివార్ ఈ దాడులకు ఆదివాసులను రెచ్చగొట్టి వాడుకోవడం గుజరాత్‌లో ప్రారంభమై ఇక్కడ వికృత రూపం తీసుకుంది. రాజ్యం అండతో సంఘపరివార్ ఛత్తీస్‌ఘడ్‌లో ఈ పనిని సాల్వాజుడుం పేరుతో ఆదివాసులతో ఆదివాసులపైననే చేయిస్తోంది.

కందమల్ జిల్లాలో సంఘ్ పరివార్‌కు ఆదివాసులను పురికొల్పడానికి కలిసొచ్చిన అంశాలు రెండు ఉన్నాయి. ఈ జిల్లాలో పానా దళితులకు అందరికి ఇంచుమించు ఒకటి, రెండెకరాల భూమి ఉన్నది. క్రైస్తవ మిషనరీల వల్ల చదువు అబ్బింది. వేరే ప్రాంతాల్లోని దళితులతో పోలిస్తే ఒక మేరకు శుభ్రమైన జీవితమే. కుయీ ఆదివాసులకు కూడా భూమి ఉన్నప్పటికీ వాళ్లు ఆ ప్రాంతపు ప్రాచీన ఆదివాసి రాజవంశానికి చెందిన వాళ్లుగా భావించడం వల్ల, రాజ్యాంగం ప్రకారం కూడా అడవిపై తమకే హక్కున్నదని భావించడం వల్ల వాళ్లు పానా దళితులను తమకు పోటీగా చూస్తున్నారు. రెండు వందల సంవత్సరాలుగా పానా దళితులు, కుయీ ఆదివాసులు సఖ్యంగా ఉంటున్నప్పటికీ ఇటీవలి రెండు పరిణామాలు వారి మధ్య వైమనస్యాలకు కారణమయ్యాయి.

పానా దళితులు తాము కూడా కుయీ భాష మాట్లాడతారు గనుక తమను షెడ్యూల్డ్ ట్రైబ్‌గా గుర్తించాలని ప్రభుత్వం ముందు డిమాండ్ పెట్టారు. క్రైస్తవులుగా మతాంతరీకరణ పొందినందువల్ల షెడ్యూల్డ్ కులం పొందవలసిన రాజ్యాంగ హక్కులు పోతాయనే భయంతో షెడ్యూల్డ్ ట్రైబ్ గుర్తింపును కోరారు. దానికి తోడు ఇటీవలనే ఎస్.టి. నియోజకవర్గంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ఎస్.సి. నియోజకవర్గంగా మార్చారు. ఈ రెండు పరిణామాలు తక్షణ కక్షలకు కారణమయ్యాయి. ఒకవైపు ఈ పొగ రాజేసిందీ ప్రభుత్వమే, దీనిని అనువుగా వాడుకుంటున్నది సంఘ్ పరివార్. కుయీ ఆదివాసి సమాజం కూడా తీర ప్రాంతాల నుంచి వచ్చిన వర్తకుల చేతుల్లో, సంఘ్ పరివార్ చేతుల్లో ఎన్నో బాధలు అనుభవించినవాళ్లే. వనవాసి ఆశ్రమాల్లో లక్ష్మణానంద మొదలుకొని ఎందరో సంఘపరివార్ కార్యకర్తలు ఆదివాసీ మహిళలపై చేసిన అత్యాచారాల గురించి ఆదివాసీ మహిళలు కూడా చెబుతున్నారు.

సంఘ్ పరివార్ భావజాలానికి పూల్‌బనీ స్థాయి నుంచి భువనేశ్వర్ దాకా లోనైన మీడియా గురించి ఒక విచిత్రమైన నుడికారాన్ని వారు వాడారు. 'అవును ఆ పత్రికలు పాపం తమ స్వామి కోల్పోయాయి'.

ఇంత జరిగినా ప్రభుత్వం కందమల్ జిల్లాకు సంబంధించిన పదేళ్ల కింది లెక్కలను మాత్రమే చూపుతున్నది. జనాభా విషయంలోగానీ, ఇతర జిల్లాల వివరాల విషయంలోగానీ, క్యాంపుల్లో ఎంతమంది ఉన్నారు, మృతుల కుటుంబాలకు ఏ నష్టపరిహారం ఇచ్చారు అనే విషయాల్లో ఏ స్పష్టతా లేదు. మృతుల కుటుంబాలు క్యాంపులలో ఉండడం మినహా, ఏ ఒక్కరికీ నష్టపరిహారం ఇవ్వలేదు. ధ్వంసమైన చర్చిలను గానీ, క్రైస్తవ సంస్థలను గానీ పునర్నిర్మాణం చేసేది లేదని ప్రభుత్వం స్పష్టంగానే ప్రకటించింది. అక్కడ మాత్రమే ప్రభుత్వానికి రాజ్యాంగంలోని లౌకిక నిర్వచనం గుర్తుకొచ్చింది. తాము క్రైస్తవ చర్చిలను పునర్నిర్మాణం చేస్తే ఒక మతాన్ని ప్రోత్సహించినట్టు అవుతుందని సాకు చూపుతుంది. సంఘ్ పరివార్ ధ్వంసం చేసిన బాబ్రీమసీదు పునర్నిర్మాణం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూపుతున్న సాకు వంటిదే ఇది కూడ.

కందమల్‌లో జరుగుతున్న ఈ హత్యాకాండ, విధ్వంసం ఆ జిల్లాకు, ఒరిస్సాకే పరిమితం కాదిప్పుడు. ఇంచుమించు అదే స్థాయిలో కర్ణాటకకు విస్తరించినట్లు సమాచారం అందుతోంది. నిన్న గుజరాత్‌లో, అప్పటినుంచే కర్ణాటకలో, ఇవాళ ఒరిస్సాలో, మళ్లీ కర్ణాటకలో ఏకకాలంలో అక్కడ ముస్లింల మీద, ఇక్కడ క్రైస్తవుల మీద దాడి ప్రారంభించారు. మొదట బిజెపి ప్రభుత్వాలు ఉన్న చోట ప్రారంభించి ఎన్‌డిఎ భాగస్వామ్యానికి విస్తరించి క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించి రేపు హిందుత్వ కార్డ్‌తో అధికారంలోకి రావాలని బిజెపి సంఘ్ పరివార్‌ని ప్రోత్సహిస్తోంది. కందమల్ జిల్లాలో జరిగిన హత్యాకాండను, విధ్వంసాన్ని నకుల్ నాయక్ అనే పానా దళిత్ నాయకుడు తప్ప ఏ ఒక్క పార్టీకూడా ఖండించలేదు. ఎందుకంటే హిందూ ఓటు బ్యాంక్‌కు భయపడి. ఇవాళ దేశవ్యాప్తంగా కూడా అత్యధిక సంఖ్యాకులు అయిన హిందువుల ఓట్లను ఆకట్టుకోవడానికి అన్ని పార్టీలు ఈ విషయంలో వెనుకంజ వేస్తూనే ఉన్నాయి. మోడీ భాష ఇవాళ కేవలం హిందుత్వ భాషగానే కాకుండా ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనా భాషగా కనిపిస్తున్నది. గుజరాత్‌లో నరేంద్రమోడీ ఈసారి ఎన్నిక అయిన క్రమంలో జరిగిన ప్రచారంలో హిందుత్వ భావజాలం ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనాకు ఎలా ఒదిగిపోయిందో ప్రచారం చేయడమే కాకుండా తెహెల్కా బయటపెట్టిన రహస్యాలనుకూడా హిందూ భావజాలం పెరగడానికి, అటువంటి హిందుత్వ భావజాలం కలిగిన వారిలో విశ్వాసం పెరగడానికి ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంలో 1992-93లో మధ్యప్రదేశ్‌లో దళిత స్త్రీలపై భజరంగ్ దళ్ చేసిన సామూహిక లైంగిక అత్యాచారం, సూరత్‌లో సున్తీ చేయించుకున్న యువకుల బట్టలు ఊడదీసి చంపిన ఉదంతం వీడియోలలో చూపి హిందుత్వ భావాన్ని ప్రేరేపించిన ఉదంతాన్ని గుర్తు చేసుకోవాలి.

ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనాకు, హిందుత్వకు ఉన్న సంబంధాన్ని వివరించాలంటే కనీసం మనం ఎమర్జెన్సీ కాలంలోకి వెళ్లాలి. ఇటువంటి అభివృద్ధి గురించి ప్రభుత్వాలకంటే రాజ్యాంగేతర శక్తులే ముందుగా మాట్లాడతాయని మొదట గమనించాల్సిన అంశం. ఎందుకంటే ప్రభుత్వాలు సంక్షేమం, సంక్షేమ రాజ్యం, పేదరిక నిర్మూలన, కూడు, గూడు, గుడ్డ విషయాలు మాట్లాడక తప్పదు. ఎందుకంటే వాళ్లకు ఓట్లు కావాలి. ఎమర్జెన్సీలో ఒకవైపు ఇందిరాగాంధీ అటువంటి 20 సూత్రాలు మాట్లాడిన సందర్భంలోనే రాజ్యాంగేతర శక్తి అయిన సంజయ్ గాంధీ ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనాలో భాగమైన జనాభా నియంత్రణ, పట్టణ సుందరీకరణల గురించి మాట్లాడాడు. ఉత్తర భారతమంతటా పెళ్లి కాని యువకులతో సహా ముస్లిం యువకులకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించాడు. ఢిల్లీ తుర్క్‌మ గేట్‌లో పట్టణ సుందరీకరణ కోసం బస్తీలు, మురికివాడల నుంచి బుల్‌డోజర్ తోలించాడు. ఈ విషయాన్ని ఇప్పటికీ వింధ్యకు ఉత్తరాన ప్రజలు ఎవరూ మర్చిపోలేదు. ఇందిరాగాంధీ హత్య తరువాత అప్పటికి ఇంకా రాజ్యాంగేతర శక్తి అయిన రాజీవ్ గాంధీ, ఆయన బలగం, ఢిల్లీ, పంజాబ్ ఇతర ఉత్తర ప్రాంతాల్లో సిక్కుల ఊచకోత మరిచిపోలేనిది. అటు వేలాది మంది సిక్కుల ఊచకోత జరిగి, ఇటు భోపాల్ గ్యాస్ పీడితులుగా వేలాది మంది మరణించినప్పటికీ ఆయన యథావిధిగా ఎన్నికలు జరిపించాడు. యాదృచ్ఛికమే అయినప్పటికి భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఒక బడా కంపెనీ అభివృద్ధి నమూనా విధ్వంసం అయితే సిక్కుల ఊచకోత హిందువుల విధ్వంసం. ఈ రెండు పెట్టుబడిగా 'హింద్ కరేగా హిందూ రాజ్య' అనే నినాదంతో రాజీవ్ గాంధీ నాలుగు వందల ఒక్క సీట్లతో లోక్‌సభకు ఎన్నికయ్యాడు. బాబ్రీ మసీద్ రామజన్మ భూమి అనే వివాదం మళ్లీ ఈ కాలంలోనే తలెత్తిందనీ, ఈ నేపథ్యం నుంచే 1985 కాంగ్రెస్ శతజయంతి సభలో రాజీవ్ గాంధీ ఈ దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకుపోతానని ప్రకటించాడని మనం గుర్తుచేసుకోవాలి.

అప్పటికే ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరవాత కాలంలో రాజ్యాంగ శక్తుల్లోకి, ప్రభుత్వాల్లోకి సంఘ్ పరివార్ చొరబాటు ఇందుకు కలిసొచ్చింది. భారతీయ జనసంఘ్ కాస్తా భారతీయ జనతా పార్టీగా మారి జనతా ప్రభుత్వంలో చేరి, సమాచార, విద్యా, విదేశాంగ విధానం వంటి కీలక శాఖలు చేతుల్లో పెట్టుకొని ప్రభుత్వ శాఖల్లో, మీడియాలో, విద్యలో ఒక పథకం ప్రకారం హిందుత్వ భావజాలం ప్రవేశపెట్టడం ప్రారంభమైంది. అది ఇవాళ విషవృక్షమైంది. అది కేవలం హిందూ మత ప్రచారం కాదనీ, అది సామ్రాజ్యవాదానికి అనుకూలమైన ఒక మతోన్మాదం అని గుజరాత్, ఛత్తీస్‌ఘఢ్ ఉదాహరణల నుంచి మనం అర్థం చేసుకోవచ్చు. రెండు చోట్లా ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నమూనాను అమలు చేయడానికి బిజెపి పూనుకుంటున్నది. ఛత్తీస్‌ఘఢ్‌లోనైతే బహుళజాతి కంపెనీల ప్రవేశం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం తీసుకొని బిజెపి ప్రభుత్వం సాల్వాజుడుం ప్రారంభించింది.

పి.వి. నరసింహారావు హయాంలో నూతన ఆర్థిక విధానంగా ప్రారంభమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఏడాది తిరగకుండానే బాబ్రీ మసీదు విధ్వంసాన్ని ప్రోత్సహించింది. అందుకే గుజరాత్‌లో ముస్లిం మారణకాండ నాటి ఎన్.డి.ఎ. ప్రభుత్వాన్ని వేలెత్తి చూపే అర్హత ఏ ప్రభుత్వానికీ లేకుండా పోయింది. తాజాగా నందిగ్రాంలో సలీం కంపెనీ కోసం ముస్లిం రైతులను బేదఖల్ చేసే బెంగాల్ సిపిఎం ప్రభుత్వ ప్రయత్నం సిపిఎం నుంచి లౌకిక అంశం కూడా తొలిగించింది. కాశ్మీర్

విషయంలో అన్ని పార్లమెంటరీ పార్టీలు తీసుకుంటున్న వైఖరి హిందుత్వ శక్తుల చేతులను బలోపేతం చేస్తున్నాయి. ఏ పార్లమెంటరీ పార్టీ కూడా రాజ్యాంగం లౌకిక ప్రజాస్వామ్యం గురించి చెపుతున్నప్పటికీ గుండెల మీద చేతులు వేసుకుని మతోన్మాద శక్తులను ఎదుర్కోలేకపోవడానికి కారణాలు రెండు. ఒకటి, ఎన్నికల ప్రజాస్వామ్యం అధిక సంఖ్యాకుల ఓట్లతో నిర్ణయింపబడుతున్నది. ఈ అరవై ఏళ్లలో అన్ని ఎన్నికల పార్టీలు క్రమంగా ప్రజలను ఓటర్లుగా, ఓటర్లను కులాలుగా, మతాలుగా విభజించి తమ తక్షణ ప్రయోజనాలు నేరవేర్చుకుంటున్నాయి. రెండవది, అన్ని పార్లమెంటరీ పార్టీలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ప్రత్యేక ఆర్థిక మండలాల రూపంలో గానీ, అభివృద్ధి నమూనా రూపంలో గానీ బలపరుస్తున్నాయి తప్ప ఈ దాడులను ప్రజాస్వామికంగా ఎదుర్కోలేకపోతున్నాయి. ఛత్తీస్‌ఘడ్‌లో బిజెపి ప్రభుత్వానికి కాంగ్రెస్ సాల్వాజుడుంను రచించి ఇవ్వడంలో గానీ, గుజరాత్‌కు టాటా కార్ల కంపెనీ తరలిపోవడంలో గానీ ఉన్న రహస్య ఒప్పందం ఇదే. తమ తమ రాష్ట్రాలకు టాటా కార్ల కంపెనీ తరలిరానందుకు టిఆర్ఎస్ తో సహా అన్ని పార్లమెంటరీ పార్టీలు బాధపడ్డాయి.

సంఘ్ పరివార్‌కు అది ప్రవచిస్తున్న దేశభక్తి, సామ్రాజ్యవాద వ్యతిరేకత లేదని చెప్పడానికే ఈ వివరణ. వాస్తవానికి అది దళితుల మీదా, ఆదివాసుల మీదా దాడి చేయడానికి ఏర్పడిన బ్రాహ్మణీయ భావజాల వ్యవస్థ. హిందూ దేశ భావన సాకుగా హిందూయేతరుల మీద ఘర్షణ పేరుతో అది చేస్తున్న దాడులూ, ముస్లింల మీద, క్రైస్తవుల మీదనే కాదు, అవి సారాంశంలో దళితుల మీద, ఆదివాసుల మీద చేస్తున్న దాడులే.

కందమల్ సందర్భంలో సంఘ్‌పరివార్‌ను ముఖ్యంగా భజరంగ్‌దళ్, విఎచ్‌పిలను నిషేధించాలనే డిమాండ్ కూడా వస్తున్నది. ఒకవైపు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అంతర్జాతీయ ఒత్తిడులకు భయపడి ఇవి మతఘర్షణలు కావంటూనే, భజరంగ్ దళ్‌ను హిందూ మౌలిక వాద సంస్థ అని అంగీకరించాడు. ముస్లింల విషయంలో ఫండమెండలిస్ట్ సంస్థలుగా పేర్కొంటున్న వాటిని దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు టెర్రిస్టులుగా చూస్తున్నప్పుడు, భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్‌లను మాత్రం ఎందుకు టెరర్రిస్టులుగా చూడకూడదని ఒరిస్సాలోని ప్రజాస్వామ్య వాదులు ప్రశ్నిస్తున్నారు. ఒక హింసా చర్య లేకుండా ఫండమెంటలిజం టెరర్రిజం అవుతుందా అనే ప్రశ్న వేసుకుంటే గుజరాత్ హత్యాకాండలో ప్రభుత్వంలో ఉన్న మంత్రులతో సహా ఎందరో సంఘ్ పరివార్ కార్యకర్తలు, హత్య, అత్యాచారం, లూటీ, విధ్వంసం కార్యక్రమాల్లో దోషులుగా ఆరోపించబడ్డారు, నేరస్తులుగా రుజువయ్యారు. ఒరిస్సాలోనూ బాధితులు అటువంటి హింసా చర్యల్లో వారినే కీలక పాత్రలుగా చెపుతున్నారు. ఒకవైపు సిమి నాయకత్వంపై ప్రభుత్వం చేసిన నేరారోపణలు ఏవీ ఇంతవరకు ఏ కోర్టులో రుజువు కానప్పటికీ ఏడు సంవత్సరాలుగా ఆ సంస్థను ప్రభుత్వం నిషేధించింది. ఇవాళ దేశంలో జరుగుతున్న పేలుళ్లు, విధ్వంసాలన్నిటికీ ఆ సంస్థనే బాధ్యత చేస్తోంది. సుప్రీం కోర్టులో సిమి తరపు న్యాయవాది ఇంతవరకూ ఒక్క సిమి నాయకుని పై కూడా నేరం రుజువు కాలేదని చెప్పినప్పుడు ప్రధాన న్యాయమూర్తి ఆశ్చర్యపోయాడు. కాని మరొకవైపు లాల్‌కృష్ణ అద్వాని మొదలు నరేంద్ర మోడీ వరకు ప్రత్యక్ష విధ్వంసకాండలో, హత్యానేర ప్రోత్సాహకారాల్లో ముద్దాయిలుగా పేర్కొనబడ్డప్పటికీ ప్రధాని పదవులకూ, ముఖ్యమంత్రి పదవులకూ అర్హులవుతున్నారు. దేశ భవిష్యత్తు అటువంటి వాళ్ల చేతుల్లోకి పోతుందని ఎంతో అనుకూలంగా సంబరపడిపోతున్న వాళ్లూ ఉన్నారు.

మొత్తం పార్లమెంటరీ రాజకీయ వాతావరణం, ప్రచార సాధనాల వాతావరణం ఈ రెండిటి కారణంగా మధ్యతరగతి మాత్రమే కాకుండా, ఎంతోకొంత స్వంత ఆస్తి సంచయంపై మమకారం కలవాళ్ల భావజాలంపై హిందుత్వ ప్రభావం విస్తరిస్తోంది. చాప కింద నీరు వలె సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానం దీన్ని ప్రోత్సహిస్తోంది. విస్తారంగా అడవులూ, ఖనిజ సంపదా, అధిక సంఖ్యలో ఆదివాసీ జనాభా కలిగిన ఒరిస్సాను ఒక ఉక్కు రాష్ట్రంగా మార్చాలని నవీన్ పట్నాయక్ కంటున్న కలలు అమెరికా చదువుల వల్ల తనకు తాను సెక్యులర్‌గా భావిస్తున్న నవీన్ పట్నాయక్‌ను సంఘ్ పరివార్ చేతుల్లో కీలుబొమ్మగా ఆపలేకపోయాయిని అన్నప్పుడు మనం ఈ సెక్యులరిజానికి ఉన్న మట్టి కాళ్ల పాత్రను అర్థం చేసుకోవచ్చు. క్రైస్తవ మత బోధకుడు స్టెయిన్స్ హత్యకేసుతో ప్రారంభమైన సంఘ్‌పరివార్ ఒక రాజకీయ పథకం ఇవాళ ఒరిస్సాలోని కందమల్‌లోనే కావచ్చు, దళితులకు పోటీగా ఆదివాసులను క్రైస్తవ నెపంతో పోటీగా పెట్టే ప్రమాద కుట్రకు పూనుకున్నారు. తమకు తాముగా ప్రజాస్వామ్య వాదంలో, లౌకికవాదంలో విశ్వాసం కల వాళ్లందరూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, దానికి బాసటగా నిలుస్తున్న హిందుత్వను సారాంశంలో అర్థం చేసుకొని ప్రతిఘటించటానికి పూనుకుంటే తప్ప ఇవాళ భౌతికంగా విస్తరిస్తున్న దాడులే భావజాల రూపంలో ఎదుర్కోకతప్పని ప్రమాదం కూడా ముంచుకొస్తోంది. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ప్రతిఘటనలో భాగంగానే ఇవాళ హిందుత్వ శక్తుల నిజరూపాన్ని బట్టబయలు చేసి నిలదొక్కుకోవాల్సి ఉంది. అప్పుడు మాత్రమే ఈ దేశంలో బహుళత్వానికీ, వైవిధ్యానికీ, ప్రజాస్వామ్యానికీ మనుగడ. వీ

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - డిసెంబర్ 2008 : ఎన్నికలపై తెలంగాణ ప్రభావం**
- **ఫోకస్ - జనవరి 2009 : కొత్త సంవత్సరం, కొత్త ప్రభుత్వం - సామాన్యుల ఆశలు, కలలు**
- **ఏజెన్సీలో గిరిజన ఆరోగ్యం - ఈదుల చంద్రమౌళి, శ్రీధర్ కుమార్ లోధ్, సి.ఎచ్. కుమారస్వామి**
- **రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం అమలు - డా. కె. చొక్కయ్య, సామల నాగరాజు**

తొలినాటి సముద్ర మార్గాల నుండి నేడు గగన మార్గాన్ని పట్టిన అంతర్జాతీయ వ్యాపార సంక్షోభాలను, ప్రపంచీకరణ చరిత్రను వివరిస్తున్నారు **పి. భరత్**

ప్రపంచీకరణ సాగివచ్చిన చరిత్ర

ప్రపంచీకరణ అనే పదం నేడు అలవాటు పదంగా మారింది. ఈ పదం వర్తమాన యుగంలో సృష్టించబడినదే అయినా ఈ దృగ్విషయానికి సంబంధించిన సంపద, అధికారం అనే మూలాలు మాత్రం ఐదు వందల సంవత్సరాలకు పూర్వమే ఏర్పడ్డాయి. రాజకీయ అధికార గొడుగు నీడలో నిర్వహించబడిన గతకాలపు ప్రపంచ వ్యాపిత ఆర్థిక వ్యవస్థలలాగ కాకుండా శక్తివంతమైన ట్రాన్స్‌నేషనల్ కార్పొరేషన్‌లు వాటికనుగుణంగా, పథకం ప్రకారం రూపొందించిన రూపమే ప్రపంచీకరణ. ప్రపంచాన్ని వాటి అవసరాల కనుగుణంగా శాసించడానికి మార్కెట్ ద్వారా రాజ్యాన్ని అధిగమించే ప్రక్రియే ప్రపంచీకరణ. అంతర్జాతీయ వ్యాపారం కొత్తేమీ కాదు. కాని ప్రాపంచిక, చారిత్రక మార్పుకు ప్రజల ప్రయోజనాలను చూపిస్తూ రాజ్యాన్ని అధిగమించి ఆర్థిక శక్తి పైన మాత్రమే తన లక్ష్యాన్ని వర్తమాన ప్రపంచీకరణ కేంద్రీకరిస్తుంది.

ప్రపంచీకరణ కొంత పాత, కొంత కొత్త కలయికల మేళవింపు. ప్రపంచీకరణను అర్థం చేసుకునే క్రమంలో పూర్వపు ఐదు వందల సంవత్సరాల నాటి రాజకీయ, ఆర్థిక పరిస్థితులను అవగతం చేసుకోవాలి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి ఏ విధంగా జరిగిందో, దాని చారిత్రక క్రమాన్ని అర్థం చేసుకోవడం అవసరం. 15వ శతాబ్దం చివరి నాటికి ఈ అభివృద్ధి నాలుగు దశలలో జరిగింది. మొదటి మూడు దశలు రాజ్యాన్ని పాలించే రాజ్యాధినేతల అధీనంలోని వ్యవస్థలు, నాలుగవ దశ ట్రాన్స్‌నేషనల్ కార్పొరేషన్‌ల సమ్మేళనం, ఫైనాన్స్ సంస్థల ద్వారా జరిగిన అభివృద్ధి.

15వ శతాబ్దం చివర యూరోపియన్ వ్యాపారవాదులు సముద్రాలను దాటి ఇతర ఖండాలను ఆక్రమించారు. ఇది అంతర్జాతీయికరణ మొదటి దశ. 1488లో బర్త్‌లోమ్యియోడియాస్ ఆఫ్రికాను, 1492లో కొలంబస్ అమెరికాను, 1498లో వాస్కోడిగామా భారతదేశాన్ని కనుగొనడంతో యూరోపియన్ వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఆ క్రమం దశాబ్దాలపాటు కొనసాగింది.

భూమిపై సముద్రాంతర వ్యాపారం ఒక ముఖ్య పాత్రను పోషించింది. స్పెయిన్, పోర్చుగల్ అధికేంద్రాలుగా వ్యాపారవాద అంతర్జాతీయికరణ కొనసాగింది. ఆఫ్రికా నుంచి ఎన్నో వేల సంవత్సరాలుగా బంగారాన్ని చలామణి చేస్తూ ఆసియా, యూరప్‌ల మధ్య వ్యాపారం కొనసాగిస్తున్న ఇస్లామిక్ వాణిజ్యానికి నష్టం చేకూర్చింది. అంతే కాకుండా ఇన్‌కా, అజ్‌టెక్ నాగరికతలను స్వాధీన పరుచుకొని, కొల్లగొట్టి నామరూపాలు లేకుండా చేసింది.

యూరోపియన్ చక్రవర్తుల విజయదాహం, ధైర్యం, అత్యాశ కలిగిన వ్యాపారవాదులు, అన్వేషకులు మహా సముద్రాల ఆవల వాణిజ్యాన్ని ఊహించని విధంగా విస్తృతపరిచి 16వ శతాబ్దపు మధ్యకాలానికి ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ పరిమాణాన్ని పెంచారు. బంగారం, వెండి, రత్నాలు, ఏనుగు దంతాలు, తృణధాన్యాలు యూరోపియన్ మార్కెట్‌కు తరలించబడ్డాయి. అనేక దేశాల నుంచి కొల్లగొట్టిన సంపద వలన యూరోపియన్ ఆర్థిక వ్యవస్థ బలపడింది. వంద సంవత్సరాల లోపే ద్రవ్య సప్లై పదిరెట్లు పెరిగింది. మొదట్లో వస్తుమార్పిడి పద్ధతిపై ఆధారపడిన యూరోపియన్ ఆర్థిక వ్యవస్థ క్రమంగా ద్రవ్యపూరిత ఆర్థిక వ్యవస్థగా మారింది.

ఆర్థిక అంతర్జాతీయికరణకు వ్యాపారులు నాయకత్వం వహించారు. వారి భద్రత కొరకు, ద్రవ్య సహాయం కొరకు చక్రవర్తులను ఆసరాగా చేసుకొని వ్యాపార కార్యక్రమాలు కొనసాగించేవారు. ఇందుకు ప్రతిఫలంగా చక్రవర్తులకు లాభాలలో వాటాలతో పాటు దిగుమతి సుంకాన్ని చెల్లించేవారు. ఇతర దేశాల అన్వేషణను ప్రోత్సహించి అక్కడ వలసవాద పరిపాలనను, వాణిజ్య కార్యకలాపాలను కొనసాగించేటట్లు చేసేవారు.

రాజ్య విధానాలు, వ్యాపారవర్గాల స్వప్రయోజనాలను కేంద్రీకృతం చేసి ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ పరిధిని పెంచారు. యూరోపియన్ రాచరికాలు సముద్రమార్గాలను, తీరప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకొని వారితో దీర్ఘకాలంపాటు కొనసాగించిన ఘర్షణలు 1763లో పారిస్ ఒప్పందంతో ముగిసాయి. అది బ్రిటన్‌ను ఆధిపత్య రాజ్యంగా చేసింది.

హింస, దోపిడీ, సముద్రపు దోపిడీ, జాతి విధ్వంసం మొదటి అంతర్జాతీయికరణ ముఖ్య లక్షణాలు. బానిస వర్తకం అనేది ఈ కాలంలో అత్యధిక లాభదాయకమైనది. ఈ కాలంలో మూడు దశాబ్దాల పాటు వ్యవసాయం, సముద్ర వ్యాపారం, వలసవాదం, దోపిడీ, బానిసత్వం ఆదిమ సంచయనంకు కారణభూతమయ్యాయి.

ఈ క్రమం ముగింపులో గ్రేట్ బ్రిటన్‌లో అనేక ఆర్థిక పరివర్తనలు జరిగాయి. నూతన ధనిక సముద్రాంతర వ్యాపారవాదులు, ఉత్పత్తిదారులుగా మారి మొదటగా పెద్ద కర్మాగారాలను నిర్మించి వందలకొద్ది వేతన కార్మికులను సృష్టించారు. వ్యవసాయంలో ఉత్పాదకత పెరుగుదల, సాంకేతిక అభివృద్ధిల మూలంగా ఎక్కువగా దిగుబడి నిచ్చే పంటలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని ప్రజలను వ్యవసాయరంగం నుంచి కర్మాగారానికి తరలించారు.

పదిరెట్లు పెరిగిన ద్రవ్య సప్లై జాతీయ మార్కెట్ల రూపాన్ని సృష్టించి, దాని ద్వారా అప్పుడే అభివృద్ధిలోనికి వస్తున్న నగర ఆధారిత ఆర్థిక, సామాజిక భద్రతా వ్యవస్థలను విచ్ఛిన్నం చేసింది. ఈ రకమైన ఆర్థిక పరివర్తనకు భావిసూచనగా గ్రేట్ బ్రిటన్ నిలిచింది.

18వ శతాబ్దపు రెండో భాగంలో పెట్టుబడిదారీ ఉత్పాదక వ్యవస్థ అంతర్జాతీయికరణ ప్రక్రియను బలవంతంగా ముందుకు తీసుకుని పోయింది. ప్రపంచ ఆర్థిక రంగానికి ఇంగ్లాండ్ కేంద్రంగా మారింది. ఇక్కడే మొదటిసారిగా పారిశ్రామిక విప్లవం రూపుదిద్దుకుంది. నూతన యంత్రాధారిత ఉత్పత్తి వ్యవస్థ పెట్టుబడి సాంద్రత, సాంకేతిక ప్రగతి, వేతన కార్మికులను, నూతన శ్రమవిధానాలకు రూపమిచ్చింది. ఈ వ్యవస్థనే తరువాత 'పెట్టుబడిదారీ వ్యవస్థ' అని పిలిచాం. ఈ వ్యవస్థ రెండో దశలో ప్రపంచ ఆర్థిక అభివృద్ధికి ముఖ్యపాత్రను పోషించింది.

వ్యాపారవాదం బహిర్గత వనరులపై ఆధారపడితే, పెట్టుబడిదారీ వ్యవస్థ సొంతంగా పరిమితులు లేని అంతర్గత చలనాల ఆధారంగా అభివృద్ధిని కొనసాగించింది.

పెద్ద తరహా పారిశ్రామిక ఉత్పత్తి ఆగమనం వలన ఉత్పాదక దేశాలు వాటి వలస ప్రాంతాలకు మధ్యన ఆర్థిక, వాణిజ్య సంబంధాలలో మార్పులు వచ్చాయి. వస్తువుల ఎగుమతి వలసవాద అధికారానికి ముఖ్య భాగం అయింది. నాటినుండి అధికోత్పత్తి వ్యవస్థలో ఒక భాగంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే వలస ప్రాంతాలకు అవసరం ఉన్నా లేకపోయినా అదనపు వస్తువులను బలవంతంగా అమ్మారు. ముడి పదార్థాలకు, విలువైన లోహాలకు వలసవాద ఆధిపత్యాలు మార్కెట్లుగా రూపొందాయి. నిరంతరంగా విస్తృతమవుతున్న యూరోపియన్ యాంత్రిక ఉత్పత్తి అభివృద్ధికి వలస ప్రాంతాలనుంచి ముడిపదార్థాల అవసరం పెరిగింది. దీని ఫలితంగా ప్రతి వలసవాద ఆధిపత్య దేశం ఉత్పత్తిని ప్రారంభించి అటు కేంద్రానికి ఇటు దాని వలసవాద ప్రాంతానికి మధ్య స్పష్టమైన అంతర్జాతీయ శ్రమ విభజనను ఏర్పరిచింది. ఉత్పాదక వలస ఆధిపత్య దేశానికి వలస ప్రాంతాలు తక్కువ ధరకు ముడి సరుకులు అమ్మి తిరిగి అక్కడ నుంచి వస్తువులను ఎక్కువ ధరకు కొనుగోలు చేసేటట్లుగా మార్చింది. వలసవాద ఒప్పందం ప్రకారం వలస ప్రాంతాలు వస్తువుల ఎగుమతి, దిగుమతి వాటి వలసాధిపత్య దేశం నుంచే చేయాలి. వస్తువులను ఉత్పత్తి చేసిన ఉత్పాదక దేశానికి పోటీగా, ప్రత్యామ్నాయంగా ఉండకూడదు. దీని ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ భూమి మీద ప్రతి చోట అసమాన మారక నియమాన్ని రుద్దింది.

19వ శతాబ్దం మధ్యకాలంలో ఈ పరిశ్రమలు మార్కెట్లపై ఆధిపత్యం చెలాయించాయి. బ్రిటన్ ప్రపంచ వ్యాపిత వాణిజ్య సరళీకరణను సమర్థిస్తూ గుదిబండగా చేసింది. తన వలసప్రాంతాలకు పెద్ద ఎత్తున వర్తకానికి అదనపు ఉత్పత్తిని పంపిస్తూ స్వేచ్ఛా వ్యాపారానికి ఏకైక సమర్థకుడిగా నిలిచింది. ఈ కాలంలో గ్రేట్ బ్రిటన్ మాత్రమే కాకుండా అనేక వలస ఆధిపత్య దేశాలు అసమాన వర్తకాన్ని, సాంకేతిక అభివృద్ధిని కొనసాగిస్తూ వివిధ దశలవారీగా నాగరికతలను ధ్వంసం చేసింది.

వలసవాద రాజ్యాధికారాల కింద పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్జాతీయ అభివృద్ధి రెండు పంథాలలో కొనసాగింది. ఒకటి పారిశ్రామికీకరణకు దారితీస్తున్న ప్రతి యూరోపియన్ దేశంలో వ్యాపారవాదుల మధ్య పోటీ, పారదర్శక వాణిజ్యాన్ని పెంపొందించడం రెండు వలస ఆధిపత్య దేశాలకు, వాటి వలస ప్రాంతాలకు లేక మునుపటి వలస ప్రాంతాలకు మధ్య అసమాన, అవినీతితో కూడిన వాణిజ్యాన్ని కొనసాగించడం. 1774లో జార్జ్ వాషింగ్టన్ ఆధ్వర్యంలో పదమూడు బ్రిటిష్ అమెరికన్ వలసప్రాంతాలు ఇంగ్లిష్ వస్తువులను రానీయకుండా బోస్టన్ పోర్ట్‌ను మూసివేసింది. వలస ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి పెట్టుబడి సంచయానికి స్వతంత్ర కేంద్రంగా ఆవిర్భవించింది. ముఖ్యమైన వలస ప్రాంతాలు విడిపోవడంతో బ్రిటిష్ సామ్రాజ్యం వాటితో బలమైన ఆర్థిక ఒప్పందం ఏర్పర్చుకుంది. కాని 19వ శతాబ్దం వరకు గ్రేట్ బ్రిటన్ దాని అధికారం చేత పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయికరణ చేయడంలో ప్రధాన పాత్రను పోషించింది. రెండవ అంతర్జాతీయికరణ సార్వభౌమాధికార రాజ్యాల కింద జరిగింది. తాజా పెట్టుబడిదారీ వ్యవస్థ విదేశీ మార్కెట్లకు, ముడి పదార్థాల అన్వేషణలో వలసవాద సామ్రాజ్య కొనసాగింపును కాంక్షించింది. అంతర్జాతీయ శ్రమ విభజనను సంస్థాగతం చేసి తదుపరి దశకు పునాదులు వేసింది.

1883లో జాన్ డి రాక్ ఫెల్లర్ స్టాండర్డ్ ఆయిల్ ట్రస్ట్ కంపెనీని స్థాపించారు. ఇది మొదటి పెద్ద బహుళజాతి సంస్థ. ఆనాటి నుంచి ఆర్థిక అంతర్జాతీయికరణ మూడవ దశలోనికి ప్రవేశించింది. అమెరికా వ్యాపారంలో ఎదుగుతున్న కొద్దీ బహుళజాతి కార్పొరేషన్‌ల యుగం ఆరంభమయింది. రెండవ పారిశ్రామిక విప్లవం అయినటువంటి పెట్రోలియం, విద్యుత్ వలన ఆర్థిక స్థితి ఊహించని ప్రగతిని సాధించింది. అలాగే స్టీల్, పారిశ్రామిక రంగాలు ఈ విప్లవాన్ని ముందుకు తీసుకుని వెళ్లినాయి. పెట్టుబడి, శ్రమల కలయిక, నవకల్పనల ద్వారా ఉత్పాదక స్థాయి పెరగటానికి దోహదపడింది.

19వ శతాబ్దం చివరినాటికి అమెరికా అతిపెద్ద పారిశ్రామిక శక్తిగా ఎదిగింది. నూతనంగా ఏర్పడిన గుత్తాధిపత్య సంస్థ స్టాండర్డ్ ఆయిల్ ట్రస్ట్ ప్రపంచ వ్యాప్తంగా తన వ్యాపారాన్ని కొనసాగించి మొత్తం పెట్రోలియం పరిశ్రమలను సైన్యంతో ధర్మ కర్తృత్వవ్యతిరేక చట్టాలను 1890ల వరకు అమలు పరిచింది. తన వ్యాపార విస్తృతిని ఫెడరల్ ప్రభుత్వం, ఇతర దేశాల ప్రభుత్వ అధికార సహాయాలతో కొనసాగించింది. 'ఈ కదలిక వలన పూర్తి వ్యవస్థలో ఆధునిక ఆర్థిక పరిపాలనకు నాంది పలికింది. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారం కొనసాగించడానికి ఒక విప్లవాత్మకమైన మార్గాన్ని చూపింది' అని రాక్ ఫెల్లర్ గర్వంగా పేర్కొన్నారు.

రాక్‌ఫెల్లర్ మార్గంలో స్టీల్ ఉత్పాదక రంగంలో 'ఆంద్రూ కార్నెగీ', ఫైనాన్స్ రంగంలో 'మోర్గాన్' , కెమికల్ రంగంలో 'నెమిరస్' ఆటోమొబైల్ రంగంలో 'హెన్రీ ఫోర్డ్'లు తమ గుత్తాధిపత్యాన్ని కొనసాగించారు. వీరు ప్రపంచవ్యాప్తంగా పోటీ నెలకొల్పి ఇతర కంపెనీలను తమలో విలీనం చేసుకొని, ఒక నిర్వహణ కిందకు తీసుకొనివచ్చి బడా వ్యాపారులుగా ఎదిగారు. 1890ల నుంచి 1929 వరకు అమెరికా సామాజిక, ఆర్థిక జీవనాన్ని ఈ గుత్తాధిపత్యదారులు శాసించారు.

రవాణా, కమ్యూనికేషన్‌ల విస్తృతి వల్ల బహుళజాతీయికరణ మరింతగా పెరిగింది. 1914లో నలభై అమెరికన్ కంపెనీలు వాటి ఉత్పాదక పరిశ్రమలను ఇతర దేశాలలో నెలకొల్పాయి. ఈ దశలో గుత్తాధిపత్యాలు, పరిమితస్వామ్యాలు, హోల్డింగ్ కంపెనీలు, కార్టెల్స్ మొదలైన పారిశ్రామిక, ఫైనాన్స్ రంగాలు ఆర్థిక రంగాన్ని కేంద్రీకృతం చేశాయి. ఈ గుత్తాధిపత్య సంస్థలు, వాటి నిర్వాహకులు ఆర్థిక రంగాన్ని శాసించారు. 1913లో ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్‌ను ఏర్పరిచే దాక మోర్గాన్ అమెరికా కేంద్ర బ్యాంక్ పాత్రను పోషించాడు. కార్నెగీ కార్మికుల పని

గంటలను రోజుకు 12 గంటలుగా పెంచి వ్యతిరేకించిన వాళ్లను పోలీసుల చేత నిర్బంధంగా అణచివేశాడు. అమెరికా ప్రభుత్వం ప్రేక్షక పాత్రను పోషించింది.

24 అక్టోబర్ 1929లో న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్ కూలి పోవడంతో వ్యాపార వర్గాలలో మితిమీరిన ఆశావాదం కూడా కుప్పకూలి పోయింది. కేవలం మూడు వారాలలోనే షేర్ల సూచి 469 నుంచి 220కి పడిపోయింది. ఈ ఫైనాన్స్ సంక్షోభం ప్రపంచ వ్యాపిత ఆర్థిక రంగంపై ప్రభావం చూపింది. 150 సంవత్సరాల స్వయం నియంత్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ నిశ్చల స్థితిలోనికి వచ్చింది. పారిశ్రామిక ఉత్పత్తుల ధర క్షీణించింది. వేతన రేటు పడిపోవడంతో నిరుద్యోగిత పెరిగింది. 1929 నుంచి 1933 వరకు ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తి నలభై శాతానికి, ప్రపంచ వాణిజ్యం ముప్పై శాతానికి తగ్గింది. 1933లో అమెరికాలో నిరుద్యోగిత ఇరవై నాలుగు శాతానికి పెరిగింది. మూడు సంవత్సరాలలో దేశ జాతీయ ఆదాయం 85 బిలియన్ డాలర్ల నుంచి 42 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ప్రతి ద్రవ్యోల్బణం పరిస్థితి పూర్తిస్థాయిలో ఆవిష్కరించబడింది.

వాస్తవానికి ఈ సంక్షోభానికి కారణం 1929 స్టాక్ మార్కెట్ క్షీణించడం కాదు. దీనికి సంబంధించిన క్లిష్ట పరిస్థితులు 1926 నుంచే కొనసాగాయి. ఈ మాంద్యానికి కారణం ప్రాథమికంగా డిమాండ్ తగ్గడంగా పేర్కొన్నారు. కాని ఫైనాన్స్ మార్కెట్ల స్పెక్యులేషన్, అవినీతి కారణం కాగా, సంపన్నుల చేతిలో నియంత్రించలేని ఆదాయం కేంద్రీకృతమవ్వడం, గుత్తాధిపత్య ప్రాతినిధ్యం పెరగడం మరొక కారణం.

అనేక సంవత్సరాలపాటు వేతనరేటుకన్నా లాభాలరేటు అత్యధికంగా పెరగడం, స్టాక్‌ధరలు లాభాలరేటు కన్నా పెరగడం, సాధారణ ప్రజల కొనుగోలు శక్తి బలహీనపడడం మూలంగా స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది. దీని మూలంగా జాతీయంగా అంతర్జాతీయంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యం నుంచి తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థను నిలబెట్టడానికి గుత్తాధిపత్యదారులు చేసిన ప్రయత్నాలు వృథా ప్రయాస అయ్యాయి.

ఈ వైఫల్యంవల్ల స్వేచ్ఛావ్యాపార, ప్రభుత్వేతర సమర్థకులు తిరిగి ప్రభుత్వాన్ని ఆర్థిక మాంద్యం నుంచి బయట పడవేయవలసిందిగా వేడుకొన్నారు. జర్మనీ, ఇటలీలలో సంపూర్ణాధికార రాజ్యం ఆర్థికరంగాన్ని గుత్తాధిపత్యం దగ్గర నుంచి తీసుకొని ఫాసిజం వైపుకు మళ్లింది. అమెరికాలో ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ఈ సమస్యను పరిష్కరించి న్యూడీల్ ఒప్పందాన్ని కుదిర్చారు. రాజ్యం, పెద్ద వ్యాపారులు, పౌరసమాజాలను సామాజిక ఒప్పందంలో భాగస్వామ్యం చేయడమే న్యూడీల్ ఒప్పందపు సారాంశం. పెట్టుబడి, శ్రమల మధ్య కచ్చితమైన సమతౌల్యాన్ని ఏర్పర్చడానికి ప్రభుత్వం న్యూడీల్ కింద కొత్త మార్పులను చేసింది.

కార్మికులకు, రైతులకు, మధ్య తరగతి ప్రజలకు కొనగోలు శక్తి పెరగటానికి అవసరమైన చట్టాలను చేసింది. కార్మిక సంఘాలకు చట్టం సహాయ సహకారాలు అందించడమే కాకుండా నిరుద్యోగులకు భద్రత ఏర్పరిచింది. 1935లో సామాజిక భద్రత చట్టాన్ని అమలులోనికి తెచ్చింది. ఆ తరువాత అన్ని పారిశ్రామిక దేశాలు ఈ విధానాలను అమలుపరిచాయి. పెట్టుబడిదారీ ప్రపంచంలో ఏర్పడిన సామాజిక రాజ్యాన్ని 'శ్రేయోరాజ్యంగా' పిలిచారు. 150 సంవత్సరాల సామాజిక సంఘర్షణలు, సంక్షోభాల మూలంగా ఏర్పడిందే ఈ శ్రేయోరాజ్యం. ఏ ఆటంకాలులేని సమర్థవంతమైన ఆర్థికవ్యవస్థ, సమాజానికి పరస్పర ఆధారం కావాలన్నదే శ్రేయోరాజ్యం ప్రాథమిక అంశం. ఈ సంక్షేమ విధానాలను అంగీకరించినప్పటికీ ఇది నాగరిక పెట్టుబడిదారీ వ్యవస్థయే.

శ్రేయోరాజ్య విధానాలు ఎక్కువ కాలం కొనసాగలేదు. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం తలెత్తింది. ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి 1944లో బ్రిటన్ వుడ్స్‌లో కీన్స్ సమక్షంలో రూజ్‌వెల్ట్ ఆధ్వర్యాన 44 మిత్ర దేశాలు సమావేశమై స్వేచ్ఛా వ్యాపారం, స్వేచ్ఛా పోటీ అంశాలపై చర్చించి నూతన ప్రపంచ ఆర్థిక ఒప్పందంపై సంతకం చేశారు.

నూతన అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థకు డాలర్ ముఖ్య కరెన్సీగా మారింది. దీని ఫలితంగా అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ప్రపంచ కేంద్ర బ్యాంక్‌గా మారింది. ఈ నూతన ఒప్పందాన్ని అమలు పరచడానికి మూడు సంస్థలు పుట్టుకువచ్చాయి. అవి 1) అంతర్జాతీయ ద్రవ్యనిధి; 2) ప్రపంచ బ్యాంక్; 3) గాట్, 1995లో దీనిని డబ్ల్యు.టి.ఒ. గా మార్చారు.

యుద్ధానంతరం బహుళజాతీయికరణ వేగం పుంజుకుంది. 1970లలో ఏడు వేల బహుళజాతి సంస్థలు, యాభై వేల అనుబంధ సంస్థలు ప్రపంచ వ్యాపితంగా వెలిశాయి. ఇందులో అధికభాగం అమెరికాకు చెందినవి. ఈ బహుళజాతి సంస్థలు ఎక్కువగా విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాయి. అదే సమయంలో తమ స్వదేశీ మార్కెట్లను స్థిరపరిచి అభివృద్ధి పరిచాయి. ఈ మూడవ అంతర్జాతీయి కరణలో ముఖ్య విషయం ఏమిటంటే బహుళజాతి సంస్థలకు, వాటి మాతృ దేశాలకు మధ్య సజీవ సంబంధం కొనసాగించడం. పారిశ్రామిక వేత్తలు అటు దేశభక్తిని ప్రదర్శిస్తూ ఇటు కంపెనీల ప్రయోజనాలను నేరవేర్చుకున్నారు. రెండింటి పట్ల ఒకేరకమైన గౌరవాన్ని ప్రదర్శించారు. జనరల్ మోటార్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తరువాత కాలంలో డిఫెన్స్ సెక్రటరీ అయినవటువంటి చార్లెస్ విల్సన్ 'దేశానికి ఏది మంచో అదే జనరల్ మోటార్స్ కు మంచి' అని పేర్కొన్నారు. కాని 'జనరల్ మోటార్స్‌కు ఏది మంచో దేశానికి అదే మంచిది' అనేది వాస్తవం.

1970లలో అమెరికన్ బంగారు నిల్వలు తగ్గాయి. వియత్నాం యుద్ధం వలన ఆర్థికంగా కుంటుపడిన అమెరికా, స్వర్ణ ప్రమాణం ఆధారంగా స్థిర రేటు వద్ద ముద్రించవలసిన కరెన్సీ ఒప్పందాన్ని పక్కనపెట్టి వేల డాలర్లను ముద్రించింది. ఈ రకంగా ముద్రించిన కరెన్సీని నిలిపివేయాలని యూరప్ అమెరికా పై ఒత్తిడి తెచ్చినప్పటికీ అప్పటి అధ్యక్షుడు నిక్సన్ ఏకపక్షంగా స్వర్ణ ప్రమాణీకరణను తొలగించి డాలర్ల ముద్రణను ప్రోత్సహించి కొనసాగించాడు. దీని ఫలితంగా 1976లో అస్థిర కరెన్సీ ప్రపంచవ్యాప్తంగా ఏర్పడింది. దీనిని జమైకా ఒప్పందంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి సభ్య దేశాలు అధికారికంగా సమర్థించాయి. దీని మూలంగా ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహం పెరిగింది.

స్వేచ్ఛా వర్తకం మూలంగా పెరిగిన బహుళజాతి సంస్థలు జాతి రాజ్యాల స్థాయిని దాటిపోయాయి. వాటి ఫైనాన్స్, సాంకేతిక సామర్థ్యం సరిహద్దులు దాటి రాజ్యాధికారాలను అధిగమించింది. పెరిగిన విలీనాలు వలన సమకూరిన సంపద మూలంగా చరిత్రలో మొదటిసారిగా జాతీయ చట్టబద్ధతా చట్రం నుంచి ప్రభుత్వ నియంత్రణల నుంచి కార్పొరేషన్‌లు విముక్తి పొందాయి. 'ప్రత్యామ్నాయం లేదు' అనేది ముఖ్య సూత్రంగా మారి రాజకీయవేత్తలు వారి ఆర్థిక ప్రతిఫలాల కొరకు జపించడం మొదలుపెట్టారు. రూజ్‌వెల్ట్ ప్రవేశపెట్టిన శ్రేయోరాజ్య విధానాలకు

విధానాలు, దళారీలతో అవస్థలపాలవుతూ, అనారోగ్యంతో, గిట్టుబాటు కాని కూలితో ఆత్మహత్యల పాలవుతూ కొట్టుమిట్టాడుతున్న సిరిసిల్ల చేనేత కార్మికుల పరిస్థితిని వివరిస్తున్నారు **డి. సురేష్, బి. సదానందం**

సిరిసిల్ల చేనేత కార్మికుల వ్యధలు

చేనేత పరిశ్రమకు దేశంలోనే మన రాష్ట్రానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మన రాష్ట్రంలో వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, మంగళగిరి, సిరిసిల్ల ఇలా అనేక ప్రాంతాలు చేనేత పరిశ్రమకు అలవాలంగా ఉన్నాయి. కాని ఇటీవల ప్రతినోటా వినిపిస్తున్న పేరు సిరిసిల్ల. దీనికి కారణం ఇటీవలి కాలంలో నేత కార్మికుల ఆత్మహత్యలే. ఇక్కడ సుమారుగా ముప్పై వేల మరమగ్గాలున్నాయి. వీటిపై దాదాపుగా పదిహేను వేలమంది ఆధారపడి జీవిస్తున్నారు.

ఇంతటి ఘన చరిత్ర కలిగిన సిరిసిల్ల ఉరిసిల్లగా మారింది. గత పదేళ్లలో సుమారుగా 500 మంది కార్మికులు, గత నాలుగేళ్లలో 283 మంది కార్మికులు బలవ్మరణం పాలయ్యారు. గత ఏడాది 68 మంది సుమారుగా 50 మంది చేనేత కార్మికులు వివిధ కారణాల వలన ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్లలో ప్రతి మూడు గడపలకు ఒక గడప ఆత్మహత్యలకు గురి అయినదే. ఒక చిన్న పట్టణంలో దేశంలోనే మరి ఎక్కడా ఇన్ని ఆత్మహత్యలు జరగలేదు. అయితే ఈ ఆత్మహత్యలకు అనేక కారణాలున్నాయి.

మారని చేనేత విధానం : ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి రంగము కాలానుగుణంగా మార్పు చెందుతూ వస్తోంది. కాని ఈ మార్పు సిరిసిల్లలోని మగ్గాలకు చేరుకోలేదు. మగ్గాలన్ని 20 ఏళ్ల క్రితంనాటి పరిజ్ఞానంతో తయారైనవే. మరమగ్గాల శకం ప్రారంభమైనప్పటినుంచే సిరిసిల్లలో పవర్‌లూమ్స్ ఉన్నాయి. నాటి మరమగ్గాలే నేటికీ కొనసాగుతున్నాయి. వీటిపై ఒకేరకమైన వస్త్రం తయారవుతుంది. దీన్ని లంగాల తయారీకి వాడతారు. దీనికి మార్కెట్‌లో అంత డిమాండ్ లేదు. వేరే రకం వస్త్రాన్ని తయారు చేయాలంటే మగ్గాలను ఆధునీకరించాలి. కానీ అందుకు పెట్టుబడులు లేక పాత వాటినే కొనసాగిస్తున్నారు. కార్మికులకు వివిధరకాల వస్త్రాలను నేసే శిక్షణ లేదు. ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందాలంటే వీరికున్న నైపుణ్యం చాలదు.

గిట్టుబాటు కాని రోజువారి కూలి : మరమగ్గాలపై 12 గంటలు పనిచేస్తే దక్కేది రు 80 నుంచి వందలోపే. కుటుంబంలో ఇద్దరు పనిచేసినా వచ్చేది రు. 200 లోపే . నేసిన వస్త్రాన్నిబట్టి కూలి చెల్లిస్తారు. దీనిని 'రొటేషన్ పర్ మీటర్' అంటారు. కొన్ని యంత్రాల 'రొటేషన్' ఎక్కువ. కాని వాటికి తక్కువ రేటు నిర్ణయిస్తారు. నూలు ధరలు నాలుగేళ్లలోనే 30 శాతానికి పైగా పెరిగాయి. 4 శాతం అమ్మకం పన్ను, 16 శాతం ఎక్సైజ్ సుంకం నడ్డి విరుస్తున్నాయి. పది లక్షల మీటర్ల సామర్థ్యానికి రోజుకు 4–5 లక్షల మీటర్లే తయారవుతోంది. విద్యుత్ రాయితీ ఇచ్చారు.

ముగింపు చెప్పి ధరల నియంత్రణ, వేతనాలు, పెట్టుబడులపై ఉన్న చట్టబద్ధ శాసనాలను తొలిగించేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడానికి పిలుపునిచ్చి ప్రజోపయోగాలైన ఆరోగ్యం, విద్య, నీరు, రవాణా మొదలైన వాటిని కూడా పూర్తిస్థాయిలో ప్రైవేటీకరించడానికి ఒత్తిడి తెచ్చారు. పరిమితి లేని పోటీతత్వం, స్వేచ్ఛా వ్యాపారం వలన శ్రమ మార్కెట్లు దోచుకోబడ్డాయి. ఈ విధంగా పెరిగిన అంతర్జాతీయికరణ ప్రపంచీకరణగా రూపాంతరం చెందింది. ప్రపంచం మొత్తాన్ని వర్తకం ద్వారా ఏకీకరించడం దీని ముఖ్య లక్ష్యం. ఈ నూతన ఆర్థిక విధానం ప్రపంచ వ్యాపిత వనరులను, మానవ కార్యకలాపాలను తన అధీనంలోకి తెచ్చుకొని బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేసింది. ఈ సంస్థలు కేవలం వస్తుఎగుమతితో సంతృప్తి చెందక వాటి అనుబంధ పరిశ్రమలతో ప్రాంతీయ వర్తకాన్ని కూడా చేపట్టాయి. వాల్–మార్ట్ అనే రిటైల్ సంస్థ నేడు ప్రపంచ వ్యాప్తంగా తన అమ్మకాలను కొనసాగిస్తోంది. ఇది వస్తువులను ఉత్పత్తి చేయదు. కాని ఉత్పాదక వస్తువులను అనేకచోట్ల అమ్ముతూ దేశీయ, ప్రాంతీయ రిటైల్ వ్యాపారాన్ని కొల్లగొడుతుంది. ఈ విధంగా కోకా–కోలా, ఎక్సన్‌మొబైల్ లాంటి అనేక కార్పొరేషన్‌లు ప్రపంచవ్యాప్తంగా తమ అమ్మకాలను పెంచుకుంటూ పోతున్నాయి.

యు.ఎస్.ఎస్.ఆర్. కమ్యూనిస్ట్ దేశాలు కూలిపోయిన తరువాత 1990లలో మరొక విధానం ముందుకు వచ్చింది. అది నయా ఉదారవాదం. ప్రపంచ వ్యాప్తంగా ఏకైక మార్కెట్ ఉండాలన్నదే లక్ష్యం. 1996లో అమెరికా అధ్యక్షుడు క్లింటన్ ఒక ప్రసంగంలో పెద్ద ప్రభుత్వం కూలిపోయిందనీ పెద్ద ఎత్తున వ్యాపారం కొనసాగించడానికి ఎక్కువ అవకాశం దొరికిందనీ పెర్కొన్నారు. అదే సంవత్సరం అక్టోబర్‌లో సామాజిక భద్రతా విధానాలను తగ్గిస్తూ బిల్‌పై సంతకం చేశారు. దీన్ని బట్టి చూస్తే అమెరికా రాజకీయ విధానాలు అర్థమవుతాయి. ఒక పక్కన సామాజిక ప్రజాస్వామిక వాదులు అని చెప్పుకుంటూనే మరొక వైపున ప్రపంచీకరణ భావజాలాన్ని పెంపొందిస్తున్నారు. 21వ శతాబ్దంలో ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమం బలంగా ముందుకు వచ్చింది. కాని అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉంది. జార్జ్‌బుష్ అధ్యక్షుడు అయిన తరువాత జరిగిన సెప్టెంబర్ 11 దాడులను పురస్కరించుకొని ఆయన ప్రపంచీకరణనను 'మిలిటరైజ్' చేయాలని పేర్కొన్నారు. ఈ నయా ఉదారవాద ప్రపంచీకరణను ఎదుర్కోవడానికి మూడవ ప్రపంచ దేశాలు ఏకమై ప్రపంచీకరణ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకొనిపోవటమే పరిష్కారం. వీ

గడిచిన గత 8 సంవత్సరాల్లో పరిశీలించినట్లైతే సిరిసిల్ల మరమగ్గాల విద్యుత్ రాయితీ పట్టికలో చూడవచ్చు.

ఆర్థిక సంవత్సరం	రాయితీ మొత్తం (రు. లక్షల్లో)	విడుదలైన మొత్తం (రు. లక్షల్లో)	బకాయి మొత్తం (రు. లక్షల్లో)
2002-02	37.10	37.10	00
2002-03	133.64	130.50	3.14
2003-04	191.90	165.65	26.25
2004-05	237.10	181.94	55.16
2005-06	311.54	220.00	91.54
2006-07	287.45	252.07	35.38
2007-08	335.38	335.38	00
30.09.08 వరకు	184.80	94.80	90.00

పెరుగుతున్న ధరలు : ఒక్కొక్కరూ నెలంతా నాలుగు మగ్గాల మీద ఓవర్ టైమ్ పనిచేసినా రు. 1500-2500 వరకే వస్తున్నాయి. మొత్తం కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. 20 కిలోల రేషన్ బియ్యం పది రోజులకు సరిపోతున్నాయి. 'అర బస్తా బియ్యం కొనడానికి రు. 14 వందలు అవుతున్నాయి. నేత కార్మికుల కుటుంబాల్లో మహిళలు బీడీలు తయారు చేస్తూ కొంత సంపాదించేవారు. పుర్రె గుర్తు వల్ల బీడి పరిశ్రమ సంక్షోభంలో పడింది. మహిళల రాబడి తగ్గింది. కల్తీ మద్యం, నాటుసారా కుటుంబాలను మరింత పీల్చేస్తున్నాయి. నేత కార్మికుల కష్టాలను గట్టెక్కించుకునేందుకు బ్యాంకులను ఆశ్రయించినా బ్యాంకులు అప్పులివ్వడానికి నిరాకరిస్తున్నాయి. చివరికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నెలకు నూటికి రు. 10 చొప్పున వడ్డీకి అప్పులు తీసుకొని అసలు తీర్చలేక మానసికంగా కుంగిపోతున్నారు.

అనారోగ్య సమస్యలు : కాలం చెల్లిన పాత మరమగ్గాలతో పనిచేయడం వలన శబ్ద కాలుష్యానికి, రసాయనాల ప్రభావానికి గురై తీవ్ర ఆనారోగ్య పాలవుతున్నారు. సిరిసిల్లలో 100 పడకల ఆసుపత్రి ఉంది. 26 వైద్యుల పోస్టులకు నలుగురే శాశ్వత వైద్యులు పనిచేస్తున్నారు. 9 మందిని తాత్కాలికంగా నియమించారు. కీలకమైన ఫిజిషియన్, సర్జన్, గైనాకాలజిస్ట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది ఉద్యోగాల్లో 40 శాతం ఖాళీయే. అత్యవసర పరిస్థితిలో అవసరమయ్యే వెంటిలేటర్ లేదు. నేతకారులకు ఎక్కువగా వచ్చే క్షయ, శ్వాసకోశ వ్యాధులకు శస్త్రచికిత్సలు అవసరంలేదు. వాటికి ఆరోగ్యశ్రీ వర్తించదని తిప్పి పంపుతున్నారు.

మధ్యదళారుల వ్యవస్థ : సిరిసిల్లలో మూడంచెల 'మధ్యవర్తుల' వ్యవస్థ నడుస్తోంది. మరమగ్గాలకు అవసరమైన ముడి నూలును హైదరాబాద్‌కు చెందిన కొందరు బడా వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నారు. ఈ సరుకును మాస్టర్ వీవర్ చేనేత కార్మికులు చేత వస్త్రాన్ని నేయిస్తున్నారు. ఈ గొలుసులో చివరగా ఉన్నది కార్మికుడే. సహజంగానే కార్మికుడి శ్రమ ప్రతి దశలో దోపిడికి గురవుతోంది. సిరిసిల్లలో ప్రతి నేత కుటుంబం రు. 50 వేల నుంచి రు. లక్షకు పైగా అప్పుల్లో కూరుకుపోయి ఉంది. సిరిసిల్లలో నాలుగు మైక్రో ఫైనాన్స్ సంస్థలు కార్మికులపై కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్నాయంటే పరిస్థితిని ఇట్టే గ్రహించవచ్చు.

ఫలించని ప్రభుత్వ పథకాలు : సిరిసిల్లలో మొత్తం 15,000 మంది కార్మికులు ఉండగా 3508 మందికి అంత్యోదయ కార్డులొచ్చాయి. జనశ్రీ బీమా యోజన పరిధిలో 4500 మందిని మాత్రమే చేర్చారు. వాయిదాలు సరిగ్గా చెల్లించక పథకం అమలు కావటం లేదు. 50 ఏళ్లు దాటితే వృద్ధాప్య పింఛన్ ప్రభుత్వం ఇస్తున్నామని చెప్పినా ఇక్కడ కేవలం 819 మందికి మాత్రమే మంజూరయ్యాయి. సిరిసిల్లలో 25 వేలమంది విద్యార్థులు ఉండగా కేవలం 560 మందికి మాత్రమే ఉపకార వేతనాలు అందాయి. ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల పరిహార విషయానికి వచ్చినట్లయితే గత పదేళ్లలో 901 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోగా వీరిలో 137 మందికి మాత్రమే నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. సుమారుగా 161 మందికి పరిహారాన్ని తిరస్కరించడం జరిగింది.

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వాల నుంచి లభిస్తున్న ఆర్థిక సహాయం, సహకారం కావలసినంతగా అందడంలేదు. థ్రిఫ్ట్ స్కీం, కొన్ని ఇన్సూరెన్స్‌లు మినహా జీవన ప్రమాణాలు పెరిగే పథకాలేవీ అమలు కావడంలేదు. కార్మికులకు నేరుగా మేలు చేసే పథకాలు తక్కువగా ఉన్నాయన్నది సుస్పష్టం. మహిళా సంఘాల్లో చేనేత వర్గానికి చెందిన సభ్యులకు వారి వృత్తికి సంబంధించిన శిక్షణ ఇవ్వడంలేదు.

ప్రభుత్వ కంటితుడుపు చర్యలు : ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలన్ని పెద్దకంపెనీలకే పనికొస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని టెక్స్‌టైల్ పార్కులకు భారీ సబ్సిడీలిచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాలో నెలకొల్పనున్న హైదరాబాద్ హైటెక్ వీవింగ్‌పార్క్‌కు రు.40 కోట్లు, విశాఖ, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న మరో రెండు ప్రాజెక్టులకు రు.40 కోట్ల వంతున సబ్సిడీలు ప్రకటించగా, నల్లగొండ జిల్లా పోచంపల్లిలో ఏర్పాటు చేయ తలపెట్టిన పోచంపల్లి హాండ్లూమ్ పార్క్‌కు రు.7.40 కోట్ల సబ్సిడీ ప్రకటించారు. ఇందులో పోచంపల్లి పార్కులో మాత్రమే కొంతవరకు చేనేత కార్మికులకు ఉపాధి లభించవచ్చని చెబుతున్నారు. సిరిసిల్లలో సుమారు ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులోని 125 ప్లాంట్లలో కేవలం 15 ప్లాంట్లలోనే మరమగ్గాలు ప్రారంభమయ్యాయి. వీటిలోనూ స్థానికులకు ఉపాధి లభించడం లేదు.

మరమగ్గాలపై అధునాతన శిక్షణ కోసం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కేంద్రం పనిచేయడంలేదు. దీన్ని పూర్తి స్థాయిలో ఉపయోగిస్తే సుమారు 5000 మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. కాని దీనిని వదిలేసి ఇటీవల ప్రభుత్వం కొత్తగా అపెరల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. మళ్లీ ఇదొక భూపందేరమేనని ఖచ్చితంగా చెప్పవచ్చు. సిరిసిల్లలో 15000 మంది నేతకార్మికులు ఉండగా వీరిలో కేవలం 5000 మందికే అంత్యోదయ కార్డులను మంజూరు చేస్తామని ప్రకటించింది. ప్రతి కుటుంబానికి నెలకు సుమారు 50 కేజీల బియ్యం అవసరం కాగా కేవలం 35 కిలోల బియ్యం ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖత చూపుతోంది. పెన్షన్ల కోసం సుమారు 5000 మంది దరఖాస్తు చేసుకోగా 1300 మందికి మాత్రమే పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రస్థావనలో రుణమాఫీ, కనీస వేతనాల ప్రస్తావనే లేదు. ఈ చర్యలన్నీ కూడా పెద్ద కంపెనీలకు బడా బాబులకు వత్తాసు పలికేటందుకు మాత్రమే ప్రభుత్వం చేస్తోందనడంలో సందేహం లేదు. ఇప్పటికయినా ప్రభుత్వం మేల్కొని చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి సకాలంలో స్పందించినట్లయితే చేనేత వస్త్ర పరిశ్రమలో మకుటాయ మానంగా ఉన్న సిరిసిల్ల మరొక మొహంజోదడోగా (మృతుల దిబ్బ) మారుతుంది. వీ

చేనేత, ఇతర చేతివృత్తులకు కాలం చెల్లిందనే వాదనలను తోసిపుచ్చుతూ లక్షలాదిమందికి నేటికీ జీవనాధారంగా ఉన్న చేనేతరంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, స్థితిగతులను వివరిస్తున్నారు **పులుగుజ్జు సురేష్**

చేనేతకు భవిష్యత్తు లేదా?

ఇంకా ఎందుకు పురాతనమైన టిక్కు టిక్కుమనే కొయ్య ముక్కను పట్టుకుని మగ్గుతారు. ప్రపంచం ఆధునిక యుగంలో పరుగులు తీస్తూ నూతన శకంలో ఉరకలు వేస్తోంది. మీరూ కలవండి, మీ ఆశల సౌధంలో రాకెట్‌లా దూసుకెళ్ళండి, దేశం అభివృద్ధి పథంలో ఆకాశమే హద్దుగా గంతులు వేస్తోంది. ఎన్నాళ్లని ఈ అరగుంటలో కూర్చుంటారని, పాలకులు, పాలనాధికారులు, కొన్ని బహుళజాతి కంపెనీల దళారీల నుండి నిత్యం మన చెవులు రింగుమని పగిలేలా వినిపిస్తోంది. అయితే చేనేత రంగంలో ఉన్న 3 కోట్ల మంది ప్రజల సహజమైన జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపడం సాధ్యమవుతుందా? అటువంటివి ఎపుడైనా పరిశీలించారా? పేద వారికి, సంపన్న వర్గాలకు మధ్య పెరుగుతున్న అంతరం చెప్పడానికి వీలుకానంతగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఆ అభివృద్ధి కొరకు కొన్ని సమూలమైన మార్పులు చేసి తగిన పద్ధతులను అవలంబించాలి.

2005లో ప్రభుత్వానికి సమర్పించిన నిపుణుల కమిటీ నివేదికలో చేనేత పోటీలో నిలబడలేదు. అందువల్ల చేనేతపై ఆధారపడిన మహిళలు, యువకులను ఇతర రంగాలవైపు మళ్లించాలని నివేదించారు. సరిగ్గా వందేళ్ల క్రితం 1905లో కేంద్ర బ్రిటిష్ ప్రభుత్వ అధికారి ఎస్.బి.హెవెల్ ఇకముందు భారతదేశంలో చేనేత వంటి చేతివృత్తులకు కాలం చెల్లిందని ప్రచారం చేస్తే, బ్రిటిష్ ప్రభుత్వ సలహాదారు సర్ జార్జ్‌వాట్సన్ మరో అడుగు ముందుకేసి 1915 నాటికి 'చేమగ్గం' భారత్‌లో కనబడదని జోస్యం చెప్పారు. ఇదే దారిలో పయనించిన సి.ఎన్.వకీలు రచించిన 'మనద్రవ్య విధానం' అనే గ్రంథంలో 1882 నాటికే ఇది అంతరించి పోవాలి. కానీ ఇప్పటిదాకా మగ్గాలు ఉన్నాయంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉందంటూ కొన్నిరకాల అనుచిత వ్యాఖ్యలు చేసారు. ఉద్దేశ పూర్వకంగా చేనేత పరిశ్రమను దెబ్బతీయడానికే ఇటువంటి ప్రచారం చేసారని వందేళ్లుగా నడుస్తున్న చేనేత చరిత్రే నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.

గతంలో భారత ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భూమిక పోషించిన చేనేత పరిశ్రమలో మానవ రక్తమాంసాలను స్పృశిస్తూ ఉత్పత్తయిన సరికొత్త డిజైన్‌లకు విదేశాలలో విపరీతమైన డిమాండ్ ఉండేది. ఆంధ్రదేశపు రంగు రంగుల విలక్షణమైన వస్త్రాల తాకిడికి లండన్‌లోని మాంచెస్టర్ తట్టుకోలేక పోయింది. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని బ్రిటిష్ ప్రభుత్వం బ్రిటిష్‌లో మిల్లులపై తయారయిన వస్త్రాలను చౌక ధరలకు మనదేశంలో దిగుమతి చేయడం, క్రమంగా మనదేశంలో మిల్లులు, పవర్‌లూంలను స్థాపించడం జరిగింది. పారిశ్రామిక విప్లవం పేరుతో నిపుణులైన చేనేత కార్మికులను బలవంతంగా పరిశ్రమలలో కూలీలుగా మార్చడం జరిగింది. చేనేతకు ఏవిధమైన సహకారం అందించకపోగా సమూలంగా ధ్వంసం చేయాలనే ప్రయత్నం యింకా జరుగుతూనే ఉంది.

చేనేత పరిశ్రమ అనేక సవాళ్ళనెదుర్కొంటూనే తన ఉనికిని కాపాడుకుంటూ పేదల జీవనోపాధికి ఆధారమయ్యింది. అయితే ప్రభుత్వాలు చేనేత పరిశ్రమకు ఎంతో చేస్తున్నాం, ప్రభుత్వం ఒక ఊత కర్రలా నిలబడకుంటే చేనేత ఎప్పుడో కనుమరుగై ఉండేదని 1999లో నివేదించిన ఎస్.ఆర్.సత్యం కమిటీ నివేదిక తెలిపింది. ఈ వ్యాఖ్య వాస్తవానికి చాలా దూరంగా ఉన్నదని, నిరాధారమనడానికి ఆధారాలెన్నో ఉన్నాయి. లక్షలాది సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత పరిశ్రమ ప్రపంచ దేశాలలో ఎక్కడా లేనంతగా 84 శాతం మగ్గాలు భారత్‌లో ఉన్నాయి. 60 శాతం మహిళలు ఉపాధి పొందుతున్న ఏకైక పరిశ్రమ చేనేత. ఇటువంటి పరిశ్రమకు ఒక్క విధానం కూడా లేదు. అవసరమైన మౌలిక వసతుల కల్పనగానీ, పరిశోధనలుగానీ జరగడంలేదు. బడ్జెట్‌లో విపరీతమైన కోత విధించబడుతున్నది. పవర్‌లూం పరిశ్రమ ఆధునీకరణకు లక్ష కోట్ల రూపాయలు హెచ్చించడానికి సిద్ధమైన భారత ప్రభుత్వం, చేనేత పరిశ్రమను ఆధునీకరణ చేయడానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కాని పవర్‌లూంల సాంకేతిక అభివృద్ధికి టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ ఫండ్ 25,000 కోట్ల రూపాయలు కేటాయించింది. కాని అదే ప్రభుత్వం చేనేత మనుగడకు, సాంకేతిక అభివృద్ధికి ఒక్క చర్యకూడా తీసుకోలేదు. ప్రభుత్వం మిల్లులు, పవర్‌లూంల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోంది.

టెక్స్‌టైల్ అపెరల్ పార్కుల ఏర్పాటు

పవర్‌లూంల అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సదుపాయాలు: 1) 25-75 శాతం పెట్టుబడి రాయితీ; 2) ఉచితంగా భూమిని అందించడం; 3) యాభై శాతం విద్యుత్ రాయితీ; 4) ఉచితంగా నీటిసరఫరా; 5) మౌలిక సదుపాయాల కల్పన; 6) ఎగుమతి ప్రోత్సాహకాలు; 7) కోను నూలుపై ఉన్న 9.2 శాతం ఎక్సైజ్ సుంకం ఎత్తివేత వంటి అనేక రకాల సదుపాయాలు కల్పిస్తూ, నిరంతరం యంత్రాల అభివృద్ధికి కృషిచేస్తూనే ఉంది. కానీ చేనేత పరిశ్రమ అభివృద్ధి విస్మరించబడిందని పైనతెలిపిన ఉదాహరణలే సాక్షి.

అయినప్పటికీ చేనేత పరిశ్రమ నిలబడి పోటీలో మరింత గట్టిగా పయనిస్తోంది. 1905లో అంటే సరిగ్గా వందేళ్ల క్రితం భారతదేశ జనాభా 25 కోట్లు కాగా, 60 లక్షల మగ్గాలపైన సుమారుగా 130 కోట్ల చదరపు మీటర్ల వస్త్రం ఉత్పత్తి జరిగింది. 2008లో 40 లక్షల మగ్గాలపైన 630 కోట్ల మీటర్లు ఉత్పత్తి జరిగింది. ఉత్పత్తి సామర్థ్యం బాగా పెరిగింది. ఆనాడు సాధారణ 'త్రోషటిల్' మగ్గంపైన సాధారణ వస్త్రాలు నేసినపుడే కార్మికుల వేళ్లు తెగనరికింది బ్రిటిష్ ప్రభుత్వం. నేడు ఒక చేమగ్గంపై మూడు జాకార్డ్ మిషన్‌లను (కరెంటులేని మిషన్) అమర్చి అనేక రకాల సరికొత్త డిజైన్‌లను ఉత్పత్తి చేయగల సాంకేతిక నైపుణ్యం పెరిగింది. అయితే ఇదే జాకార్డ్‌లను పవర్‌లూంలపై ఉపయోగించి చేనేత డిజైన్లను కాపీకొట్టి, పవర్‌లూంలపై తయారుచేసి చేనేత పేరుతో మార్కెట్ చేయడం జరుగుతోంది. ఇటువంటి అనైతిక పద్ధతుల వలన దొంగదాడిగా చేనేత మార్కెట్‌ను దెబ్బతీయడం జరుగుతోంది. వందేళ్ల క్రితం భారత చేనేత వస్త్రాలు కేవలం 8-10 కోట్ల రూపాయల విలువైన వస్త్రాల ఎగుమతి జరిగితే 2008లో 4,806 కోట్ల రూపాయల విలువైన వస్త్రాల ఎగుమతి జరిగింది. ప్రతి మీటరుకు ఒక సరికొత్త డిజైన్‌ను నేసి, తక్కువ ధరకే విక్రయించగల సామర్థ్యం చేనేత పరిశ్రమలో ఉంటే, లక్షల మీటర్లు నేస్తే గానీ ఆధునిక పవర్‌లూంలకు గిట్టుబాటుకాని పరిస్థితి ఉంది. ఈ యంత్రాలవలన ప్రజలందరూ ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్య తీవ్రమవుతోంది. వస్త్రోత్పత్తిలో ముందంజలో ఉన్న చైనా పవర్‌లూంలతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మధ్య వచ్చిన పెనుతుఫానులకు పరిశ్రమల దుష్పరిణామాలే కారణమని నిర్ధారణకు వచ్చారు. కాబట్టి అధికోత్పత్తితో పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మనదేశంలో కూడా తిరుప్పూరు, అహ్మదాబాద్, సూరత్, ఈరోడ్, సేలం వంటి చోట్ల పర్యావరణ సమస్యల ప్రభావం ప్రజల జీవనంపై పడుతోంది. కానీ చేనేత పరిశ్రమ పర్యావరణానికి ఎటువంటి విఘాతం కలిగించకుండా మానవాళికి దోహదపడుతున్నది.

చేనేత రంగం శ్రమ ఆధార పరిశ్రమ కావడం వల్ల భారతదేశంలో దాదాపు మూడు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు అంచనా. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారుగా 12.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ఉదాహరణకు ధర్మవరంలో గత వందేళ్ల క్రితం కేవలం 500 చేమగ్గాలు ఉన్నాయి. అవి ఈ రోజు రెండు లక్షలకు పెరిగి ఆరు లక్షల మందికి పని కల్పిస్తోంది. కాబట్టి భారతదేశానికి చేనేత ఒక సామాజిక సంపదగా గుర్తించాలి. 1985లో వస్త్ర పరిశ్రమను ఆధునీకరించాలనే ప్రయత్నంలో జాతీయ జౌళి విధానం రూపొందించారు. ఈ విధానంలో వస్త్ర పరిశ్రమను ఉత్పత్తి ఆధారంగా చూడడం వల్ల చేనేత ఒక ప్రధాన ఉపాధి రంగమని గుర్తించక విస్మరించబడింది. ఈ విధానం చేనేత పరిశ్రమకు పెద్ద అన్యాయం చేస్తే, 2000లో వచ్చిన నూతన జాతీయ జౌళి విధానం పవర్‌లూం రంగానికి పెద్ద పీటవేసి చేనేత పరిశ్రమను నిర్లక్ష్యం చేసింది. 1928లో వచ్చిన రాయల్ కమిషన్ నివేదిక నుండి 2005లో వచ్చిన నిపుణుల కమిటీ నివేదిక వరకు చేనేతకు మౌలిక సదుపాయాల కొరత ఉందని, చిలపలనూలు అందడం లేదని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు కూలీలకు గిట్టుబాటు కావడం లేదని, ప్రాంతాల వారిగా చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయాలని సూచించబడ్డాయి. కానీ ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. 1976లో శివరామన్ కమిటీ నివేదిక మేరకు 'ఆప్కో'ను ఏర్పాటు చేయడం జరిగింది. ఆప్కో ఇప్పటి వరకూ 100 కోట్ల పని దినాలు కల్పించింది. ప్రారంభంలో 6 కోట్ల మీటర్లు ఉత్పత్తి చేస్తే, నేడు 2 కోట్ల మీటర్లకు పడిపోయింది. లక్షలాది కార్మికులు ఆప్కో రాజకీయ దోబూచులాటల్లో ఆప్కో బలవుతున్నది. కానీ 1991 నుంచి ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు చేనేతకున్న ఒక్కగానొక్క ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆప్కో రాజకీయ దోబూచులాటలో పావుగా మారి తలుపులు మూసేయడానికి అత్యంత సమీపంలో ఉంది.

ఎన్ని పరిణామాలు జరిగినా, ఎవరు విస్మరించినా భారత ప్రజలు, ముఖ్యంగా భారత స్త్రీల అండదండలు భారత చేనేత పరిశ్రమకు మెండుగా ఉన్నాయి. చేనేత పరిశ్రమలో 70-80 శాతం మహిళలకు సంబంధించిన ఉత్పత్తులు మహిళలకోసం మహిళలే ఉత్పత్తి చేస్తున్న ఏకైక మానవ శ్రమ ఆధార పరిశ్రమ చేనేత. ఎక్కడా నిల్వలు ఉండడం లేదు. వందలాది డిజైనర్లు చేనేతనే ఆధునిక డిజైన్లకు, డిజైనర్ వస్త్రాలకు పునాది అని కొనియాడుతున్నారు. ఆధునిక డిజైన్లు చేనేతలోనే సాధ్యమని వక్కానిస్తున్నారు. భారతదేశంలో పెరుగుతున్న మధ్య తరగతి వర్గాలు చేనేత మార్కెట్‌ను మరింత పెంచబోతున్నది. కాబట్టి ఫ్యాబ్-ఇండియా వస్త్రాలయం వారు వందలకొద్ది వస్త్ర విక్రయశాలలను సరికొత్త హంగులతో ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించని ఉత్పత్తులకు ప్రపంచ దేశాలలో డిమాండ్ పెరుగుతోంది. ఎన్ని కోణాలలో పరిశీలించినా చేనేత పరిశ్రమ భవిష్యత్తు మూడు పూవులు ఆరు కాయలుగా విలసిల్లే మెరుగైన అవకాశాలు కనిపిస్తున్నాయి.

పదకొండవ ప్రణాళిక అంచనాలు కూడా 2011-12 నాటికి చేనేత పరిశ్రమ ఉత్పత్తి రెట్టింపవుతుందని, మరొక 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. కాబట్టి ప్రభుత్వాలు రాజకీయాలను విడనాడి వాస్తవ దృష్టితో పరిశీలించి, చేనేత నిపుణులతో కలసి ఒక చేనేత విధానం రూపొందించి ఆధునిక చేనేత పరిశ్రమలో కార్మికుల కుటుంబ ఆర్థిక మెరుగుదలకు దోహదపడాలనీ, కార్మికులు, కర్షకులు, విద్యార్థి, మేధావులు, విధానకర్తలు, స్వచ్ఛంద సేవకులు, సామాజిక కార్యకర్తలు, కవులు, కళాకారులు, వినియోగదారులు తగిన చేయూతనిస్తారని ఆశిస్తున్నారు. వీ

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీ ఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడం గాని వీలు కావడం లేదు.

- వై. రామచంద్రం (సర్క్యులేషన్ మేనేజర్) 9949 391028
Email : yatelliram@gmail.com

ధరలు తగ్గిన కాలంలో వాస్తవిక జాతీయాదాయం ఎక్కువగానే ఉందనీ, ధరల పెరుగుదల అభివృద్ధికి తోడ్పడుతుందనడం సరికాదనీ అంటున్నారు **డా. యిమ్మానేని సత్యసుందరం**

అదుపు తప్పిన ద్రవ్యోల్బణం

ధరల పెరుగుదల మనదేశంలో దడ పుట్టిస్తోంది. 31 మే, 2008తో ముగిసిన వారానికి ధరల పెరుగుదల అంతకు ముందు వారంలో ఉన్న 8.24 శాతం నుంచి 8.75 శాతానికి పెరిగి గత ఏడేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గత ఏడాది ఈ కాలంలో ద్రవ్యోల్బణం 5.09 శాతంగా ఉంది. జూన్‌లో ముగిసిన వారానికి ధరల పెరుగుదల 11.42 శాతానికి పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ధరలు పెరగటం సామాన్యం. అభివృద్ధి వ్యయం పెరిగినా, ఉత్పత్తి త్వరగా పెరుగదు. ఈ పరిస్థితి ధరల పెరుగుదలకు దారితీస్తుంది. మన దేశంలో సేవారంగం అధిక వృద్ధిరేటు సాధించింది. అయితే, గిరాకీకి తగినట్లుగా ఆహార ఉత్పత్తులు పెరగలేదు. పెరిగితే అది ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకంగా పనిచేస్తుందని, అది అభివృద్ధికి తోడ్పడగలదని అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం. అయితే ధరలు అదుపుతప్పితే నష్టపోయేది స్థిరమైన ఆదాయం పొందేవారు, పేద ప్రజలు టోకు ధరలు కాకుండా చిల్లర ధరలే పేదల అసలు పరిస్థితిని తెలియజేస్తుంది.

మనం ఒకటి గుర్తించుకోవాలి. ధరల పెరుగుదల అభివృద్ధికి తోడ్పడుతుంది అన్నది పూర్తిగా వాస్తవం కాదు. మన దేశ పరిస్థితే తీసుకుంటే ధరలు తగ్గిన కాలంలో వాస్తవిక జాతీయ ఆదాయం ఎక్కువగా ఉంది. ఉదాహరణకు, మన దేశంలో ధరల పెరుగుదల 2006-07లో 5.5 శాతం వుంటే, 2007-08లో 8 శాతం ఉంది. అయితే, 2006-07లో మన అభివృద్ధిరేటు 9.4 శాతం ఉంటే అది 2007-08లో 8.5 శాతానికి తగ్గింది.

పేద ప్రజలను ఇబ్బందిపరచేది అత్యవసర వస్తువుల ధరల పెరుగుదల. పేద ప్రజలు ఇప్పటికీ తమ ఆదాయంలో 60 శాతం ఆహార వస్తువులపై ఖర్చు చేస్తున్నారు. పేదలు కూడా కొత్త వస్తువులపై (షాంపూ లాంటివి) ఖర్చు చేస్తున్నారు. అయితే, ఆహార వస్తువుల ధరలు పెరిగినపుడు కొత్త వస్తువులు పేద ప్రజలకు అందుబాటులో వుండవు. కరెంటు చార్జీలు, బస్సు, ఆటో రేట్లు అధికంగానే ఉన్నాయి. ద్రవ్యోల్బణాన్ని లెక్కకట్టేటప్పుడు వీటిని లెక్కలోనికి తీసుకోవడం లేదు.

ద్రవ్యోల్బణం వల్ల బాగా నష్టపోయేది పేద ప్రజలే. ఉదాహరణకు, 2007-08లో టోకు ధరల సూచిక పెరుగుదల 4.7 శాతం. అయితే పారిశ్రామిక శ్రామికుల వినియోగ ధరల సూచిక పెరుగుదల 6.1 శాతం, వ్యవసాయ కార్మికుల విషయంలో ఈ శాతం 7.5గా నమోదయింది. టీ, పండ్లు, కాయగూరలు, మొక్కజొన్న, చేపలు మొదలైన వాటి ధరలు బాగా పెరిగాయి. ధరల పెరుగుదల ప్రభావం వివిధ తరగతులపై వివిధ రకాలుగా ఉంటుంది.

అధిక ధరలకు కారణాలేమిటి? చాలా దేశాలలో ఆహార ధరలు పెరుగుతున్నాయి. మనం కూడా ఆహార వస్తువుల వినియోగంలో 3 శాతం దిగుమతి చేసుకొంటున్నాం. గోధుమ, వరి, నూనెగింజల ధరలు బాగా పెరిగాయి. జీవ ఇంధనాలకు కొంత భూమి, ఆహార ధాన్యాలను వినియోగించుట జరుగుతుంది. అమెరికా 20 శాతం ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల ఉత్పత్తికి వినియోగిస్తున్నది. మన ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇటీవల కాలంలో సంతృప్తికరంగా లేదు. ఈ సంవత్సరం (2007-08)లో 22 కోట్ల టన్నులు ఉండవచ్చు. పప్పు ధాన్యాల విషయంలో ప్రగతి లేదు. 1951లో తలసరి వినియోగం రోజుకి 60.7 గ్రాములు ఉంటే, 2005 నాటికి అది 31.5 గ్రాములు తగ్గింది. ఎక్కువ మంది రైతులకు వ్యవసాయం లాభసాటిగా లేదు. సేకరణ ధరలు పెంచడం వల్ల ప్రయోజనం లేదు. ఉత్పాదకత పెరగాలి.

వ్యవసాయేతర వస్తువుల ధరలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. దీనికి పెట్రోల్ ధర పెరుగుదల ముఖ్యకారణం. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోల్ ధర పీపాకి 140 డాలర్లకు పెరిగింది (ప్రస్తుతం తగ్గింది). రవాణా ఖర్చులకి వస్తువులకి ధరలకు సంబంధం ఉంది. పెట్రోల్‌పై మన దేశంలో పన్నుల భారం కూడా ఎక్కువే. ద్రవ్యోల్బణం రైతులపై భారాన్ని పెంచింది. వ్యవసాయ ఖర్చులు పెరిగాయి. రైతుల నికర ఆదాయాలు అనిశ్చితిలో పడిపోయాయి. ప్రజల ఆదాయాలు స్వల్పంగా పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెద్దగా లేదు. ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలు ఆగిపోయేటట్లుగా ఇనుము, సిమెంట్ ధరలు పెరిగాయి. ఆహార వస్తువుల ఎగుమతులను ప్రభుత్వం నిషేధించింది. ఇటీవల కాలంలో దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలను విస్తృత పరచుట జరిగింది. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం అన్ని జిల్లాలలో అమలులో ఉంది. అందువల్ల పేదరిక నిర్మూలన జరగకపోయినా పేదల కొనుగోలు శక్తి కొంతవరకు పెరిగింది. దీనివలన అత్యవసర వస్తువులకు గిరాకీ పెరిగి ధరలు పెరిగే అవకాశం ఉంది. ధరలు ఇంకా పెరుగుతాయి అన్న ఆందోళనలో ప్రజలు వస్తువులకు అనవసరంగా గిరాకీ పెంచుతారు. అందువలన కూడా ధరలు పెరుగుతాయి. ఉదాహరణకు, మన రాష్ట్రంలో ఎరువుల కొరతలేదు. అయినా వాటి ధరలు పెరిగాయి. కృత్రిమ కొరతలు సృష్టించబడ్డాయి.

మన ప్రజా పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్.) విస్తృతమైంది. ధరలను అదుపులో వుంచుటకు పి.డి.ఎస్.ను ఉపయోగించవచ్చు. అయితే మన పి.డి.ఎస్. పనితీరు బాగోలేదు. తక్కువ తూకాలు, బోగస్ కార్డులు మామూలైపోయాయి. కోటాలో కొంత బహిరంగ మార్కెట్‌కు తరలించబడుతోంది. అంతేకాదు, పప్పుధాన్యాల లాంటివి అక్రమ నిల్వలకు గురయ్యాయి. ధరలను అదుపులో ఉంచాలంటే ఆహార ధాన్యాల ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. నిత్యావసర వస్తువులు పేద ప్రజలకు అందుబాటులో ఉండాలి. అన్ని స్థాయిలలో అవినీతిని అరికట్టాలి. వీ

వీక్షణానికి మీ చేయూతనందించండి !

ఆరు సంవత్సరాలుగా ప్రతినెలా మీతో సంభాషిస్తూ, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపై కొత్త ఆలోచనలను, వైవిధ్యపూరితమైన చర్చను ప్రోత్సహిస్తూ, మీ ఆదరణ చూరగొంటూ వస్తున్న వీక్షణం తన ఆర్థికస్థితిని కూడ మీతో పంచుకోదలచుకుంటున్నది.

వీక్షణం ఇప్పుడు నడుస్తున్న పద్ధతిలో, పెరుగుతున్న న్యూస్ ప్రింట్ ధరలు, ప్రింటింగ్ ఖర్చులు, కార్యాలయ నిర్వహణ, పోస్టింగ్ వంటి ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక్కొక్క ప్రతికి ఉత్పత్తివ్యయం రు. 14 గా ఉంటున్నది. కాగా ప్రతి సంచికకూ చందాదారులు చెల్లించేది రు. 10. అందులో పోస్టేజి ఖర్చులు మినహాయిస్తే వాస్తవంగా చెల్లిస్తున్నది రు. 9 కన్న తక్కువ. పత్రిక విడిప్రతిని దుకాణాలలో కొనుక్కునేవారు రు. 10 చెల్లించి కొనుక్కున్నపటికీ, ఏజెంట్ కమిషన్ పోగా వారి నుంచి పత్రికకు అందేది ఒక్కొక్క ప్రతికి రు. 6 మాత్రమే. అంటే పత్రిక ఒక్కొక్క ప్రతి చందాదారుల విషయంలో రు. 5 లోటుతో, విడిప్రతి కొనుగోలుదారుల విషయంలో రు. 8 లోటుతో నడుస్తున్నదన్నమాట. పత్రిక ఎన్ని ప్రతులు ఎక్కువ అమ్మకమైతే అంత ఎక్కువగా లోటు పెరుగుతుందన్నమాట. ప్రస్తుతానికి ప్రతినెలా రు. 25,000 లోటుతో పత్రిక నడుస్తున్నది. ఏ పత్రిక అయినా తన ఉత్పత్తి వ్యయాన్నంతా పాఠకులనుంచే రాబట్టడం జరగదు. ఉత్పత్తివ్యయంలో కొంతభాగాన్ని ధరగా నిర్ణయించి మిగిలిన భాగాన్ని వ్యాపార ప్రకటనల రూపంలో సేకరించడం ఆనవాయితీ. ఎన్ని ఖర్చులు పెరిగినా గత నాలుగు సంవత్సరాలుగా ధరనుగాని, వార్షిక చందాను గాని పెంచలేదని, వీక్షణంకు ఇప్పటివరకూ ప్రభుత్వ ప్రకటన తప్ప ఇతర ప్రకటనలు కూడా ఎక్కువగా రావడం లేదని మీకు తెలుసు. వీక్షణం ను నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సర్వేలు చేయడం ద్వారా సంపాదించిన నిధులను వీక్షణం కొరకు ఖర్చుపెడుతున్నది. ఆ పరిస్థితి ఇంకా ఎక్కువ కాలం కొనసాగే అవకాశం లేదు.

ఈ పరిస్థితిలో వీక్షణంను ఆదుకొని, ఆర్థికవనరులను కల్పించి, మనుగడను సుస్థిరం చేయవలసింది మీరే. ఇది మీ పత్రిక, దీన్ని కాపాడుకోవడం, పది కాలాలపాటు నిలిచేలా చూడడం మీ బాధ్యత.

అందుకోసం

- పాఠకులందరూ చందాలు కట్టవచ్చు.
- ప్రతి చందాదారూ మరొకరిని చందాదారుగా చేర్పించవచ్చు, లేదా మిత్రులొకరికి వీక్షణం సంవత్సర చందా కానుకగా ఇవ్వవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో మీకు తెలిసిన దుకాణదారు వీక్షణం తెప్పించేలా, సక్రమంగా బకాయిలు చెల్లించేలా చూడవచ్చు.
- మీకు తెలిసిన వారెవరయినా వ్యాపార ప్రకటనలు ఇవ్వగలిగిన స్తోమత, అధికారం కలిగి ఉంటే వారిద్వారా వీక్షణంకు ప్రకటనలు ఇప్పించవచ్చు.

వీక్షణంను ఆదుకొండి

తెలుగునాట ఇటువంటి పత్రిక ఇది ఒక్కటే, దీని మనుగడకు, విస్తరణకు మీ చేయూతనందించండి

చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120	మూడు సంవత్సరాల చందా	రు. 350
ఐదు సంవత్సరాల చందా	రు. 550	పది సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

నూట యాభై ఏళ్ల కింద పెట్టుబడిదారీ సంక్షోభం గురించి మార్క్స్ చేసిన విశ్లేషణ మరొకసారి నిజమవుతున్నదంటూ చరిత్రను విప్పి చెపుతున్నారు **కె.జి. కన్నబిరాన్**

వాళ్లు నన్ను మార్క్స్ అంటారు...

'మనిషంటే సంఘ పశువు' అన్నాడు ఫ్రెంచ్ తత్వవేత్త రూసో. తరువాత కొద్దికాలానికి మరొక మేధావి ఎవరో వచ్చి 'మనిషంటే రాజకీయ జంతువు' అని కలిపారు. అప్పుడే పారిశ్రామిక విప్లవం చెలరేగుతోంది. ఆడమ్ స్మిత్ వచ్చి తన వెల్త్ ఆఫ్ నేషన్స్ పుస్తకం రాసిన సమయానికి మరొకరు ఎవరో వచ్చి 'మనిషంటే ఆర్థిక జీవి' అన్నారు.

మనిషంటే వాస్తవంగా ఏమిటి అన్నదానితో మనకు పెద్దగా నిమిత్తం లేదు. మనిషంటే ఇవన్నీ కావచ్చు. అంతకన్నా ఎక్కువా కావచ్చు. ఒకే సమయంలో అన్నీ కాకపోవచ్చు. ఆ నిర్వచనాలలో ఒకదానికో రెండిటికో నిదర్శనం కావచ్చు. కాని, ఆ నిర్వచనాలు అన్నిటికీ మొత్తంగానూ విడివిడిగానూ మనిషే ప్రమాణం.

ఇంగ్లండ్‌లో స్టూవర్ట్ పాలన సాగుతున్నప్పుడు చక్రవర్తికి దైవిక పాలనా అధికారం ఉన్నదని సిద్ధాంతం కల్పించిన రాజనీతి శాస్త్ర తత్వవేత్త హాబ్స్, 'మనిషంటే తోడేలు' అన్నాడు. ప్రాకృతికమైన రాజ్యం నీచంగా, పాశవికంగా, అల్పత్వంతో ఉంటుందని ఆయన చెప్పిన అవగాహనను బట్టి చూస్తే ఆ మాటా నిజమేనని అనిపిస్తుంది. అందువల్లనే అధ్యయనం చేయవలసిన, అర్థం చేసుకోవలసిన శాస్త్రంగా అర్థశాస్త్రం విస్మరించడానికి వీల్లేంది అయిపోయింది. అప్పటికే శ్రామికులను పీల్చి పిప్పి చేసే కార్ఖానాలు, ఎన్నో గంటల పనిదినాలు ఉనికిలోకి వచ్చాయి. మనిషిని స్థితిని బట్టిగాక సామాజిక ఒప్పందాన్ని బట్టి గుర్తించడం మొదలైపోయింది. ఆ గుర్తింపు మనుషుల జీవితాలను ప్రభావితం చేసి పేదరికాన్ని పెంచింది. అదే ఆ కాలపు నవలల ఇతివృత్తంగానూ మారింది. సరిగ్గా ఈ సమయంలో వచ్చిన జాన్‌రస్కిన్ అర్థశాస్త్రమంటే పందుల శాస్త్రం అన్నారు. అప్పుడప్పుడే పుడుతున్న శాస్త్రం మీద రస్కిన్ చేసిన వ్యాఖ్య దురుసుగా కనబడవచ్చు. కాని, డ్రైజాయిలీ వృత్తులలో వృత్తిపరమైన సంఘాలను పెంపొందించడానికి ప్రయత్నించినప్పుడు అది చట్టవ్యతిరేకమని న్యాయస్థానం కొట్టివేసింది. అప్పటికే పారిశ్రామిక విప్లవపు తొలి దుష్పరిణామాలకు వ్యతిరేకంగా విలియం కాబెట్ విప్లవ భావాలు, క్రైస్తవ సోషలిజం ఉద్యమమూ వ్యాపిస్తున్నాయి.

దీనంతటి నుంచి గుర్తించవలసిన విషయమేమంటే మొట్టమొదటి నుంచీ కూడా పెట్టుబడిదారీ విధానం సరైనది కాదని, దాని స్థానంలో సోషలిజమో, మరొక సామాజిక ధర్మమో రావాలని ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. రాబర్ట్ ఓవెన్, విలియం మారిస్‌లు పారిశ్రామికీకరణ పాశవికమైనదని, అనైతికమైనదని అన్నారు. మారిస్ అయితే సోషలిజం గురించి మాట్లాడాడు. ఆనాటి పార్లమెంట్ సమాజానికి మార్గదర్శక సూత్రంగా 'వ్యక్తివాదం' ఉండగూడదని తిరస్కరించింది. వాళ్లు సాంఘిక సంక్షేమ చట్టాలను తయారు చేశారు. పెట్టుబడిదారీ విధానంలో ఒకరు బాగుకోసం చేసే పని అందరి బాగుకోసం దారితీస్తుందని చెప్పిన సిద్ధాంతాన్ని వాళ్లు ఖండించారు. అర్థశాస్త్రం అనే దానికి పంపిణీతో ఏ సంబంధమూ లేదనేంత దూరం వాళ్లు వెళ్లారు. సమాజం స్థితి నుంచి ఒప్పందానికి మారిపోయిన తరువాత మనిషి మార్కెట్లతో దైనందిన సంబంధంలోకి వస్తాడని, ఆ క్రమంలో ప్రవర్తన ఎలా ఉండాలని ఆడమ్ స్మిత్ సూత్రాలే రాసిపెట్టాడు. టామ్ పేయిన్ చెప్పినట్టు ప్రభుత్వమనేది మనిషి కోల్పోయిన అమాయకత్వానికి చిహ్నామైనట్టయితే, పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చిన సమస్యలను గమనించినట్టయితే అర్థశాస్త్రం గురించి రస్కిన్ చేసిన వ్యాఖ్య న్యాయమేనని అనిపిస్తుంది. నిజంగానే అర్థశాస్త్ర సూత్రాలను ఒక ప్రయోగశాలలో నియంత్రిత పరిస్థితులలో పరీక్షించలేం. అలా పరీక్షించి జీవితానికి అన్వయించలేం. అర్థశాస్త్ర అధ్యయనంలో 'దుడ్డున్న వాడిదే బర్రె' అనే సూత్రం మానవ జీవితాల మీద ప్రభావం వేసేందుకు అనుమతించలేం.

లాభాల గురించి రాసిన అర్థశాస్త్రవేత్త ఫ్రాంక్ నైట్ ఏమన్నాడంటే 'స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థ ఆదర్శవంతమైన సామాజిక నిర్మాణం కాదు. సంపూర్ణ పోటీ అనే సైద్ధాంతిక సూత్రం కింద అది వాస్తవంగా మనుషుల మధ్య జరిగే వినిమయాన్ని అర్థం చేసుకోజాలదు. జీవన విలువలు అనేవి భిన్నమైనవి. వాటిని మనం వినిమయం చేసుకోగలిగిన సరుకులనూ, సేవలనూ వినియోగించి పొందే తృప్తికి కుదించలేం. అంతేకాదు మనకు కోరికలనేవి కూడా చాలా తరచుగా సామాజిక ప్రభావాల వల్లనే నిర్ణయమవుతాయి. అట్లాగే ఒక సమాజపు ఉత్పాదక సామర్థ్యమనేది మనకు అందిన దాన్ని వాడుకోవడానికి చైతన్యయుతంగా చేసే ప్రయత్నం, శుష్కమైన అదృష్టం, ఉట్టి పశుబలం, మోసం అనే అన్ని అంశాల కలయిక నిర్ణయిస్తుంది.'

అర్థశాస్త్రాన్ని ఒక శాస్త్రంగా మలిచి దాని స్వభావం, ప్రాధాన్యతా వివరించిన లయోనెల్ రాబిన్స్ అర్థశాస్త్రమనేది అపరిమితమైన లక్ష్యాల కోసం పరిమితమైన వనరులను వాడే శాస్త్రమని చెప్పాడు. ఈ లక్షణమే అర్థశాస్త్రానిక సాంఘిక లక్షణాన్ని ఇస్తుంది. అందువల్లనే అర్థశాస్త్రం సమాజానికి అవసరమైన పద్ధతిలో పనిచేయాలి.

ఒకవైపు ఈ చర్చ సాగుతుండగా కార్ల్‌మార్క్స్ పెట్టుబడిదారీ

విధానాన్ని అధ్యయనం చేస్తూ తన కాపిటల్ మొదటి సంపుటం, ఇతర వాదవివాద రచనలు సాగిస్తున్నాడు. పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతోనే వైకల్యం ఉందని ఆయన రాస్తున్నాడు. పెట్టుబడిదారీ విధానం పెరుగుతున్న కొద్దీ ఒకదాని తరువాత మరొకటిగా సంక్షోభాలను ఎదుర్కొంటుందని ప్రతి సంక్షోభం దాన్ని బలహీనపరుస్తుందని ఆయన అన్నాడు. అప్పుడప్పుడు మాంద్యం దాని తరువాత వికాసం ఒకదానివెంట ఒకటి వచ్చి పెట్టుబడిదారీ ఉత్పత్తి చక్రాన్ని దెబ్బతీస్తాయి. అందువల్ల కార్మికవర్గ శ్రేణులు అంతకంతకూ పెరిగిపోతుంటాయి. అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే భవిష్యత్తులో పాలనాధికారం చేపట్టబోయే వర్గాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఏం జరగబోతోందో మార్క్స్ భవిష్యవాణి చెప్పలేదు. ఊహించలేదు. ఆయన చెప్పినది జ్యోతిష్యం కూడా కాదు. ఆయన గుర్తించిందల్లా ఏమంటే, 'పారిశ్రామిక ఉత్పత్తిలో సామూహిక శ్రమ ద్వారా పెరిగే సంపద, అంటే పెరిగే పెట్టుబడి సామాజిక ఉత్పాదకత విషయంలో వ్యక్తిగా కార్మికుడు ఎంత పేదరికంలోకి పోతే, ఎంతగా అతడి వ్యక్తిగత ఉత్పాదక శక్తి తగ్గితే, అంతగా పెరుగుతుంది.' ఇక్కడ మార్క్స్ చేసిన ప్రయత్నమంతా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అభివృద్ధి క్రమాన్ని గుర్తించడమే. ఏ నియంత్రణా లేకుండా అది పెరిగినప్పుడు దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో గుర్తించడమే. మిగిలిన విషయాలన్నీ యథాతథంగా ఉన్నప్పుడు అనివార్యంగా ఏయే ఘటనలు జరుగుతాయో ఆయన అంచనా కట్టాడు. పెట్టుబడిదారీ పరిశ్రమ గురించి ఆయన చేసిన విమర్శలన్నీ సరైనవని అనేక సార్లు రుజువైంది. 1929లో మహాసంక్షోభం తలెత్తినప్పుడు మార్క్స్ విశ్లేషణ ఎంత సరైనదో మేధావిలోకం గుర్తించింది. ఆడమ్ స్మిత్ ప్రవచించిన పెట్టుబడిదారీ విధానపు అదృశ్య హస్తాలు పనిచేయడం లేదని, సంక్షోభ ఫలితాలను అరికట్టడానికి మరేమైనా చేయాలని సిద్ధాంతాలు మొదలుపెట్టారు.

అటువంటి ప్రయత్నాలలో చెప్పుకోదగినది జాన్ మేనార్డ్ కీన్స్ తన 'జనరల్ థియరి ఆఫ్ ఇంట్రస్ట్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ మనీ' లో చేసిన ప్రయత్నం. పెట్టుబడిదారి విధానానికి పుట్టుకతోనే వచ్చిన జబ్బుకు మందు కనిపెట్టడానికి ఆయన ప్రయత్నించాడు. నిజానికి ఆర్థిక వ్యవస్థ పనితీరులో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని చెప్పే చాలామంది అర్థశాస్త్రవేత్తల్లో ఆయన కూడా ఒకరు. తాను ఒకపనికిరాని అర్థశాస్త్రపు బానిసను కానని ఆయన మార్క్సును ఉద్దేశించే అన్నాడు. ఆయన పుస్తకంలో అధికోత్పత్తి సిద్ధాంతాలకు సంబంధించి ఉన్న ప్రస్తావనలలో మినహా మరెక్కడా మార్క్స్ గురించి నేరుగా కూడా రాయలేదు. కాని ఆయన సిద్ధాంతమంతా మార్క్స్ విశ్లేషణకు జవాబే. ఆ క్రమంలో ఆయన స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం నుంచీ, అదృశ్య హస్తాలు అన్నిటినీ సవరిస్తాయనే సిద్ధాంతం నుంచీ దూరం జరిగాడు. కుటుంబానికి మంచి అయినది దేశానికి మంచి కానక్కర్లేదని స్పష్టం చేశాడు. పెట్టుబడిదారీ అభివృద్ధిలో ఏ సమస్యలు తలెత్తుతాయని మార్క్స్ అంచనా కట్టాడో ఆ సమస్యలకు పరిష్కారాలు కనిపెట్టడమే కీన్స్ పని. సంక్షోభాలు రాకుండా పెట్టుబడిదారీ పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేసేలా ప్రభుత్వ జోక్యం ఉండాలని కీన్స్ చేసిన సూచన సంక్షేమ రాజ్య భావనకు, లోటు బడ్జెట్లకు, ప్రణాళికాబద్ధ విధానానికి దారితీసింది. సమాజంలో సరుకుల డిమాండ్‌ను ఎప్పుడూ కాపాడడానికీ, మనుషులలో వినియోగకాంక్ష పెరగడానికి ఏం చేయాలో ఆయన సూచించాడు. 'మనుషులను నిరుద్యోగంలో ఉంచడం కన్నా, గోతులు తవ్వమనీ, తవ్విన గోతులు పూడ్చమనీ ఉద్యోగం కల్పించడం మంచిది' అని ఆయన అన్నారు. మార్క్సును తప్పించడానికి ఆయన సిద్ధాంతం చేసాడు కాని ప్రభుత్వం గురించీ, ప్రభుత్వ బాధ్యతల గురించీ ఆయన కచ్చితంగా మారిన అవగాహనను ఇచ్చాడు. ఆయన ఇచ్చిన సంక్షేమ రాజ్య భావన స్పష్టమైన శ్రమ విభజన చేసింది. ఒకవైపు రాజ్యమేమో ప్రజల సంక్షేమాన్ని చూస్తుంది. మరొకవైపు స్వేచ్ఛా వాణిజ్య సంస్థలు ఆ ప్రజలను దోపిడీ చేస్తూ అదనపు శ్రమ విలువను, దేశపు వనరులను కైవసం చేసుకుంటాయి.

సోషలిస్ట్ దేశాలు కుప్పకూలిపోగానే మార్క్సిస్ట్ సిద్ధాంతం తప్పని రుజువైందనీ, ఆ సిద్ధాంతాల కాలం చెల్లిందనీ చాలా మంది అన్నారు. ఈ చౌకబారు అవగాహన ఆశ్చర్యం కలిగిస్తుంది. స్వేచ్ఛా వాణిజ్య అర్థశాస్త్రం రాజ్యం చేయడం మొదలుపెట్టింది. ఒకప్పుడు సంక్షేమ రాజ్య భావన ఉన్నప్పుడు పరిశ్రమలు జాతీయం చేయబడ్డాయి. ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి వ్యూహం అమలయింది. ఈ పరిశ్రమలు పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన చేశాయి. పెట్టుబడిదారీ విధానంలో మళ్లీ మళ్లీ వచ్చే మాంద్యానికీ, నిరుద్యోగానికీ వ్యతిరేకంగా ఈ ఉద్యోగ కల్పన ఉపయోగపడింది. కాని ఇప్పుడు దీన్నంతా సోషలిజంగా భావించి రద్దు చేసేశారు.

మిల్టన్ ఫ్రీడ్‌మన్, షికాగో అర్థశాస్త్ర బృందం, జఫ్రీ సాక్స్ వంటి మేధావులు అప్పటి దాకా ఉన్న ప్రభుత్వ వ్యయాన్నంతా రద్దు చేసేశారు. ఎటువంటి నియంత్రణా లేని మార్కెట్ శక్తుల అరాచకత్వానికి ఆర్థిక వ్యవస్థలను అప్పగించారు. ప్రతి ప్రభుత్వ జోక్యాన్ని సోషలిజం గానే గుర్తించి ధ్వంసం చేశారు. ఇటువంటి అర్థశాస్త్ర వేత్తలు తలెత్తడానికి ఎన్నో దశాబ్దాల ముందు కీన్స్ అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్‌కు ఒక ఉత్తరం రాస్తూ, 'ప్రస్తుతం కొనసాగుతున్న సామాజిక వ్యవస్థ చట్రం లోపల హేతుబద్ధ ప్రయోగాల ద్వారా దుష్ఫలితాలను అరికట్టే కార్యక్రమానికి మిమ్మల్ని మీరు ధర్మకర్తగా పెట్టుకున్నారు. మీరు అందులో విఫలమైతే హేతుబద్ధ మార్పుకే అర్థం పోతుంది. ఛాందసత్వం రాజ్యమేలుతుంది. దాన్ని తోసెయ్యడానికి విప్లవం వస్తుంది' అన్నాడు.

కీన్స్ చెప్పిన మాటను ఆ తర్వాతి అధ్యక్షులు కొనసాగించారు. నయా ఉదారవాద అర్థశాస్త్రం అధికారంలోకి వచ్చాక ఒక పద్ధతి ప్రకారం జరిగిట్టుగా ఒకదాని తరువాత ఒకటి బహుళజాతి బ్యాంక్‌లు కుప్పకూలిపోయాయి. మార్క్స్ ఊహించినట్టే జరిగింది. ఇది చూస్తే ముసలాయన మార్క్స్ మళ్లీ భూగోళం మీదికి వచ్చినట్టుంది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ అదృష్టం కొద్దీ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలోని అంతర్జాతీయ కార్మిక వర్గం మార్క్స్ రాకను గమనించనేలేదు. ఆయనేమో గుబురు గడ్డంలో నుంచి విశాలమైన చిరునవ్వు నవ్వుతూ ప్రపంచంలోని స్టాక్‌మార్కెట్లూ, షేర్‌మార్కెట్లూ కలయతిరుగుతున్నాడు. బహుళజాతి సంస్థలను కాపాడడానికి, వాళ్లను నష్టాలను భర్తీ చేయడానికి అమెరికన్ ప్రభుత్వమూ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ లక్షల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టవలసి వస్తోంది. ఈ విస్తరిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం మార్క్స్ ఇంకా సజీవంగా ఉన్నాడని చూపుతోంది.

ఇంతింత పెద్ద మొత్తాలను ఆయా సంస్థలకు ఇచ్చే బదులు నేరుగా ప్రజలకే ఇస్తే మంచిది కాదా? కీన్స్ చెప్పినట్టు అందువల్ల

కాగితాలపై చలామణీ అవుతూ చేతులు మారి, ఊహాజనితంగా ఎదిగిన మార్కెట్ కుప్పకూలిపోయిన సంక్షోభ క్రమాన్ని వివరిస్తున్నారు **బ్రహ్మాచారి**

మహాసంక్షోభం 1929 - 2008

1929 మహాసంక్షోభంలో చెక్కుచెదరని బేర్‌స్టెరన్స్ అనే భారీ స్థాయి పెట్టుబడి బ్యాంకు (ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) 2008 సంక్షోభంలో విలవిలలాడింది. ఆనాడు తన ఉద్యోగుల్లో ఏ ఒక్కరినీ తొలగించని ఆ సంస్థ ఈనాడు తన్ను తానే అమ్ముకొని తొలిగిపోయింది. మార్చి 24న షేర్‌కి పది డాలర్ల చొప్పున పదకొండు వందల కోట్ల డాలర్లకు జె.పి. మోర్గాన్ ఛేజ్ బేరం కుదుర్చుకుంది. ఇదే షేర్ ఏడాది క్రితం 133 డాలర్లు పలికింది.

ఇండియన్ అమెరికా తనఖా సంస్థలలో తొమ్మిదవ స్థానం పొందింది. ఇది ఆల్ట్ – ఎ రుణాలివ్వడంలో ఆరితేరింది. అప్పు తీసుకునే వాళ్లు ఆస్తినీ, ఆదాయాన్నీ రుజువు చేసే పత్రాలు పూర్తిగా లేకపోయినా ఇచ్చే అప్పులివి. దివాలాకి సిద్ధమయితే ప్రభుత్వం జూలై 12న 3200 కోట్ల డాలర్ల బ్యాంకుని స్వాధీనం చేసుకుంది. దీనితో ప్రభుత్వానికి 400 నుంచి 800 కోట్ల డాలర్ల దాకా నష్టం వాటిల్లుతుంది.

ఫ్రెడ్డీమాక్, ఫానీమే – భారీ తనఖా సంస్థలు. ఇవి శాసనం ద్వారా ఏర్పడ్డాయి. అందుకని వీటికి ప్రభుత్వ గ్యారంటీ ఉన్నదనే భావన ఉంది. దాంతో తక్కువ వడ్డీలకే డబ్బు వస్తుండేది. ఈ ముప్పై ఏళ్లలో బాగా ఎదిగాయి. అవి నేరుగా సబ్‌ప్రైం రుణాలివ్వలేదు. కాని సెకండరీ మార్కెట్‌లో లావాదేవీలు నిర్వహించాయి. ఇతర తనఖా బ్యాంకుల నుంచి అప్పులు కొన్నాయి. వాటిని సెక్యూరిటీలుగా పేకేజీలు చేసి వాల్‌స్ట్రీట్ మదుపుదారులకి అమ్మాయి. ఈ రెండు సంస్థలూ భారీగా దెబ్బతిన్నాయి. ఈ తొమ్మిది నెలల్లో పదకొండు కోట్ల డాలర్ల నష్టాన్ని చవిచూసాయి. సెప్టెంబర్ 7న ప్రభుత్వం ఈ రెంటినీ తన నియంత్రణ కిందకు తెచ్చుకుంది. ఇక మెరిల్ లించ్ వంతొచ్చింది. ఇది న్యూయార్క్ నగరంలో 34 అంతస్తుల భవనం మొత్తంలో ఉండే సంస్థ. అంతటి బ్యాంక్ జూలై 2007 నుంచి జూలై 2008 వరకు 1920 కోట్ల డాలర్లు నష్టపోయింది.

అంటే రోజుకి ఐదు కోట్లకి పైమాటే. సెప్టెంబర్ నెలలో అరవై ఎం.బి.ఎస్. (మార్ట్‌గేజ్ బాక్డ్ సెక్యూరిటీస్)లలో 5118 కోట్లు కోల్పోయింది. సెప్టెంబర్ 14న బ్యాంక్ ఆఫ్ అమెరికాకి షేర్‌కి 29 డాలర్ల తక్కువ ఐదు వేల కోట్ల డాలర్లకు అమ్ముడుపోయింది.

ఆ మరుసటిరోజే లీమ్మన్ బ్రదర్స్ సంస్థ దివాలా దాఖలు చేసింది. అమెరికా చరిత్రలో ఇది అతిపెద్ద దివాలా. ఇంగ్లండ్‌లో ఇందులో పని చేసే ఐదువేల మందికి ఉపాధి పోయింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ ఉద్యోగుల సంఖ్య ఇరవై ఆరు వేలు. వీరిలో ఎక్కువమందికి పని ఉండదు.

ఎ.ఐ.జి. (అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూప్) సంస్థ షేర్ నిరుడు డెబ్బై డాలర్లు. అది సెప్టెంబర్ 17న రెండు డాలర్లకి దిగింది. లక్ష కోట్ల బ్యాలెన్స్ షీట్ ఆ సంస్థది. 1,16,000 వేల మంది ఉద్యోగులతో, 130 దేశాల్లో లావాదేవీలు నిర్వహిస్తున్న బీమా సంస్థ. ప్రభుత్వం దానికి 8,500 కోట్ల డాలర్లిచ్చి ఎనభై శాతం వాటా తీసుకుంది.

వాషింగ్టన్ మ్యూచువల్స్ సంస్థకి అమెరికాలో 2239 బ్రాంచ్‌లున్నాయి. 43 వేల మంది ఉద్యోగులున్నారు. ఆ సంస్థ కూలబోతూ బేరానికొస్తే జె.పి. మోర్గాన్ ఛేజ్ 190 కోట్లకు కొనుక్కుంది. ఇది సెప్టెంబర్ 25న కుదిరింది.

అక్టోబర్ 3న వకోవియా సంస్థ 1500 కోట్లు తీసుకొని వెల్స్‌ఫార్గోలో కలిపివేసింది.

గోల్ఢమాన్ సాన్స్, మోర్గాన్ స్టాన్లీ రెండూ కమర్షియల్ బ్యాంక్‌లుగా మారి ఉనికిని కాపాడుకుంటున్నాయి.

2001 నుంచి అమెరికాలో ఇళ్ల కొనుగోళ్లు పెరిగాయి. ఇళ్ల నిర్మాణాలూ ఊపందుకున్నాయి. ఇళ్ల విలువ కూడా పెరుగుతూ పోతోంది. బ్యాంకుల వడ్డీరేటు బాగా తక్కువగా ఉన్నాయి. కనక అప్పుచేసికొన్నా, ఇళ్ల విలువ పెరుగుతూ ఉంటుంది కనక లాభదాయకమే అనుకున్నారు. తనఖా సంస్థలు విరివిగా అప్పులిచ్చాయి.

సరుకులకు గిరాకీ పెరగదా? కనీసం గోతులు తవ్వించి, పూడ్చే పనైనా చేయగూడదా? కార్మికులు అనుత్పాదక శ్రమ చేసినా ఆర్థిక వ్యవస్థలు బాగుపడతాయే.

కీన్స్ ఊహించినట్టుగా విప్లవమేమీ రావడం లేదు. ఛాందసత్వమేమీ భయపడనక్కర్లేదు. ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలను తయారు చేసింది కాని అంతర్జాతీయ కార్మిక వర్గపు సుశిక్షిత సైన్యాన్ని తయారు చేయలేదు. చాలాకాలం కింద బ్రెజ్నెవ్ అధికారంలో ఉన్నప్పుడు ఒక పరిహాసం చలామణీలో ఉండేది. మార్క్స్ సోవియట్ యూనియన్‌కు వచ్చాడట. తానూ తన సహచరులూ రాసిన దాన్ని ఎంతగా అపార్థం చేసుకొని అమలులో పెడుతున్నారో చూసి విచారపడ్డాడట. ప్రపంచ కార్మికులతో మాట్లాడితే బాగుంటుంది అనుకున్నాడట. ఈ రోజుల్లో టెలివిజన్ ద్వారా అయితే ఎక్కువ మందితో మాట్లాడొచ్చునని ఎవరో సలహా ఇచ్చారట. అతి కష్టం మీద మార్క్స్ సోవియట్ యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఒక నిమిషం మాట్లాడడానికి అవకాశం దొరికించుకున్నాడట. టెలివిజన్ తెరమీదికి వచ్చి 'ప్రపంచ కార్మికులారా! నన్ను క్షమించండి. పెట్టుబడిదారీ విధానమే విజయం సాధించింది' అన్నాడట. ఇది పెట్టుబడిమీద శ్రమ శక్తి అంతిమ విజయానికి ముందరి క్షణమేనా? వీ

మన దేశంలో ఇంటికోసం అప్పు చేస్తే, ఇరవై ఏళ్లు, ముప్పై ఏళ్లు బాకీ చెల్లిస్తూపోతాం. ఆ బ్యాంక్‌కి పెట్టుకున్న టైం ప్రకారమే నెలనెలా కొంత డబ్బు వస్తుందేమో కాని మొత్తం ఒకేసారి రాదు.

కాని అమెరికాలో పరిస్థితివేరు. అక్కడ అప్పు తీసుకున్న వాళ్లు నెల నెలా కొద్ది మొత్తాలే కడతారు. అయితే తనఖా బ్యాంక్‌లకి ఇక్కడ లేని అవకాశం అక్కడ ఉంది. ఏమంటే అక్కడ తన తనఖా అప్పుల్ని అమ్ముకోవచ్చు. కొనేందుకు చాలా సంస్థలున్నాయి. ఇదెలా జరుగుతుందో చూద్దాం.

ఇల్లు కొనాలనుకున్న వ్యక్తి తనఖా బ్యాంక్‌లో అప్పు తీసుకుంటాడు. దీన్ని ప్రైమరీ మార్కెట్ అంటారు. లావాదేవీ పూర్తయ్యాక ఆ సంస్థ ఆ అప్పుని మరొక సంస్థకి అమ్ముకోవచ్చు. ఈ మార్కెట్‌ని సెకండరీ మార్కెట్ అంటారు. ఇప్పుడుకొన్న సంస్థ మొదటి తనఖా బ్యాంక్‌కి మొత్తం డబ్బు చెల్లిస్తుంది. ఆ డబ్బుతో తనఖా బ్యాంక్ మరొకరికి అప్పిస్తుంది. దాన్నీ సెకండరీ మార్కెట్లో అమ్ముకుని, ఆ డబ్బుతో వేరొకరికి రుణం సమకూరుస్తుంది. ఇలా ఎన్ని సార్లైనా అదే డబ్బుని చలామణీలో పెట్టగలదు – ప్రతిసారి కొంత వడ్డీ తానుంచుకుని మిగితాదాన్నీ రెండో సంస్థకిస్తుంది.

మరి సెకండరీ మార్కెట్లో కొన్న సంస్థ ఏం చేస్తుంది? కొన్న అప్పుల్ని భాగాలుగా విడగొడుతుంది. వీటిని సి.డి.ఒ. (కలెక్ట్యులైజ్డ్ డెబ్ట్ ఆబ్లిగేషన్) అంటారు. వాటిని మదుపుదారులకి విక్రయిస్తారు. వాటి తాలూకూ అసలూ వడ్డీ సకాలంలో చెల్లిస్తామని హామీ యిస్తారు.

ఇలా సి.డి.ఒ. లని మదుపరులకమ్మి, వచ్చిన డబ్బుతో మళ్లీ తనఖా సంస్థల దగ్గర కొత్త అప్పులు కొని మళ్ళీ సి.డి.ఒ.లుగా విభజించి అమ్ముకుంటారు. తనఖా బ్యాంక్‌నుంచి అప్పు తీసుకున్న వాళ్లు సక్రమంగా 'కిస్తీ'లు కట్టాలి. తనఖా బ్యాంక్ ఆ డబ్బుని మొదట అప్పుని కొన్న సంస్థకి చేరుస్తుంది. ఆ సంస్థ సి.డి.ఒ.లు కొన్న వారికిస్తుంది. తన ఫీజుని తాను తీసుకుంటుంది.

ఈ చక్రం ఇలా తిరుగుతూ ఉన్నంత కాలం ఈ రెండు సంస్థలనీ, సి.డి.ఒ.లు కొన్నవారికీ ఎవరి లాభం వారికి వస్తూనే ఉంటుంది.

తనఖా బ్యాంకులు ఎక్కువ మందికి రుణాలిచ్చే ప్రయత్నాలు చేశాయి. కొత్తవాళ్లని పట్టుకునేందుకు బ్రోకర్లని ఉపయోగిస్తాయి. అమెరికాలో 2004లో సుమారు 53 వేల బ్రోకరేజ్ కంపెనీలు ఉన్నాయి. వాటిలో నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగులున్నారు. నూటికి 68 అప్పులు వీళ్ల ద్వారానే నడుస్తాయి. అప్లికేషన్లు పూర్తి చేయటం, పత్రాలన్నీ సరిచూడడం వీరి పని. ఈ మొత్తం పరిస్థితిని బట్టి ఈ వ్యాపారం ఏ స్థాయిలో నడిచిందో ఊహించవచ్చు.

అప్పులు జోరుగా ఇచ్చారు. పుచ్చుకున్నారు. ఒకానొక దశలో సక్రమంగా తిరిగి చెల్లించగలిగిన వారు తగ్గారు. కాని వ్యాపారం ఆగదు గదా! చెల్లించే శక్తి లేనివారికీ చెల్లిస్తారనే నమ్మకం లేని వారికీ కూడా అప్పులిచ్చారు. ఇలాంటి అప్పుల్నే సబ్ ప్రైం లోన్లు అంటారు. వీటి మీద వడ్డీ ఎక్కువ. ఇలాంటి అప్పులు 2004లో డెబ్బై వేల కోట్ల డాలర్ల స్థాయికి చేరాయి.

కొంతమంది ఆదాయం ఎక్కువ చెబుతారు. పత్రాలు సరిగా చూడకుండానే అప్పులిస్తారు. వీటిని ఆల్ట్-ఎ అప్పులంటారు. అబద్ధాలకోరు అప్పులు (లైయర్స్ లోన్స్) అని కూడా అంటుంటారు. మొత్తం అప్పుల్లో ఇరవై శాతం ఇవే. వీటివల్ల అమెరికన్ హోమ్ మార్టిగేజ్ బ్యాంక్ ఆగస్ట్ 2007లో దివాలా తీసింది. 2005 దాకా పెరుగుతూ వచ్చిన ఇళ్ల విలువ తగ్గసాగింది. క్రమక్రమంగా ఇప్పటి దాకా విలువ పడిపోతూనే ఉంది. 2007లో ఇళ్ల విలువ ఆరు లక్షల కోట్లు తగ్గింది. నాలుగు వారాల్లో ఒక లక్ష కోట్లు పడినట్లు మూడీస్ ఛీఫ్ ఎకానామిస్టు మార్క్‌జిండీ అన్నారు. ప్రస్తుతం ఇళ్ల విలువ కంటె తనఖా అప్పులే ఎక్కువ ఉన్నాయి. ఇలాంటి కేసులు తొంభై లక్షలున్నాయి. వాటి మొత్తం విలువ కంటే వాటి మీద ఉన్న అప్పు 83,600 కోట్ల డాలర్లని మెరిల్ లించ్ తేల్చింది.

ఈ పరిస్థితుల్లో బ్యాంక్‌లకి అప్పులు చెల్లించటం ప్రయోజనకరం కాదని కొందరూ, శక్తిలేక కొందరూ చెల్లించటం మానివేశారు. అలాంటివాళ్లు 2006 లో పన్నెండు లక్షలూ, 2007 లో పదిహేడు లక్షలు ఉన్నారు. 2008 లో ఇరవై ఐదు లక్షలని అంచనా. వచ్చే అయిదేళ్లలో ఇలాంటివి అరవై ఐదు లక్షలుంటాయని క్రెడిట్ సూసీ గ్రూప్ రిపోర్ట్ పేర్కొన్నది.

బ్యాంక్‌లు స్వాధీనం చేసుకున్న ఇళ్లు అమ్ముడవడం లేదు. అంతేకాదు కొనేవాళ్లు దొరకని ఇళ్లు నలభై రెండు లక్షలున్నాయి.

అప్పులు తీసుకొన్న వాళ్లు తిరిగివ్వక పోయేసరికి అప్పటి దాకా తిరిగిన చక్రం ఆగిపోయింది. డబ్బంతా అప్పులిచ్చి ఉన్నారు. ఇళ్లు స్వాధీనం చేసుకున్నా కొనేవాళ్లు కరువయ్యారు. బ్యాంకులు చేతులెత్తాయి.

అమెరికాలోనే కాదు ప్రస్తుతం యూరప్‌లో కూడా సబ్‌ప్రైం లెండింగ్ బాగా విస్తరిస్తోంది. ఇటలీ, జర్మనీలలో అయితే వందల కోట్ల యూరోలు సెంకడరీ మార్కెట్లో ఆటాడుతున్నాయి. అంతేకాదు అమెరికా బ్యాంకుల్లో చాలా దేశాల బ్యాంకులు పెట్టుబడులుపెట్టాయి. కనక చాలా దేశాల బ్యాంకుల్లో ద్రవ్య కొరత ఏర్పడ్డది – అదే ద్రవ్య సంక్షోభం.

ఆ పరిస్థితుల్లో వైట్‌హౌస్ ప్రతినిధి 'వీటినిలా పడిపోనిస్తే ఎకానమికే కీడు వాటిల్లుతుంది' అని తేల్చిచెప్పారు. అమెరికా ఎకానమియే కాదు ప్రపంచ మొత్తం ఆర్థిక సంక్షోభం తలెత్తుతుందని చెప్పటం మొదలుపెట్టారు. ఆర్థిక పరిస్థితి 'ప్రమాదం' లో పడిందనీ, తగిన చర్యలు తీసుకోవాలనీ బుష్ ముందుకొచ్చాడు. అన్ని దేశాలూ సహకరించుకుని సంక్షోభం తొలగించాలని అన్నాడు. అంతా కలిసి పని చెయ్యాలని జి7 దేశాల సమావేశంలో నిర్ధారించారు. భయపడాల్సిన పని లేదని పదే పదే చెబుతూ వచ్చారు. ఇవేమీ పనిచెయ్యలేదు. షేర్ మార్కెట్లు ప్రపంచ వ్యాప్తంగా పడిపోతూనే ఉన్నాయి. ఒక దశలో ఇటలీ, రష్యా, ఆస్ట్రియా దేశాలు ట్రేడింగ్ నిలిపి వేయాల్సి వచ్చింది.

మరోవైపు ప్రభుత్వాలు బ్యాంకుల్ని ఒడ్డుకు చేర్చేందుకు పూనుకున్నాయి. కేంద్ర బ్యాంకులన్నీ వడ్డీ రేట్లు తగ్గించాయి. అయినా మార్కెట్ పతనం ఆగలేదు.

యూరో దేశాలు పదిహేను. అవి బ్యాంకులకి రెండు లక్షల తొంభై వేల యూరోలిచ్చేందుకు సిద్ధం అయ్యాయి. బ్రిటన్ బ్యాంక్ ప్లాన్ మూడు బ్యాంకులని బయటపడెయ్యటానికి 6400 కోట్లు కావాలని ప్రభుత్వం ఆ బ్యాంకుల్లో పెద్ద భాగస్వామి కానుంది. బ్యాంకులు డబ్బిచ్చిన దేశాలన్నీ వాటిలో వాటా కోరాయి. అమెరికాలో డెబ్బై వేల కోట్ల డాలర్ల పథకం ప్రవేశపెట్టారు. మొదట్లో బ్యాంకుల్నించి అనుమానస్పద బాకీలని కొనాలని ప్రతిపాదించారు. ఆ బిల్లుని కాంగ్రెస్ తిరస్కరించింది. కొన్ని సవరణలతో అక్టోబర్ 3న ఆ బిల్లు నెగ్గింది. అయితే ఇరవై ఐదు వేల కోట్ల డాలర్లు ఇచ్చి, వాటాలు పొందాలనే మార్పు చేశారు. బ్యాంక్‌కి డిపాజిట్లకి ఒక లక్ష కోట్ల డాలర్ల దాకా బీమా ఉంది. దాన్ని రెండు లక్షల యాభై వేల కోట్ల డాలర్లకి పెంచారు.

ఇండియా ఇప్పటికి బ్యాంకులకి నగదు నిల్వల నిష్పత్తులు, 9 నుంచి 6.5 శాతానికి తగ్గించింది. మొత్తం రు. 1,45,000 కోట్లు సమకూర్చింది. అంతేకాదు అక్టోబర్ 20న రెపోరేటిని ఒక శాతం తగ్గించింది. బ్యాంకులకి డబ్బు అవసరమైతే రిజర్వ్ బ్యాంక్ నుంచి అప్పు తీసుకుంటాయి. అందుకు చెల్లించే వడ్డీయే రెపోరేట్. ఇంతకు ముందు తొమ్మిది శాతం ఉన్న దాన్ని ఎనిమిది శాతం చేశారు. అంటే బ్యాంక్‌లకి తక్కువ వడ్డీకి డబ్బు దొరుకుతుంది. అయినా ఇక్కడ సెన్సెక్స్ అక్టోబర్ 22న 513 పాయింట్లు తగ్గి 10,170 వద్ద ముగిసింది. నిఫ్టీ 169 పాయింట్లు తగ్గి 3065 వద్ద ముగిసింది.

మరోవైపు ఉద్యోగాలు పీకటం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. విమానయాన సంస్థలు జీతాలు తగ్గించే ఆలోచనలో ఉన్నాయి. ఈ మధ్య జెట్ సంస్థ ఉద్యోగుల్ని తొలిగించి, తప్పని పరిస్థితుల్లో తిరిగి చేర్చుకుంది. ముందు ముందు ఇలాగే ఉంటుందని చెప్పలేము.

అమెరికాలో సంక్షోభానికి కారకులైన బ్యాంక్‌లకి డబ్బులిచ్చి, ఉద్యోగాలు పోతున్న వాళ్లకి, ఇళ్లు పోగొట్టుకున్న వాళ్లకీ సరైన అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వం పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నది. దీని ఫలితంగా బడ్జెట్‌లో లోటు పెరిగి అప్పు చెయ్యాల్సొస్తోంది. ఇప్పటికే పది లక్షల ముప్ఫై వేల కోట్ల అప్పుతో సతమతవుతోంది. ఇదంతా కలిస్తే తడిసి మోపెడైపోతుంది.

ఎంత చేసినా మార్కెట్ వర్గాలు తృప్తిపడడం లేదు. షేర్ మార్కెట్లు అప్పుడప్పుడు తప్ప పడిపోతూనే ఉన్నాయి. కారణం మాంద్యంలో పడబోతున్నామనే భయం. ఇప్పటికీ మాంద్యంలో ఉన్నామా అనే అనుమానం. అదయినా ఇదయినా ఎప్పటికి బయట పడతామో తెలియక పోవటం. వరసగా రెండు త్రైమాస్యలు వృద్ధిరేటు క్షీణిస్తే (నెగెటివ్) మాంద్యం అంటుంటారు. ఆ ప్రకారం అయితే ఇంకా ఏ దేశమూ మాంద్యం బారినపడలేదు. అయితే ప్రతి దేశంలోనూ వృద్ధిరేటు తగ్గుతోంది. అంతే కాదు ముందనుకున్న దాని కన్నా తగ్గుతోంది. ఐ.ఎం.ఎఫ్. ప్రకారం స్పెయిన్ వచ్చే సంవత్సరం మాంద్యంలో పడుతుంది. మిగతా దేశాల కంటే గట్టి దెబ్బతింటుంది. 2011 దాకా కోలుకోక పోవచ్చని నిపుణుల అంచనా. వృద్ధిరేటు రెండు శాతం క్షీణిస్తుందని ఐ.ఎం.ఎఫ్. అన్నది.

జర్మనీ వృద్ధిరేటు 2009లో 0.2 శాతం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. ఒక సర్వే ప్రకారమైతే 0.8 శాతం క్షీణతకి అవకాశం ఉంది. అదే జరిగితే నాలుగు లక్షల ఉద్యోగాలు పోతాయని తేల్చింది. ఫ్రాన్స్ వృద్ధి ఒక శాతం మాత్రమేనని ప్రధాని అన్నాడు. అమెరికా బీజియిక్ ప్రకారం తయారీ రంగం నెమ్మదించింది. ఆర్థిక కలాపం వెనకడుగువేసింది.

పై నిర్వచనం ప్రకారం ఏ దేశమూ ఇప్పటికి మాంద్యంలో లేదు. ఈనాటి అంచనా ప్రకారం వచ్చే ఏడాది కూడా ఆ ప్రమాదం లేదు – ఒకటి రెండు దేశాలకు తప్ప.

మరి వ్యాపార వర్గాలు ఎందుకు భయపడుతున్నట్లు? మాంద్యానికి వారి నిర్వచనం వేరు. సరుకులు అమ్ముకోలేకపోతే మాంద్యం ఉన్నట్లే. అమెరికాలో సెప్టెంబర్‌లో రిటైల్ అమ్మకాలు 1.2 శాతం తగ్గాయి. ఒక అమెరికాలోనే కాదు అన్ని దేశాల్లో పరిస్థితిదే.

జనానికి కొనుగోలు శక్తి తగ్గింది. ఇందుకు పెరుగుతున్న నిరుద్యోగం ఒక కారణమైతే, పెరుగుతున్న సరుకుల ధరలు మరొక కారణం. అమెరికాలో 2008 జనవరి నుంచీ సెప్టెంబర్ వరకూ 7,60,000 ఉద్యోగాలు పోయాయి. మిలియన్ల మందికి పని గంటలు తగ్గాయి. అంటే ఆమేరకు ఆదాయాలు తగ్గాయి. ప్రస్తుతం 6.1 శాతంగా ఉన్న నిరుద్యోగం 2009 చివరకి 10 శాతం కావవచ్చని అంచనా. పార్ట్ టైం పనివాళ్లు 3,37,000 మంది పెరిగి మొత్తం 61 లక్షల మందయ్యారు. వీరికి ఆదాయం తక్కువ. ఈ సెప్టెంబర్‌లోనే 1,59,000 మందికి ఉద్యోగాలు పోయాయి. మొత్తం నిరుద్యోగుల సంఖ్య 95 లక్షలు. ఇంగ్లండ్ నిరుద్యోగం 5.75 శాతం. వచ్చే క్రిస్మస్ నాటికి నిరుద్యోగుల సంఖ్య 20 లక్షలకి చేరవచ్చని అంచనా. 2010 కి 30 లక్షలకి చేరి రేటు 9 శాతం అవుతుందనే అభిప్రాయం బలంగా ఉంది. అన్ని దేశాల్లో నిరుద్యోగులు పెరుగుతూనే ఉన్నారు.

నిత్య జీవితావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. అమెరికాలో వినియోగదారుల ఆదాయంలో 36 శాతం ఆహారానికీ, ఆరోగ్యానికీ, గ్యాస్‌కీ, హీటింగ్‌కీ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇతర ఖర్చులు తగ్గించుకోవటం తప్ప సామాన్యులకి గత్యంతరం లేదు. హోటళ్లలో తినే జనం బాగా తగ్గారని హోటళ్ల సంఘం వాపోయింది.

అక్టోబర్ 20న అంతర్జాతీయ కార్మిక సంస్థ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం ఈ సంక్షోభం వల్ల ప్రపంచంలో రెండు కోట్ల మంది నిరుద్యోగులవుతారు. 2007లో 19 కోట్ల మంది నిరుద్యోగులున్నారు. 2009 చివరికి 21 కోట్లు మంది ఉంటారు. రోజుకి ఒక డాలరు కన్నా తక్కువ సంపాదించే వాళ్లు మరో 4 కోట్ల మంది పెరుగుతారు. 2 డాలర్లిచ్చే వాళ్లు 10 కోట్ల మంది పెరుగుతారు. ఈ పరిస్థితుల్లో సరుకులేమి కొనగలుగుతారు? అందుకే ఉత్పత్తి తగ్గి, మాంద్యం వైపు ప్రపంచం అడుగులు వేస్తున్నదని కొందరి అభిప్రాయం. ఇది దీర్ఘ కాలం పీడిస్తుందనీ, ఉద్యోగులూ, కార్మికులూ బాగా బాధలు పడాల్సి వస్తుందని భావిస్తున్నారు.

అందుకే దీన్ని అందరూ 1929 మహాసంక్షోభంతో పోలుస్తున్నారు. ఎవరి నోట విన్నా అదే మాట. అప్పుడేం జరిగిందో చూద్దాం...

మహాసంక్షోభం 1929లో మొదలైంది. ముందు అమెరికాని పట్టుకొని అన్ని పారిశ్రామిక దేశాలకీ పాకింది. ఆ దేశాలన్నీ ఆర్థికంగా ఒకదాని మీద మరొకటి ఆధారపడ్డాయి. కనక అమెరికాకి తగిలిన దెబ్బవల్ల ఇతర దేశాలకీ బొప్పులు కట్టాయి. వ్యాపారాలు మూతపడ్డాయి. బ్యాంకులు దివాలా తీశాయి. ప్రజలు దాచుకున్న డబ్బులు అయిపోయాయి. 1932 కల్లా 1929తో పోలిస్తే పారిశ్రామికోత్పత్తి సగమే జరిగింది. 1933లో 1 కోటి 50 లక్షల మంది ఉద్యోగాలు లేకుండా ఉన్నారు. ప్రతి వంద మందిలో ఇరవై ఐదు మందికి పనిలేదు. జర్మనీలో 1932లో 60 లక్షలమంది నిరుద్యోగులున్నారు. ప్రతి నలుగురి లో ఒకరన్నమాట. 1933లో ఐదువేల బ్యాంకులు దివాలా తీశాయి.

అప్పటిదాకా మాంద్యాలను ప్రభుత్వాలు పట్టించుకునేవి కావు. మార్కెట్లే అన్నిటినీ సరిచేసుకుంటాయని నమ్మకం అయితే అప్పటి అమెరికా అధ్యక్షుడు హోవర్ కొన్ని చర్యలు చేపట్టారు. 1930లో ఎగుమతి, దిగుమతి సుంకాల్ని 50 శాతం దాకా పెంచారు. మాంద్యం ఆగకపోగా, ఇతర దేశాలకి ఎగుమతి అయింది. ఆయన తదుపరి చర్యలేవీ ఫలించలేదు. ప్రజామోదాన్ని కోల్పోయారు.

ఆ పరిస్థితుల్లో 1932లో రూజ్‌వెల్ట్ అధ్యక్షుడయ్యాడు. 1933–36 మధ్య నిరుద్యోగులకి పని కల్పించడానికి, ఆర్థిక స్థితిని చక్కపెట్టటానికీ సంస్కరణలు చేపట్టారు. ఈ కార్యక్రమానికీ న్యూ డీల్ అని పేరుపెట్టారు.

ప్రజలకు పనులు కల్పించారు. బ్యాంకుల్ని సంస్కరించారు. కార్మికులకి కనీస వేతనాలు నిర్ణయించారు. పని గంటలు స్థిరీకరించారు. 1934 జనవరికల్లా 40 లక్షల మందికి పనులు కల్పించారు.

1934 జూలై 23న ప్రఖ్యాత రచయిత ఎచ్.జి. వెల్స్ స్టాలిన్‌ని కలిసి మాట్లాడారు. అంతకుముందే అప్పటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్‌ని కలిశారు. ఆయన బాగానే చేస్తున్నట్లు చెప్పారు. అమెరికాలో పునర్వ్యవస్థీకరణ జరుగుతోందనీ, ప్రణాళికాబద్ధ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ సృష్టించబడుతోందనీ చెప్పారు. ప్రభుత్వ నియంత్రణ కోసం సంస్థలు ఏర్పాటు చేస్తున్నారనీ, సోవియట్‌లోనూ అదే ప్రక్రియ గమనిస్తున్నాననీ అన్నాడు.

స్టాలిన్ స్పందిస్తూ రెండు దేశాల లక్ష్యాలు వేరని చెప్పారు. అమెరికా లక్ష్యం అప్పుడు ఆ దేశంలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం వల్ల ఏర్పడింది. ఆర్థిక పునాదిని అలానే ఉంచి, అంటే పెట్టుబడి ద్వారా కార్యకలాపాలకు దెబ్బదగలకుండా సంక్షోభం నుంచి బయటపడడం. కొంత మేరకు లక్ష్యాన్ని సాధించగలిగినా పెట్టుబడిదారీ విధానం పెన వేసుకుని ఉండే ఉత్పత్తిలో అరాచకత్వాన్ని నిర్మూలించే ప్రయత్నం చెయ్యరు. ఆ ఆర్థిక పునాదిని కాపాడతారు. ఆ వ్యవస్థ అరాచకత్వానికి అనివార్యంగా దారితీస్తుంది. కనక అక్కడ జరుగుతున్నది సమాజ పునర్నిర్మాణం కాదు. పాత వ్యవస్థలో తలెత్తిన కొన్ని అతి పోకడలను నియంత్రించడం మాత్రమే – అని స్పష్టంగా చెప్పారు. వాళ్ళు సమాజాన్ని పునర్నిర్మిస్తున్నామనుకుంటారేమోగాని, ప్రస్తుత సమాజ పునాదిని బెసకనివ్వరన్నారు. ప్రణాళికాబద్ధమైన ఎకానమీ నిరుద్యోగాన్ని నిర్మూలిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగాన్ని కొంత వరకూ తగ్గించవచ్చు అని అనుకుందాం, పెట్టుబడిదారులు అందుకు ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. పెట్టుబడిదారీ పునాదిని కదల్చాలనుకుంటే ఆయన పరాజయం పాలవుతారు. బ్యాంకులూ పరిశ్రమలూ ఆయన చేతిలో లేవు. ప్రైవేట్ వ్యక్తుల, సంస్థల సొంత ఆస్తిగా ఉన్నాయి. కనక ఆయన అటువంటి లక్ష్యాన్ని సాధించలేరు – అని చెప్పారు. అది అక్షరాలా నిజమైంది.

1936లో రెండోసారి గెలిచారు. అయితే 1937లో దేశం మాంద్యంలో కూరుకుపోయింది. నిరుద్యోగుల్లో మరో 40 లక్షలమంది చేరారు. ఆయన చేసినకొన్ని కార్మిక అనుకూల చట్టాలు పెట్టుబడి దారులకు రుచించలేదు. ఆయనేదో సోషలిజం తేస్తున్నట్లు గగ్గోలు పెట్టారు. న్యూడీల్ లోని కొన్ని భాగాల్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. మొదట్లో రూజ్‌వెల్ట్‌ని కాపిటలిజాన్ని కాపాడిన వ్యక్తిగా కీర్తించినవాళ్ళే సోషలిజం వైపుకి లాక్కెళ్తున్నాడని తూలనాడారు. సుప్రీంకోర్టు న్యూడీల్‌కి వ్యతిరేకంగా తీర్పిచ్చినప్పుడు లూషియానా గవర్నర్ ఇలా అన్నారు 'ఈ దేశాన్ని ఫాసిజం బారినపడకుండా కాపాడినందుకు సుప్రీంకోర్టుకు చేయెత్తి మొక్కుతున్నాను'. రూజ్‌వెల్ట్ అప్పుడున్న దీన పరిస్థితుల్ని చక్కబెట్టే ప్రయత్నం చేశాడంతే. దీనికే అంతగా ఎగిరిపడ్డారు. నిజంగా సోషలిజం వైపుకి మొగ్గితే ఏమైనా ఉందా!

అమెరికా పాలకవర్గాలకి జాతీయీకరణ అనే పదం పడదు. పాల్సన్‌కి బ్యాంకుల్లో వాటాలు తీసుకోవడం ఇష్టం లేదు. ఇంగ్లండ్, ఫ్రాన్స్ పట్టుబట్టడం వల్ల ఒప్పుకున్నాడు. ఈ 700 బిలియన్ ప్లాన్‌ని కాంగ్రెస్ కొందరు వ్యతిరేకించారు. ఇది సోషలిస్టు చర్య అన్నారు. మిచిగన్ కాంగ్రెస్ సభ్యులు దీన్ని 1917 బోల్షివిక్ విప్లవంతో పోల్చాడు.

మార్కెట్ శక్తులే అన్ని చక్కబరుస్తాయనేది వాళ్ల అభిప్రాయం. అయితే ఏ మాంద్యంలోనైనా బాధలనుభవించేది కార్మికులూ ఉద్యోగులే. రూజ్‌వెల్ట్ ఎంతచేసినా, మాంద్యం వచ్చాక నిరుద్యోగం పెరుగుదలని అరికట్టలేకపోయాడు. ఆనాటి మహాసంక్షోభం అన్నిదేశాల కార్మికుల్నీ పీడించింది. కాని సోవియట్‌ని తాకలేకపోయింది. దానికి కారణం స్టాలిన్ చెప్పినట్లు అది సోషలిస్టు ఆర్థిక నిర్మాణం కావటమే. ఈ సంక్షోభ సమయంలో కార్మికులూ, మేధావులూ ఈ విషయం గుర్తు చేసుకోవాలని మనవి. వీ

'దాస్ కేపిటల్' కు మళ్లీ ఆదరణ

చదువరుల ఫ్యాషనే మారుతోందో, లేక కుప్పకూలుతున్న విశ్వవిపణి ప్రభావమో తెలియదు కాని, కార్ల్ మార్క్స్ సాహిత్యానికి మళ్లీ ఆదరణ పెరుగుతోందని ఫ్రాంక్‌ఫర్ట్ ప్రచురణ కర్తలు చెబుతున్నారు. ముఖ్యంగా గతితార్కిక భౌతిక వాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించి 150 సంవత్సరాల కిందటే సంచలనం సృష్టించిన కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ ద్వయం రచించిన ప్రఖ్యాత ఆర్థిక గ్రంథం 'దాస్ కేపిటల్'ను సొంతం చేసుకోడానికి యువతరం ఇప్పుడు పోటీలు పడుతున్నారని ప్రఖ్యాత జర్మన్ ప్రచురణకర్త జోయెర్న్ స్క్యూట్రంఫ్ చెపుతున్నారు. కమ్యూనిస్ట్ సాహిత్యాన్ని ప్రముఖంగా ప్రచురించే 'కార్ల్ డీట్జ్ వెర్లాగ్' సంస్థకు ఆధిపత్యం వహిస్తున్న స్క్యూట్రంఫ్, ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో, మార్క్స్‌తోపాటు జర్మనీకి చెందిన ప్రఖ్యాత సోషలిస్టు నేత రోసా లక్సెంబర్గ్‌ల నిలువెత్తు చిత్రాలతో అలంకరించిన తన స్టాల్ ముందు నిలబడి ఈ విషయాన్ని చాలా గర్వంగా చెపుతున్నారు. '2005 నుంచీ కేపిటల్ విక్రయాలు పెరుగుతూ వస్తున్నాయి. అప్పుడు 500 కాపీలు అమ్మాను. ఆ తరువాత 2007లో 1,300 కాపీలకు ఈ విక్రయాలు పెరిగాయి. ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ 1,500 కాపీలు చెల్లిపోయాయి. మామూలుగా అయితే ఇదే పెద్ద లెక్క కాకున్నా, అంత సులువుగా ఎవరూ చదవలేని ఈ ఉద్గ్రంథం విషయానికి వస్తే నిజంగా గొప్ప విషయమే' అన్నారు. 'అయితే కొనే వాళ్లలో యువజనం కూడా ఉన్నందున వాళ్లు మారిన ఫ్యాషన్ కోసం తీసుకుంటున్నారనుకోవాలి. ఎందుకంటే అది చదవడం చాలా కష్టం. వాళ్లు ఎప్పటికీ దాన్ని పూర్తి చేయలేరు' అని చెప్పిన స్క్యూట్రంఫ్, మొత్తం మీద పాఠకుల ఆసక్తిలో మార్పు కనిపిస్తోందంటున్నారు. ప్రపంచంలోని పలు బడా దేశాలు ఆర్థిక మాంద్యంలో మునిగిపోతున్న ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో, కార్ల్‌మార్క్స్‌ను మళ్లీ చదవాల్సిన అవసరం తలెత్తిందనుకుంటున్న సమాజం, నిజంగా తనలో ఏదో లోపించిందని భావిస్తున్నదానిగా కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు.

(మూలం : ఆంధ్రజ్యోతి దినపత్రిక, అక్టోబర్ 19, 2008)

అమెరికా వ్యాపారవర్గాల ప్రయోజనాలు ప్రజల ఆకాంక్షలనూ, మొత్తంగా రాజకీయాలనూ ఏ రకంగా శాసిస్తున్నాయో వ్యాఖ్యానిస్తున్నారు **సాజీ గోపాల్**

వాల్‌స్ట్రీట్ జూదగాళ్లు - వైట్‌హౌస్ మాయగాళ్లు

జార్జ్‌బుష్ అమెరికా ప్రజల, ప్రవాసుల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నాడు. అప్పులలో నిండామునిగిన 'బేర్‌స్టెర్న్స్'ను 29 బిలియన్ డాలర్లతో ఫ్రెడీ మేక్ - ఫ్రెనీమే కంపెనీలను 200 బిలియన్ డాలర్లతో ఏఐజి ఇన్సూరెన్స్ కంపెనీ 85 బిలియన్ డాలర్లకు కొన్నాడు. అమెరికా ఆర్థికరంగం పేకమేడలా కుప్పకూలుతోంది. బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ కంపెనీలు, తాకట్టు కంపెనీలు (మోర్టగేజ్ కంపెనీలు) నష్టాల ఊబిలో కూరుకుపోయి దివాళా తీస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకున్నది. మరి దీని వెనకాల వున్న కారణాలు ఏమిటి?

ఈ ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి కాస్తంత చారిత్రలోకి పోయి, అమెరికా ఆర్థిక విధానాలను గమనించాలి. అమెరికాలో రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, తాకట్ల కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా అప్పటి ప్రభుత్వం 1938లో 'ఫెన్నీ మే' 1970లో 'ఫ్రెడ్డీ మేక్' అనే కంపెనీలను ప్రారంభించింది. యీ కంపెనీలు రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు, తాకట్టు కంపెనీలకు పరోక్షంగా ప్రభుత్వ సబ్సిడీలు ఇచ్చాయి.

ఆర్థిక స్తోమతలేనివాళ్లకు విపరీతమైన అప్పులిచ్చి రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక కృత్రిమమైన డిమాండ్ సృష్టించారు. ఇళ్ల ధరలను రియల్‌ఎస్టేట్ కంపెనీలు వాస్తవ విలువకంటే విపరీతంగా పెంచేసాయి. వడ్డీవ్యాపారం రుచిమరిగిన బ్యాంకులు, వ్యాపారసంస్థలు కనీస నియమాలను పాటించకుండా, అప్పులు ఇచ్చాయి. ఉద్యోగాలు కోల్పోయిన జనం తీసుకున్న అప్పులు చెల్లించలేకపోయారు. వడ్డీ వ్యాపారంలో జూదమాడిన కంపెనీలు పేకమేడల్లా కుప్పకూలుతున్నాయి. తాము తీసుకున్న గోతిలో తామేపడ్డాయి. 'పెట్టుబడిదారులు తమ బొందను తామే తవ్వుకుంటారని' కార్ల్‌మార్క్స్ అన్నట్లే ఇప్పుడు జరుగుతోంది. అమెరికాలో పెట్టుబడి వ్యవస్థ పరాకాష్టకు చేరుకుంది. 1930 అమెరికాలో 'గ్రేట్ డిప్రెషన్' (ఆర్థిక సంక్షోభం) పునరావృతం అవుతోంది. అమెరికా చరిత్రలో ఎప్పుడూ కనీవినీ ఎరగని రీతిలో, అమెరికా ప్రభుత్వం 700 బిలియన్ డాలర్ల ప్రజల సొమ్ముని వాల్‌స్ట్రీట్‌లో జూదమాడి నిండా మునిగిన దళారులకు, తాకట్టు కంపెనీలకు ధారాదత్తం చేయాలని ప్రయత్నిస్తోంది. దీనిని అధికారంలో ఉన్న రిపబ్లికన్‌పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న డెమొక్రటిక్‌పార్టీ రెండూ సమర్థిస్తున్నాయి.

ఈ సందర్భంగా ప్రభుత్వం, రాజకీయ నాయకుల పాత్రను గమనించాలి. అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్, ఆర్థికమంత్రి హెన్రీ పాల్సన్ ప్రభుత్వ పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యారు. బ్యాంకులు, తాకట్టు కంపెనీలు, వ్యాపారసంస్థల మీద ఎలాంటి ప్రభుత్వ నియంత్రణ లేకుండా, తమ ఇష్టారాజ్యంగా నడిచాయి. వాల్‌స్ట్రీట్ జూదగాళ్ల నష్టాలను సామాన్య జనం నెత్తిన రుద్దుదామని కొంతమంది రిపబ్లికన్లు, డెమోక్రట్లు ప్రయత్నిస్తున్నారు. ఏడువందల బిలియన్ డాలర్ల ప్రభుత్వ సొమ్ముని (అంటే అమెరికా ప్రజల సొమ్ముని) వాల్‌స్ట్రీట్ షేర్ మార్కెట్ దళారులకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. కొంతమంది అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల విజ్ఞత వల్ల 'ఏడువందల బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్' బిల్లు ఓడిపోయింది.

అమెరికాలో అత్యంత ధనవంతమైన వ్యాపార సంస్థ జనరల్ ఎలక్ట్రిక్ చెందిన ఎన్.బి.సి. టైమ్ వార్నర్‌కు చెందిన సి.ఎన్.ఎన్., అలాగే అత్యంత పెద్ద మీడియా కంపెనీ అయిన న్యూస్ కార్పొరేషన్ తమ స్వప్రయోజనాల కోసం ఈ బిల్లును సమర్థిస్తున్నాయి. జనాన్ని 'మీ ఉద్యోగాలు పోతాయి, మీకు జీతాలు రావు, ఎ.టి.ఎం. కార్డులతో డబ్బు తీసుకోలేర'ని తప్పుడు ప్రచారంతో జనాన్ని భయపెట్టాలని ప్రయత్నిస్తున్నాయి.

ఒకవైపు అమెరికాలో మెజార్టీ ప్రజలు 'బెయిల్ అవుట్' బిల్లును వ్యతిరేకిస్తున్నా, మరొకవైపు ప్రభుత్వం-రాజకీయనాయకులు-బడా కంపెనీలు 'బెయిల్ అవుట్' బిల్లును అమలుచేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అమెరికా బిజినెస్ లాబీలు ప్రభుత్వం-రాజకీయ నాయకులను నియంత్రిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, అధ్యక్షపదవికి పోటీపడుతున్న బారక్ ఒబామా నాలుగు వందల మిలియన్ డాలర్లు, జాన్ మెకెయిన్ మూడు వందల మిలియన్ డాలర్లు (రిపబ్లికన్ పార్టీతో కలిపి) వసూలు చేసారు. దీనిలో మెజార్టీ భాగం బిజినెస్ లాబీల దగ్గర నుండి వచ్చిందే. సెనెట్‌లో రాత్రింబగళ్లు కష్టపడి సెనేటర్లు ఈ బిల్లును ఆమోదించారు.

చివరికి 'అమెరికన్ కాంగ్రెస్' 700 బిలియన్ డాలర్ల బిల్లును సాగదీసి 840 బిలియన్ డాలర్లు చేసి ఆమోదించింది. వెంటనే జార్జ్ బుష్ సంతకం చేసి చట్టం చేసాడు. అమెరికా ప్రభుత్వం, రాజకీయ నాయకులు, వ్యాపార వర్గాలు ఎంతగా లాలూచీ పడ్డారో, తమ స్వప్రయోజనాల కోసం దేశాన్ని ఎలా తాకట్టు పెడతారో దీనితో మరింత స్పష్టమౌతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంత దివాళాకోరు స్థితికి చేరుకోవటం పరాకాష్ట. ఇదొక పట్టపగటి దొంగతనం. ప్రభుత్వం జనాన్ని దోచుకుంటున్న వైనం. అమెరికా ప్రభుత్వం ఎన్ని బిలియన్ డాలర్ల నోట్లు ముద్రించినా, బెయిల్ అవుట్ల పేరుతో ఎన్ని బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినా, ఆర్థిక సంక్షోభాన్ని ఆపలేదు. దివాలా తీస్తున్న కంపెనీల లాభనష్టాలను మార్చజాలదు, అమెరికా ఆర్థిక విధానాలను గుడ్డిగా అమలుచేసిన ఇతర దేశాలు కూడా ఈ వరదలో కొట్టుకుపోతున్నాయి. పెట్టుబడిదారీవాదం చావుకి సిద్ధంగా ఉంది. పెట్టుబడిదారీవాదం కోటీశ్వరులకు లాభాలను కోట్లాది జనానికి దరిద్రాన్ని పంచుతుంది. వీ

ఇవాల్టి సంక్షోభానికి బీజాలు నాలుగు దశాబ్దాల కిందటే పడ్డాయనీ, ప్రపంచీకరణ ప్రగల్భాల బోలుతనం బట్టబయలయిందనీ అంటున్నారు **కె.వి. కూర్మనాథ్**

బయటపడ్డ ప్రపంచీకరణ మోసం

ఇది హెచ్చరికలు లేకుండా హఠాత్తుగా సంభవించిన సంక్షోభం కాదు. ఇట్లాంటిదేదో జరగబోతోందని ఎందరో మేధావులు ఎన్నోసార్లు చెప్పారు. అయితే అవన్నీ అబద్ధాలనీ, పెట్టుబడిదారీ వ్యవస్థ ఔన్నత్యాన్ని ఓర్వలేని, గుర్తింపజాలని గుడ్డివాళ్ల వాచాలత్వమని కొట్టిపడేశారు. ప్రపంచ బ్యాంక్, దాని దిశానిర్దేశాలలో దేశాల సరిహద్దుల్ని చెరిపేసిన ప్రపంచీకరణ మాత్రమే ప్రపంచానికి దిక్కని నమ్మబలికారు.

కానీ ఇప్పుడేమయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ నిజంగానే మరణ శయ్యపై ఉంది. ప్రపంచీకరణకు రాజధాని అయిన అమెరికా ఆర్థిక సంక్షోభంలో విలవిల్లాడుతోంది. అబద్ధాలమీద అనైతిక ప్రమాణాలమీద డబ్బులు సంపాదించిన బ్యాంక్‌లూ, ఇన్స్యూరెన్స్ కంపెనీలూ దివాళా తీశాయి. తెలివిలేని పథకాలతో ఆర్థికశాస్త్రంలోని ప్రాథమిక సూత్రాలు పాటించకుండా దురాశే ఏకైక లక్ష్యంగా పనిచేసి ఒకదాని వెంట ఒకటి కూలబడ్డాయి. దివాళా తీసేయి. లక్షల కోట్ల రూపాయల డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ఈ సంక్షోభానికి బీజాలు దాదాపు మూడు నాలుగు దశాబ్దాల కిందటే పడ్డాయి. సరిగ్గా 1930ల నాటి ఆర్థిక మాంద్యానికి ముందటి దశాబ్దంలో ఎలాగైతే అమెరికాలో స్టాక్ మార్కెట్లు రంగుల ప్రపంచాన్ని చూపించాయో, ఇప్పటి సంక్షోభానికి ముందు కూడా మార్కెట్లో పెట్టుబడిదారీ వ్యవస్థ 'గొప్పదనాన్ని' ప్రకటించాయి. (అడపాదడపా వచ్చే ఆటుపోట్ల సంగతి అటుంచితే, అమెరికా స్టాక్ మార్కెట్ల సూచిలే ప్రపంచానికి మార్గమని ప్రచారం చేసారు. 'నా కోడి కూస్తేనే ప్రపంచం నిద్రలేస్తుందని' ఊళ్లోని ముసలమ్మ అనుకుందో లేదో తెలీదుగానీ, వాల్‌స్ట్రీట్ అమెరికా స్టాక్ మార్కెట్ లావాదేవీల అడ్డా ఎలా నిద్రలేస్తుందో ప్రపంచంలోని మిగతా అన్ని స్టాక్ మార్కెట్లు అలా లేచేవి, లేస్తున్నాయి.)

అయితే అబద్ధాలూ, మోసపూరిత ప్రకటనలూ ఎంతకాలం నడుస్తాయి? ఏదో రోజు వాస్తవాన్ని ముఖాముఖి ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తుంది కదా. ఆ రోజు వచ్చేసరికి, వ్యవస్థ బోలుతనం బట్టబయలైంది. జీవముడిగిన బ్యాంక్‌లను రక్షించడానికి ఏడువందల బిలియన్ డాలర్ల (దాదాపు 33,60,000 కోట్ల రూపాయలు) సహాయం ప్రకటించింది బుష్ ప్రభుత్వం. అంటే నేరం చేసిన వాడినే సత్కరించడమన్నమాట.

విచిత్రంగా ఈ బ్యాంక్‌ల, సంస్థల మోసానికి గురైన ప్రజలు రోడ్డున పడితే పట్టించుకోని ప్రభుత్వం, బ్యాంక్‌లు మూతపడితే మాత్రం బుష్ ప్రభుత్వ యంత్రాంగం నిద్రాహారాలు మాని ఈ ప్యాకేజీని తయారు చేసింది. ఇంకా ఆశ్చర్యకరమైన కీలకమైన విషయమేమిటంటే, ఈ ప్యాకేజీలో బ్యాంక్‌లు, పెట్టుబడి సంస్థల్లో పేరుకుపోయిన తనఖా ఆస్తులను ప్రభుత్వం కొనడం. ఆమేరకు ప్రభుత్వానికి ఆయా కంపెనీల్లో వాటాలొస్తాయి.

ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఈ తనఖా ఆస్తులే (మార్ట్‌గేజ్డ్ ప్రాపర్టీస్). కొన్నేళ్ల క్రితం అమెరికాని కుదిపివేసిన సబ్ ప్రైం (అసలు విలువకంటె చాల తక్కువ విలువున్న ఆస్తులపై అప్పులివ్వడం) సంక్షోభానికి మూలకారణం ఈ తనఖా ఆస్తులే.

వీటి గురించి కొంచెం వివరించాలి (వీటి గురించి వినని వాళ్ల కోసం). ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనుక్కోవడానికి బ్యాంక్‌ల నుంచి గృహరుణాలు తీసుకోవడం అందరికీ తెలిసిందే. అయితే ఈ అప్పులు యిచ్చేముందు బ్యాంక్‌లు, ఇతర సంస్థలు కొన్ని విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా అప్పుపెట్టి కొంటున్న ఇల్లు, ఫ్లాటు, ప్లాటు నిజంగా అంత విలువ చేస్తుందా, అప్పు తీర్చే శక్తి అప్పు తీసుకుంటున్న వాళ్లకి ఉందా, ఒకవేళ వాళ్లు డిఫాల్ట్ (అప్పు తీర్చకపోతే) అయితే ఆ ఆస్తి అమ్మితే తమ డబ్బు తమకి వస్తుందా, ఆ ఆస్తిమీద ఏమైనా న్యాయపరమైన యిబ్బందులున్నాయా – ఇట్లాంటి వివరాలెన్నింటినో చూడాలి. కానీ అమెరికాలో చాలా బ్యాంక్‌లు ఈ ప్రాథమిక అంశాలను పక్కన పెట్టాయి. ఎందుకంటే, ఈ గృహరుణాలు ఆ బ్యాంక్‌లకు వాటికవే ఒక వ్యాపార అంశం కాదు. ఈ తనఖా ఆస్తులు (గృహరుణాన్ని తీసుకున్న వాళ్లు ఇంటి పత్రాలను బ్యాంక్‌ల దగ్గర ఉంచడాన్ని మార్ట్‌గేజ్ లేదా తనఖా) బ్యాంక్‌లకు ఒక పెన్నిధి లాంటిది. ఈ మార్ట్‌గేజ్ ప్రాపర్టీస్ పోర్ట్‌ఫోలియోని ఈ బ్యాంక్‌లు వేరే బ్యాంక్‌లకు, ఆర్థిక సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు యూనిట్స్‌గా అమ్ముతారు. ఇళ్ల విలువలు పెరుగుతుంటే ఈ యూనిట్స్ ఎక్కువ రాబడి తెస్తాయని ప్రకటనలు గుప్పిస్తారు.

ప్రపంచీకరణ పుణ్యమా అని ఈ యూనిట్ల అమ్మకాలు అమెరికా గడపదాటి ఎక్కడెక్కడో మార్కెట్లలోని మదుపర్ల డబ్బును ఆకర్షిస్తాయి. ఈ బుడగ పెరిగినంతవరకు ఆ ఆకర్షణలు, ఆశలు పెరుగుతాయి. ఇదివరకు చెప్పినట్టు ఈ బుడగ ఎప్పుడైతే తన పరిమితికి చేరుకుంటుందో అప్పుడు వాస్తవంతో ఎదురుపడాల్సి వస్తుంది. అబద్ధాలు, మోసాలు, అనైతిక విలువలతో కూడిన ప్రచారాలూ ఎన్నాళ్లు పనిచేస్తాయి. అందరినీ అంతకాలం మోసం చెయ్యడం సాధ్యం కాదు కదా! బుడగ బద్ధలవగానే పెట్టుబడిదారీ వ్యవస్థ నగ్నస్వరూపం బయటపడింది. అయితే ఇది తాత్కాలికమైన సమస్య అని, ప్యాకేజీతో బయటపడేయ్యగలమని బుష్ ప్రభుత్వం నమ్మబలుకుతోంది. కానీ, సమస్యకు అసలు కారణమైన వ్యవస్థాగతమైన లోపాల గురించి ప్యాకేజీని రూపొందించిన వాళ్లు ఊసెత్తలేదు. లోప భూయిష్టమైన వ్యవస్థను ప్యాకేజీతో రక్షించగలరా?

అమెరికా మార్కెట్ సంక్షోభం ప్రపంచాన్నే కుదిపేస్తుంటే మన పాలకులు ఏం కాలేదంటూ మనను ఇంకా మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు **వి. హనుమంతరావు**

బ్యాంకులు సరే, ప్రజల బతుకులో?

ద్రవ్యోల్బణం, రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ప్రకటిస్తున్న ఎన్నికల తాయిలాలు, తగ్గుతున్న స్థూల జాతీయాదాయం అభివృద్ధిరేటు, తగ్గుతున్న ప్రత్యక్ష పన్నులశాతం, పారిశ్రామిక ఉత్పత్తుల సూచి – ఇలా అనేక ప్రతికూల ధోరణులతో దేశం సతమతమవుతున్న నేపథ్యంలో అమెరికా ఆర్థిక సంక్షోభం పిడుగులా వచ్చిపడింది. వామపక్షాల పీడవదిలింది, ఆర్థిక సంస్కరణలను వచ్చే ఎన్నికలలోగా వేగవంతం చేద్దామని ఆర్థికమంత్రి చిదంబరం, కార్పొరేట్‌రంగం కన్న కలలు కల్లలయ్యాయి. సంస్కరణల మాట అటుంచి, అమెరికా సంక్షోభం కొట్టిన దెబ్బతో ఆత్మరక్షణలో పడింది ప్రభుత్వం. అమెరికాలో బ్యాంకులు దివాలా తీసినా, మన బ్యాంకులు క్షేమంగానే ఉన్నాయి. డిపాజిటర్ల డిపాజిట్లకు ఎటువంటి ప్రమాదంలేదు. అమెరికా సంక్షోభం మనదేశం మీద మార్జినల్‌గానే ఉంటుందంటూ ప్రభుత్వం ప్రజలను జోకొట్టడానికి ప్రయత్నించింది. కాని రోజు రోజుకూ ప్రపంచ దేశాల్లో తలెత్తుతున్న ధోరణులను గమనించిన ప్రభుత్వం కాస్త వెనక్కు తగ్గింది. ఒకపక్క మన ఫండమెంటల్స్ బాగానే ఉన్నాయంటూ చిదంబరం అంటున్నా, ప్రధాని మన్మోహన్ సింగ్ 'ప్రపంచం ఏమైపోతున్నా, భారత ఆర్థిక వ్యవస్థ చెక్కు చెదరదు అని అనుకోవటానికి వీలులేదు' అని దేశాన్ని హెచ్చరించారు. ప్రపంచీకరణ, మార్కెటీకరణ మన కొంప ముంచుతాయి మొర్రో అని ప్రజాస్వామ్య వామపక్ష శక్తులు ఎంతగా మొత్తుకొన్నా, పాలకుల చెవుల్లో ప్రపంచ బ్యాంకు పెట్టిన బిరడాలవల్ల ఈ మొత్తుకోళ్ళు వినిపించుకోలేదు.

ఫండమెంటల్స్ బావున్నాయనే దానికి ఆర్థిక శాస్త్ర పరిభాషలో ఏమంటారో తెలియదు కాని ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ చిదంబరం ఈ పాటే పాడుతూ వచ్చారు. 'నా

ఒకవేళ తాత్కాలికంగా బయటపడినా మళ్లీ ఇదే పరిస్థితి మళ్లీ మళ్లీ ఎదురుకాదని హామీ ఇవ్వగలరా?

పోనీ ఇదేదో అమెరికా సమస్య కదా అని వదిలేద్దామా అంటే సరిపోదే. అమెరికాలాగా, యూరోపియన్ దేశాల్లాగా అయిపోవాలంటే ప్రపంచీకరణ తప్పనిసరని వాదించి అన్ని రకాలుగా భారతదేశాన్ని అంతర్జాతీయ విపణిలో భాగం చేసేరు మన పాలకులు. దీంతో, సంపన్న దేశాల పెట్టుబడి సంస్థలు ఇబ్బడిముబ్బడిగా మన స్టాక్ మార్కెట్లలో కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాయి. వీటి వ్యాపార సూత్రమేమిటంటే, వేల కోట్ల పెట్టుబడులు పెట్టి సెన్సెక్స్ (బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి హెచ్చుతగ్గులను సూచించే సూచీ)ను ఆటాడిస్తారు. అంటే, అవి విపరీతంగా పెట్టుబడులు పెట్టడం వల్ల సెన్సెక్స్ పెరుగుతూ పోతుంది. రెండేళ్ల క్రితం 5,000 పాయింట్లు మాత్రమే కూడిన సెన్సెక్స్ ఎన్నడూ లేని విధంగా కొన్ని నెలల క్రితం 20,000 పాయింట్లు దాటిపోయింది. ఆశతోనో, దురాశతోనో చిన్న మదుపర్లు ఈ సెన్సెక్స్ మాయలో పడతారు. ఇంకా పెరుగుతుంది, ఇంకా పెరుగుతుందన్న భ్రమలో ఇంకా డబ్బులు పెట్టడమో లేకపోతే నోషనల్ (ఊహజనిత) పెరుగుదలను చూసి మురిసిపోవడం చేస్తారు. అదును చూసుకుని, విదేశీ, స్వదేశీ గుత్త పెట్టుబడిదార్లు స్టాక్ మార్కెట్ల నుంచి ఒకేరోజు పెద్ద మొత్తంలో తమ షేర్లు అమ్ముకుని మామూలు మదుపర్ల ఊహజనిత (అంటే పది రూపాయల షేరు వంద రూపాయలు పలుకుతుంటే ఊహించి సంతోషపడడం) విలువను నిజం చేసుకుని సొంతం చేసుకుంటారు. స్టాక్ మార్కెట్లు ఒక్కసారి నేలకూలుతాయి. పెద్దవాళ్లు సొమ్ము చేసుకోగా, చిన్నవాళ్లు – ముఖ్యంగా అప్పుచేసి షేర్లు కొన్నవాళ్లు – తలలు పట్టుకుని కూచుంటారు.

ఒక పక్క మార్కెట్లు కుదేలయితే ప్రభుత్వం మాత్రం ధైర్యం నూరిపొయ్యడానికి ప్రయత్నిస్తుంది. ముందు మనకేమీ కాదని అంటుంది. సెగపెరుగుతున్న కొద్దీ 'అవును మనమీద కూడా కొంచెం ప్రభావం పడింద'ని మొహమాటంగా ఒప్పుకుంటుంది. రంగంలోకి దిగి వడ్డీరేట్లు తగ్గిస్తుంది (రిజర్వ్ బ్యాంక్ ద్వారా). మార్కెట్లోకి లిక్విడిటీ (డబ్బు) వస్తుందని తద్వారా బ్యాంక్‌ల దగ్గర, ప్రజల దగ్గర దాదాపు లక్ష కోట్లు అదనంగా చేరుతాయని, వాళ్లు ఆ డబ్బంతా ఖర్చు పెడితే వస్తువులకు గిరాకీ పెరుగుతుందనీ, కంపెనీలు మళ్లీ పచ్చగా ఉంటాయని ప్రభుత్వం హామీ ఇస్తుంది.

చాల విచిత్రమైన విషయమేమిటంటే, ఇదే రిజర్వ్ బ్యాంక్ ఐదారు నెలల క్రితం, ద్రవ్యోల్బణాన్ని అమాంతం పెంచింది. ఎందుకంటే, ద్రవ్యోల్బణాన్ని అదుపు చెయ్యడానికి! వడ్డీరేట్లు పెంచితే ఆర్థిక వ్యవస్థ నుంచి దాదాపు లక్ష కోట్లు సక్ (పీల్చివెయ్యబడటం) చేస్తే ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది కాబట్టి వస్తువులపై డిమాండ్ తగ్గుతుందని (కాబట్టి ధరలు తగ్గుతాయి) ప్రభుత్వం హామీ యిచ్చింది. ఈ ఐదారు నెలల్లో ఏ నిత్యావసర వస్తువు ధర తగ్గకపోగా ఇంకా చాలా పెరిగింది. మనకి దొరకని సమాధానమేమిటంటే, ఆర్థిక వ్యవస్థలోకి లక్ష కోట్లు అదనంగా వస్తే, ప్రజలకు అందుబాటులోకి అంత డబ్బు వస్తే, వాళ్లు మరింతగా కొంటే (ప్రభుత్వ వాదన ప్రకారం) వస్తువుల ధరలు ఇంకా పెరగవా?

ఇంతకీ ఈ లక్షకోట్ల విడుదల చేష్టలుడిగిన పెట్టుబడిదార్లకు అభయ హస్తమిచ్చి మార్కెట్ల ధైర్యం నిలబెట్టి ఎన్నికల తరుణంలో నిరుత్సాహ వాతావరణం లేకుండా చేసుకోడానికేనని అనిపిస్తుంది. వీ

దృష్టిలో ఈ మాటకు అర్థం దేశ ఆర్థిక పరిస్థితి బావుందని కాదు, ప్రజల ఆర్థిక పరిస్థితి బావుందా అనేదే. వారి పరిస్థితి బావుందని' ఎవరైనా అంటే గట్టిగా నిలదీయాలనిపిస్తుంది. రోజుకు సగటున ఒక వ్యక్తి 20 రూపాయలు సంపాదిస్తుంటే ఫండమెంటల్స్ బాగున్నాయని అర్థమా? బ్యాంకుల్లో డబ్బు క్షేమంగానే ఉందట. సామాన్యుడికి బ్యాంకుతో పనేలేదు. రైతాంగంలో 27 శాతం మందికే బ్యాంకు రుణాలిస్తుంది. కాగా బ్యాంకుల్లో డబ్బు క్షేమంగానే వుందనే భరోసా కార్పొరేట్లకు, ఉన్నత మధ్యతరగతి వర్గాన్ని ఉద్దేశించి మాత్రమేనని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఒకవేళ కార్పొరేట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటే, అది మనదేశ బ్యాంకుల్లో వాళ్లు జమచేసిన డబ్బు గురించి కాదు. దేశంలో కొన్ని బ్యాంకులు అమెరికాలో సంక్షోభంలో ఉన్న, లేదా దివాలా తీసిన బ్యాంకులతో ఉన్న లావాదేవీల్లో ఒక బిలియన్ డాలర్ల గురించే వారి ఆందోళన. అమెరికాలో దివాలా తీసిన బ్యాంకులకు అక్కడి ప్రభుత్వం 70 వేల మిలియన్ డాలర్లు ఇచ్చి ఆ బ్యాంకులను రక్షించిందట. ఆ డబ్బేమీ బుష్ తన జేబులో నుంచి తీసి ఇచ్చింది కాదు. ఆ డబ్బు అమెరికన్ ప్రజలది. ప్రజల డబ్బుతో దివాలా తీసిన బ్యాంకులను రక్షించిందట. సంక్షోభంలో పడిన అయిదు అమెరికన్ బ్యాంకుల్లో నాలుగింటిని ప్రభుత్వం మోకాలొడ్డి రక్షించింది కాబట్టి ఆ నాలుగింటితో లావాదేవీలున్న ఇండియన్ బ్యాంకులు ఆందోళన పడాల్సిన పనిలేదని మన రిజర్వుబ్యాంక్ డెప్యూటీ గవర్నర్ లీలాధర్ భరోసా ఇస్తున్నారు. అమెరికాలో దివాలా తీసిన బ్యాంక్‌ల పక్షాన లీలాధర్ వకాల్తా పుచ్చుకోవటమెందుకో. ఏమైనా రిజర్వ్ బ్యాంక్ ఒక పక్కన అరవై వేల కోట్ల రూపాయలు చలామణిలోకి విడుదల చేసి, రెండో పక్కన ఫండమెంటల్స్ బాగానే ఉన్నాయనటం సామాన్యునికి అర్థం కాని విషయం. అయితే రిజర్వ్‌బ్యాంకు గవర్నర్ డి. సుబ్బారావు ఒక అంతర్జాతీయ వేదిక నుంచి ప్రసంగిస్తూ ఓ చిన్నపాటి హెచ్చరిక చేశారు. అమెరికా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను నేరుగా ప్రభావితం చేయడం లేదు కాని దేశంలోకి వచ్చే విదేశీ నిధులు, ఎగుమతులు,దేశీయ మార్కెట్లో రుణావసరాలను ప్రభావితం చేయవచ్చునీ, విదేశీ మారకం, ఈక్విటీ మార్కెట్ల ద్వారా అమెరికా సంక్షోభం దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రవేశించవచ్చునని, డబ్బు, రుణం, క్రెడిట్ మార్కెట్ల మీద చూపే ప్రభావం చిన్నదేమీ కాదని, ఇది రాబోయే నెలల్లో తీవ్రతరం కావచ్చునని అన్నారు. విదేశీ నిధులు తమ తమ దేశాల్లో సమస్యల్లో ఇరుక్కు పోవటంతో భారత కార్పొరేట్లకు విదేశీ నిధులు లభించటం సాధ్యం కాకపోవచ్చునని, ఈ సంక్షోభంతో ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఇదివరలో లాగ పెట్టకపోవచ్చునని హెచ్చరించారు. ఆర్థిక సంస్కరణలను వేగిర పరచాలని చిదంబరం ఉబలాటపడ్డారు. ఉదాహరణకు ప్రావిడెంట్ ఫండ్ నిధులని షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలని, బ్యాంకుల్లో విదేశీ ఈక్విటీని 74 శాతం వరకు పెంచాలని చిదంబరం తన ఆలోచనలను వెల్లడించారు. దీనికి ఉద్యోగులు, వారిని బలపరుస్తూ వామ పక్షాలు అడ్డుపడుతూ వచ్చాయి. ఒక వేళ చిదంబరం మాటే నెగ్గివుంటే, వేలకోట్ల ప్రజల సొమ్ము నేటి సంక్షోభం ఫలితంగా బంగాళాఖాతంలో కొట్టుకుని పోయివుండేది. ఇందుకు వామపక్షాలను అభినందించాలి. బ్యాంకుల్లో నిధులు దేశాభివృద్ధికి వినియోగపడాలని ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసింది. (అప్పట్లో అది రాజకీయమే కావచ్చు) ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల నిధులతో జూదం ఆడడానికి సిద్ధమైంది. ఎంత తేడా, ఎంత పతనం?

నడుస్తున్న సంవత్సరంలో అన్ని రంగాల్లో అభివృద్ధి నేల చూపులు చూస్తోంది. పారిశ్రామికోత్పత్తి సూచి తగ్గుతూ వచ్చింది. వ్యవసాయోత్పత్తి అనుకొన్నంత ఆశాజనకంగా లేదు. ఐటి రంగం పరిస్థితి అంతే. ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం పెరుగుతూ వస్తోంది. నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. ఐటి రంగం నుంచి కంప్యూటర్ కార్మికుల తొలగింపు ప్రారంభమైంది. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల లక్ష్యాన్ని కుదించారు. ఈసంవత్సరం మొదటి ఆరు నెలల్లో గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే – నికర ప్రత్యక్ష పన్ను ఆదాయ శాతం పెరుగుదల 40 నుంచి 32.5కు పడిపోయింది. 2008–09లో లక్ష కోట్ల రూపాయలు రుణం రూపంలో సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించగా, మొదటి ఆరు నెలల్లోనే 96,000 కోట్ల రూపాయల రుణ సేకరణ జరిగిపోయింది. వంట నూనెలదిగుమతులు మరో మూడు, నాలుగు సంవత్సరాల పాటు కొనసాగించాలని అధికారిక అంచనా. విదేశీ నిధుల ధార సన్నంగా పడుతోంది. ఇటీవలి కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ ఆర్థిక సంస్థల పెట్టుబడులు (స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు) కుప్పలు తెప్పలుగా దేశంలో వచ్చిపడ్డాయి. ఈ రాకను ఆధారం చేసుకొని దేశం ఆర్థిక పరిస్థితి భేషుగ్గా వుందని పాలకులు ఊదరగొట్టేశారు. కాని ప్రస్తుత సంక్షోభంతో అతివేగంగా దేశం నుంచి ఈ పెట్టుబడులు తరలి పోతున్నాయి. ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ నెలలకు మధ్యకాలంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 11 వేల కోట్ల రూపాయల విలువగల స్టాకును తరలించుకపోయారు. వ్యాపార ధోరణిలో విదేశాలనుంచి తీసుకున్న రుణాలు (ఇ.సి.బి. 2007 ఏప్రిల్–జూన్ నెలల్లో 17 బిలియన్ డాలర్లయితే ఈ సంవత్సరం అదే కాలంలో 1.6 బిలియన్ డాలర్లకు పడిపోయింది. మన ఆర్థిక పరిస్థితి దిగజారిందనడానికి వేరే నిదర్శనం అక్కర్లేదు. షేర్ మార్కెట్ కుప్పకూలిపోవటంతో షేర్లలో పెట్టుబడులు పెట్టేకన్నా బంగారం కొనుక్కొంటే క్షేమం అని అనుకొని బంగారం కొనటం ప్రారంభించేసరికి, తగ్గుతూ వచ్చిన బంగారం ధర మళ్లీ 15 వేలకు పెరగబోతోంది. ఈ కారు చీకటిలో చమురు ధర బాగా తగ్గటం ఒక్కటే కాంతి రేఖగా కనుపిస్తోంది.

పరిస్థితులు విషమిస్తున్నా, ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందనీ, స్టాక్ మార్కెట్ల పతనంతో బెంబేలుపడవద్దనీ చిదంబరం ఇన్వెస్టర్లకు భరోసా పలుకుతున్నారు. ప్రస్తుత సంవత్సరం ప్రారంభం నుంచి ఆర్థిక రంగంలో దిగజారుతున్న ధోరణులను పైన క్లుప్తంగా వివరించటం జరిగింది. ఎకనమిక్ టైమ్స్ పత్రిక మాజీ సంపాదకుడు ప్రస్తుతం టైమ్స్ ఆఫ్ ఇండియా ఆర్థిక కాలమిస్టు స్వామినాథన్ ఎస్. సంక్లేసారియా అయ్యర్, 'ఈ పరిణామం కలిగించే బాధ విస్తృతమైంది, లోతైంది. ఆదాయం, ఉద్యోగాలు తగ్గుతాయి, కొన్నిసార్లు నాటకీయంగా జరుగుతాయి. చాలా కంపెనీలు, ముఖ్యంగా చిన్న కంపెనీలు దివాలా తీస్తాయి లేదా చతికిలబడతాయి. రవాణా, రెస్టారెంట్లు, వ్యాపారం, రియల్ ఎస్టేట్, ఎగుమతి రంగాలు తిరోగమన పంథాలో పయనిస్తాయి. కంపెనీలకు, వ్యక్తులకు రుణ సౌకర్యం బిగిసిపోతుంది. కార్పొరేట్ లాభాలు నేల చూపు చూస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు తగ్గి, ప్రజలకు అందించాల్సిన సాయం అందజేయ లేకపోతాయి, స్టాక్ మార్కెట్లు ఇంకా పడిపోతాయి; సెన్సెక్స్ 10 వేలకు లోపు పడిపోతుంది' అని అన్నారు. దీనంతటికీ అమెరికాయే కారణం. అయినా మన్మోహన్ సింగ్‌కు బుష్ ఆరాధ్యుడే. వీ

ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి మూలకారణాలు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలలోనే ఉన్నాయంటూ, సంక్షోభాన్ని వివరిస్తున్నారు **డి. నరసింహారెడ్డి**

ప్రపంచ ఆర్థిక సంక్షోభం - ఎందుకు? ఏమిటి?

వాషింగ్టన్ సమ్మతి (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) నేపథ్యం

నియంత్రణలేని మార్కెట్ల ద్వారా నడిచే పెట్టుబడిదారీ విధానం వలయాలు వలయాలుగా పైకీ కిందకీ ఊగిసలాడుతుందనేది అందరికీ తెలిసిన విషయమే. సంక్షోభాల వల్ల పెట్టుబడిదారీ విధానం తనలోని అనుత్పాదక పెట్టుబడులను క్షాళన చేసుకుంటుందని, దానితో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, కాని సంక్షోభం పెద్దదైతే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని మార్క్స్ అన్నాడు. మార్కెట్ వల్ల జరిగే ఈ వైఫల్యాల బలహీనతను అర్థం చేసుకున్న కీన్స్ పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడడానికి ప్రభుత్వ జోక్యం అవసరమని వాదించాడు. ప్రస్తుత సంక్షోభంలో ఆసక్తికరమైన విషయమేమంటే, ఈ సంక్షోభం మార్క్సుకు మాత్రమే కాదు, కీన్స్ ఆలోచనలకు కూడా ఎప్పుడో కాలం చెల్లిందనే మూఢవిశ్వాసం మీద నిర్మాణమైంది. అందువల్లనే విచిత్రంగా ఈ సంక్షోభం అందరినీ మళ్లీ ఒకసారి మార్క్స్ రచనలనూ, కీన్స్ రచనలనూ అధ్యయనం చేయడానికి పురిగొల్పుతోంది. ఇదంతా ఎందుకంటే, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం ఎంత విస్తృతమైనదంటే ప్రతి ఒక్కరూ 1930ల నాటి మహాసంక్షోభాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు. నిజానికి ఈ సంక్షోభపు మూలకారణం ద్రవ్య పెట్టుబడి పెరుగుదల స్వభావంలోనూ, విస్తృతిలోనూ ఉంది. ద్రవ్య పెట్టుబడి విజయగర్వపు పెరుగుదలకు కారణాలు ఎన్నో ఉన్నాయి. మొట్టమొదటిది 1980లలో వాషింగ్టన్ సమ్మతి అనే భావన తలెత్తినప్పటినుంచీ అమెరికా నాయకత్వం లోని అన్ని బడా పెట్టుబడిదారీ శక్తులూ ద్రవ్య పెట్టుబడి ప్రోత్సాహంతో మార్కెట్లను సరళీకరించడమూ, ప్రైవేట్ వ్యాపార సంస్థలను నియంత్రణ లేకుండా విస్తరించడమూ సాగిస్తున్నాయి. 1971లో సౌలభ్యపూరితమైన కరెన్సీలుగా మొదలైనవి అన్ని ఆంక్షలనూ ఎత్తివేయాలనే రీగన్-థాచర్ ప్రయత్నాలతో అదుపు ఆజ్ఞలు లేని ద్రవ్య పెట్టుబడి విస్తరణగా మారింది.

రెండవది, ద్రవ్య పెట్టుబడి స్థిరంగా విస్తరించాలంటే అది తప్పనిసరిగా భయానికి అత్యాశకు మధ్య సమతూకం మీద ఆధారపడాలి. ఆ భయం మార్కెట్ ఎక్కడ విఫలమౌతుందో అనే భయం మాత్రమే కాదు, ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థగా సోషలిజం ఉన్నదనే భయం. అది ఉండడం వల్లనే పెట్టుబడిదారీ దేశాలు ద్రవ్య పెట్టుబడి మీద ఆంక్షలు విధించాయనే భయం. కాని తూర్పు యూరప్‌లోనూ, సోవియట్ యూనియన్‌లోనూ సోషలిజం కూలిపోయిన తరువాత ఆ భయం బలహీనపడింది. ఇక అత్యాశది పైచెయ్యి అయింది. సరళీకరణే అంటే ఆంక్షలు లేకపోవడమే రాజ్యం చేసింది. కౌబాయ్ కాపిటలిజం (ఇష్టారాజ్యంగా సాగే పెట్టుబడిదారీ విధానం) అనే అమెరికన్ నమూనా అందరికీ ఆమోదయోగ్యమైంది.

మూడవది ద్రవ్య పెట్టుబడిని సరళీకరించడం వల్ల డిరైవేటివ్స్ వంటి ప్రయోగాత్మక ద్రవ్య ఉత్పత్తులు వెల్లువెత్తాయి. ప్రస్తుత సంక్షోభానికి కేంద్ర స్థానంలో ఉన్నవి అవే.

పైన వివరించిన నేపథ్యం వెలుగులో ప్రస్తుత ఆర్థిక సంక్షోభపు విభిన్న కోణాలను చర్చిద్దాం. ప్రత్యేకంగా సబ్‌ప్రైం సంక్షోభం అనబడేదాని స్వభావాన్ని, ప్రస్తుత పతనానికి మూలమైన డిరైవేటివ్స్ అనే అదుపాజ్ఞలు లేని ద్రవ్య ప్రయోగాల క్రమాన్ని, ఈ సంక్షోభం అమెరికా, ఇతర దేశాల ద్రవ్య మార్కెట్ల మీదా, ఆర్థిక వ్యవస్థల మీద వేయగల ప్రభావపు వైశాల్యాన్ని పరిశీలిద్దాం.

సబ్‌ప్రైం సంక్షోభం లేదా గృహనిర్మాణాల బుడగ

వికాసం : ఈ సంక్షోభం మొత్తాన్నీ గురించి బారక్ ఒబామా క్లుప్తంగా చెప్పాడు : 'మన ఆర్థిక మార్కెట్ల పతనానికి దారితీసినవి వాల్‌స్ట్రీట్‌లో అదుపులేకుండా సాగిన సట్టా వ్యాపారమూ, అత్యాశా, వాటి పట్ల అలక్ష్యం వహించిన వాషింగ్టన్ పాలకుల వైఖరి'. ఇదంతా గృహరుణాలతో ఎలా మొదలైందో చూద్దాం. సబ్‌ప్రైం (అయోగ్య) రుణాలు అంటే నిర్ణీతమైన ముందస్తు చెల్లింపులు, ఒక ఉద్యోగం, లేదా ఆదాయ స్థాయి వంటి యోగ్యతలు లేని రుణగ్రహీతలకు రుణాలు అందించే పద్ధతి. ఇది ప్రమాదకరమైనదనేది స్పష్టమే. మరి ఇటువంటి అయోగ్య ఖాతాదారులకు బ్యాంకులు ఎందుకు రుణాలిచ్చాయి? ఏ ప్రయోజనాలు కోసం ఇచ్చాయి? ఇదంతా 1980లలో మొదలైంది. గల్ఫ్ దేశాలనుంచి పెట్రో డాలర్లు, జపాన్ నుంచి విదేశీ మారక ద్రవ్య నిలువలు పెద్ద మొత్తంలో అమెరికా వైపు ప్రవహించాయి. అమెరికా జీవనశైలిలో సుప్రసిద్ధమైన అంశం వినియోగదారీ సంస్కృతి. దానికి బ్యాంకులు ఉదారంగా రుణాలిస్తాయి. మొదట ఆ రుణాలు కార్లకోసమూ, ఎలక్ట్రానిక్, గృహోపకరణాల కోసం ఉండేవి. కాని ఎప్పుడయితే విదేశాల నుంచి ద్రవ్య నిలువలు ప్రవహిస్తూ చేతిలో వనరులు పెరిగిపోయాయో బ్యాంకులు ఎవరెవరు అప్పు తీసుకుంటారా, ఎంత పెద్ద మొత్తం అప్పు తీసుకుంటారా అని మొదలెట్టాయి. భారీ మొత్తాల గృహ రుణాలు వాటికి ఎక్కువ రుణాలివ్వడానికీ, ఎక్కువ లాభాలు చేసుకోవడానికీ కలిసొచ్చాయి. 1990ల మధ్యకల్లా ఇళ్ల కోసం రుణాలివ్వడం బ్యాంకులకు చాలా ఆకర్షణీయమైన వ్యాపారంగా మారింది. తక్కువ వడ్డీ రేట్లు మాత్రమే కాక ఇళ్ల ధరలు విపరీతంగా పెరుగుతూ ఉండడం కూడా రుణాలను ప్రోత్సహించింది. ఒకవైపు ఇళ్ల ధరలు పెరిగిపోతూ ఉండగా, వాటిని అరికట్టడానికి వడ్డీ రేట్లను పెంచి ఉండవలసిన అమెరికన్ ప్రభుత్వం తక్కువ వడ్డీ రేట్లకు రుణాలివ్వడాన్ని ప్రోత్సహించింది. బ్యాంకులు ఈ

రుణాలు ఎక్కువ ఇచ్చే పనిని అర్హులైన రుణ గృహీతలకుమాత్రమే కాక అర్హత లేని వారికి కూడా ఇవ్వడం ప్రారంభించాయి. ఆదాయం లేదు, ఉద్యోగం లేదు, ఆస్తులు లేవు అనేదే గృహ రుణాలకు నినాదంగా మారిపోయింది. వీటిని ఆదాయ, ఉద్యోగ, ఆస్తి ధృవీకరణ అవసరం లేని రుణాలుగా పిలవడం మొదలైంది. ఇళ్ల ధరలు పెరుగుతూ ఉన్నాయి గనుక తనఖాలో ఉన్న ఇళ్లే ధరావత్తుగా ఉంటుందనే ఆశ మొదలైంది. ఇటువంటి అనర్హులైన ఖాతాదారులు రుణాలు తిరిగి చెల్లించకపోతే ఇళ్లు స్వాధీనం చేసుకుని ఎక్కువ ధరకు అమ్మి రుణాలు చెల్లగట్టుకో వచ్చుననే తర్కం సాగింది. 1994లో మొత్తం గృహరుణాలలో ఐదు శాతంగా ఉన్న ఈ సబ్‌ప్రైం రుణాలు 2006 నాటికి ఇరవై శాతానికి పెరిగాయి. ఈ రకమైన గృహ రుణాల వల్ల 1994లో అరవై నాలుగు శాతంగా ఉన్న ఇంటి యజమానులు 2004 నాటికి తొంభై శాతం అయ్యారు. అలా 1990లలో గృహ రుణాల వికాసం సాగింది. 1997కు 2006కు మధ్య ఇళ్ల ధరలు 124 శాతం పెరిగాయి. ఆ ధరలను నియంత్రించడానికి అమెరికన్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది.

బుడగ

ఇదంతా బాగానే ఉందా. ఈ గృహరుణాల వికాసం బుడగ ఎప్పుడు మారింది? ఈ బుడగ పేలిపోవడానికి, సబ్‌ప్రైం రుణాలకు ఏమిటి సంబంధం? బ్యాంక్‌లు గృహరుణాలు ఇవ్వడం మొదలుపెట్టాక తొందరలోనే గుర్తించిన విషయమేమంటే వాటి డబ్బు దీర్ఘకాలానికి కట్టుబడిపోతోంది. ఎందుకంటే గృహరుణాలన్నీ దీర్ఘకాలిక రుణాలే. సరిగ్గా ఇక్కడ ప్రవేశించారు ద్రవ్య బ్యాంకింగ్ మోసగాళ్లు. అప్పుడు వాళ్లను మహామేధావులని పిలిచి వాళ్లకు ప్రతిఫలాలు కూడా ఇచ్చారు. ఈ ద్రవ్య బ్యాంక్‌లు అనబడేవి అమెరికాకే ప్రత్యేకమైన ఒకరకమైన బ్యాంక్‌లు. యూరప్‌లోగానీ, చాలా ఇతర దేశాలలో గానీ ద్రవ్య బ్యాంకింగ్ అనేది లేదు. మామూలుగా డిపాజిట్‌లు తీసుకొని అప్పులు ఇచ్చే బ్యాంక్‌లకన్న భిన్నంగా ఈ ద్రవ్య బ్యాంక్‌లు అనబడేవి డిపాజిట్‌లూ తీసుకోవు, అప్పులూ ఇవ్వవు. అవి చేసే పనల్లా 'రుణాల్ని కొనడం', వాటిని 'ఉత్పత్తులు' గా మార్చి ఇతరులకు అమ్మడం. మరో మాటల్లో చెప్పాలంటే బ్యాంక్‌లు ఇచ్చిన గృహరుణాలను కొంత కమిషన్ మీద ఈ ఫైనాన్స్ బ్యాంక్‌లు తమ సొంతం చేసుకుంటాయి. వాటిని సెక్యూరిటీలుగా మారుస్తాయి. వాటిని తనఖా ఆధార సెక్యూరిటీలు (మార్ట్‌గేజ్డ్ బ్యాక్డ్ సెక్యూరిటీస్) లేదా సమాంతర రుణ ఒప్పందాలు (కొల్లాటరలైజ్డ్ డెబ్ట్ ఆబ్లిగేషన్స్) అని పిలుస్తారు. ఈ సెక్యూరిటీలను పెద్ద బ్యాంక్‌లకు గానీ, మదుపు సంస్థలకు గానీ అమ్ముతారు. డిరైవేటివ్‌లుగా పిలవబడే ఈ ఉత్పత్తులే అమెరికన్ గృహ మార్కెట్‌కూ, ప్రపంచ ద్రవ్యలకూ ప్రధాన లంకె. లేమన్ బ్రదర్స్, మెరిల్ లించ్ వంటి ఈ ద్రవ్య బ్యాంక్‌ల అత్యాశ ఎంత పెద్ద ఎత్తున ఉండిందంటే, వాళ్లు తమ ఆస్తులకు ముప్పై రెట్లు ఎక్కువ సొమ్ము చేసుకున్నారు. అంటే వాళ్ల దగ్గర మూడు సెంట్ల ఆస్తి ఉంటే వాళ్లు ఒక డాలర్ డిరైవేటివ్‌లు అమ్ముతూ వచ్చారు. ఇలా ఎక్కువ చేసి చూపిన రంగం దావానలంలా వ్యాపించింది. నిజంగానే ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్, రియల్ ఎస్టేట్ రంగాలకు చెందిన మొదటి అక్షరాలతో కలిపి ఈ రంగాన్ని 'ఫైర్' (మంట) అనే పిలిచారు. ఈ ఫైర్ రంగం మొత్తం ప్రైవేట్ రంగ శ్రామికులలో ఎనిమిది శాతానికి మాత్రమే పనికల్పిస్తూ మొత్తం లాభాలలో 41 శాతం లాభాలు చేసుకున్నాయి.

ఈ విధంగా గృహరుణాలు అతి సులభంగా దక్కడంతో చాలా మంది నివాస గృహాలుగా మాత్రమే గాక భవిష్యత్తులో ఎక్కువ ఆదాయం ఇచ్చే సట్టా వ్యాపారంగా గృహాలు కొనడం మొదలుపెట్టారు. ఉదాహరణకు 2006లో కొన్న ఇళ్లలో 40 శాతం మళ్లీ అమ్మడానికో, లేదా ఖాళీగా ఉంచడానికో కొన్నవే. మరి ఈ బుడగ ఎలా పేలిపోయింది? ఇళ్ల సరఫరా విపరీతంగా పెరిగిపోయే సరికి ఇళ్ల ధరలలో తరుగుదల మొదలైంది. 2007 కల్లా ఇళ్ల ధరలు పడిపోవడం మొదలైంది. అక్టోబర్ 2007 నాటికి మొత్తం సబ్‌ప్రైం రుణాలలో 16 శాతం చేతులెత్తేశారు. 2007లో పదమూడు లక్షల ఇళ్లు రుణాలు చెల్లించలేమని ప్రకటించాయి. దానితో ధరల పతనం ఎంత వేగంగా సాగిందంటే 2008 మార్చి నాటికి ఎనభై ఎనిమిది లక్షల ఇళ్ల ఖరీదు వాటి తనఖా ధరకన్న తక్కువకు పడిపోయింది. ఇలా రుణగ్రహీతలు ఎగ్గొట్టడమో, చెల్లించలేమనడమో చేసే సరికి డిరైవేటివ్‌ల మీద ఆదాయం కూడా ఆవిరైపోయింది. డిరైవేటివ్‌ల విలువ అదృశ్యమైపోయింది. నిన్నటిదాకా గట్టి ఆస్తులుగా కనబడినవి రాత్రికి రాత్రి బూడిద అయిపోయాయి. ఈ డిరైవేటివ్‌లు అన్నిటినీ అమెరికన్ ద్రవ్య బ్యాంకింగ్ వ్యవస్థ తయారు చేసింది. ప్రపంచమంతటా ముఖ్యంగా బ్రిటన్‌లోనీ, యూరప్‌లోనీ బ్యాంక్‌లకు అమ్మింది. ఈ దెబ్బతో అమెరికాలోని ఐదు పెద్ద ద్రవ్య బ్యాంక్‌లు మూతపడిపోయాయి. లేమన్ బ్రదర్స్ అదృశ్యమైంది. బేర్‌స్టేర్న్స్, మెరిల్ లించ్ లను ఇతర బ్యాంకులు కొనడానికి ప్రభుత్వం సాయపడింది. మోర్గన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాక్స్ లను మామూలు బ్యాంక్‌లుగా మార్చేశారు. 1.3 ట్రిలియన్ డాలర్లు గాలిలో కలిసిపోయాయని అంచనా వేస్తున్నారు. (దీన్ని మనకు తెలిసిన పరిభాషలో చెప్పాలంటే రు. 6,50,000 కోట్లు – భారత జాతీయా దాయానికి 18 రెట్లు).

డిరైవేటివ్‌లు – ద్రవ్య ఉత్పాతం

ఈ ద్రవ్య సంక్షోభపు ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థమీద గానీ, ప్రపంచం మీద గానీ ఎలా ఉందో చూడబోయే ముందు కౌబాయ్ కాపిటలిజం అదుపాజ్ఞలు లేని డిరైవేటివ్‌లు కీలకపాత్ర వహించేలా తద్వారా ప్రపంచ వ్యాపిత ద్రవ్య బీభత్సాన్ని సృష్టించేలా ఎలా చేసిందో అర్థం చేసుకోవాలి. డిరైవేటివ్‌ల మీద ఆధారపడి నడిచే ఈ మొత్తం ద్రవ్య మార్కెట్ల కొత్త విధానాన్ని తయారు చేసినవాడూ, ప్రోత్సహించినవాడూ అలాన్ గ్రీన్‌స్పాన్. ఆయన మన రిజర్వ్ బ్యాంక్ వంటి యు.ఎస్. ఫెడరల్ రిజర్వ్ సిస్టం కు 1987 నుంచి 2006 వరకు అతి ఎక్కువ కాలం అసాధారణంగా అధ్యక్షుడుగా ఉన్నాడు. 1990ల మొదటి నుంచే డిరైవేటివ్‌లలో ఉన్న ప్రమాదం గురించి తీవ్రమైన హెచ్చరికలు వస్తూ ఉన్నాయి. జార్జ్‌సోరోస్ వంటి ప్రఖ్యాత భారీ స్టాక్ మార్కెట్ మదుపుదారు తాను డిరైవేటివ్‌లలో పెట్టుబడులు పెట్టనని ఎందుకంటే అవి ఎలా పనిచేస్తాయో అర్థం కాదని అన్నాడు. స్టాక్ మార్కెట్ లాభాలలో అత్యంత విశ్వాసం గల మరో బడామదుపుదారు వారెన్ ఇ బఫెట్ డిరైవేటివ్‌లను 'ద్రవ్య రూపంలోని జన విధ్వంసక ఆయుధాలు' అని అభివర్ణించాడు. కాని ఈ హెచ్చరికలు ఎవరి చెవులకూ సోకలేదు. ముఖ్యంగా ఈ హెచ్చరికలను పట్టించుకోవలసిన అలన్ గ్రీన్‌స్పాన్ వీటిని పెడచెవిన పెట్టాడు. డిరైవేటివ్‌లపై ఆంక్షలు విధించడానికి అమెరికన్ కాంగ్రెస్ చేసిన ప్రతి ప్రయత్నాన్ని గ్రీన్‌స్పాన్ అడ్డుకున్నాడు. 1994లో కాంగ్రెస్ ముందు వాంగ్మూలం ఇస్తూ 'డిరైవేటివ్ మార్కెట్లతో సహా ద్రవ్య మార్కెట్‌లోని ప్రమాదాలను ప్రైవేట్ సంస్థలే నియంత్రిస్తున్నాయి. మార్కెట్ నియంత్రణ కన్న మించి ప్రభుత్వం

చేయగల నియంత్రణ ఏమీలేదు' అన్నాడు గ్రీన్‌స్పాన్. తత్ఫలితంగా డిరైవేటివ్‌లను అదుపు చేసే చట్టం ఉనికిలోకి రాలేదు. మళ్లీ 2000లో డిరైవేటివ్‌లను నియంత్రించే అధికారాన్ని కమాడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్ కమిషన్ అనే సంస్థకు అప్పగించడానికి ప్రయత్నం జరిగినప్పుడు గ్రీన్‌స్పాన్ అడ్డుకున్నాడు. 'మీరెన్ని చట్టాలైనా చేయవచ్చు. ఏ తప్పు జరగదని నేను హామీ ఇవ్వగలను. ఏ ఒప్పు కూడా జరగదు' అన్నాడు. మళ్లీ 2003లో అమెరికన్ సెనేట్ బ్యాంకింగ్ కమిటీ ముందర మాట్లాడుతూ గ్రీన్‌స్పాన్ 'ప్రమాద బాధ్యత తీసుకోవడానికి అవకాశం లేని వాళ్ల చేతిలోనించి ఆ బాధ్యత తీసుకోవడానికి ఆసక్తీ, ఇష్టమూ ఉన్న వారికి బదలాయించే అసాధారణమైన ఉపయోగకరమైన సాధనాలే, డిరైవేటివ్‌లు. వాటిని నియంత్రించడానికి ప్రయత్నించడం పొరపాటు' అన్నాడు. గ్రీన్‌స్పాన్ యవ్వనంలో అలాన్ రాండ్ అనే నవలా రచయిత ప్రభావం ఉండేవాడు. ఆ ప్రభావం ఆయనకి ఏమి నేర్పిందంటే, సామూహిక శక్తి అనే తప్పుడు సాధనం కన్న వ్యక్తిగత స్వార్థం అనే మేలైన సరుకు మంచిదని. గ్రీన్‌స్పాన్ ఆర్థిక సామర్థ్యం గురించి కథలూ, గాథలూ చెబుతారు. ఆయన ద్రవ్య విషయాలలో ఒక మంత్రగాడట. కాని ఇప్పుడాయనను బుడగలమీద బుడగలు తయారు చేసేవాడని పిలుస్తున్నారు.

ఉపశమనం ఎవరి కోసం?

ఈ మొత్తం కథలో అనైతిక భాగం ఏమంటే డిరైవేటివ్‌లు అనే ద్రవ్య బ్యాంకింగ్ మేధోప్రయోగ ఉత్పత్తుల చుట్టూ అల్లబడిన ఆకర్షణీయ గాథలూ, ఆ ఉత్పత్తులు తయారు చేసినందుకు వాళ్లకు వాళ్లే ఇచ్చుకున్న కానుకలు. ఈ ద్రవ్య బ్యాంక్‌ల సి.ఇ.ఒ. లకు 2007లో అందిన వార్షిక వేతనాల ఉదాహరణలు చూడండి. గోల్డ్‌మన్ సాక్స్ – 70.3 మిలియన్ డాలర్లు (రు. 350 కోట్లు), లేమన్ బ్రదర్స్ – 34 మిలియన్ డాలర్లు (రు. 153 కోట్లు), మెరిల్ లించ్ – 17.3 మిలియన్ డాలర్లు (రు. 77 కోట్లు). ఈ ఆదాయం పొందుతున్న వాళ్లు ద్రవ్య డిరైవేటివ్‌లను కనిపెట్టిన ఘరానా మోసగాళ్లు. ఇప్పుడు బుష్ ప్రభుత్వం మొదట ప్రతిపాదించిన 700 మిలియన్ డాలర్ల ఉపశమన పథకం నిజంగా గృహరుణాల భాగోతంలో ఇళ్లు కోల్పోయిన లక్షలాదిమందిని ఆదుకోవడానికి కాదు. ఈ విషపూరితమైన డిరైవేటివ్‌లను సంపాదించుకున్న ద్రవ్యబ్యాంక్‌లనూ, బడా బ్యాంక్‌లనూ ఆదుకోవడానికి. ఈ ఉపశమన పథకం గురించి చర్చించేటప్పుడు అమెరికన్ కాంగ్రెస్‌లో దాన్ని 'రాబందుల నెలవు'గా అభివర్ణించారు. అమెరికా బడా ద్రవ్య సంస్థల బాధ్యతారాహిత్యానికి లక్షలాదిమంది పన్ను చెల్లింపుదార్లు మూల్యం చెల్లించవస్తుందని విమర్శించారు. 'అతికొద్దిమంది వహించిన బాధ్యతారాహిత్యం వల్ల తీసుకొంటున్న అసాధారణ చర్య'గా ఈ ఉపశమన పథకాన్ని డెమోక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి బారక్ ఒబామా అభివర్ణించాడు. నిరుద్యోగులకు ఎక్కువ సౌకర్యాలు విస్తరించడం, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు ప్రజా పథకాలు చేపట్టేందుకు సహాయం అందించడం, తనఖా ఇళ్లలో నివాసాన్ని కొనసాగించేలా కుటుంబాలకు సహాయపడడం, మౌలిక సాధన సంపత్తి రూపొందించడానికి ఎక్కువ పెట్టుబడులు పెట్టడం వంటి ద్రవ్య రూప జోక్యాలద్వారా ప్రభుత్వం ఎక్కువ బాధ్యత నిర్వహించాలని ఎన్నో సూచనలు వచ్చాయి.

ప్రమాదకరమైన డిరైవేటివ్‌ల వ్యాప్తి ఎంత పెద్ద ఎత్తున ఉందంటే ఇవాళ యూరప్‌లో అత్యధిక భాగం ఆ ప్రభావంతో గిలగిలలాడుతోంది. బ్యాంక్‌లకు ఇంకా ఎక్కువ నిధులు అందజేయాలనే గగ్గోలు ప్రపంచమంతా వినిపిస్తోంది. ఫ్రాన్స్ 320 బిలియన్ యూరోల నిధులను ప్రభుత్వ హామీ రుణాలుగా ఇచ్చేందుకు బ్యాంక్‌లకు అందజేసింది. అలాగే ఇబ్బందులలో ఉన్న బ్యాంక్‌లకు అదనపు నిధులు సమకూర్చేందుకు మరొక 40 బిలియన్ యూరోలు ఇచ్చింది. అట్లాగే ఫ్రెంచ్ ప్రభుత్వమే ఫ్రాన్స్ – బెల్జియంలకు చెందిన రుణదాత బ్యాంక్ డెక్సియాకు ఉపశమనం అందజేసింది. బ్రిటిష్ ప్రభుత్వం మూడు బ్యాంక్‌లను పాక్షికంగా జాతీయకరించింది. జర్మనీ ప్రభుత్వం 400 బిలియన్ యూరోల బ్యాంక్ రుణాలకు పూచిపడింది. మరొక 80 బిలియన్ యూరోల నిధులను బ్యాంక్‌లకు అదనంగా అందజేసింది. హాలండ్, బెల్జియం, లగ్జెంబర్గ్‌లు ఫోర్టిస్ బ్యాంక్ మునిగిపోకుండా కాపాడాయి. కాని ఇంత చేసినా ఈ ప్రమాదకర డిరైవేటివ్‌ల బారిన పడిన బ్యాంక్‌లు ఎంత పెద్దవంటే వాటి సాధారణ ఆరోగ్య పరిస్థితిని నిలబెట్టడానికి ఎంత ఉపశమనమైనా సరిపోదు. ఒక్క ఉదాహరణ చెప్పాలంటే, స్విట్జర్లాండ్‌లోని యు.బి.ఎస్. బ్యాంక్ ఆస్తులు ఆ దేశపు జాతీయాదాయం కన్న 4.84 రెట్లు ఎక్కువ. యూరప్‌లో కనీసం ఒక డజనుకన్న ఎక్కువ బ్యాంక్‌ల ఆస్తులు ఆయా దేశాల స్థూల జాతీయోత్పత్తి కన్న ఎక్కువ. దాదాపు ఆ బ్యాంక్‌లన్నీ ప్రమాదకర డిరైవేటివ్‌ల ప్రభావానికి లోనయ్యాయి.

మాంద్యం దిశగా ఆర్థిక సంక్షోభం

ఇప్పుడిక ఎంత మాత్రం సమస్య ఆర్థిక సంస్థలను కాపాడడానికి మాత్రమే సంబంధించినది కాదు. అమెరికాలో ఇప్పటికే మాంద్యం ప్రారంభమైంది. చిల్లర సరుకుల అమ్మకాలు పడిపోతున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గిపోతోంది. పారిశ్రామిక రంగంలో తరుగుదల గత ఇరవై సంవత్సరాలలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉంది. సబ్‌ప్రైం సంక్షోభం వల్ల పది లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. నిరుద్యోగ జనాభా 8 శాతానికి చేరి గత ఇరవై ఐదు సంవత్సరాలలో ఎన్నడూ లేనంత హెచ్చు స్థాయిలో ఉంది. ఈ మాంద్యపు పర్యవసానాలు భారతదేశంతో సహా ప్రపంచాన్నంతా చుట్టుముడుతున్నాయి. భారతదేశంలో ప్రమాదకర డిరైవేటివ్‌లయితే ప్రభావం చూపడం లేదుకాని, అమెరికాలోనూ, యూరప్‌లోనూ వస్తున్న మాంద్యం తప్పకుండా ప్రభావం చూపుతుంది. నిజానికి భారతదేశంలో ప్రభావం పెద్దగా ఉండకపోవడానికి కారణం ఇంతకాలంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ప్రైవేట్ బ్యాంక్‌లలో 74 శాతానికి, బీమా రంగంలో 49 శాతానికి మించకుండా ప్రతిఘటించడం, పెట్టుబడి ఖాతాలో కన్వర్టబిలిటీ రాకుండా అడ్డుకోవడం. అలాగే అసలు ఈ ప్రమాదానికంతా మూలకారణమైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను పునరాలోచించవలసి ఉంది. మొత్తంగా గట్టి నియంత్రణా విధానం, ప్రత్యేకించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ మదుపు సంస్థలు, మైక్రో ఫైనాన్స్‌తో సహా అన్నిరకాల ఆకర్షణీయమైన కొత్త కొత్త ద్రవ్య ఉత్పత్తులు వంటి ద్రవ్య విధానం మీద గట్టి నియంత్రణా విధానం, ఆరోగ్యం, విద్య, మౌలిక సాధనా సంపత్తి రంగాలలో ఎక్కువ ప్రభుత్వ రంగం ఇవాళ తక్షణావసరం. కాని మన అధికారవర్గపు స్వభావాన్ని బట్టి ఇటువంటి అవసరమైన గుణపాఠాలను నేర్చుకుంటారనే నమ్మకం లేదు. ఒకవైపు ప్రైవేట్ ద్రవ్య సంస్థల అక్రమాల గురించి ప్రపంచమంతా మేల్కొంటూ ఉండగా మన కేంద్ర ప్రభుత్వ మంత్రుల బృందం బీమా కంపెనీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 29 శాతం నుంచి 49 శాతానికి పెంచాలని, విదేశాల నుంచి వాణిజ్య రుణాలను మరింత ఎక్కువ తీసుకోవాలని, స్టాక్ మార్కెట్లలో విదేశీ మదుపు సంస్థలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని సిఫారసు చేసింది! వీ

వీక్షణంలో వ్యాపార ప్రకటనల గురించి....

వీక్షణం ప్రతి సంచికలోనూ అచ్చువుతున్న ప్రభుత్వ ప్రకటన గురించి, ఇటీవల అచ్చయిన కొన్ని వ్యాపార ప్రకటనల గురించి కొందరు గౌరవనీయ మిత్రులు తమ అభ్యంతరాలను, సందేహాలను వ్యక్తం చేశారు. అటువంటి అభ్యంతరాలే, సందేహాలే మరికొందరు మిత్రులలో, అభిమానులలో కూడ ఉండవచ్చు.

ఏ పత్రిక అయినా అచ్చువేసే వ్యాపార ప్రకటనలతో ఆ పత్రికకు ఏకీభావం ఉండాలనే నియమమేమీలేదు. ఆ వ్యాపార ప్రకటనలను స్వీకరించడమాలేదా అన్నది పత్రిక ఇష్టాయిష్టాలకు సంబంధించిన అంశం కాదు. పత్రికారంగ ఆర్థిక స్థితికి సంబంధించిన విషయం. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం అమ్మకాల ఆదాయం మీద మాత్రమే ఆధారపడి ఏ పత్రికా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పత్రిక ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మాత్రమే పూరించగలుగుతుంది. అందువల్లనే పత్రికారంగం సాధారణంగా వ్యాపార ప్రకటనల ద్వారా ఆ లోటును పూరించుకోవడం మాత్రమే గాక లాభాలు కూడ చేసుకుంటుంది. వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలకు లాభాల సంగతి అలా ఉంచి, కనీస మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులయినా కావాలి. అందుకోసం కొన్ని వ్యాపార ప్రకటనలనయినా అంగీకరించకతప్పదు.

ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలన్నిటినీ పెద్ద పత్రికలు, పాలకపార్టీ ఆశ్రిత పత్రికలు, పైరవీకారులు కబ్జా చేస్తున్నారని, ఆ ప్రకటనల విధానంలో పారదర్శకత ఉండాలని, చిన్న పత్రికలకు ప్రాధాన్యత ఉండాలని ఎంతో కాలంగా ఆందోళన జరిగిన ఫలితంగా కొన్ని సంవత్సరాల కింద ప్రభుత్వ ప్రకటనలలో చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంతభాగం కేటాయించాలనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. అందువల్ల వీక్షణంకు వస్తున్న ప్రభుత్వ ప్రకటన చిన్న పత్రికల హక్కుగా వస్తున్నదే తప్ప వీక్షణంలో అచ్చయ్యే రచనల మీద ప్రభావం వేయగలిగినది కాదు. నిజానికి ఆ ప్రకటన వల్ల వీక్షణం తన వైఖరిలో ఎప్పుడయినా ఏ మెతకవైఖరినయినా ప్రదర్శించి ఉంటే ఎవరయినా దాన్ని ఎత్తిచూపి సరిదిద్దవచ్చు.

పత్రిక నిర్వహణ కొరకు వ్యాపార ప్రకటనలను స్వీకరించకతప్పని దుస్థితిలో అవి రచనల మీద ప్రభావం వేయకుండా జాగ్రత్త పడడం తప్ప ప్రస్తుతానికి మరేమీ చేయగల అవకాశం లేదు. వ్యాపార ప్రకటనలను ఎంతమాత్రం స్వీకరించబోమని ప్రకటించాలంటే పత్రికకు విస్తారమైన ప్రజాసంఘీభావం ఉండాలి. అది ఆర్థిక స్వావలంబనగా మారగలిగిన స్థితి ఉండాలి. లేకపోతే కొంతకాలం విరాళాలమీదనో, అప్పుల మీదనో నడిపి ఆ తర్వాత పత్రికను ఆపివేయడం మినహా మరోమార్గం లేదు. ఈ అంశాలను పాఠకుల, అభిమానుల దృష్టికి తీసుకురావడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com

సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

బోధన గురించి, జ్ఞాన వినిమయ క్రమంలో సమస్యల గురించి చర్చిస్తూ ఒక మార్క్సిస్ట్ బోధనా సిద్ధాంతాన్ని తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు **బ్రూస్ రాపాపోర్ట్**

బోధన గురించి మార్క్సిస్టు సిద్ధాంతం - ఆచరణ

(గత సంచిక తరువాయి)

తరగతి గదిలో వివరణా పద్ధతులు

మార్క్సిస్టులుగా మన దగ్గర తరగతి గదులలో విద్యార్థులకు వివరించడానికి చాలా ముఖ్యమైన సమాచారం ఉంటుంది. దీన్ని వాళ్లు విమర్శనాత్మకంగా అర్థం చేసుకుని, మన పనికి సరైన మార్గదర్శకత్వం వహించేలా వారి అభిప్రాయాలు చెప్పడానికి వీలుగా మన సమాచారాన్ని వారికి అందజేసే పద్ధతులు ఏమిటనవే ముఖ్యమైన సమస్య. సుదీర్ఘంగా ఉపన్యాసం ఇవ్వడం, ఆ చివరన జవాబులు చెపుతామని ప్రశ్నలు అడగమనడం సరైన పద్ధతి కాదు.

1. ఈ విషయంలో ఒక తరగతి గదిలో అనుసరించడానికి ఉపయోగకరమైన పద్ధతికి నాకు ఒక సూచన ఉంది : తరగతి ప్రారంభించడానికి విద్యార్థుల మధ్య 'కొత్తవీ, మంచివీ' చెప్పుకొమ్మనే ప్రక్రియ మొదలుపెట్టాలి. ఆ తరువాత ఆ రోజు చెప్పబోయే విషయం గురించి క్లుప్తమైన ఉపన్యాసం ఇవ్వాలి. ఆ తరువాత ఆ ఉపన్యాస విషయంలోని ప్రశ్నలమీద కేంద్రీకరిస్తూ 'ఆలోచించూ, వినూ' చర్చలను ఒకరొకరి మధ్యన గానీ, చిన్నబృందాల మధ్య గానీ నడపాలి. ప్రశ్నలూ జవాబులూ, చర్చ తరువాత మొత్తం తరగతిని ఉద్దేశించి మరొక ఉపన్యాసం. ఆ తరువాత బోధకుడు చెప్పిన ప్రశ్నల మీద ఆధారపడి చిన్నబృందాల మధ్య అభ్యాసాలు. ఆ తరువాత ఒక్కొక్క చర్చా బృందమూ తాము ఏమి చేసామో మొత్తం తరగతికి చెప్పడం. ఇదీ మొత్తం ప్రక్రియ. దీని ద్వారా వాస్తవానికి ఉపాధ్యాయులు తక్కువ సమాచారాన్ని మాత్రమే అందించినట్టు కనబడవచ్చు. కాని, విద్యార్థులు నేర్చుకొనేది వాస్తవంగా చాలా ఎక్కువగా ఉంటుంది. విద్యార్థుల మధ్య చర్చలు సాధారణంగా చాలా జవజీవాలతో ఉంటాయి. వాటి మధ్యలో కల్పించుకుని ఉపాధ్యాయులు మరింత సమాచారాన్ని అందజేయవచ్చు.
2. అంతకు ముందు తరగతిలో ఏం జరిగిందో వివరించే నివేదికను ఇచ్చే పని ఇద్దరు ముగ్గురు విద్యార్థులకు అప్పగించాలి. ఆ విద్యార్థులు ఆ నివేదికను నోటిమాటలో ఇవ్వవచ్చు. కానీ, వినే విద్యార్థులందరి దగ్గరా వాళ్లు చెప్పే విషయానికి సంబంధించి లిఖితమైన ప్రతులు ఉండాలి. దీని వల్ల అంతకు ముందరి తరగతిలో జరిగిన చర్చను సమీక్షించే అవకాశం వస్తుంది. కొందరు విద్యార్థులకైనా 'ఉపాధ్యాయులు'గా మారే అవకాశం ఇస్తుంది. లిఖిత ప్రతులు దగ్గర ఉండే సరికి ప్రతి విద్యార్థికి తాను అంతకు ముందరి తరగతిలో చేసిన వ్యాఖ్యలను అచ్చులో చూసే అవకాశం వస్తుంది.

తరగతి గదిలో నిర్ధారణ, తిరస్కరణ

ఇంతకు ముందే చెప్పినట్టు పెట్టుబడిదారీ సమాజంలో ఆత్మ విశ్వాసాన్ని ధ్వంసం చేయడం, మనిషిని తిరస్కరించడం అన్ని చోట్లా తప్పనిసరిగా ఉంటాయి. తద్వారా నిష్క్రియాపరులైన పౌరులను, శ్రద్ధాసక్తులు లేని విద్యార్థులను, ఉపాధ్యాయులను తయారు చేయడానికి ప్రయత్నం జరుగుతుంది. సాంప్రదాయికంగా మనిషిలో ఆత్మ విశ్వాసం పెంపొందించే పనీ, వ్యక్తిత్వ వికాసం సాధించే పనీ, వైద్యులకూ, సలహాదారులకూ, సామాజిక బృందాలకూ అప్పగించడం జరుగుతుంది. కాని మనం గనుక విప్లవాత్మక భావాలనూ, ఆచరణనూ సమర్థంగా అందజేయాలనుకుంటే మనం ఈ సమస్యలను మన తరగతి గదులలోనే పరిష్కరించలవలసి ఉంటుందనుకుంటాను.

1. విద్యార్థులలో ఉండే శక్తిని, బలాన్ని ఎత్తిచూపడానికి దొరికిన ఏ అవకాశాన్ని వదులుకోకండి. అటువంటి అవకాశాలను పెంచుకొండి. దీని అర్థం, వారి తప్పులను విస్మరించమని కాదు. కానీ, వారి శక్తి గురించీ, విజయం గురించీ ఎక్కువ శ్రద్ధ పెట్టడం, దాన్ని గుర్తించడం, దాన్ని మెచ్చుకోవడం జరగాలి. దాని అర్థం ఏమంటే, వారిమీద ప్రోత్సాహకరమైన విమర్శ పెట్టడం. ఒక విద్యార్థి ఎదగడానికి ఉన్న అవకాశం మీద మన సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించడం. ఉపాధ్యాయులుగా మనకిది చాలా కష్టమౌతుంది. ఎందుకంటే మనకు నేర్పిందంతా ఇందుకు వ్యతిరేకంగా ప్రవర్తించమనే. అంటే, విద్యార్థిలో పొరపాటూ తప్పూ వైఫల్యం ఎక్కడ కనబడతుందా వెతకమని విమర్శించమని మనకు నేర్పుతున్నారు. ఇక్కడ మనం ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. ప్రస్తుతం చైనాలో (ఈ వ్యాసం రాసినది 1974లో) విమర్శ చాలా కటువుగా ఉంటోంది. కాని, అక్కడ మొత్తం సమాజమే ప్రతి మనిషి ఆత్మవిశ్వాసాన్ని పెంచేదిగా ఉన్నప్పుడు ఎంత తీవ్రమైన విమర్శ అయినా వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని ధ్వంసం చేయజాలదు. కనుక విమర్శ

గురించి అక్కడ వర్తించే సూత్రం ఇక్కడ వర్తించదు. పెట్టుబడిదారీ సమాజంలో కటువైన విమర్శ అంటే ఒక మనిషి నిస్సహాయతను, నిరాశను ఇబ్బడిముబ్బడిగా పెంచే విమర్శే. ఇక్కడ అప్రస్తుతం కాదనుకుంటే మరొక్క విషయం కూడా చెప్పాలి. ఈ అవగాహన మన ఉద్యమాలలో 'విమర్శా ఆత్మవిమర్శా' ప్రక్రియకు కూడా వర్తిస్తుంది.

2. విద్యార్థులను వారిని తిరస్కరించే సమస్య గురించి స్వేచ్ఛగా చర్చించుకోనివ్వాలి. అలా చర్చించే క్రమంలో వారిని వారు ఎలా నిర్ధారించుకుంటారో పక్కవారిని ఎలా నిర్ధారిస్తారో ప్రోత్సహించాలి. అందులో భాగంగా ఒక్కొక్కరినీ కూర్చోబెట్టి తమ గురించి తమకు నచ్చిన విషయం ఏమిటో, తాము సాధించిన విజయం ఏమిటో, తాము సామాజికీకరణ పొందిన క్రమంలో గురైన అణచివేతకు వ్యతిరేకంగా తాము ఏమి సాధించారో చెప్పుకోమనాలి. ఉదాహరణకు అబలలుగా గుర్తించబడిన స్త్రీలు తమ సాహసాన్ని ప్రదర్శించడం. బలహీనులుగా చూడబడిన కార్మికులు తమ యజమానుల మెడలు వంచడం వంటివి చర్చించాలి. విద్యార్థులందరినీ తాము ఒక సమస్యను ఎదుర్కోవడంలో ఎంత స్పష్టంగా శక్తివంతంగా ప్రవర్తించాలో చెప్పుకోమ్మని తద్వారా వాళ్లు ఒకరి ఆత్మవిశ్వాసాన్ని మరొకరు గుర్తించేలా చేయాలి.
3. ఒకరిని ఒకరు అడ్డుకొట్టడాన్ని, తిరస్కరించడాన్ని కచ్చితంగా ఆపేయండి. ఇలా చేయడమంటే, మొత్తాన్ని అదుపులో పెట్టుకొని తమ ఇష్టారాజ్యంగా నడపదలచుకున్న వాళ్ల చేతుల్లోకి పోవడమే అని చూపెట్టండి. ఆత్మవిమర్శ అనేది చాలా ముఖ్యమైనది. అత్యవసరంగా పాటించవలసినది. కాని ఒకరిని మరొకరు దిగలాగడమనేది శత్రువుకే ఉపయోగపడుతుంది. విమర్శకు గురైన వ్యక్తుల తిరస్కరణకు వారి నిష్క్రియాపరత్వానికి దారితీస్తుంది.
4. ఒక మనిషి లోలోపలి సొంత విలువ ఏమిటో రూపు కట్టించడానికి ఉపాధ్యాయులు తామే ఉదాహరణ ప్రాయంగా నిలవాలి. ఇది చాలా ముఖ్యమైనదే. కాని, చాలా కష్టమైనది కూడా. ఎందుకంటే ఆ ఉపాధ్యాయులు కూడా మనుషులను తిరస్కరించే సమాజంలో పుట్టి పెరిగినవారే. అందువల్ల విద్యార్థుల స్థాయికి తమను తాము తెచ్చుకోవడానికి తమను తాము నిందించుకుంటూ తక్కువ చేసుకుంటూ మాట్లాడుతుంటారు.
5. సమాజంలో తిరస్కరణ అనేదానికి మౌలిక పునాది వర్గం రీత్యా, జాతిరీత్యా, స్త్రీపురుష భేదం రీత్యా జరిగిన వర్గీకరణలోనే ఉందని విశ్లేషించి చర్చించండి. పెట్టుబడిదారీ విధానంలో అంతర్గతంగా వర్గీకరణ ప్రక్రియల వల్ల తాము ఏ స్థాయిలో తారుమారు చేయబడుతున్నామో విద్యార్థులు అర్థం చేసుకోవడానికి ఇది చాలా ముఖ్యం.
6. తిరస్కరణ క్రమంలో ఒక భాగమైన నిరాశావాదాన్ని గట్టిగా ఎదిరించండి. అలా ఎదిరించడానికి పెట్టుబడిదారీ విధానంలోని భయానకమైన విషయాలను చూపడం కాకుండా దానిలోని వైరుధ్యాలను చూపండి. దానిమీద పోరాడుతున్న ప్రజల ఉదాహరణలు చూపండి. వ్యవస్థను ప్రతిఘటించడానికీ, మార్చడానికీ తాము ఏయే మార్గాలు అనుసరించే అవకాశం ఉన్నదో విద్యార్థులు ఒకరితో ఒకరు లేదా చిన్న బృందాలలో చర్చించుకునే అవకాశం కల్పించండి.

ముఖ్యమైన విషయాలు, బాధాకరమైన సంబంధాలు

ఇంతకుముందే చెప్పినట్టు ఈ ప్రపంచం పట్ల మన అవగాహనలో కొన్ని మనం భావోద్వేగపూరితంగా విధ్వంసమైన అనుభవాల నుంచి ఏర్పడినది. అందువల్ల వాటిని మార్చడం చాలా కష్టమవుతుంది. చాలాసార్లు మార్క్సిస్ట్ ఉపాధ్యాయుడు ఈ అవగాహన వరకూ వచ్చి ఆగిపోతారు. ఈ అవగాహనలో తప్పుడు చైతన్యం అనేది భాగం. ఈ తప్పుడు చైతన్యాన్ని విద్యార్థులకు వివరించడానికి వారికి నిరాశతో, భయంతో సంబంధం ఉన్న భావాలు ఎలా కలిగాయో విశ్లేషించుకునే, చర్చించుకునే అవకాశం ఇవ్వాలి. ఆయా విద్యార్థులను బట్టి, ఆయా చర్చాంశాలను బట్టీ, ఈ చర్చ ఎలా జరుపుతామనే పద్ధతి మారవచ్చు. ఉదాహరణకు పురుషాధిపత్యం, స్త్రీల పట్ల వ్యతిరేకత అనే భావాన్ని చర్చించడానికి నేను ఈ కింది అభ్యాసాల ద్వారా ప్రయోజనం పొందాను.

1. పురుషాధిపత్యం వల్ల స్త్రీ వ్యతిరేక భావాల వల్ల అణచివేతకు గురైన ఒక అనుభవాన్ని, దానివల్ల పొందిన ఆగ్రహాన్నీ, బాధనూ వివరించే అవకాశాన్ని విద్యార్థులకు ఒకరొకరిమధ్య గానీ, ఒక చిన్న 'ఆలోచించూ, వినూ' బృందంలో గాని ఇవ్వండి. ఒక్కొక్కరి జంటలు తయారు చేసినప్పుడు ఆ జంటలో ఒక పురుషున్నీ, ఒక స్త్రీనీ ఉంచితే ఇద్దరికీ సమాచారం పంచుకోవడానికి సమాన సమయం ఇచ్చి, మధ్యలో జోక్యాల్ని అరికడితే ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.
2. విభిన్న పాత్రలని పోషించే సందర్భాలను కలిపించండి. విద్యార్థులు అణచివేతకు గురైన భావాలను అనుభవాలను వ్యక్తీకరించడానికి, ఆ సమస్యల నుంచి బయటబడే ప్రత్యామ్నాయ మార్గాల గురించి మాట్లాడడానికి అవకాశం కల్పించండి.
3. ఇటువంటి చర్చ చేసేటప్పుడు ఒక్కోసారి విశ్లేషణ అపరాధ భావనలోకి ఏమీ చేయలేమనే నిరాశలోకి దిగజారుతుంది. ఈ నిరాశావాదాన్ని ఎదిరించడానికి మనదేశంలోనూ, ఇతర దేశాలలోనూ విప్లవకారులు ఇటువంటి స్థితులను మార్చడానికి చేసిన కృషి గురించి అధ్యయనం చేయండి. చర్చించండి. ఆ మార్పుల ప్రభావాలు వివరించండి. పురుషాధిపత్య అవరోధాలు ఉన్నప్పటికీ పురుషాధిపత్యాన్ని ఎదిరించే పద్ధతిలో ప్రవర్తించడం ఎట్లాగో చూపే ప్రవర్తనను ప్రదర్శించమని ఒకరితో ఒకరు గానీ, బృందాల మధ్య గానీ ఒక అభ్యాసం చేయించండి.

సంబద్ధత

తరగతి గదిలో చెప్పే విషయం విద్యార్థులకు అవసరమైనదిగా, సంబద్ధమైనదిగా కనబడేటట్టుగా చేయడానికి కేవలం సమకాలీన ఉదాహరణలు మాత్రమే ఇస్తే సరిపోదు. సంబద్ధతకు నేను రెండు అర్థాలు చెప్పుకుంటాను. అవీ;

1. జనానికి ఉన్న అనుభవాలను నిర్ధారిస్తూ వాళ్లు వాటిని మనం చెప్పే దానితో పోల్చి చూసుకుంటూ ఆ అనుభవాల నేపథ్యంతో

మనం చెప్పే విషయం గురించీ మాట్లాడగలిగితే అది సంబద్ధమైనదన్న మాట.

2. వాస్తవ సామాజిక ఆచరణ నుంచే సరైన భావాలు వస్తాయి అని మనం చూపగలిగితే అది సంబద్ధమైనదన్న మాట. ఈ అంశాన్ని వివరించడానికి మన విద్యార్థులతో ఒక ప్రయోగం చేయవచ్చు. వారి భావాలలో ప్రధానమైన మార్పు తెచ్చిన సామాజిక రాజకీయ ఘటనలను ఆ మార్పును విశ్లేషించమని మనం విద్యార్థులను అడగవచ్చు. మన విద్యార్థుల వర్గ పునాది పట్ల నిశితమైన శ్రద్ధ వహించడం కూడా సంబద్ధతలో భాగమే. కాని, వేరువేరు వర్గాల ప్రజలు వేరువేరు చదువులకు మాత్రమే అర్హులు అనే పెట్టుబడిదారీ భావజాలన్ని బట్టి మన పాఠ్యాంశాలను మార్చాలని నేను అనడం లేదు. మన విద్యార్థుల వాస్తవ జీవితాలలోని సంఘటనలకూ సంబంధించే ఉదాహరణలను ఎంచుకోవడం మీద మనం శ్రద్ధ పెట్టాలి. మన విద్యార్థులు ఏ సామాజిక వర్గ పునాది నుంచి వస్తున్నారో అదే పునాదికి చెందిన ప్రజాపోరాటాల విజయాల గురించి చెప్పడం మీద కూడా మనం శ్రద్ధ పెట్టాలి.

ఈ సంవిధానాల్ని ఉపయోగించడం

ఈ సంవిధానాల్ని ఉపయోగించడానికి ప్రయత్నించేటప్పుడు మనకు తప్పనిసరిగా ప్రతిఘటన ఎదురవుతుంది. నిరాశ వ్యాపిస్తుంది. తరగతి గది అంటే మానవీయమైన ప్రోత్సాహకరమైన భావోద్వేగభరితమైన సంబంధం ఉండకూడని స్థలం అని ఎంతో కాలంగా ఉన్న భావజాలం వల్ల మన పద్ధతులకు ప్రతిఘటన రావడం సహజమే. ఈ కొత్త బోధనా పద్ధతులతో ప్రయోగం చేసేటప్పుడు ఉపాధ్యాయులకూ విద్యార్థులకూ కూడా కలిగే అసౌకర్యాన్ని తొలగించడానికి రెండు కీలక అంశాలు ఉన్నాయి. మొట్టమొదటిదీ మనం ఈ పద్ధతులు ఎందుకు ఉపయోగిస్తున్నామో వివరించడం ముఖ్యం. నేను సాధారణంగా నా తరగతులను మొదలు పెట్టేటప్పుడు పెట్టుబడిదారీ విధానంలో పాఠశాలలోని సమస్యల గురించి నేర్చుకోవడంలో ఉన్న ఇబ్బందుల గురించి చెపుతాను. తమ సొంత పాఠశాల అనుభవాలలోని పెట్టుబడిదారీ సమాజ అనుభవంలోని బాధమయ సందర్భాలను గుర్తు తెచ్చుకోవడానికి వారికి తోడ్పడతాను. పెట్టుబడిదారీ విధానం నిష్క్రియాపరమైన రొడ్డకొట్టుడు భావాల శ్రమ శక్తిని తయారు చేసేందుకే ఇటువంటి బోధనా పద్ధతిని కనిపెట్టిందని వాళ్లకు వివరిస్తాను. ఈ సమస్యలతో వ్యవహరించేటందుకే ఈ కొత్త పద్ధతులను కనిపెట్టడం జరిగిందని చెప్పి ఆ పద్ధతులను ఉపయోగిస్తాను.

రెండోది, విద్యార్థులు వారికిచ్చిన అభ్యాసాలను నమ్మకంతోనూ సరదాగానూ చేసేలా చూడడం చాలా ముఖ్యం. నేను కొత్త బోధనా పద్ధతులను వాడలేకపోతున్నానంటే ప్రధాన కారణం విద్యార్థులు ఏమి చేయగలరో, ఏమి చేయలేరో నా వాస్తవిక అంచనా కాదు. నిజమైన కారణం నా సొంత దురభిప్రాయాలు మాత్రమే. చాలా సందర్భాలలో నేను గుర్తించినదేమంటే నేను నా విద్యార్థులను 'ఊరికే ప్రయత్నించి చూడండి' అంటే చాలు. మొదట ఇబ్బంది పడినప్పటికీ వాళ్లు అవి ప్రయత్నించారు. ప్రయత్నించడం మాత్రమే కాదు సంతోషంగా అవి నేర్చుకున్నారు.

తరగతి గది – ఉద్యమం : ఒక వ్యాఖ్య

నిజమైన శిక్షణను ఆలోచనను అడ్డుకునే పెట్టుబడిదారీ వ్యవస్థలో విప్లవాత్మక భావాలను, విశ్లేషణను బోధించడంలో వైరుధ్యం ఉన్న మాట నిజమే. కాని, అన్ని వైరుధ్యాల లాగానే ఈ వైరుధ్యం కూడా విప్లవాత్మక మార్పుకి అవకాశం కల్పిస్తుంది. ఆశ్చర్యకరంగా ఇక్కడ నేను ఉపాధ్యాయుల కోసం చర్చించిన భావాలలో కొన్ని మొత్తంగా వామపక్ష ఉద్యమానికి కూడా ఉపయోగపడతాయి. తరగతి గదిలోని సమస్యలు అని నేను చర్చించినవి మన సమావేశాలలోనూ, చర్చలలోనూ, సభలలోనూ కూడా ఉన్నవే. ఆ సమస్యలు నిరాశవాద రూపంలో, అవతలి వాళ్లను పడదోసే విమర్శ రూపంలో, ఆత్మనింద రూపంలో, చాలామంది నిజంగా ఇబ్బంది పడి పక్కకు తప్పుకొనేలా జరిగే 'బహిరంగ చర్చ'ల రూపంలో మన మధ్య ఉన్నాయి. ఈ సమస్య మనను భయపెట్టకూడదు. మన ఉద్యమంలో ఉన్న వైరుధ్యాలతో వ్యవహరించడానికి నిర్దిష్టమైన పద్ధతులను మనం కనిపెట్టవలసి ఉంది.

❋ ❋ ❋ ❋ ❋

గత కొద్ది సంవత్సరాలుగా మాలో కొందరం మన రాజకీయాల గురించీ, ఒక విప్లవోద్యమాన్ని నిర్మించే మన ప్రయత్నాల గురించీ లోతైన పునరాలోచన సాగిస్తున్నాం. ఆ సామూహిక కృషిలో పోరాటంలో నా భాగస్వామ్యం వల్లనే ఈ వ్యాసంలో చర్చించిన విషయాల గురించి నా మనసులో లోతైన ప్రశ్నలు తలెత్తాయి. ఈ వ్యాసాన్ని నేను కొన్ని సంవత్సరాల కింద రాశాను. ఈ వ్యాసంలో కొన్ని మౌలికమైన, శక్తివంతమైన అంశాలు ఉన్నాయి. కాని దాని నిండా ప్రపంచం గురించి ఒక పెటీబూర్జువా అవకాశవాద విశ్లేషణ నిండి ఉంది. 'బోధనా శిక్షణా పరిస్థితులలో ఉన్న సామాజిక సందర్భం గురించి నిశితమైన శ్రద్ధ వహించాలి' అని ఆ వ్యాసం సరైన అవగాహననే ప్రకటించింది. వాస్తవంలో పెట్టుబడిదారీ సమాజంలో అన్ని అంశాలలోని మౌలిక లక్షణం సామాజిక ఉత్పత్తిని పాలకవర్గాల ప్రయోజనాల కోసం దోపిడి చేయడం ఎట్లా అనేదే. ఈ లక్షణమే పాఠశాలలకు వర్తిస్తుంది. అమెరికన్ సమాజంలో ఈ సందర్భాన్ని సామ్రాజ్యవాదం అంటాం. ఈ సందర్భం ప్రపంచాన్ని పీడక, పీడిత జాతులుగా విభజించింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని శ్వేత పీడక జాతి దేశంలో నల్లజాతీయులనూ, చికాగోలనూ, మెక్సికన్లనూ పీడిత జాతులుగా బయట మూడో ప్రపంచ దేశాలన్నిటినీ పీడిత జాతులుగా దోపిడీ చేస్తోంది. ఈ వ్యవస్థను పెంచి పోషించడంలో కొనసాగించడంలో పాఠశాలలు కీలక పాత్ర వహిస్తాయి. కాని నా వ్యాసంలో ఈ విషయాన్ని నేను చర్చించలేదు. దీన్ని అంచనా కట్టి దీంతో ఎలా పోరాడాలో చెప్పలేదు. అక్కడ దృష్టి అంతా పరాయీకరణ సామాజిక పాత్రలు, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వగైరా మానసిక సమస్యలమీదే ఉండింది. ఇది కేవలం రోగలక్షణాలు మాత్రమే. వాటికి లోతైన సామాజిక సమస్యలు ఉన్నాయి. వాటిమీద చర్చ సాగలేదు. తెల్లజాతిలో పేదవారి గురించి, మూడో ప్రపంచ దేశాల నుంచి, స్త్రీల నుంచి వచ్చిన విద్యార్థుల మీద ప్రత్యేకంగా సాగే అణచివేత గురించి పాఠశాలలో కూడా తెల్లవారికీ పురుషులకూ దక్కే పెంపొందే అవకాశాల గురించి చర్చించనే లేదు.

గ్రామ, పట్టణ, జిల్లా స్థాయిలలోనే కాక మొత్తంగా పాలనా వ్యవస్థను మెరుగుపర్చడానికి అవసరమైన కొన్ని సూచనలు చేస్తున్నారు **అనిసెట్టి శాయికుమార్**

ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య వ్యవస్థలు

అందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం, పరిశుభ్రమైన తాగునీరు, కనీస జీవనానికి అవసరమైన నిత్యావసర వస్తువుల అందుబాటు, పనిచేసుకుని తనకు తాను స్వయం పోషకంగా మనగలిగే వ్యవస్థకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఈ ధ్యేయాలు సాధించి, సరైన పాలన అందించడానికి, రాజ్యాంగ పరిధిలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు కృషి చేయాలి. అందుకై వివిధ రంగాలలో కింది మార్పులు తెచ్చేందుకు వాగ్దానం చేసి; అమలుకై పాటుపడాలి.

పాలనా వ్యవస్థ : భారత రాజ్యాంగపు ప్రదేశిక స్ఫూర్తితో ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక దృక్పథపు తాత్వికతతో, మహాత్మాగాంధీ, కార్ల్‌మార్క్సులు కలలు గన్న అత్యున్నత వికేంద్రీకరణతో పాలన వ్యవస్థ నిర్మాణ, నిర్వహణలను సమూలంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది.

గ్రామీణ పాలనా వ్యవస్థ : నేటికీ నూటికి డెబ్బైమంది ప్రజానీకం గ్రామాల్లో నివసిస్తున్నారు. అన్నిటికీ గ్రామాలే కీలకం. గ్రామాలే పునాది. ముందుగా ఇప్పుడున్న చిన్న చిన్న తండాలు, కుగ్రామాలు, చిన్న పంచాయతీలూ రద్దు చేయాలి. కనీసం పదివేల జనాభా అవసరాలకు తగ్గకుండా నూతన మెగా గ్రామాలు (చిన్న పట్నాలని కూడా అనవచ్చు) నిర్మించాలి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముప్పై శాతం విస్తరణకు అనుకూలంగా ఉండేట్లు తీర్చిదిద్దాలి. లక్షల కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వానికి ఇదంత పెద్దపనికాదు. లబ్దిదారుల సహకారం, భాగస్వామ్యం తోడవటం వల్ల ఒక పంచవర్ష ప్రణాళికతో దీన్ని పూర్తిగా సుసాధ్యం చేయవచ్చు. అనారోగ్యం, సౌకర్యాలలేమి, స్థానిక విషయాలు స్థానికంగా పరిష్కరించు కునేలా సౌలభ్యంలేక కునారిల్లుతున్న గ్రామీణ వ్యవస్థకు సంబంధించి అన్ని సమస్యలకూ ఇది ఒక చక్కని పరిష్కారం. ఈ మెగా గ్రామాల్లో ఒక జూనియర్ కాలేజి వరకూ విద్యావ్యవస్థ, ఒక సినిమా హాలు, ఒక వైద్యశాల, మార్కెట్, లైబ్రరీ, రవాణా సౌకర్యం, రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, రక్షిత మంచినీటి సరఫరా వంటివి ఏర్పరచి నిర్వహించటం చాలా సులభమౌతుంది. ఇలాంటి గ్రామాల్లో ప్రధాన రోడ్లు, కూడళ్లలో మడిగెలు, షాపులు నిర్మించి, స్థానిక ప్రభుత్వమే అద్దెకు ఇచ్చి, నిర్వహించే విధానం ఏర్పడాలి. స్థానిక ప్రభుత్వ ఆదాయంగా ఉండే వీటి అద్దెలను బంగారం రేట్లతో అనుసంధానించి ప్రతి రెండేళ్లకూ అద్దెను సమీక్షించి సవరించే విధానం అమలు పరచాలి. ఈ పద్ధతి అమలు పరచటం ద్వారా ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉన్న 27,223 గ్రామాల సంఖ్యను ఐదు వేల లోపు ఉండేట్లుగా కుదించవచ్చు.

నా వ్యాసంలో మరొక్క ప్రధాన సమస్య 'క్రమాన్ని ఆధిపత్యంలో పెట్టడం'. 'మన దగ్గర ఒక మంచి అభిప్రాయం ఉండి దాన్ని ఇతరులకు చేర్చడమెట్లా తెలియకపోతే ఎలా' అనే ప్రశ్నను బాగానే చర్చించాను. కాని, నేను అడగని ప్రశ్న ఏమంటే 'నీ దగ్గర మంచి బోధనా పద్ధతులు ఉండి అసలు చెప్పడానికి మంచి విషయం లేకపోతే ఎలా'. బోధనా, ప్రచార నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవే. ఆ అంశంలో నా వ్యాసం కొంత దోహద పడుతుంది కూడా. కాని అమెరికాలోనూ, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ కొనసాగుతున్న రివిజనిజం అవకాశవాదాల చరిత్రను చూసినప్పుడు వస్తువూ, సరైన దృక్పథం అనేవి ప్రాథమికమైనవి కాని, రూపం, బోధనా పద్ధతి అంత ప్రాథమికమైనవి కావు.

చివరిగా, సరైన భావాలు ఆకాశం నుంచి ఊడిపడవు అని మావో అంటాడు. అట్లాగే చెడ్డ భావాలు కూడా ఆకాశం నుంచి ఊడిపడవు. బోధనా క్రమం మీద ఎక్కువ శ్రద్ధ కూడా ఆకాశం నుంచి ఊడిపడదు. నా వ్యాసంలోనూ, నా బోధనలోనూ బోధనాపద్ధతుల మీద ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపడం వల్ల ఏం జరిగిందంటే నేను కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను విస్మరించాను. అవి నా వర్గానికి, నా జాతికి పురుషుడుగా నాకు దొరికిన అవకాశాల గురించిన ప్రశ్నలు. అధికారం ముఖ్యంగా పురుషాధికారం, శ్వేతజాతి అధికారం అనేదే సామ్రాజ్యవాదపు మౌలిక పునాది. తెల్లవాళ్లం, పురుషులం అయిన మనం బోధకులుగా కూడా అధికారాన్ని పొందడం అంటే అర్థం ఏమిటి. మనం అనుభవిస్తున్న వేరువేరు రూపాల అధికారాలు మన బోధన మీద మనం సమర్థించే రాజకీయ ఉద్యమాల మీద ఎటువంటి ప్రభావం చూపుతాయి. ఇదంతా మన విద్యార్థుల మీద ఎటువంటి ప్రభావం చూపుతుంది. ప్రపంచంలో మన నిర్దిష్ట ఆచరణే మనం నేర్చుకోవడానికి భూమిక అనుకుంటే నిజంగా కమ్యూనిస్టు ఆచరణ సృష్టించే నిర్దేశించే ఒక పార్టీని నిర్మించడంలో మన శక్తియుక్తులు ఎలా ఖర్చు పెట్టగలం. మంచి బోధనా పద్ధతుల గురించిన అన్వేషణలో నేను విస్మరించిన కొన్ని ప్రశ్నలు ఇవి.

ఇటువంటి విషయాల మీద పోరాటంలో నాతోపాటు మీరు కలిసి నడుస్తారని ఆశిస్తాను.

(మంత్లీ రివ్యూ ప్రెస్ ప్రచురించిన స్టడీస్ ఇన్ సోషలిస్ట్ పెడగాగీ (1978) పుస్తకం నుంచి) వీ

ప్రస్తుతం గ్రామీణ పాలనపై వివిధ స్థాయిల ప్రభుత్వ ఉద్యోగుల పెత్తనాన్ని తీసివేసి, వివిధ విధులు సమీక్షించి, ఆ స్థానిక ప్రజా ప్రతినిధులకే వీలైనన్ని ఎక్కువ విధులు అప్పగించాలి. సాధారణ పరిస్థితుల్లో వారు సలహా పూర్వక విధుల్ని, స్థానిక జిల్లా, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అప్పజెప్పిన కార్యాలయ విధులకే పరిమితం కావాలి. మెగా గ్రామ కార్యాలయంలో రెవెన్యూ కార్యదర్శి, పంచాయితీ కార్యదర్శుల పోస్టులు రద్దు చేసి, గ్రామ కార్యాలయం ఒకటే ఏర్పాటు చేసి, అన్ని విధులూ ఆ కార్యాలయం ద్వారానే జరపాలి.

ఆచరణలో అమలు కాకుండా పోతున్న గ్రామ సభకు జవ జీవాలు కల్పించి, పటిష్టం చేయాలి. గ్రామంలోని వయోజనులందరూ సభ్యులుగా ఉండే ఈ గ్రామ సభ అధికారాలు మరింతగా విస్తృత పరచటం ద్వారా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ స్ఫూర్తిని ప్రజల్లో పెంచాలి. ఈ గ్రామ సభలకు స్థానిక ప్రజా ప్రతినిధులను పదవీచ్యుతుల్ని చేయగల (రికాల్) అధికారం ఉండాలి. గ్రామ సర్పంచ్ తదితరుల్ని తొలగించే అధికారాలు కలెక్టర్‌ల నుంచి తొలగించి, ఈ రికాల్ విధానం ద్వారా గ్రామ సభకు అప్పగించాలి. గ్రామాల్లో భూస్వామ్య పెత్తందారీ విధానపు ఒత్తిడిల నుంచీ తట్టుకుని ప్రజాభీష్టం స్వేచ్ఛగా వ్యక్తం కావాలంటే అవసరమైనప్పుడు రహస్య ఓటింగ్ విధానాన్ని కూడా అనుసరించాలి. గ్రామీణ వ్యవస్థల అధికార, విధుల పరిధి విస్తృత పరిచే క్రమంలో వివిధ దేశాల వ్యవస్థల్ని పరిశీలించి, కౌంటీబరీ వంటి వాటిలోని మంచి పాలనా విధానాలు కూడా అనువర్తింపజేసుకోవచ్చు.

గ్రామాల్లో న్యాయ పంచాయితీ వ్యవస్థను సక్రమంగా అమలు పరిచేందుకు సరయిన ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలి. 'న్యాయం' అనే మాటకు తాత్వికంగా 'సమ్మతి' అని అర్థం. గ్రామాలలోని న్యాయ పంచాయితీ వ్యవస్థలు ఇరుపక్షాల మధ్య సంప్రదింపులు జరిపి, వారిరువురూ అంగీకరించే తీర్పులు చెప్పే విధానానికి ప్రాధాన్యం ఇవ్వటం ద్వారా న్యాయ స్థానాలపై ఒత్తిడి తగ్గించవచ్చు. న్యాయ పంచాయితీల ఏర్పాటును నొక్కి చెప్పిన లా కమిషన్ సిఫార్సులు, బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫార్సులు కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

పట్టణాలు : చిన్న మధ్య తరగతి పట్నాలుగా ఉన్న ఆవాస ప్రాంతాలను కూడా మెగా గ్రామ పరిపాలన వ్యవస్థలానే పునఃనిర్మించాలి. వీటికి, మెగా గ్రామాలకు ఇచ్చే నిధులు, గ్రాంటులు తదితర ఆర్థిక వనరుల కేటాయింపులో స్థానికంగా రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేసే పన్నుల ప్రాతిపదికను తగ్గించి, జనాభా నిష్పత్తి, ప్రత్యేక అవసరాలను ముఖ్యమైనవిగా పరిగణించాలి. ప్రస్తుతం దాదాపు 25 శాతం ప్రజలు పట్టణాల్లో నివసిస్తున్నారు. ఈ 25 శాతం మంది ప్రజల్లో కూడా నూటికి పదిమంది వ్యవసాయం పైనే ఆధారపడి పనిచేస్తున్నారు. మిగతా 90 శాతం పట్టణ ప్రజలు సేవారంగం (సర్వీస్ సెక్టార్)లోనే పని చేస్తున్నారు. పెద్ద వ్యాపారాలూ, పరిశ్రమలూ పట్టణాల్లోనే కేంద్రీకృతమౌతున్నాయి. సర్వీస్ సెక్టార్‌లో దోపిడీకి అవకాశమున్న అన్ని అంశాలపై ప్రభుత్వ నియంత్రణతో బాటు, ప్రజానియంత్రణ కూడా ఉండేట్లు చూడాలి.

జిల్లా పాలన : పట్టణ, మెగా గ్రామీణ వ్యవస్థ పునాదిగా, పైన రాష్ట్ర ప్రభుత్వం ఉండేట్లుగానూ, మధ్యలో జిల్లాపాలనా యంత్రాంగం ఉండేట్లుగానూ మూడంచెల పాలనా విధానం మాత్రమే ఉండేట్లు చూడాలి. జిల్లా పాలనా యంత్రాంగం అటు రాష్ట్ర ప్రభుత్వానికి, ఇటు పట్టణ లేదా మెగా గ్రామ పాలనకూ అనుసంధానకర్తగా, సమన్వయకర్తగా ఉండాలి. వీటి పాలన పర్యవేక్షణ, నిధులు సూత్రాల ప్రకారం పంపిణీ చేయటం, రోడ్లు, తదితర విషయాల నిర్వహణ వంటి నిర్దిష్ట కర్తవ్యాలకు జిల్లా పాలనా యంత్రాంగం ఉండాలి. జిల్లాపాలనా యంత్రాంగాన్ని జనాభా ప్రాతిపదిక పై పట్టణాలు, మెగా గ్రామాలనుంచీ మాత్రమే ఎన్నుకోవాలి. జిల్లా కలెక్టర్ల అధికారాలకు గణనీయంగా కోత పెట్టి, ప్రజాప్రతినిధులకు ఎక్కువ బాధ్యత కట్టబెట్టి, కలెక్టర్లు పర్యవేక్షణకు పరిమితం కావాలి.

రాష్ట్ర పాలన : రాష్ట్ర పాలన వికేంద్రీకరణ ప్రాతిపదికన ఏర్పర్చాలి. అన్ని స్థాయిలలో వికేంద్రీకరణ ప్రాతిపదికన అధికారాలు, విధుల పునర్వ్యవస్థీకరణ జరగాలి. ప్రతీ రాష్ట్రానికీ తమకు సంబంధించిన ఆదాయంలో సింహభాగం ఆ రాష్ట్రానికే చెందేట్లుగా నిబంధనలను మార్చాలి. భారత రాజ్యాంగంలో వివరించిన కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాను సవరించి, ఎక్కువ అంశాలపై రాష్ట్రాలకే అధికారం ఉండేట్లుగా పునర్విభజించాలి. రక్షణ, కరెన్సీ, రైల్వే, తంతితపాలా, కేంద్రపోలీస్, ఇంటెలిజెన్స్, అంతర్జాతీయ వ్యవహారాలు, విదేశీయానం, ఇమిగ్రేషన్ వంటి ప్రధాన అంశాలు మినహా మిగిలిన అన్ని విషయాలపై, గనులు, ప్రకృతి వనరులపై రాష్ట్రాలకే నిర్ణయాధికారం ఉండాలి. గవర్నర్‌ల వ్యవస్థను రద్దుపరచాలి. ఇందుకై అవసరమైన మేరకు విధి విధానాలను అనుసరించి రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. ముఖ్యంగా గనులు, చమురు, గ్యాస్, అడవుల వంటి వాటి విషయాలలో రాష్ట్రాలకే అధికారం ఉండే పద్ధతి రావాలి. స్థానికులకు స్థానిక వనరులు, సహజ సంపదపై హక్కులు లేకుండా చేస్తున్న విధానం నశించాలి. గనులు ఖనిజాల ఆదాయంతో రాష్ట్రం సుసంపన్నమౌతుంది. కృష్ణాగోదావరి బేసిన్‌లోని సహజ వాయువు (గ్యాస్) నిక్షేపాలతో వంటకు కారు చౌకగా గ్యాస్ అందటమే కాక, విద్యుదుత్పాదన ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పారిశ్రామిక ఆర్థిక రంగాల్లో ఉచ్ఛ స్థితికి చేరుకొనే వీలుంది.

చట్ట సభలు : చట్ట సభల నియోజకవర్గాలను కుదించి, ఎక్కువ నియోజక వర్గాలు ఉండేట్లు చేయాలి. ధనబలంతో, ఆశ్రిత పక్షపాత ధోరణుల ఫలితంగానో గుండాగిరితోనో ఎమ్మెల్యేలుగా నెగ్గి, స్వపక్షానికి మద్దతుగా చేతులెత్తడానికో, అపుడప్పుడూ సభా సమావేశాలకు హాజరై గురక పెట్టడానికో, అధికారబలంతో డబ్బునూ, తద్వారా మందినీ సమకూర్చుకుని, పార్టీ పేరు చెప్పుకునో, అధినాయకత్వం పేరు చెప్పుకునో నోట్లు చల్లి ఓట్లు పండించుకునే ప్రజాప్రతినిధులు చట్ట సభల్లో ప్రవేశించే విధానాన్ని నిర్మూలించే చర్యలు చేపట్టాలి. నియోజక వర్గాల పరిధిని తక్కువ చేయడం ద్వారా, ప్రజలతో ప్రత్యక్ష సంబంధ బాంధవ్యాలున్న సిసలైన ప్రజా సేవకులు ఎన్నికవడానికి ఈ విధానం దోహదం చేస్తుంది. ఇందుకై రాజ్యాంగ సవరణకు ప్రతిపాదించాలి. ప్రతీ ఎమ్మెల్యే విధిగా ఒక ప్రణాళిక ప్రకారం తన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ప్రజా సమావేశాలు నిర్వహించి, వారి సాధక బాధకాల పరిష్కారానికై కృషి చేయాలి. ప్రజా ప్రతినిధులు ఎప్పుడూ ప్రజల ఆశయాలకు, ఆకాంక్షలకూ దర్పణంగా, వారికి నిజమైన ప్రజా ప్రతినిధిగా మసలుకునేందుకు అవసరమైన నిబంధనలు ఏర్పరచాలి. క్రూరులుగా, భూస్వామ్య అహంకారం ప్రదర్శించిన వారిగా, నేరస్తులుగా,

అవినీతిపరమైన వ్యాపారులతో అక్రమంగా కోట్లకు పడగలెత్తిన వారుగా ఉన్నవారు ఎన్నికలలో పోటీ చేసేందుకు అంగీకరించకూడదు. ఎన్నికలలో ధన ప్రాబల్యాన్ని అరికట్టే చర్యలు తీసుకోవాలి.

న్యాయ వ్యవస్థ : ప్రజల్ని పాలితులుగా పరిగణించే స్వభావం ఉన్న బ్రిటిష్ కాలం నాటి న్యాయవ్యవస్థ కొద్ది మార్పులతో మౌలిక తత్వం మారకుండా ఉన్న విధానం స్థానే ప్రజాపక్షంగా ఉండే న్యాయవ్యవస్థను మానవీయ కోణంతో లౌకిక పునాదులపై పునర్నిర్మించాల్సి ఉంది. ఇప్పుడున్న విధానాలను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. అన్ని స్థాయిలలో (గ్రామీణ న్యాయ పంచాయితీలతో సహా) మధ్య వర్తిత్వాన్ని నెరిపే వ్యవస్థలను ప్రజా పక్షంగా ఏర్పాటు చేయాలి. కోర్టులో వ్యాజ్యం వేసే ముందుగానే ఖచ్చితంగా ఆర్బిట్రేషన్, సంప్రదింపులు జరపటం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం చేయడానికి అవకాశం ఇవ్వాలి. అప్పటికీ న్యాయం జరగలేదని బాధితులు భావిస్తేనే న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి అవకాశం కల్పించాలి. ఇలాంటి మధ్యవర్తిత్వం వహించే ప్రజా పక్ష వ్యవస్థల వద్దకు వచ్చి తమ వాదన వినిపించడానికి నిరాకరించే వారిపై చర్యలు తీసుకునేందుకు న్యాయ వ్యవస్థకు అధికారం కల్పించాలి. న్యాయం పొందటానికి, వ్యాజ్యాలు వేయడానికీ ఎంత డబ్బయినా ఖర్చు పెట్టే విధానం వల్ల సామాన్యులు బలవుతున్నారు. కాబట్టి న్యాయ పాలనలో ధన ప్రాబల్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలి. ఐతే తగిన కారణాలున్న అత్యవసరమైన, ప్రాధాన్యమున్న విషయాలు, రాజ్యాంగ పరిహారపు హక్కులు, రిట్‌ల వంటి వాటికి మధ్యవర్తిత్వ వ్యవస్థల నుంచీ మినహాయింపు ఉండాలి.

ఇక న్యాయ వ్యవస్థ అధీనంలో ఉండే జైళ్ళ శాఖ పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఖైదీల పట్ల క్రూరంగా వ్యవహరించే బ్రిటిష్ కాలం నాటి పద్ధతే ఇంకా సాగుతోంది. శిక్ష ఉద్దేశం నేరస్తునిలో పరివర్తన తెచ్చేదిగా ఉండాల్సింది పోయి; జైలు శిక్ష అనుభవిస్తున్న వాళ్ళు మరింత కరుడుగట్టిన నేరస్తుల్లా తయారవడానికి దోహదం చేసే పద్ధతిలో కొనసాగుతోంది. చిన్న చిన్న నేరాలకు జైలు పాలై అనంతరం జైళ్ళలోనే ముఠాలు ఏర్పాటు చేసుకుని, మరిన్ని నేరాలకు పాల్పడుతోన్న వైనం వార్తాపత్రికల ద్వారా చూస్తూనే ఉన్నాం. అంతే కాకుండా జైళ్ళలో రాజకీయ అధికార ప్రాపకం, ధనబలం ఉన్న ఖైదీలకు సాధారణ ఖైదీలకు మధ్య దారుణమైన వివక్ష కొనసాగుతున్నది. ఈ విషయాల్లోని చెడు విధానాల్ని సంస్కరించేదుకుగానూ జైళ్ళ మాన్యువల్‌ను పూర్తిగా మార్చటంతోబాటు తీవ్రమైన చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. ఖైదీల్లో శాస్త్రీయమైన, చట్టపరమైన అవగాహన పెంచటం, అహింసాతత్వం, ఉన్నత మానవసంబంధాల స్ఫూర్తి నింపేందుకు వీలయిన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా వేలాదిమంది చట్టం పట్ల అవగాహన లేని నిరుపేద ముద్దాయిలు దీర్ఘకాలం ఖైదీలుగా మగ్గుతున్నారు. డబ్బు పెట్టి సమర్థులైన న్యాయవాదుల్ని పెట్టుకోగలిగిన సత్తా ఉన్నవారు హత్యానేరం వంటి తీవ్ర నేరాలు చేసినా, బెయిలుపై బయట తిరుగుతూ ఏళ్ల తరబడి కేసులు వాయిదా వేయించుకుని కేసులనుంచే బయటపడుతున్నారు. ఆచరణలో న్యాయం కొనుక్కునే విధంగా తయారయింది. ఆర్నెల్లో, మూణ్నెల్లో శిక్షపడే అవకాశమున్న నేరాల కింద ఖైదు చేయబడ్డ ముద్దాయిలు ఎందరో ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోతోంది. అవిద్య, అజ్ఞానం, పేదరికంతో మగ్గే గ్రామీణ బడుగు, బలహీనవర్గాల వారే ఇలా బలవుతున్నారు. ఇలాంటి వారందరినీ బేషరతుగా విడుదల చేయాలి.

అవిద్య, అజ్ఞానం, పేదరికం, కులపరమైన వెనుకబాటు తనం పరస్పర ఆశ్రయాలుగా ఉన్నవర్తమాన అసమాన సమాజంలో ఎందరో నిరుపేదలు న్యాయస్థానం తలుపులు తట్టలేకపోతున్నా కొత్తగా న్యాయవాద వృత్తిని చేపట్టిన వారికి ఇలాంటి కేసులు అప్పగించి వారికి ప్రభుత్వమే ఫీజులు చెల్లించడం జరగాలి. వారంతట వారు తెల్లకార్డులున్న నిరుపేదల కేసుల్ని కూడా ప్రభుత్వ చెల్లింపు పద్ధతిలో స్వచ్ఛందంగా యువ న్యాయవాదులు చేపట్టే వెసులుబాటు కల్పించాలి. ఈ పద్ధతి ప్రవేశపెట్టడం వలన నిరుపేదలకూ, నిర్దోషులకూ, అసహాయులకూ, స్త్రీలకూ ఎంతో మేలు జరగడమే కాక, సమర్థులైన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకుని సమర్థత పెంపు చేసుకోవడానికి దోహద పడుతుంది.

ఉద్యోగ బృందపాలన : ప్రభుత్వానికి కళ్ళు, కాళ్ళు, చేతులు కూడా ప్రభుత్వ ఉద్యోగులే. అన్ని రంగాలలో ప్రభుత్వ ప్రమేయాన్ని ఉపసంహరించాలనీ, ప్రభుత్వ పోలీసు విధులకే పరిమితం కావాలనే ప్రస్తుత విధానాన్ని సమూలంగా తీసివేయాలి. అన్ని రంగాలలో ప్రభుత్వ ప్రమేయం పెంచాలి. బాధ్యతాయుత ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడాలి. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతినిధులకు, ప్రజలకు బాధ్యత వహించే విధానం రావాలి. అందుకోసం ప్రభుత్వ ఉద్యోగులలో పెరుగుతోన్న పరాయీకరణ ధోరణుల్ని నిర్మూలించి, వారు పనిని ప్రేమించే సంస్కృతిని పెంచే చర్యలు చేపట్టాలి. వారిని కార్యోన్ముఖులను చేసేందుకు ఒక ఉద్యమంలా కార్యక్రమాలు చేపట్టాలి. కార్యాలయ విధానాలు, నిర్వహణ, తదితర అంశాలలో ఆ ఉద్యోగులందరి సలహాలూ, సూచనలూ తీసుకొని వారిలో భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయడం ద్వారా కూడా నిజాయితీని పెంపొందించి, మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నించవచ్చు. అలానే లంచాల విషయంలో కూడా ఈ సమావేశాల్లో చర్చకు పెట్టి, ప్రజలు లబ్ధిదారుల్ని కూడా సమావేశాలకు హాజరై మాట్లాడే అవకాశం ఇవ్వడం వలన కూడా మరింత నిజాయితీగా ఉద్యోగులు సేవలందించడానికి ఉపయోగపడుతుంది.

ప్రభుత్వ స్థాయిలోనూ, శాసనసభ స్థాయిలోనూ చట్టబద్ధంగా అమలవుతున్న అవినీతిని గురించి ప్రతి రెండు నెలలకు ఒక సారయినా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలి. మంత్రులు, ఐఎఎస్ అధికారుల నుంచి, కింది స్థాయి గెజిటెడ్ అధికారి వరకూ ఆస్తులు స్వచ్ఛందంగా వెల్లడి చేయాలి.

ఉద్యోగులు బాధ్యతా రాహిత్యంగా, అందినకాడికి దండుకునే వారిగా తయారవడానికి 'కాంట్రాక్ట్' 'ఔట్‌సోర్సింగ్' ఉద్యోగ వ్యవస్థీకరణం, ఆర్థికలేమి, అసహాయతలను, పనిలేకపోవడాన్ని (నిరుద్యోగాన్ని) అలుసుగా తీసుకుని వీలయినంత చౌకగా శ్రమ దోపిడీ చేయాలనుకునే భూస్వామ్య, పెత్తందారీ పద్ధతిని ప్రభుత్వమే అవలంబించటం విడనాడాలి. ప్రభుత్వం ఆదర్శవంతమైన యజమానిగా, ఉద్యోగి కుటుంబం కనీస అవసరాలు తీర్చుకుని గౌరవంగా బ్రతకడానికి వీలైనంత జీతం ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

మన రాష్ట్రంలో 2004సంవత్సరంలో అక్టోబరు ఒకటో తేదీ తర్వాత రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన వారికి పెన్షన్ సౌకర్యం

ఎత్తివేశారు. జీవనానికి భద్రత నిస్తూ, విశ్రాంత (రిటైర్డ్) జీవితం శ్రమలేకుండా గడపడానికి అవకాశమిచ్చే పెన్షన్ తీసివేయటం వల్ల అనేక అనర్థాలు దాపురించే ప్రమాదం ఉంది. విశ్రాంత జీవితానికి భద్రతలేని పరిస్థితుల్లో; సర్వీసులో ఉండగానే దొరికినంత వరకూ దోచుకుని, దాచుకుందామనే తత్వానికి ప్రోత్సాహం దొరికి, లంచగొండి తనం ప్రబలుతుంది. అందువల్ల నూతన పెన్షన్ విధానం ఎత్తివేసి, ప్రభుత్వమే పెన్షన్ ఫండ్ ఏర్పర్చాలి. ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న ఉద్యోగులకు వారికి అభిరుచి ఉన్న రంగాల్లో వారి సేవలు డిమాండ్ చేయవచ్చు. రాజకీయాలకు అతీతంగా ఎయిడ్స్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, యాచకవృత్తి నిర్మూలన తదితర పనులకు వారిని ఉపయోగించుకోవచ్చు.

ప్రభుత్వ కార్పొరేషన్‌లను అమ్ముకోవటం ఒక పద్ధతిగా కొనసాగుతోంది. ముందుగా కార్పొరేటీకరించి, కొన్నాళ్ళు సాగాక బడా కార్పొరేట్, బహుళ జాతి సంస్థలకు అమ్ముకోవడానికి తయారౌతున్నారు. వైద్యశాఖ, నీటి పారుదల శాఖ, ఆర్ అండ్ బి తదితర శాఖల్లో ఈ పద్ధతి ఇప్పటికే మొదలైంది. ఇక దశాబ్ద కాలానికి పైగా లక్షల సంఖ్యలో ఖాళీ అయిన ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఉన్నవారికి పదోన్నతులు ఇస్తూ (వీరు ఆందోళన చేయకుండా) తీవ్ర పనిభారం పెంచుతున్నారు. వీటన్నిటినీ పర్యవేక్షించడానికి ఏకంగా రాష్ట్ర సచివాలయంలోనే బ్రిటిష్ ప్రభుత్వ సంస్థ 'డి.ఎఫ్.ఐ.డి.'ని ఏర్పర్చి వారి నిర్ణయాలకు అనుగుణంగా అడుగులకు మడుగులొత్తుతున్నారు.

వైద్యరంగం : ప్రజలందరి ఆరోగ్యానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. బ్రిటన్ వంటి సంపన్న దేశాలలోని 'సామాజిక వైద్య బీమా' వంటివి మన పరిస్థితులకు అనుగుణంగా రూపొందించి అమలు చేయాలి.

'ఆరోగ్యశ్రీ' వంటి మోసపూరిత విధానాల ద్వారా ప్రజా ధనాన్ని కార్పొరేట్ వైద్యశాలలకు అప్పనంగా దోచి పెట్టే విధానం రద్దు కావాలి. కావాలనే ప్రభుత్వ వైద్యశాలల్లో అధునాతన పరికరాలు కొనకుండా, ఉన్న వాటిని ఉపయోగించే సాంకేతిక నిపుణుల్ని నియమించకుండా అవి తుప్పు పట్టిపోతున్నా అలాగే వదిలేస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాలల్లో డాక్టర్లకు, సాంకేతిక నిపుణులకు ఇచ్చే కంటే తక్కువ జీతాలతో ప్రభుత్వ వైద్యులను పనిచేయమంటున్నారు. వారందరికీ కనీసం జీతాలను రెట్టింపు చేసి, ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలి. తద్వారా సమర్థులు ప్రభుత్వ వైద్యశాలను విడిచి పెట్టడాన్ని అరికట్టవచ్చు. వైద్యులు, సిబ్బందిపై సామాజిక నిఘా నియంత్రణలు ఉండే వ్యవస్థ ఏర్పాటు చేయాలి. వీరందరిలో సేవా దృక్పథం సేవానిరతి, చిత్తశుద్ధి, సామాజిక దృక్పథంతో రోగిని పనిముట్టుగా కాకుండా మానవులుగా చూసే దృక్పథం పెరిగేందుకు నిరంతర కార్యక్రమాలుండాలి. వైద్య ఆరోగ్య రంగాన్ని మూడు ముక్కలుగా విభజించి, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఎ.పి.ఐ.వి.పి.) వంటి వాటి ద్వారా కార్పొరేటీకరణ చేసే విధానం రద్దు చేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలి.

ప్రభుత్వం సమీకృత వైద్య విధానం అవలంబించాలి. వైద్య విధానం చుట్టూ రోగి కాకుండా రోగి చుట్టూ వైద్య విధానాలు ఉండే పద్ధతి రావాలి. ఒక్కో రుగ్మతకూ ఒక్కో వైద్య విధానం; లేదా ఒకేసారి ఒకటికి మించిన వైద్య విధానాల ద్వారా రోగికి స్వస్థత కల్పించేట్లుండాలి. అలోపతితో బాటు ఆక్యుపంచర్, ఆయుర్వేద, యునాని, హోమియో వంటివి కూడా ఒకేచోట అందుబాటులో ఉంచాలి. దేశీయ వైద్య విధానపద్ధతులు, మూలికలు, మందులపై శాస్త్రీయ పరిశోధనను చేపట్టాలి. నకిలీమందుల్ని అరికట్టాలి. అందుకు ఔషధ నియంత్రణ మండలిలో ఖాళీలు భర్తీ చేసి నకిలీలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

విద్యారంగం : ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. విద్య స్వభావంలో మౌలిక మార్పు రావాలి. స్కూలు విద్య వరకూ విద్యార్థిని ఉన్నత మానవునిగా, సృజన శీలిగా, మానవ ప్రేమికునిగా, పర్యావరణ రక్షకునిగా తీర్చిదిద్దేట్లు ఉండాలి. పదవతరగతి వరకూ డిటెన్షన్ విధానాన్ని, పబ్లిక్ పరీక్షల విధానాన్ని ఎత్తివేయాలి. ప్రాథమిక విద్య ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యలాంటి వారు సూచించినట్లు ఇంటి భాషలోనే జరగాలి. ఇంటర్మీడియెట్, ఆపై స్థాయి విద్యలు ప్రణాళికాబద్ధమైన కోర్సులుగా ఏర్పరచాలి. ప్రధానంగా స్థానిక సామాజిక ప్రజావసరాలను సక్రమంగా అంచనా వేసి, ఇక్కడి ఉపాధికి అనువుగానూ, దేశవిదేశాలలోగల ఉద్యోగ, ఉపాధి అవకాశాలనూ సక్రమంగా అంచనావేసి, అందుకు అనుగుణమైన కోర్సులు ప్రారంభించాలి. పాఠ్యాంశాలు ఎంచుకున్న రంగంలో మక్కువతో సృజనాత్మకతను పెంచుకునే విధంగా ఉండాలి. అన్ని స్థాయిలలోనూ విద్యార్థులకు అన్ని రకాలయిన ఉపకరణాలూ అందుబాటులో ఉంచాలి. కంప్యూటర్ లాబోరేటరీ సౌకర్యాలు సక్రమంగా ఉండాలి.

విద్యా వ్యాపారం నశించాలి. ధనంతో కొనుక్కోగలిగిన వారికీ ఉన్నత విద్యగా ఉన్న ప్రస్తుత విద్యా వ్యవస్థను నిర్మూలించి, ఆసక్తి అనురక్తి ఉన్న కోర్సులలో కుల, మత, వర్గ భేదం లేకుండా అందరికీ విద్యావకాశం కల్పించటం ప్రభుత్వ ప్రాథమిక విధిగా ఉండాలి. వీ

అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యను నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సే ఉంది. ఇప్పటికే 19 జిల్లాల నుంచి మాకు ఈ సమాచారం అందుతోంది. ఇంకా **వరంగల్, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కడప** జిల్లాల నుంచి అసహజంగా చనిపోతున్న వారి సమాచారం అందాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని పంపిస్తాం.

ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి : **వై. రామచంద్రం** (సర్క్యులేషన్ మేనేజర్) ఫోన్ నెం. 9949391028

– సంపాదకులు

గుడుంబా, సారాలకు బానిసలై పర్యవసానంగా అతలాకుతలమవుతున్న కుటుంబాలు, యువత జీవితాల గురించి వ్యాఖ్యానిస్తున్నారు **గుగులోతు దేవోజి, ఆర్. యాకూబ్**

పచ్చని పల్లెలో గుడుంబా గుబులు

మన రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలు, పట్టణానికి దగ్గరగా ఉన్న ప్రాంతాల పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు నేడు మద్యానికి, నాటుసారాకు బానిసలుగా తయారై తమ జీవితాన్ని విధ్వంసం చేసుకుంటున్నారు. నేడు రాష్ట్రంలో ప్రతి గ్రామంలో మంచినీరు దొరకక పోవచ్చునేమోగాని నాటు సారా (గుడుంబా) దొరకదంటే ఆశ్చర్యపోవాలి. పల్లెల్లో యువకులను, నడి వయస్కులను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య నాటు సారాయి (గుడుంబా). గ్రామీణ ప్రాంతాలలో పెద్ద రైతు దగ్గర పనిచేసే జీతగాని దగ్గర నుండి సొంత భూమిలో వ్యవసాయం చేసుకొనే చిన్న రైతులు, లీజు కూలీల వరకు తమ అలసటను మరిచిపోవడం కోసం గుడుంబాను సేవిస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నా, యుక్త వయస్సులోనే నడివయస్కునిగా అవతారమెత్తుతున్నా, తన సంపాదనంతా గుడుంబా పైన ఖర్చు అయిపోతున్నా సామాన్య గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ గుడుంబా మహమ్మారిని వదల్లేక పోతున్నారు.

ఈ గుడుంబా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో అనేక కుటుంబాల్లో విషాదచ్ఛాయలను నింపింది. గ్రామీణ ప్రాంతాల్లో పనులు దొరకక మద్యంకు బానిసలై శవాలుగా మిగులుతున్నారు. కల్తీసారాయి తాగి ప్రాణాలర్పిస్తున్నారు. గుడుంబా వలన నష్టపోయిన కుటుంబాల స్త్రీల వ్యథలను చూస్తే విషాదమే మిగిలిపోతుంది. ఏజన్సీ లంబాడ తండాలల్లో ఉపాధి అవకాశాలు దొరకక, ఈ గుడుంబా తయారీని ఒక కుటీర పరిశ్రమగా ఎంచుకుంటున్నారు. ఏజన్సీలో ఇప్ప పువ్వును సేకరించి గుడుంబా తయారు చేస్తే, మైదాన ప్రాంతాలలో బెల్లం పానకంతో తయారు చేస్తున్నారు. ఒక్కొక్కమారు ఈ తయారీలో కల్తీ చేసినపుడు అనారోగ్యం పాలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతేగాక పట్టణానికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ప్యాకెట్ల ద్వారా రవాణా జరుగుతోంది. ఈ ప్యాకెట్ల సారాయిలో కూడా ఎక్కువగా కల్తీ జరుగుతోంది. అందువలన ప్రజలు తమ ప్రాణాలను కోల్పోవలసిన దుస్థితి నెలకుంటోంది.

అనేక ప్రభుత్వాలు మద్యపాన నిషేధాన్ని విధించడానికి ప్రయత్నిస్తున్నా ఆచరణ సాధ్యం కావడం లేదు. మన ప్రభుత్వానికి దీని నుండే అత్యధికంగా పన్నులు వస్తు ఉండటం కారణం కావచ్చును లేదా గతంలో సారా, మద్యం కాంట్రాక్టర్లుగా పనిచేసినవారే నేడు రాజకీయనాయకులుగా చెలామణి అవుతుండటం కూడా కావచ్చు.

పేద, మధ్యతరగతి ప్రజలు నాటు సారాకు అలవాటు పడితే పట్టణాలలో యువత పాశ్చాత్య సంస్కృతి, గౌరవం పేరుతో బ్రాంది, విస్కీలు, విదేశీ సరుకులకు బానిసలుగా తయారవుతున్నారు. విద్యార్థి దశలో ఈ పరిస్థితులు ఎక్కువవుతున్నాయి. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు చదివే విద్యార్థులు పార్టీల పేరుతోనూ, వీకెండ్‌లు పేరుతో మద్యంనూ సేవించడం జరుగుతోంది. ఇదేమని ప్రశ్నిస్తే ఫ్యాషన్, సంస్కృతి అంటూ గొప్పలు చెపుతున్నారు. మొత్తానికి గ్రామం నుండి పట్టణం వరకు వస్తువులు, సరుకు మారాయే తప్పా మద్యం బానిసత్వం ఒక్కటే మరలేదు. ఈ మహమ్మారిని పారదోలాలంటే కింది స్థాయి నుండి మౌలికమైన మార్పులను తీసుకురావాల్సి ఉంది.

గుడుంబా తయారీ కేంద్రాలుగా పల్లెసీమలు

రాష్ట్రంలో ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, ఆలయాలకు గుడుంబా అమ్మే కేంద్రాలు దూరంలో ఉండేవి. కాని నేడు బడి, గుడి ప్రార్థనా స్థలం అని తేడా లేకుండా పక్కనే అమ్ముతున్నారు. మందుప్రియులు మద్యం, గుడుంబాను సేవించి ఆలయాలకూ, విద్యాలయాలకూ ప్రవేశిస్తున్నారు. నిత్యం కళ్లెదుటే మద్యం, గుడుంబా విరివిగా లభిస్తుండడంతో పిల్లలు కూడా మద్యపానానికి, గుడుంబాకు అలవాటు పడ్డం మొదలు పెడుతున్నారు. ప్రభుత్వాలు మద్యపాన నిషేధం విధించినా తాగేవారిని కట్టడి చేయలేకపోయాయి. అనధికార మద్యం అందుబాటులో లేకుండా చేయడంతో గుడుంబా వైపు జనం మొగ్గుచూపడం మొదలెట్టారు. దీంతో ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సారా, గుడుంబాను తాగేవారు రోజువారీ కూలీలు. అయితే సంపాదించిన కూలీలో సగానికి పైగా ఈ సారాకు పెడుతున్నారు. కొంతమంది ఈ గుడుంబాకు బానిసై ఏ పనికీ వెళ్లకుండా భార్యా పిల్లలు సంపాదించిన డబ్బును బలవంతంగా తీసుకొని, అవసరం అయితే చితకబాదైనా తాగుతున్నారు. అర్థాంతరంగా చనిపోయి భార్యా పిల్లలను అనాథలను చేస్తున్నారు. అధిక మంది యువతులు చిన్న వయస్సులోనే వితంతువులుగా మారుతున్నారు. భర్తను కోల్పోయిన వితంతువులు కుటుంబాన్ని, పిల్లలను పోషించలేక, బడికి పంపించలేక పొట్ట చేతపట్టుకొని పట్టణాలకు వలసగా వచ్చి, వారి పిల్లలను బాల కార్మికులుగా మారుస్తున్నారు. ఏ పని దొరకక కొంతమంది వ్యభిచారులుగా మారుతున్నారు. ఈ మద్యం, గుడుంబా ఎయిడ్స్ వ్యాప్తి చెందడానికి కూడా పరోక్ష కారణంగా నిలుస్తోంది.

గుడుంబా యువతపై ప్రభావం

గుడుంబా (మద్యం) తాగి వ్యక్తులు చనిపోని గ్రామమంటూ లేదు. ప్రతి గ్రామం, తండాలలో గుడుంబాకు బానిసై ప్రాణాలు పోగొట్టుకున్న వారు ఎంతోమంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఒక కుటీర పరిశ్రమగా గుడుంబా వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. (సారా) గుడుంబాను గ్రామీణ తండాల నుండి పట్టణ ప్రాంతాలకు ప్యాకెట్ల రూపంలో, సినిమా హాళ్ల పక్కన పాన్‌షాప్‌లలో, హమాలీలు, కూలీలు ఉండే స్థలాలలో, రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్ సమీపంలో గుడుంబా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికీ, అధికారులకూ అవసరం లేనట్లుగా ఉంటున్నారు. రోజంతా కష్టపడి సంపాదించినదంతా తాగి ఇంట్లో అన్నం తినకుండా ఉండి పోతారు. అలానే ఆరోగ్యం క్షీణించి ఆరు నెలలు తిరగక ముందే మృత్యువాత పడుతున్నారు.

కొంతమంది గుడుంబా తాగిన మైకంతో వావి వరుసలు మరిచి కూతురిపై అత్యాచారాలు చేసిన వారున్నారు. ఈ సారా వలన సమాజానికి జరిగే నష్టాన్ని ఆలోచించవలసిన అవసరం ఉంది.

ఈ గుడుంబాలో తాగేవారికి హానికల్గించే పదార్థాలు సాధారణంగా వాడే పదార్థాలే కాకుండా ఎక్కువ మత్తు కోసం హాని కల్గించే యూరియా, అంబర్, కాలిపోయిన బ్యాటరీల పొడి, పటికను వండేటప్పుడు అందులో వేస్తారు. అందువలన గుడుంబాను సేవించే వారికి కొద్దికాలంలోనే కాలేయం, జీర్ణాశయం పూర్తిగా పాడైపోతున్నాయి, కండరాల నొప్పి, జ్ఞాపక శక్తి క్షీణిస్తోంది. పిచ్చివాళ్లుగా మారుతున్నారు. శరీరం మొత్తం వాపు వచ్చి ఆరోగ్యం అతి త్వరగా క్షీణించి చనిపోతున్నారు.

నివారణ చర్యలు

ఈ మద్యం, గుడుంబాలను నివారించకపోతే ప్రతి గ్రామంలో, గిరిజనతండాలలో, పట్టణంలో కొన్ని ప్రాంతాలు పురుషులు లేని గ్రామాలుగా, తండాలుగామారే ప్రమాదం ఉంది. అందువలన ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

1. గుడుంబా తయారీదారులను అరెస్టు చేసినంత మాత్రాన గుడుంబా తయారీ ఆపరు. ఈ గుడుంబా తయారీకి అవసరం అయ్యే పదార్థాలు అమ్మే వ్యక్తులను, దుకాణదారులను కఠినంగా శిక్షించాలి.
2. గ్రామాల నుండి పట్టణాలకు సారా ప్యాకెట్లు సరఫరా చేసే వ్యక్తులను గమనించి వారిపై చర్యలు కఠినంగా తీసుకోవాలి.
3. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ సారా వ్యతిరేక కమిటీలు వేసి సారాను విక్రయించేవారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి.
4. డ్వాక్రా గ్రూపు మహిళలు అందరూ కలిసి గుడుంబాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తండాలను / గ్రామాలలో ప్రతి ఆదివారం మీటింగ్‌లు పెట్టి సారా వలన కలిగే నష్టాలు వివరించాలి.
5. సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనే మహిళలకు, డ్వాక్రా గ్రూపులకు ప్రోత్సాహకాలు కల్పించాలి.
6. ప్రతి తండాను, గ్రామాన్ని సారాలేని గ్రామంగా, తండాలుగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ చేపట్టాలి. ప్రజలలో చైతన్యంతోనే ఈ మద్యం, సారాను నిర్మూలించగలం.

ముగింపు

మద్యపానంను నిషేధించాలంటే విస్తృతంగా గ్రామీణ ప్రాంతాలలో, కుటుంబాలలో చర్చ జరగాలి. ఏ ఆధారం లేని కొన్ని కుటుంబాలు ఈ గుడుంబానే జీవనాధారంగా చేసుకుంటున్నాయి. మొదటగా వారిని కలిసి ఉపాధి అవకాశాల కల్పనకు ఆయా గ్రామ పంచాయతీలు చొరవ తీసుకునే విధంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలి. అంతేగాక గ్రామాలలో పనిచేసే కార్మికులు, రోజువారి కూలీలకు తమ జీవితాల్ని, కుటుంబ సంతోషాలను ఎలా కోల్పోతున్నారో అర్థమయ్యేటట్లు కౌన్సిలింగ్ నిర్వహించాలి. చిన్న పిల్లలకు దూరంగా ఈ మద్యంను ఉంచాలి. కొంతమంది తల్లిదండ్రులు వారి ముందే తాగుతుంటారు. అలా తాగడం మాన్పించాలి. పండుగలు వచ్చినా, ఇంట్లో ఇతరేతర శుభకార్యాలు జరిగినా క్రమం తప్పకుండా మద్యంను అందుబాటులో ఉంచుతారు. ఈ సంప్రదాయాన్ని విడనాడే విధంగా కుటుంబ సభ్యులు, స్థానిక ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏది ఏమైనా ప్రభుత్వం మద్యపాన నిషేధంపై సమగ్ర చట్టం తీసుకవచ్చినప్పటికి దానిని ఆచరణలో పెట్టడానికి ప్రజలంతా మూకుమ్మడిగా ముందుకు రావాలి. చిన్న నిడివితో కూడిన ఛాయాచిత్ర ప్రదర్శనలను ప్రతి గ్రామాలలో నెలకు ఒక మారైనా ఏర్పాటు చేయాలి. రేపటి యువతరాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. అప్పుడే పల్లెలు పచ్చగా ఉంటాయి. వీ

(7వ పేజీ తరువాయి..)

10) విశ్వబ్రాహ్మణ వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్‌కు అదనంగా వృత్తి కళాకారుల పెన్షన్ ఇవ్వాలి; 11) విశ్వబ్రాహ్మణులు ఉత్పత్తి చేసే వస్తు ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర ప్రకటించాలి. మార్కెట్ సౌకర్యం కల్పించాలి; 12) అపరల్ పార్క్‌లు, జ్యూయలరీ, కాపర్, బ్రాస్, అల్యూమినియం పరిశ్రమల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి; 13) విశ్వబ్రాహ్మణ పురోహితులకు ఎండోమెంట్ శాఖ ద్వారా దేవాలయాలలో పురోహితులుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలి; 14) ప్రభుత్వ కార్యాలయాల ఫర్నిచర్, భవన నిర్మాణాల ఫర్నిచర్ పనిలో విశ్వబ్రాహ్మణులను ఉద్యోగులుగా నియమించాలి. పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్ ఉద్యోగాలను విశ్వబ్రాహ్మణులకు ఇవ్వాలి; 15) విశ్వబ్రాహ్మణ జనాభాను సర్వే చేయించి జనాభా నిష్పత్తి ప్రకారం గ్రామస్థాయి నుండి స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభలలో నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలి; 16) వ్యక్తిగత బీమా, ఆరోగ్యబీమా, పనికి ఆహార పథకం, సహకార సంఘాలను స్థాపించి సహకార సంఘ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి; 17) ప్రపంచీకరణ పర్యవసానంగా రెడీమేడ్ ఆభరణాల దిగుమతి వల్ల స్వర్ణకారుల వృత్తిని పూర్తిగా కోల్పోయినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర అధ్యయనం నిర్వహించి స్వర్ణకార వృత్తిని రక్షించేందుకు చర్యలు చేపట్టాలి. 20 గ్రాములలోపు బంగారు, 100 గ్రాములలోపు వెండి వస్తువుల తయారీ స్థానిక స్వర్ణకారులకు లభించే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలి; 18) ప్రతి మండల, జిల్లా కేంద్రాలలో విశ్వబ్రాహ్మణ సంఘ కార్యక్రమాలకు స్థలం కేటాయించాలి. అదే విధంగా విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్స్ ప్రభుత్వం నిర్మించాలి; 19) దొంగ బంగారం, దొంగ కశ్ర విషయంలో విశ్వబ్రాహ్మణులపై పోలీస్ వేధింపులు నివారించాలి; 20) సాంకేతిక విద్యాలయాలకు, విశ్వవిద్యాలయాలకు టెక్నాలజీ మిషన్‌లలో నామినేటెడ్ పదవులను విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలి; 21) నిరుపేద విశ్వబ్రాహ్మణులకు తెల్లరేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.

– బి.పి. చారి

విశ్వబ్రాహ్మణ సామాజిక చైతన్య ప్రచారక్, ఖమ్మం

మౌలిక సదుపాయాలు లేకపోవడం, విత్తనాలు, ఎరువులతో సహా అన్నింటికీ మార్కెట్‌పై ఆధారపడడం, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడం ఇలా సమస్యల వలయంలో ఉన్న వ్యవసాయరంగ స్థితిని తెలియజేస్తున్నారు **పుల్లా శ్రీనివాస్, కేతిరెడ్డి వాసు**

వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం

కొన్ని వందల సంవత్సరాల క్రితం పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలు మిగతా దేశాలను అంటే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలను లూటీ చేయడం, ఆక్రమించడం ఆరంభించాయి. బ్రిటిష్ వారు భారతదేశాన్ని 250 సంవత్సరాల క్రితం వ్యాపార నిమిత్తం వలసగా చేసుకున్నారు. దీనికి పాశ్చాత్య దేశాలకు ప్రేరణ దురాశ, పెట్టుబడిదారీ 'స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ' ఏకైక లక్ష్యమైన 'లాభం'. బ్రిటన్‌లో 250 సంవత్సరాల క్రితం ఆరంభమైన పారిశ్రామిక విప్లవం ఈ వలసవాద దోపిడికి సాయపడింది. నూతన కర్మాగారాలను, ఆవిరి ఓడలను, తుపాకులను పారిశ్రామిక విప్లవం సాధించిన దేశాలు తయారు చేసాయి. దీనితో సామ్రాజ్యవాద ఆక్రమణలు మరింత సులువుగా, రక్తసిక్తంగా జరిగాయి.

నేడు మనం ప్రపంచ పెట్టుబడిదారీ విస్తరణను వర్ణించే 'ప్రపంచీకరణ' అనే మాటను వింటున్నాం. భారతదేశంలో పెప్సీ, కోకా-కోలా, పాశ్చాత్య టెలివిజన్ ప్రదర్శనలు, సినిమాలు, నైక్ వంటి దుస్తులు సర్వసాధారణం అయిపోయాయి. భారతదేశం మరింతగా ప్రపంచ మార్కెట్ వ్యవస్థకు ద్వారాలు తెరుస్తోంది. అయితే ప్రపంచీకరణ అనేది పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దోపిడికి కొనసాగింపేనని గత ఐదు వందల సంవత్సరాల చరిత్ర రుజువు చేస్తోంది. ప్రపంచంలోని పేద ప్రజానీకంలో భ్రమలను రేకెత్తించేందుకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని ప్రస్తుత ప్రక్రియలు. ఉత్తర అమెరికా, యూరప్, జపాన్ దేశాలలోని ధనవంతుల జీవన స్థాయిని ఈ పేద ప్రజలు అందుకునేలా చేయగలవని నమ్మించడవే. ప్రపంచీకరణ అనేమాట తాలూకు పని ఈ మాయమాటలను ప్రజల చేత నమ్మించే సమయంలోనే ఈ దేశాలు పేదదేశాల వనరులపై సరికొత్త దాడిని ముమ్మరం చేశాయి.

నోబెల్ బహుమతి గ్రహీత, ప్రపంచ బ్యాంకు మాజీ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్‌లిట్జ్, ప్రపంచ బ్యాంకు ఐ.ఎం.ఎఫ్., డబ్ల్యు.టి.ఓ. తయారు చేసిన పథకాలపై కఠినమైన రీతిలో దాడి ద్వారా వాటిని బహిర్గతం చేశాడు. 'ది అబ్జర్వర్' (లండన్ అక్టోబర్ 10, 2001)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సంస్థలు అన్ని దేశాలకు ప్రతిపాదించే నాలుగు అంశాల ఫార్ములా జాబితాను చెప్పారు. ఈ ఫార్ములా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను నాశనం చేసి వదిలిపెడుతుంది.

ఈ నాలుగు అంశాల ఫార్ములా వాస్తవానికి ధనిక దేశాల అజెండాను అమలు జరిపేలా క్లయింట్ దేశాల లాభాన్ని పొందే దేశాలపై ఒత్తిడి తెస్తుంది.

- ప్రైవేటీకరణ లేదా లంచాలీకరణగా స్టిగిలిట్జ్ పిలిచేది. రాజకీయ వేత్తలు, అధికారులకు తమ తమ దేశాల విద్యుత్, నీటి సంస్థలను అమ్మివేసేందుకు లంచాలను ఇవ్వడం అంటే 'జాతీయ ఆస్తుల అమ్మకం ధరపై కొద్ది బిలియన్లను తగ్గించినందుకుగాను' ఆ అమ్మకం సొమ్ములో పది శాతం వాటాను పొందడం.
- పెట్టుబడుల సరళీకరణ లేదా స్టిగ్‌లిట్జ్ మాటలలో చెప్పాలంటే, హాట్‌మనీ వలయం, మదుపు చేసే పెట్టుబడులతో పాటుగా ఈ వలయం కరెన్సీ, రియల్ ఎస్టేట్ స్పెక్యులేషన్ మార్కెట్లలోకి ప్రవహిస్తుంది. ఈ డబ్బు దేశాలలోకి ప్రవహించి నంత వేగంగానే వెలుపలికి వెళ్ళిపోతే ఐ.ఎం.ఎఫ్ ఈ దేశాలను జాతీయ పెట్టుబడి నిధులలోకి మరల స్పెక్యులేటర్లు వచ్చి చేరేలా చేసేందుకుగాను వడ్డీ రేట్లను పెంచవలసిందిగా కోరుతుంది. ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలో ఈ హాట్‌మనీ ఉప్పెనలను స్టిగ్‌లిట్జ్ పేర్కొన్నాడు.
- మార్కెట్ ఆధారిత ధరల నిర్ణయం : ఐ.ఎం.ఎఫ్. దొమ్మీగా ఆయన పిలిచేదానికి దారితీసే ఆహారం, నీరు, వంటగ్యాస్ ధరలను పెంచేందుకు వాడే మోజైన మాట ఇదని స్టిగ్‌లిట్జ్ చెప్పారు. వంట చెరుకు, ఆహారం, నీటి ధరల అంశాలపై ఇండోనేషియా, ఈక్వెడార్, బొలీవియాలలో దొమ్మీలు జరిగాయి.
- ప్రపంచీకరణ అంటే: సరుకులు, పెట్టుబడి తాలూకు స్వేచ్ఛా ప్రవాహం అన్న రీతిలో ఉంది. ఈ పెట్టుబడి కూడా ప్రధానంగా స్పెక్యులేటివ్ పెట్టుబడి. ఈ డబ్బు ఎంత సులువుగా వస్తుందో, అంతే సులువుగా వెళ్లిపోతుంది.
- 1991-97 సంవత్సరాలలో తూర్పు ఆసియా దేశాల నుండి 105 బిలియన్ డాలర్ల నికర పెట్టుబడులు, వినాశకరంగా తరలి వెళ్ళిపోయాయి. దీనితో ఇండోనేషియా, కొరియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ దేశాలలో ఆర్థిక సంక్షోభం ఏర్పడింది.

వ్యవసాయరంగంలో సంస్కరణ ఫలితాలు: వ్యవసాయాభివృద్ధికి కావలసినవి : 1) విత్తనాలు; 2) రుణ సౌకర్యం; 3) నీటి పారుదల; 4) మార్కెట్ సదుపాయం; 5) పంటల మార్పిడి; 6) వ్యవసాయ శాఖ; 7) ఎగుమతి సౌకర్యాలు.

విత్తనాలు : రాష్ట్ర జాతీయ విత్తనాభివృద్ధి సంస్థలు లోగడ విత్తనాల ఉత్పత్తి కోసం పనిచేశాయి. నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసి రైతాంగానికి

పంపిణీ చేశాయి. వీటికి ఇప్పుడు నిధుల కేటాయింపు తగ్గించారు. ప్రైవేట్ కంపెనీలకు అనుకూలంగా చట్టం తెచ్చారు. విత్తనాభివృద్ధి సంస్థలు మోన్‌శాంటో, కార్గిల్, మైకో కంపెనీలు సంవత్సరానికి రు. 20,000 కోట్ల విత్తనాల వ్యాపారం జరుపుతున్నాయి. పత్తి, మిర్చి, ఆముదం, వేరుశనగ, బెండ, టమాట, నకిలి విత్తనాలున్నాయి. కల్తీ పురుగు మందులు 1000 కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది.

రుణ సౌకర్యం : 1997 తర్వాత వ్యవసాయరంగానికి రుణ సదుపాయం తగ్గుతూ వస్తోంది. మన రాష్ట్రంలో వివిధ బ్యాంకుల్లో 84,000 కోట్ల రూపాయల డిపాజిట్లు ఉండగా 64,000 కోట్ల రూపాయలు మాత్రమే అప్పులిచ్చారు. ఇందులో వ్యవసాయరంగానికి 6,000 కోట్లు మాత్రమే. వ్యవసాయరంగానికి 40 శాతం వరకు ఇవ్వాలి. పంట రుణాలు 18 శాతం ఇవ్వాలి. దీనిని మొత్తంగా 10 శాతం లోపు కుదించారు. 75 శాతం పేద రైతులకు ఇవ్వాలని, 25 శాతం ఎస్.సి.లకు ఇవ్వాలని ఉంటే 5 శాతం ఇస్తున్నారు. 187 లక్షల మందికి రు. 6,000 కోట్లు అప్పులిచ్చారు. నష్టపోతే వడ్డీ మాఫీ చేయడానికి కూడా అవకాశం లేదంటారు. 200 ఖాతాలకు 14,000 కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చారు. వ్యవసాయరంగంలో 77 శాతం రిపేమెంట్ ఉంటోందని తెలుస్తోంది. అయినా 75 శాతం రైతాంగం వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడాల్సి వస్తోంది.

నీటిపారుదల సౌకర్యం : మన భౌగోళిక విస్తీర్ణం 6.84 కోట్ల ఎకరాలు. సేద్యయోగ్యమైన భూమి 4.25 కోట్ల ఎకరాలు. సాగుచేస్తున్న భూమి 2.92 కోట్ల ఎకరాలు. ఇందులో సాగునీటి వనరులున్నవి 1.10 కోట్ల ఎకరాలు. 40 నదుల ద్వారా 2748 టి.ఎం.సి.ల నీరు వాడుకునే వీలుంది. ఇందులో 1900 టి.ఎం.సి. నీరు వాడుకునే ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. మిగతా నీరు సముద్రంలో కలుస్తోంది. ప్రాజెక్టుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నీరు–మీరు, ఇంకుడు గుంతలు, వాటర్‌షెడ్లు, బిందు, తుంపరసేద్యం పేరుతో 4000 కోట్ల రూపాయల వరకు ఖర్చు పెట్టారు. గ్రౌండ్ వాటర్ లెవల్ పెరగడం పడిపోయింది. ఎస్.ఎల్.బి.సి., ఎస్.ఆర్.ఎస్.పి. రెండో దశ, వరద కాల్వలు పూర్తి కాలేదు.

నీటి సంఘాలు : ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక పర్యాయం రిపేర్లు చేయాలి. ఎకరాకు నాలుగు వేల రూపాయల మెయింటనెన్స్ కింద ఇస్తారు. సంఘాలే నిర్వహణ చేసుకోవాలి. ప్రభుత్వం నిర్వహణ నుండి వైదొలగుతోంది. పంపుసెట్లు ప్రాజెక్ట్ ద్వారా అయితే ఖర్చు అవుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ మోటారు రిపేరు రైతు భరించాల్సి వస్తోంది. చార్జీలు విపరీతంగా పెరిగాయి.

మార్కెట్ సదుపాయం : మన రాష్ట్రంలో మొత్తం రెండు రకాల మార్కెట్లున్నాయి. 1100 మార్కెట్లు ఉంటే 800 మార్కెట్లకు సొంత స్థలాలు ఉన్నాయి.

1) రెగ్యులేటెడ్ మార్కెట్లు – రైతులు సరుకులు తెచ్చి అమ్ముకుంటారు. తెలంగాణ, రాయలసీమలలోనే మార్కెట్లు మొత్తం 274 వరకు ఉన్నాయి.
2) అన్ రెగ్యులేటెడ్ మార్కెట్ : ఫీజు చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు సేల్స్ టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, పర్చేజ్ టాక్స్, ఆర్‌డిఎక్స్ సగటున వరి పంటలకు ఎకరాకు 2000 వరకు వస్తుంది.

కనీస మద్దతు ధర లేనపుడు ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయాలి. గత ఎన్.డి.ఎ. ప్రభుత్వం మార్కెట్లను ప్రైవేటీకరించాలని జి.ఒ. పంపింది. మార్కెట్లపై ప్రభుత్వ జోక్యం తగ్గింది. తర్వాత వైదొలగుతోంది. కనీస మద్దతు ధర ఉండదు. మార్కెట్ పోటీ ఉండదు.

పంటల మార్పిడి : డబ్ల్యు.టి.ఒ. ఒప్పందానికి ముందే సామ్రాజ్యవాద దేశాలు తమ దేశాల్లో వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించటానికి సబ్సిడీలు పెంచాయి. ఈ సబ్సిడీలు పాకిస్తాన్‌లో 26 శాతం, అమెరికాలో 29 శాతం, యూరప్‌లో 37 శాతం, కెనడాలో 54 శాతం, చైనాలో 39 శాతం, దక్షిణ కొరియాలో 61 శాతం, జపాన్‌లో 72.5 శాతం అలాగే భారతదేశంలో 3 శాతం మాత్రమే. ప్రస్తుతం సబ్సిడీలను 1.5 శాతానికి కుదించారు. అమెరికాలో ఒక హెక్టారు సాగుకు 500 డాలర్లు ప్రోత్సాహకరంగా ఇస్తున్నారు. మన దేశంలో పంట సరళి ఆహార ధాన్యాల నుండి వాణిజ్య పంటల ఉత్పత్తి వైపు మరల్చుతున్నారు.

వ్యవసాయశాఖ : రాష్ట్రంలో వ్యవసాయ శాఖలో 11000 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, 3500 పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలు అందించిన 7500 మంది ఎం.పి.ఇ.ఒ.లను ప్రస్తుత ప్రభుత్వం తొలగించింది. 1991 నుండి వరుసగా ప్రభుత్వాలు వ్యవసాయ శాఖను బలహీనపరుస్తున్నాయి.

ఎగుమతులు : మన రాష్ట్రంలో పత్తి, మిర్చి, పంచదార లాంటి పంటలు మనఅవసరానికి మించి ఉత్పత్తి అవుతున్నాయి. పంటల సీజన్‌లో రేట్లు తగ్గిస్తారు. ప్రపంచ మార్కెట్‌లో రేట్లు ఎక్కువ ఉన్నప్పుడు ఎగుమతులు ఆపేస్తారు. బడావ్యాపారులకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తారు.

దిగుమతులు : సంవత్సరానికి భారతదేశంలో రైతులు 1,16,200 కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతున్నారు. వ్యవసాయ కూలీలకు గతంలో 120 రోజుల పనులు దొరికేది. ఇప్పుడు 70 రోజులకు మించి పనిలేదు. నిజవేతనాలు పడిపోయాయి. పౌష్టికాహారం లభ్యం కావటంలేదు. రోగ నిరోధక శక్తి తగ్గుతోంది. వైద్యం అందుబాటులో లేదు. యంత్రాలు రావడం వలన కోతల సీజన్‌లో కూడా పనిదొరకడం లేదు. ప్రపంచీకరణ ప్రభావం వలన వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడింది. ఈ విధానాల కొనసాగింపు కారణంగా గ్రామీణ కూలీలు పట్టణాలకు వలసలు పోతున్నారు. దీనిని అరికట్టాల్సిన అవసరం ఉంది.

పరిష్కారం : వ్యవసాయరంగానికి అన్ని వసతులు కల్పించాలి. విత్తనాలు ప్రభుత్వమే అందించాలి. రుణాలు మంజూరు చేయాలి. ఎరువులు కూడా సొసైటీ ద్వారా కేటాయించాలి. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. అనవసరమైన దిగుమతులు ఆపివేయాలి. గ్రామీణ ఉపాధి పథకాలకు నిధులు పెంచి అవి దుర్వినియోగం కాకుండా ప్రజల భాగస్వామ్యంతో అమలు జరపాలి. వీ

భూమి సమస్య మొదట ఆదివాసి సమస్యగానూ, తరువాత పెట్టుబడికీ ప్రజలకూ మధ్య సమస్యగానూ, అంతిమంగా వివిధ వర్గాల ప్రజల సమస్యగానూ పరిణమిస్తుందంటున్నారు **ఎం. నాగరత్నం**

ఆదివాసులకు భూమి హక్కు?

ఆదివాసి ప్రాంతాల్లో భూమి సమస్యను కూలంకషంగా చూస్తే ప్రాథమికంగా ఇది ఆదివాసుల సమస్యే అయినా, అది కేవలం వారితోనే ఆగిపోదు. నేడు ప్రవేశిస్తున్న పెట్టుబడి, అధికార వర్గం మొదట ఆదివాసులను భూమి, అడవి నుండి తొలగిస్తుంది. అనంతరం ఆదివాసేతర చిన్న రైతులు, పెద్ద రైతులు కూడా ఒత్తిడికి లోనవుతారు. విస్తరిస్తున్న మార్కెట్లు, ఖండాంతర పెట్టుబడులు ఇతర దేశాల నుండి రాబోతున్న వత్తిడులు ఆదివాసి ప్రాంతాలపై అధికంగా ఉండటం మూలాన ఆదివాసేతర పెద్ద రైతులు అవసరమయితే నష్ట పరిహారానికి తమ భూములను పెట్టుబడిదారులకు అప్పగించి చేతులెత్తవలసి ఉంటుంది. అందువల్ల మొదటగా ఇది ఆదివాసి సమస్యగా కనపడ్డా, 1/70ని కాపాడకపోతే మొత్తంగా ఆదివాసేతర పేదలు, రైతాంగం కూడా తమ హక్కులను కోల్పోయే ప్రమాదముంది. పెద్ద పెట్టుబడుల ముందు చిన్న రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములను అనివార్యంగా అప్పగించవలసి ఉంటుంది. అంటే ఈ ప్రాంతాల్లో భూమి సమస్య మొదటగా ఆదివాసి సమస్య, రెండవ దశలో పెట్టుబడికీ – ప్రజలకు మధ్య ఉండే సమస్య. చివరిదశలో, వివిధ వర్గాల మధ్య ఉండే సమస్యగా మనం అర్థం చేసుకోవాలి. భూమి ప్రాథమికంగా ఆదివాసి సమస్య అయినపుడు మన ప్రాధాన్యతలో ఆదివాసి సమూహాలకే మొదటగా మద్దతు అందించే విషయంలో ఎలాంటి సంకోచాలు అవసరం లేదు. ఆదివాసులకు రాజ్యాంగం ఇచ్చిన ఈ సౌకర్యాన్ని బలపరచడం ద్వారా మనందర్నీ కూడా పరిరక్షించుకొనే అవకాశం ఉంది.

భూమి ఆదివాసులకు జీవనాధారం. భూమి ఆస్తిగా మారకముందు అన్ని మైదాన ప్రాంత ప్రజలకు కూడా జీవనాధారంగానే ఉంది. కానీ భూమి సాగుచేసుకొనే క్రమంలో జీవనాధారం నుండి బలమైన పెత్తన శక్తిగా మారడానికి, కొన్ని సముదాయాలకు ప్రధాన వనరుగా ఉపయోగపడింది. బలమైన దోపిడీ శక్తులు వేళ్లూనుకొనడానికి అటవీ, షెడ్యూల్డ్ ప్రాంతంలో నిర్దిష్టమైన సంబంధాలు ఏర్పర్చటం మొదట నుండి ప్రభుత్వాలకు అవసరమైంది. పెద్ద ఎత్తున ఈ ప్రాంతాల్లోకి వలసలు ప్రోత్సహించబడ్డాయి. వనరుల వినియోగం పేరిట, అటవీ ఉత్పత్తుల సేకరణ పేరిట, ప్రభుత్వ యంత్రాంగం కుప్పలు, తెప్పలుగా విస్తరించింది. అటవిశాఖ, ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా అధికమైనాయి. బొగ్గు గనులు, పేపర్ పరిశ్రమలు, వాణిజ్యం, వ్యాపారం వల్ల మైదాన ప్రాంత ప్రజల్లో షెడ్యూల్డ్ ప్రాంతాల్లోకి రావడం పెరిగింది. భూమిపైన ఒత్తిడీ పెరిగింది. అడవి క్షీణించింది. నీటి వనరుల దాపు ఉన్న నల్లరేగడి భూములు కోస్తా, భూస్వామ్య వర్గాల వశమైనాయి. మరొక వైపు సామ్రాజ్యవాద విధానాలు అధికం కావడంతో మైదాన ప్రాంత రైతులు, చిన్న రైతులు తమ ఉనికిని కాపాడుకోవడంలో మనో వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మైదానంలో సామ్రాజ్యవాద ప్రపంచ దోపిడీ శక్తుల ప్రభావం షెడ్యూల్డ్ ప్రాంతంలో సామ్రాజ్యవాద, ప్రాంతీయ దోపిడీ ప్రాబల్య శక్తుల ఉనికిని జాగ్రత్తగా గమనించాలి.

ఆదివాసి ప్రాంతంలో భూమి సమస్యపై విపరీత వాదనలను ముందుకు తెస్తున్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం గణాంకాలను ముందుకు తెచ్చి ప్రచారం చేస్తోంది. దీనిపైన కొన్ని ప్రభుత్వ వర్గాలు కూడా విస్మయాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఈ వాదనలకు కొన్ని వివరణలను పరిశీలిద్దాం.

1/70 సవరణను బలపరిచే వాదం ప్రధానంగా భూమి కొనుగోలు – అమ్మక వాదం. దీనిపైన స్పష్టత అవసరం. భూమి అమ్మడానికి ఇబ్బంది లేకుండా 1/70 చట్టంలోనే అమ్మదల్చుకొన్న భూమిని ప్రభుత్వానికి స్వాధీన పరిచే వసతి ఉంది. దానికి ప్రభుత్వ పరిహారం చెల్లించవచ్చు కూడా. 'భూమి అమ్మకం' వసతి ప్రధానంగా వలస భూస్వాములకు కోస్తా ప్రాంతంలో తిష్టవేసిన అక్రమ భూకామందులకు ఉపయోగపడుతుందే తప్ప ఆదివాసేతర పేదలకు లాభపడదు. 'అమ్మకం' ఆరంభమైతే రక్షణలేని, అప్పుల పాలవుతున్న చిన్న రైతులు భూములను తాకట్టుపెడతారు. క్రమేపి నశించిపోతారు. అమ్మకం భూస్వాములకు లాభించి, చిన్న రైతులను చింతలకు గురిచేస్తుంది. తాకట్లకు భూమిని పెట్టుకొనే పద్ధతిని ప్రోత్సహిస్తే వడ్డీ వ్యాపారులు విజృంభిస్తారు. చిన్న రైతులను వడ్డీ వ్యాపారస్తులు, చివరకు పెద్ద రైతులను సామ్రాజ్యవాదం, ప్రపంచబ్యాంక్ కబళించేస్తోంది. భూమిని నమ్ముకొని బతికే చిన్న రైతులకు, ఆదివాసులకు ఉపయోగంగా ఉండే చట్టాన్ని కాపాడు కొంటామా? భూమిని అక్రమంగా ఆర్జించిన బడా భూస్వాములకు అమ్మకపు వసతిని కల్పించి, వారికి మరింత సంపన్నతకు సహకరించే భావజాలాన్ని సవరణ పేరిటా, మరొక మిష పేరిటో ప్రచారం చేస్తామా? అన్నది ప్రధానమైన ప్రశ్న; దేశంలో జరుగుతున్న దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను బలపరచకుండా 1/70 చట్ట సవరణ అటు ఆదివాసులకూ లాభించదు,

ఇటు ఆదివాసేతర పేదలకూ ప్రయోజనమివ్వదు. భూస్వాముల భూ అమ్మకాల మార్కెట్ కోసం ఆదివాసుల, పేద ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయనే విషయాన్ని గమనించాలి. పెద్ద ఎత్తున ప్రపంచ బ్యాంకు పెట్టుబడికి రహదార్లను ఏర్పరుస్తోంది. 1/70 చట్టం ఉండటం వల్లనే బిర్లా పెర్క్యూలేస్ పరిశ్రమ కోర్టు వారిచే అభిశంసించ బడ్డది. అసమపోటీని నివారించడానికే ఉదారవాద రక్షణలు అవసరం. ఉదారవాద సానుకూల దృష్టిని అవసరమైన రీతిలో, ఉపాయకరమైన ప్రగతిశీల పరిభాషలో తోసి వెయ్యడం వల్ల లాభం. ఎవ్వరిదో – నష్టం ఎవ్వరిదో చూడగలగాలి. నష్టపోయే వర్గాలు, తెగలను ఊహించగలగాలి.

భూమి జీవన వారసత్వంగా మిగిలిన ఏజన్సీ ప్రాంతాల్లో, అడవుల్లో ఆదివాసులదే తొలి హక్కు. వెనుకబడ్డ ప్రాంతాల్లో ఆయా ప్రజలకూ ఇదే హక్కు వర్తిస్తుంది. ఇది కనీస స్థానిక ప్రజాస్వామ్యం. స్థానిక ప్రజాస్వామ్యం లేకుండా నూతన ప్రజాస్వామ్యానికి అర్థంలేదు. బతుకు, నివాసం వేరు. ఆక్రమణ వేరు. సహజీవన సూత్రం వేరు. ఆధిపత్య అహంకార దృష్టివేరు. దానికి భావజాలమో, బలదర్పమైన ప్రభుత్వ హంగులో – సమానంగా అన్వయించి తమతమ వాదనలో వాడడం వేరు. సహజీవనం పేరిట సమానత్వ నినాదం రావాలే తప్ప, సంస్కరణల పేరిట వలసదోపిడీకి వెనుకబడ్డ ప్రాంతాల్లో, ఏజన్సీల్లో మాల, మాదిగ వాడల్లో, లంబాడా తండాల్లో, ఎరుకల యానాది గుడిసెల్లో, పత్తిరైతుల బతుకులపై సాగే దోపిడీకి వెన్నుదన్నుగా నిలిచే దృష్టిని విడనాడాలి. ఈ నివారించుకొనే దృష్టి, ఆలోచన ఈనాటి అవసరం. ప్రజాస్వామిక విప్లవాల్లో ప్రజలకు ఒక వర్గ పునాది ఎంత సహజమో, భారతదేశంలో ప్రాంత, కుల, తెగ, లింగ నిర్దిష్టతలు కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గమనించగలగాలి.

భారతదేశ మైదానంలో ఆస్తిని ప్రైవేట్ పరంచేసి రాజ్యమే వర్గాలు సృష్టించిందన్న విషయం మరువరాదు. ఏజెన్సీలోని తెగల ఉమ్మడి వనరులపై ఉన్న రెవిన్యూ రాబట్టడం కోసమే ప్రభుత్వం ప్రవేశించిందన్న విషయం మరువరాదు. తొలి మానవుని శ్రేయస్సే మలి మానవుని వికాసం అన్న కనీస తర్కం విడనాడరాదు. వర్గాలు కనీస ప్రాయంగా ఉన్న ఆదివాసి సమాజంలో మైదానవర్గాలు ప్రవేశించిన తర్వాతే వర్గ వైరుధ్యాలు అధికమైనాయని కూడా గుర్తించాలి. ఇక్కడ స్వయంపాలన పోరాటాల్లో అన్ని సమాజ వర్గాలకు కూడా తదనంతర దశల్లో సమాన హక్కు ఉంటుందనే విషయాన్ని చూడాలి. తెగల ప్రయోజనాలు, వర్గ ప్రయోజనాల్లోనూ మొదటి ప్రాధాన్యత తెగకు ఇస్తూ, తదనంతరం చారిత్రకంగా ఇక్కడకు జీవనోపాధికోసం వచ్చిన వివిధ కులాలకు చిన్న, పేదరైతాంగం మధ్య ఈనాటికీ ఉన్న సామాజిక ఒప్పందాన్ని, అవగాహనను బలవత్తరం చెయ్యాలి. కలివిడి సంస్కృతిని బలపరచాలి. భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద పెట్టుబడి విస్తరణ కాంక్షలను తట్టుకొనే సందర్భంలో ఏకం చేయాలి. ఏకత్వం చేసే క్రమంలో ఉన్న అసమదోపిడీని ఆదివాసుల, ఆదివాసేతర పేదల దీర్ఘకాలిక ప్రయోజనాలను చూడవలసి ఉంటుంది. ఎవరికి ఉపయోగపడుతుందో కూలంకషంగా పరిశీలించి స్పష్టమైన అవగాహనను ఏర్పర్చుకోవాలి.

1/70 చట్టం ఈ వ్యవస్థలో ఆదివాసులకు ఈనాటికీ ఒక మేరకు అందుబాటులో మిగిలివున్న ఉపయోగకర సాధనం. అయినా దుర్వినియోగం చేయబడుతోంది. పేదలకు భూమి అమ్మకపు హక్కును అనుమతించక పోవడం వల్ల వారికి కనీస భద్రతను కల్పిస్తోంది. అందువల్ల యథాతథంగా ఉంచడమంటే 'అసమ మార్కెట్ల పోటీని' నివారించడమే. 'భూమి వేలం ప్రవేశాన్ని నివారించడమంటే "అన్ని వర్గాల బతుకుల వేలాన్ని' నివారించడమే. ఈ విషయాన్ని సానుకూలంగా అర్థం చేసుకోవాలి. ఏజన్సీలో గతంలో ఉన్న పేదరైతుల, ఆదివాసిల మధ్య స్పర్థ ఈ చట్టంవల్ల రాలేదు. భూస్వాముల అపరిమిత భూదాహం వల్ల వచ్చినదే. కుట్ర పూరిత పద్ధతుల్లో చిన్న రైతులపై కేసులను మాత్రమే బుక్ చేసిన అధికారుల వర్గఅనుకూల స్వభావం నుండి కుప్పలు తెప్పలుగా వచ్చిన కోస్తా వలస భూస్వాములకూ, పండ్ల తోటలకూ ఏ అధికారీ ఆక్షేపణ తెలుపలేదు. ఫలితంగా మొదటగా ఆదివాసులు, తర్వాత మొత్తంగా తెలంగాణ ప్రజలు దగా పడ్డారు. వలస సహజమని నమ్మే పిడివాదపు దృష్టి భూస్వాములకు, సామ్రాజ్యవాదులకు మాత్రమే ఉపకరిస్తుంది. అంతర్గత వలస పొట్ట కూటికోసమైతే ప్రజలు వారంతట వారే సహకరించుకొంటారు. మన రాజకీయాల కోసమో, ఆధిపత్యం కోసమో, స్పర్థపెడితే తప్ప, ఖండాంతర వలసలను వ్యతిరేకిస్తున్న మనం అంతర్గతంగా జరిగే దోపిడీ వలసల అదుపుకై డిమాండ్ చెయ్యాలనే తలంపు రాకపోవడం విడ్డూరం. ఈ దోపిడీ, వలసలను ఎదుర్కొనే స్థితి ఒక ఉద్యమానికి ఉండే కనీస ప్రజాస్వామిక కార్యక్రమం.

మైదాన ప్రాంత ప్రజలకు సాగునీరు డిమాండ్‌ను చెయ్యకుండా గత అరవై ఏళ్లుగా రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్న కోస్తా, రాయలసీమ, తెలంగాణ మైదాన పరిశ్రమాధిపతులు, వలస భూస్వాములపైన ఉద్యమాల్లో మైదాన రైతాంగాన్ని, సకల వర్గాల శ్రేణులతో కూడుకొని నిర్మించకుండా మైదాన ప్రజలకు సుఖశాంతులను కలుగజేయలేం. పట్టణాల్లో దోపిడీలు చేస్తున్న, ఒకనాటి వామపక్ష వాసనలుండి ఈనాడు ప్రపంచబ్యాంక్‌కు 'డూడూ' కొడుతున్న బసవన్నల అక్రమార్జనలపై దృష్టి సారించాలి. మైదానంలో నీటి వనరుల వినియోగం వల్ల బతుకు మెరుగుపడితే జన సంఖ్య ప్రవాహం ఏజెన్సీకి తగ్గుతుంది. ఈ ప్రవాహాన్ని ఇక నుంచైనా ఎందుకు తగ్గించాలంటే ఈ రెండింటి మధ్య ప్రస్తుతం ఉన్నది 'అసమ జీవనపోటి' కనుక ప్రత్యేకతలను గుర్తించే నేపథ్యంలో పీడిత శక్తుల అనైక్యతను మరొకవైపు ప్రచారం చెయ్యడం ప్రమాదకరం. ఈ అవగాహన కష్టమే అయినా అసాధ్యమేమీ కాదు. అందువల్లనే భిన్ననాగరికతల మధ్య కనీస పోటీ శక్తి వచ్చేదాక 1/70 వంటి చట్టాల పరిరక్షణకోసం, ఆదివాసులకోసం, భూమినినమ్మి బతికే ఆదివాసేతర పేద రైతుల కోసం బాధ్యతపడడం మనందరి కర్తవ్యం. వీ

మీలోని రచయితను వెలికితీయండి! మీ చుట్టూ మీరు చూస్తున్న ఏ విషయంమీదనైనా సమాచారాన్నీ మీ అవగాహననూ, మీ విశ్లేషణనూ నలుగురితో పంచుకోండి! వీక్షణం మీకు వేదిక కల్పిస్తుంది!

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 సెప్టెంబర్ నుండి 20 అక్టోబర్ వరకు)


జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**
ఆదిలాబాద్	3	2	32	0	0	8	4	6	0	0	15	53	10	0	0	0	1	0
హైదరాబాద్	0	0	23	0	0	0	25	13	0	0	39	37	4	0	0	0	22	0
కరీంనగర్	19	14	65	0	0	0	8	8	8	0	27	37	37	0	0	0	12	0
ఖమ్మం	3	0	42	0	0	0	9	9	0	0	40	19	47	0	0	0	0	1
మహబూబ్‌నగర్	5	3	25	4	0	0	7	12	0	6	49	24	8	0	0	0	0	0
నిజామాబాద్	1	0	36	0	0	0	21	0	0	9	19	28	0	0	0	0	0	0
నల్గొండ	10	3	17	0	2	0	9	8	0	3	18	76	6	0	0	0	0	4
రంగారెడ్డి	4	1	11	0	0	0	3	9	0	4	30	18	11	0	0	0	0	0
అనంతపుర్	13	4	34	2	0	0	17	10	0	6	33	27	35	0	0	0	0	0
తూర్పు గోదావరి	2	0	38	0	0	0	7	5	0	3	20	40	6	0	0	0	2	0
గుంటూరు	2	1	16	0	0	0	0	0	0	0	38	22	9	0	0	0	2	0
కృష్ణా	2	1	28	0	0	0	18	2	2	3	32	29	4	0	0	0	4	6
విజయనగరం	0	0	12	0	0	0	6	2	0	0	21	12	9	0	1	0	0	2
విశాఖపట్నం	0	0	11	0	0	0	2	7	0	2	16	0	7	0	0	0	0	3
చిత్తూరు	16	1	9	0	0	0	0	16	0	1	35	5	10	0	0	0	0	9
ప్రకాశం	0	2	11	0	0	0	2	0	8	14	52	0	14	0	0	0	0	8
మెదక్	15	0	19	0	0	0	7	6	2	13	31	34	6	0	0	0	0	2
శ్రీకాకుళం	0	4	8	0	0	0	10	0	0	0	21	15	16	0	1	0	0	0
*ఇతర జిల్లాలు	0	5	0	0	0	0	0	0	0	0	0	0	0	0	0	0	0	0
మొత్తం	**95**	**41**	**437**	**6**	**2**	**8**	**155**	**113**	**20**	**64**	**536**	**476**	**239**	**0**	**2**	**0**	**43**	**35**

అందిస్తున్నవారు : హైదరాబాద్ – డి. విజయభాస్కర్; రంగారెడ్డి – వి. శంకరయ్య; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; వరంగల్ – కె. శ్యాంరావు; కరీంనగర్ – ఎల్. సంతోష్; మెదక్ – భగవాన్; నల్గొండ – డి. మహేష్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – కె.వి. రమణ; కృష్ణా – బి. రమేష్‌బాబు; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; ప్రకాశం – ఎన్. రవికుమార్; అనంతపురం – ఆదిశేషు; చిత్తూరు – పలమనేరు బాలాజి; * ఇతర జిల్లాల సమాచారం; చేనేత రంగంలో జరిగిన ఆకలి చావులు, ఆత్మహత్యలు అందించినవారు : ఎన్.వి. శివరంజని, చీరాల

ఏడవ ముద్రణ విడుదలైంది!

మీ ఆత్మీయ స్పందనకు మా హృదయపూర్వక ధన్యవాదాలు

- వీక్షణం పబ్లికేషన్స్



ప్రపంచబ్యాంక్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు పేద దేశాల అవసరాలు పెంచి, కొత్త అవసరాలు సృష్టించి ఆ అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బడిముబ్బడిగా అప్పులు ఇచ్చే కుట్ర, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఉద్దేశించిన ఓ అంతర్జాతీయ కుట్ర ఇప్పుడు బట్టబయలైంది. 'ఎకనామిక్ హిట్‌మాన్' అనే ఆర్థిక దళారీలను నియమించి, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాధినేతలను ప్రలోభపెట్టి, ఆ దేశాలను అమెరికన్ సామ్రాజ్యవాదానికి బంట్లుగా మార్చేసిన ఈ కుట్ర గుట్టు విప్పారు జాన్ పెర్కిన్స్. స్వయంగా ఎకనామిక్ హిట్‌మాన్‌గా పనిచేసి ఇప్పుడు చేతికంటిన సామాన్యుల రక్తాన్ని పశ్చాత్తాపంతో కడుక్కోవాలనుకుంటున్న పెర్కిన్స్ అంతరంగ కథనమే ఈ సంచలనాత్మకమైన పుస్తకం.

వెల
రూ.50/-

కాపీలు లభించు షాపులు :

హైదరాబాద్ : ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర, దిశ పుస్తక కేంద్రం - చిక్కడపల్లి, సాహిత్య నికేతన్ - బర్కత్‌పుర, నవోదయా బుక్‌షాప్ - కోఠి, తెలుగు బుక్‌షాప్ - కోఠి, సహచర బుక్ మార్క్ - బాగ్‌లింగంపల్లి. కుశల పుస్తక కేంద్రం - బాగ్‌లింగంపల్లి.

విజయవాడ : ప్రజాశక్తి బుక్ హౌస్, మైత్రి బుక్‌హౌస్, సాహిత్య నికేతన్

నెల్లూరు : మణి బుక్‌స్టాల్ - సండే మార్కెట్, గుంటూరు - అష్టలక్ష్మి పుస్తక భండార్

విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు. ఖమ్మం, హన్మకొండ, నల్గొండ } ప్రజాశక్తి బుక్ హౌస్, విశాలాంధ్ర

ఎం.ఓ / డి.డి. కింది అడ్రస్‌కు పంపి కూడా మీ కాపీ పొందవచ్చు.

వీక్షణం పబ్లికేషన్స్
3-6-394, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం.3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్-ఫ్యాక్స్ : 040-6684 3495.

RNI Regn.No.APTEL/2003/11482 • Published 29/10/2008 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao